

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 175

సోమవారం 15-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జైస్మిన్, మీనాక్షి 'పసిడి' పంచ్

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు నాలుగు పతకాలు -14లో



60 తర్వాత.. ఆచితూచి

అర్థవంతంగా ఆర్థిక నిర్ణయాలు. పొదుపు నిధిని దీర్ఘకాలం కాపాడుకోవాలి -15లో



న్యూస్‌రీల్

ఆ డాక్టర్లకు 'హైదరాబాద్' కలే!



హైదరాబాద్ శివారులోని వైద్య కాలేజీలు, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, డాక్టర్లు దశాబ్దాలుగా ఇక్కడే కొనసాగుతుండగా రాజధానికి ఆవల జిల్లాల్లో పనిచేస్తున్న వారు మాత్రం పదోన్నతులు లభించినా పట్నం వైపు చూసే పరిస్థితి కనిపించడంలేదు.

- వివరాలు 2లో▶

మీడియా ముందుకు రావొద్దు!



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నేతలంతా ఐక్యంగా పనిచేయాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ పిలుపునిచ్చింది. అంతర్గత విభేదాల పేరుతో ఎవరైనా మీడియా ముందుకొచ్చి మాట్లాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

- వివరాలు 12లో▶

సర్కారు కరుణిస్తేనే..



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) తన ఉద్యోగుల వేతన సవరణ బాధ్యతను ప్రభుత్వానికి వదిలేసింది. ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తేనే ఉద్యోగుల జీతాలు పెంచే అవకాశం ఉంటుందని తేల్చిచెప్పింది.

- వివరాలు 3లో▶



మనదే విజయం

ఆసియా కప్‌లో పాకిస్తాన్‌పై 7 వికెట్లతో భారత్ గెలుపు

సరిహద్దు ఉద్రిక్తతలు, నిరసనలు, బాయ్‌కాట్ పిలుపుల మధ్య సాగిన క్రికెట్ సమరంలో దాయాది జట్టుపై భారత్ మరోసారి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆసియా కప్‌లో ఏకపక్షంగా సాగిన పోరులో పాకిస్తాన్‌పై 7 వికెట్ల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. కుల్దీప్ యాదవ్ నేతృత్వంలోని బౌలింగ్ బృందం ముందు నిలవలేక పాక్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 పరుగులకే పరిమితమైంది. ఆ తర్వాత కెప్టెన్ సూర్యకుమార్, అభిషేక్ శర్మ మెరుపులతో 3 వికెట్లకు 131 పరుగులు చేసిన భారత్ 25 బంతులు మిగిలి ఉండగానే లాంఛనం పూర్తి చేసింది. ఈ మ్యాచ్ ఆడటంపై విమర్శల నేపథ్యంలో ఇరుజట్లు మ్యాచ్‌కు ముందు, తర్వాతా 'షేక్ హ్యాండ్'లు లేకుండానే ఆటను ముగించాయి. -14లో

సైన్యానికి అంకితం

మ్యాచ్ గెలవడం చాలా ఆనందంగా ఉంది. నాకు మా జట్టు ఇచ్చిన పుట్టిన రోజు కానుక ఇది. ముందుగా అనుకున్నట్లుగానే చివరి వరకు మ్యాచ్‌లో నిలిచి జట్టును గెలిపించగలిగా. పాకిస్తాన్‌తో మ్యాచ్ అంటే ప్రత్యేకంగా ఏమీ చూడలేదు. ఇతర ప్రత్యర్థులలాగే చూస్తే అదే తరహాలో సన్నద్ధమయ్యాం. మేం ఎక్కువ మంది స్పిన్నర్లను ఆడించే ఇక్కడ చాంపియన్స్ ట్రోఫీ గెలిచాం. నాకూ స్పిన్నర్లంటే ఇష్టం. అందుకే వారిని ఎంచుకునేందుకు ఆసక్తి చూపిస్తా. పహల్గామ్ తీవ్రవాద దాడిలో మరణించివారి కుటుంబాలకు మేం అండగా ఉంటాం. వారికి మా ప్రగాఢ సానుభూతి. ఈ మ్యాచ్ విజయాన్ని భారత సైన్యానికి అంకితమిస్తున్నాం

–సూర్యకుమార్ యాదవ్, భారత కెప్టెన్

బంద్‌పై ప్రతిష్టంభన!

ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో అర్ధరాత్రి వరకు ప్రభుత్వం చర్చలు

- ఫీజు బకాయిలు చెల్లించకపోతే సోమవారం నుంచి కాలేజీలు బంద్ చేస్తామన్న యాజమాన్యాలు
- బకాయిలు ఏకకాలంలో చెల్లించలేమని, విడతల వారీగా చెల్లిస్తామన్న ప్రభుత్వం
- సమ్మె విరమించమని కోరాం.. వారు సానుకూలంగా స్పందించారన్న భట్టి
- చర్చలు ఫలవంతం కాలేదన్న యాజమాన్యాలు
- ఆందోళన బాటలో ప్రైవేట్ ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, పీజీ కాలేజీలు
- నేడు మధ్యాహ్నం 3 గంటలకు మళ్లీ చర్చలు



ఆదివారం రాత్రి ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో చర్చల్లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రైవేటు విద్యాసంస్థలన్నింటినీ మూకుమ్మడిగా మూసివేయాలని నిర్ణయించుకొని యాజమాన్యాలు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో సర్కారు చర్చలకు ఉపక్రమించింది. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో ప్రజా భవన్‌లో సమావేశమయ్యారు. ఇరుపక్షాల మధ్య నాలుగు గంటల పాటు జరిగిన చర్చల్లో ఎలాంటి స్పష్టత రాలేదని తెలిసింది. ప్రభుత్వం నుంచి ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో మిగతా 2వ పేజీలో ▶



ఒక్క గంటలో ఆగమాగం

ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో వర్షానికి నీట మునిగిన రోడ్డు

హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి భారీ వర్షం

అబ్దుల్లాపూర్‌మెట్‌లో అత్యధికంగా 12.8 సెంటీమీటర్లు

ప్రధాన రోడ్లన్నీ జలమయం.. నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

నగరమంతా ట్రాఫిక్ జామ్.. వరద నీటిలో ముగ్గురు గల్లంతు

సాక్షి, హైదరాబాద్/నాంపల్లి/ముషీరాబాద్: హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ఆదివారం రాత్రి అతలాకుతలం చేసింది. దాదాపు గంటపాటు వాన దంచికొట్టడంతో ప్రధాన రహదారులన్నీ నదుల్లా మారాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. దాదాపు నగరం మొత్తం ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరద నీటిలో పడి ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. ఆదివారం సాయంత్రం వరకు వాతావరణం సాధారణంగానే ఉన్నా.. రాత్రి ఎనిమిది గంటల తర్వాత మొదలైన వాన గంటపాటు కుండపోతగా కురిసింది. రాత్రి పది గంటల వరకు అత్యధికంగా నగర శివారులోని అబ్దుల్లాపూర్ మెట్ తట్టి అన్నారం, ముషీరాబాద్ బౌద్ధనగర్‌లలో 12 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి ద్విచక్ర వాహనదారులు ఫ్లైఓవర్ల కింద తలదాచుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో కార్లు, ఆటోలు, బైక్‌లు నీటిలో కొట్టుకుపోయాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మిగతా 5వ పేజీలో ▶

'నైరుతి' ఉపసంహరణ షురూ

- ➤ మూడు రోజుల ముందే మొదలైన ప్రక్రియ
- ➤ అక్టోబర్ రెండో వారాంతానికి పూర్తి
- ➤ ఈ సమయంలోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం: ఐఎండీ
- ➤ అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులపాటు మోస్తరు వర్షాలు

5 లో

నీళ్లు ఫుల్లు

- జలాశయాల్లో గరిష్టానికి చేరిన నిల్వలు
- 1,069 టీఎంసీల సామర్థ్యానికి గాను 879 టీఎంసీలకు పెరిగిన నిల్వలు
- ఈ ఏడాది రెండు పంటలకు ఇక్కట్లు లేనట్టే


5 లో

చొరబాటుదారులకు మద్దతా?

కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం

- చొరబాటుదారులను, దేశ వ్యతిరేక శక్తులను కాంగ్రెస్ కాపాడుతోంది
- 'సిందూర్' సమయంలో ఆ పార్టీ నిజస్వరూపం తెలిసిపోయింది
- కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు రాజకీయాలే ముఖ్యం
- దేశ ప్రయోజనాలను ఏనాడూ కాపాడలేదు
- నేను శివ భక్తుడిని.. నన్ను ఎవరు ఎంతగా తిట్టినా భరిస్తా
- అస్సాంలో అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధానమంత్రి

6 లో



నన్ను చాలా మంది దూషిస్తున్నారు. అవమానించడమే పనిగా పెట్టుకున్నారు. వారు నన్ను ఎంతగా తిట్టినా పట్టించుకోను. నేను శివ భక్తుడిని. అన్నింటినీ భరిస్తా. ఆ గరళాన్ని గొంతులో దాచుకుంటా. కానీ ప్రజలను అవమానిస్తే మాత్రం ఊరుకోను. ప్రజలే నా రిమోట్ కంట్రోల్. - మోదీ



హారన్ మోగించరు.. గీత దాటరు

- దేశానికే ట్రాఫిక్ పాఠాలు నేర్పుతున్న ఐజోల్ సిటీ
- స్వీయ క్రమశిక్షణ, స్వయం నియంత్రణలో ఆదర్శం
- 'సైలెంట్ సిటీ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి.. తాజాగా అక్కడి ప్రజలకు అందుబాటులోకి వచ్చిన రైల్వే సేవలు

- వివరాలు 16లో▶

సొరంగం ఘటనపై స్పందన ఏదీ?



- నెలలు గడిచినా దర్యాప్తు జాడ లేదు
- ప్రభుత్వం పరిహారం కూడా ఇవ్వలేదు.. మేము అధికారంలోకి వస్తే బాధితులకు న్యాయం చేస్తాం: కేటీఆర్

- వివరాలు 3లో▶




ఇదండీ సంగతి



ఈ గొడవంతా ఎందుకు సార్! ఉగ్రవాదులే మాకు ఆశ్రయమిచ్చారని చెప్పేస్తే సరి!

నేషన్స్.. మైగ్రేషన్స్.. టెన్షన్స్!

- దేశాలను పట్టి పీడిస్తున్న వలసలు
- ప్రపంచవ్యాప్తంగా వలసలు పెరుగుతున్నట్లు వెల్లడిస్తున్న ఐరాస నివేదికలు
- అత్యధికంగా పాకిస్తాన్ నుంచి.. రెండో స్థానంలో సూడాన్, మూడో స్థానంలో భారత్



- వివరాలు 2లో



వలసదారులకు వ్యతిరేకంగా లండన్‌లోని ట్రాఫాల్గర్ స్క్వేర్‌లో నిరసనకారుల భారీ ర్యాలీ

వలసల వ్యతిరేక ర్యాలీ హింసాత్మకం

- లండన్‌లో పోలీసులతో నిరసనకారుల ఘర్షణ
- నీళ్ల సీసాలు, చేతికందిన వస్తువులతో దాడి
- 26 మంది పోలీసులకు గాయాలు.. 24 మంది నిరసనకారుల అరెస్టు

6 లో

స్వయంగా పర్యవేక్షిస్తా

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సీఎం రేవంత్‌రెడ్డి



- ఈ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు చాలా అవసరం
- ఇప్పటివరకు బాగా పని చేశారు.. ఇకనుంచి ప్రతిరోజూ కీలకమే
- అభ్యర్థి ఎంపిక విషయం ఏఐసీసీ చూసుకుంటుంది
- గెలిపించాల్సిన బాధ్యత పార్టీ నేతలదే
- మంత్రులు, ముఖ్యనేతలతో ముఖ్యమంత్రి సమీక్ష

3 లో

ఏఐతో రోజుకు 55 నిమిషాలు ఆదా

మీటింగ్స్, మెయిల్స్, ఫైళ్ల నిర్వహణను సులభతరం చేస్తున్న ఏఐ టూల్స్

- ఏఐతో పని సులువైందంటున్న 86 శాతం మంది ఉద్యోగులు
- కార్యాలయాల్లో ఏఐ వినియోగంతో జెన్‌జెడ్ స్పీడ్
- ఇంటర్నేషనల్ వర్క్‌ప్లేస్ గ్రూపు సర్వేలో వెల్లడి

12 లో

నేషన్స్.. మైగ్రేషన్స్.. టెన్షన్స్..!

దేశాలను పట్టి పీడిస్తున్న వలసలు

ప్రపంచవ్యాప్తంగా వలసలు పెరుగుతున్నాయంటున్న ఐరాస నివేదికలు

అత్యధికంగా పాకిస్తాన్ నుంచి.. మూడో స్థానంలో భారత్

ఉద్యోగాల కొరత, తక్కువ వేతనాలు, పేదరికం, ఆరోగ్య సంరక్షణ సరిగా లేకపోవడం ప్రధాన కారణాలు

ప్రకృతి వైపరీత్యాలు, రాజకీయ అస్థిరత, ఉత్పాదకత లేని వ్యవసాయం వల్ల కూడా వలసలు

1990- 2024 మధ్య భారతీయ వలసదారుల సంఖ్య 65 లక్షల నుంచి 1.80 కోట్లకు పెరుగుదల

2024లో భారత్ నుంచి 9.79 లక్షల మంది వలస వెళ్లారంటున్న యూఎన్ నివేదిక

మన దేశం నుంచి ఎక్కువగా గల్ఫ్, యూఎస్, ఆస్ట్రేలియా, యూకే, కెనడాకు వలసలు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలను వలసల సమస్య పట్టి పీడిస్తోంది. ప్రధానంగా ఉద్యోగాల కొరత, తక్కువ వేతనాలు, పేదరికం, విద్యా ఆరోగ్య సంరక్షణ సరిగా లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు, రాజకీయ అస్థిరత, ఉత్పాదకత లేని వ్యవసాయం తదితర కారణాలతో వలసలు వెళుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా మరింత మెరుగైన జీవనోపాధి, ఆర్థిక అవకాశాలు, జీవన పరిస్థితులు, సామాజిక రక్షణ, యుద్ధం, జాతుల సంఘర్షణల నుంచి రక్షించుకోవడం లాంటివి వలసలకు కారణమవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు ఇలాంటి సమస్యలు మరింత పెరుగుతుండడంతో ఇతర దేశాలకు వలస వెళుతున్న వారి సంఖ్య గతంతో పోల్చితే గణనీయంగా పెరుగుతోందని ఐక్యరాజ్య సమితికి చెందిన పలు విభాగాల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే.. అత్యధికంగా పాకిస్తాన్ నుంచి వలసలు చోటు చేసుకుంటుండగా, భారత్ మూడో స్థానంలో ఉంది.



ఐరాస నివేదికలను బట్టి చూస్తే..

ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక వ్యవహారాల జనాభా విభాగం (యూఎన్‌డీఈఎస్‌ఏ) ప్రకారం.. 2024లో ప్రపంచ వ్యాప్త వలసదారుల సంఖ్య 30.4 కోట్లు కాగా..1990 నుంచి చూస్తే ఇది దాదాపు రెట్టింపు (15.4 కోట్లు) అయ్యింది. అంతర్జాతీయ వలసదారులు ప్రపంచ జనాభాలో 3.7 శాతంగా ఉండగా వారిలో మహిళలు 48 శాతంగా ఉన్నారు. ఐరాస మరో విభాగం (హెచ్‌సీఆర్) అంచనా ప్రకారం.. 2024 చివరి నాటికి ప్రపంచ వ్యాప్తంగా 4.37 కోట్ల మంది శరణార్థులకు ఆశ్రయం లభించింది. ఇక ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ ద్వారా వెలువడిన 'వరల్డ్ మైగ్రేషన్ రిపోర్ట్-2024' ప్రకారం.. 2022 చివరి నాటికి 28.1 కోట్ల అంతర్జాతీయ వలసదారులను గుర్తించారు. ఈ నివేదికను బట్టి చూస్తే.. వలసల్లో ఎక్కువ భాగం ప్రాంతీయంగానే జరుగుతున్నాయి. అంతర్జాతీయ వలసదారుల్లో ఒక్క ఆసియా నుంచే 40% కంటే ఎక్కువ మంది ఉన్నారని నివేదిక పేర్కొంది.

భారత్‌లో పెరుగుదల ఇలా..

1990-2024 మధ్య మొత్తం భారతీయ వలసదారుల సంఖ్య 65 లక్షల నుండి 1.80 కోట్లకు పెరిగింది. భారతీయ వలసలు ఎక్కువగా ఆసియాలోనే కేంద్రీకృతమై ఉన్నాయి, ముఖ్యంగా పశ్చిమాసియాలో ఎక్కువగా ఉండగా, ఇక్కడ భారతీయ వలసదారులలో సగం మంది నివసిస్తున్నారు. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈతో కూడిన గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ దేశాలు దాదాపు సగం మంది భారతీయ వలసదారులకు ఆశ్రయం ఇస్తున్నాయి. ఇక భారతీయ వలసదారులలో నాలుగింట ఒకవంతు మంది ఉత్తర అమెరికాలో నివసిస్తున్నారు. అలాగే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లకు వలసలు కూడా పెరిగాయి. భారతీయులు ఎక్కువ సంఖ్యలో యూరప్‌కు వెళ్లినప్పటికీ, మొత్తం భారతీయ వలసదారులలో దాని వాటా తగ్గింది.

రెండో స్థానంలో సూడాన్

'యూఎన్ వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2024' నివేదిక ప్రకారం..24 కోట్లకు పైగా జనాభా ఉన్న పాకిస్తాన్ నుంచి అత్యధిక సంఖ్యలో ఇతర దేశాలకు వలస వెళుతున్నారు. ఆ దేశంలోని హెచ్చుతగ్గులతో కూడిన ఆర్థిక పరిస్థితులు, రాజకీయ అనిశ్చితి, కార్మిక మార్కెట్‌లోని సవాళ్లు, ఇతర దేశాలలో పనికి పెరుగుతున్న డిమాండ్ తదితర కారణాలతో 2024లో 16.2 లక్షల నికర వలసలతో ప్రపంచంలోనే పాకిస్తాన్ ప్రథమ స్థానంలో నిలుస్తోంది. సూడాన్‌లో రెండు సైనిక వర్గాల మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం కారణంగా...చాలా మంది చాడ్, దక్షిణ సూడాన్, ఇథియోపియా, ఈజిప్ట్ వంటి ఇతర పొరుగు దేశాలకు శరణార్థులుగా వెళుతున్నారు. 4.8 కోట్ల జనాభా కలిగిన సూడాన్ పాక్ తర్వాతి స్థానంలో (14 లక్షలు) ఉంది. భారత్ విషయానికొస్తే..100.41 కోట్ల జనాభాతో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉండగా..అత్యధిక వలస రేటును ఎదుర్కొంటోన్న దేశాల్లో మూడో స్థానంలో ఉంది. 2024లో భారత్ నుంచి 9.79 లక్షల మంది వలస వెళ్లినట్టుగా వెల్లడైంది. ఇండియా నుంచి అధికంగా పశ్చిమ ఆసియా, గల్ఫ్ దేశాలు, యూఎస్, ఆస్ట్రేలియా, యూకే, కెనడా, తదితర దేశాలకు వలస వెళుతున్నారు.

వలసదారులంటే ఎవరు?

ఐరాస నిర్వచనం ప్రకారం.. ఒక వ్యక్తి అంతర్జాతీయ సరిహద్దు దాటి మరొక దేశానికి వెళ్లి సాధారణ నివాస స్థలాన్ని ఏర్పాటు చేసుకుంటే, ఆ వ్యక్తిని అంతర్జాతీయ వలసదారుగా (ఇమ్మిగ్రెంట్) పరిగణిస్తారు. మరో రకంగా చెప్పాలంటే ఒక వ్యక్తి తన సొంత దేశాన్ని విడిచిపెట్టి, శాశ్వతంగా లేదా దీర్ఘకాలం పాటు నివసించడానికి వేరే దేశంలోకి వెళ్లడాన్ని వలస (ఇమ్మిగ్రేషన్)గా పరిగణిస్తున్నారు. సాధారణంగా వలసదారుగా అర్హత సాధించడానికి వారు కనీసం 12 నెలలు అక్కడ నివసించాలి. తన నివాస దేశాన్ని మార్చుకున్న ఏ వ్యక్తినైనా అంతర్జాతీయ వలసదారుగా పేర్కొంటున్నారు. వారి చట్టపరమైన హోదా లేదా వారి వలస స్వభావం లేదా ఉద్దేశంతో సంబంధం లేకుండా వలసదారుగా పరిగణనలోకి తీసుకుంటారు.

క్లుప్తంగా...


జీఎస్టీ తగ్గింపుతో 140 కోట్ల మందికి ప్రయోజనం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



సాక్షి, చెన్నై: 350కు పైగా వస్తువుల ధరలు తగ్గే విధంగా జీఎస్టీని తగ్గించామని.. దీనివల్ల 140 కోట్ల మందికి ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జీఎస్టీ తగ్గింపు ఈ నెల 22 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. చెన్నై ఆళ్వార్‌పేటలోని మ్యూజిక్ అకాడమీలో ఆదివారం 'జీఎస్టీ సంస్కరణలు - రైజింగ్ ఇండియా కోసం పన్ను సంస్కరణలు' అనే అంశంపై చర్చ జరిగింది. ఇందులో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ దీపావళికి ముందు జీఎస్టీ తగ్గింపు వల్ల వస్తువుల కొనుగోళ్లు మరింత వేగం పుంజుకుంటాయన్నారు. నిత్యావసర వస్తువులకు జీఎస్టీని తగ్గించడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు మరింత లాభం చేకూరుతుందన్నారు. జీఎస్టీ పన్ను సంస్కరణల ప్రయోజనాలు ప్రజలకు చేరేలా ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి సంస్థ ఈ తగ్గింపును ప్రజల్లో తీసుకెళ్తుందన్న నమ్మకం ఉందన్నారు. కాగా చర్చా కార్యక్రమంలో కాగితం పరిశ్రమకు సంబంధించిన ఓ ప్రతినిధి మాట్లాడుతూ పుస్తకాలు, తదితర వాటికి ఒక రకంగానూ, డైరీలు, తదితరాలకు మరో రకంగా పన్ను విధించడం భావ్యమా.. అన్నీ కాగితాలే కదా..? అని మంత్రిని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ.. సిద్ధాంతాలు, కేడర్ మీద ఆధారపడే పార్టీ'



సాక్షి, విశాఖపట్నం: సిద్ధాంతాలు కార్యకర్తలను నమ్ముకుని కొనసాగుతున్న పార్టీ బీజేపీ అని.. మిగిలిన రాజకీయ పార్టీల మాదిరిగా ఏ ఎండకా గొడుగు పట్టే వైఖరి తమ పార్టీకి లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ నిర్వహించిన సారథ్యం కార్యక్రమం ముగింపు సభ ఆదివారం విశాఖ రైల్వేగ్రౌండ్స్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేపీ నడ్డా మాట్లాడుతూ.. 2014లో మోదీ ప్రధాని అయినప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేదని.. ఇప్పుడు మూడో స్థానానికి చేరువయ్యామని తెలిపారు.

సాక్షి
మీకు సాక్షి
దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం.
1800 425 9899

బంద్‌పై ప్రతిష్టంభన!

▶ మొదటి పేజీ తరువాయి

కళాశాలలు నడపటం కష్టంగా మారిందని, జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నామని యాజమాన్యాలు చెప్పాయి. తమకు రావాల్సిన బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాలని కోరాయి. అయితే ప్రభుత్వం నుంచి ఈ విషయంలో స్పష్టమైన హామీ రాలేదని యాజమాన్యాలు చెప్పాయి. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో ఫీజు బకాయిలు ఏకకాలంలో చెల్లింపు సాధ్యం కాదని, విడతల వారీగా చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పింది. కళాశాలలను మూసివేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరింది. విద్యాసంస్థల డిమాండ్లను ఇప్పటికిప్పుడు నెరవేర్చడం సాధ్యం కాదని, కళాశాలలు మూసివేయడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటుందని, నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని చెప్పింది. ఫీజుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన భరోసా రాకపోవడంతో కళాశాలల మూసివేత నిర్ణయంపై వెనక్కు తగ్గే విషయంలో యాజమాన్యాలు కూడా ప్రభుత్వానికి స్పష్టత ఇవ్వలేకపోయినట్టు తెలిసింది. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఇరుపక్షాల మధ్య మళ్లీ చర్చలు జరగనున్నాయి.

ఉదయం ఏం జరిగిందంటే..

అంతకుముందు ఉదయం ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు సమావేశమై కార్యాచరణపై చర్చించాయి. సోమవారం నుంచి బంద్‌ను పాటించాలని నిర్ణయించాయి. ఫీజులు చెల్లించే వరకూ ఎట్టి పరిస్థితుల్లో కాలేజీలు తెరవొద్దని నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్‌ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఫతి) ప్రతినిధులు మీడియాకు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఏడాది నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నాయి. గత ఏడాది పరీక్షలను బహిష్కరించాలని నిర్ణయించాయి కూడా. దీంతో ప్రభుత్వం స్పందించి వారితో చర్చలు జరిపింది. దశల వారీగా బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో అప్పుడు ఆందోళన నిర్ణయాన్ని యాజమాన్యాలు విరమించుకున్నాయి. తాజాగా శుక్రవారం యాజమాన్య ప్రతినిధులు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డిని కలిసి నోటీసు ఇచ్చారు. సెప్టెంబర్ 30లోపు బకాయిలను విడుదల చేయకపోతే, ఆందోళనను ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం సర్కారు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో విద్యాసంస్థలను మూకుమ్మడిగా మూసివేయాలని నిర్ణయించారు. బంద్ జరిగితే రాష్ట్రంలోని 1,500 పైచిలుకు ప్రైవేట్ ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, ఫార్మసీ, నర్సింగ్ కాలేజీలకు తాళాలు పడనున్నాయి. దాదాపు 10 లక్షల విద్యార్థులకు బోధన దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సమస్యలను అర్థం చేసుకున్నాం

మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నత విద్యామండలి చైర్మన్, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఆదివారం అయినప్పటికీ అందరం కలిసి సుదీర్ఘంగా నాలుగు గంటల పాటు చర్చించాం. చర్చలు సానుకూలంగా సాగాయి. కళాశాలల సమస్యలను అర్థం చేసుకున్నాం. సోమవా రం ప్రభుత్వపరంగా నిర్ణయం తీసుకుంటాం. అప్పటివరకు సమ్మెను విరమించమని కళాశాలల యజమానులను కోరాం. వారు సానుకూలంగా స్పందించారు.

సమావేశం అనంతరం భట్టి విక్రమార్క, డిప్యూటీ సీఎం

ఓపిక నశించిందన్న ప్రతినిధులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తుందని ప్రభుత్వంపై ఇన్నాళ్లు విశ్వాసం పెట్టుకున్నామని 'ఫతి' ప్రతినిధులు ఉదయం మీడియాకు చెప్పారు. ఇక ఓపిక నశించిందని, అందుకే ఆందోళన బాట పట్టామని తెలిపారు. టోకెన్లు జారీ చేసినప్పటికీ డబ్బులు ఇవ్వలేదన్నారు. దీంతో అన్ని కాలేజీల యాజమాన్యాలు ఉమ్మడి పోరుబాటకు సిద్ధమై ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్‌ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. రూ.లక్ష కోట్ల డిపాజిట్లతో ప్రత్యేకంగా ట్రస్ట్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ప్రైవేటు యాజమాన్యాలు సర్కారుకు ప్రతిపాదించాయి. ఈ లక్ష కోట్లలో సర్కారు వాటా పరిమితమేనని, సీఎస్సార్, కార్పస్ ఫండ్ వంటి ఇతర మార్గాల ద్వారానే ఈ నిధులను సేకరించవచ్చని సూచించాయి. లక్ష కోట్ల డిపాజిట్లపై వచ్చే ఏడు శాతం వడ్డీ (సుమారు రూ.3వేలకోట్లు)తో ఫీజు రీయింబర్స్ చేయొచ్చని ప్రతిపాదించాయి. దీనిని కూడా సర్కారు పట్టించుకోలేదు. ఈనేపథ్యంలో అన్ని రకాల వృత్తి విద్యా కాలేజీల యాజమాన్యాలు గురువారం రాత్రి సమావేశమయ్యాయి. సెప్టెంబర్ 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించాయి. 'ఫతి' బాటలోనే తెలంగాణ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్య సంఘం (టీపీడీపీఎంఏ) కూడా కాలేజీల బంద్‌కు పిలుపునిచ్చింది. తాము ఈ నెల 16 నుంచి కాలేజీలను మూసివేస్తామని అసోసియేషన్ చెప్పింది.

ఘనంగా 'విట్' చాన్స్‌లర్ మనుమరాలి వివాహం



వెల్లూరు: 'విట్' (వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) చాన్స్‌లర్ జి.విశ్వనాథన్ మనుమరాలు కాదంబరి ఎస్.విశ్వనాథన్ వివాహం డా॥ ఎ.శ్రావణ్ కృష్ణతో ఆదివారం తిరుపతిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ డా॥అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి సమీరా నజీర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. విట్ వైస్‌ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, జి.వి.సెల్వం తదితరులు హాజరయ్యారు.

ఆ డాక్టర్లకు హైదరాబాద్ కలే!

మెడికల్ కాలేజీల్లోని అసోసియేట్ ప్రొఫెసర్ల బదిలీల్లో వివక్ష!

జిల్లాల్లో పనిచేసే వారికి పదోన్నతి వచ్చినా అక్కడక్కడే పోస్టింగ్

హైదరాబాద్ చుట్టుపక్కల వారికి మాత్రం దగ్గర్లోనే పోస్టింగ్

64 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతి కల్పించిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాజధానికి దూరంగా, మారుమూల జిల్లాల్లో పనిచేసే ఉద్యోగులు మూడు నాలుగేళ్ల తరువాతైనా హైదరాబాద్ సమీపానికో, లేదంటే కనీసం జిల్లా కేంద్రాలకో బదిలీ కావాలని కోరుకుంటారు. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల్లో దూరంగా ఉన్నవారికి దగ్గరి ప్రాంతానికి, హైదరాబాద్ సమీపంలో ఎక్కువ కాలం పనిచేసిన వారిని జిల్లాలకు పంపడం సర్వసాధారణం. కానీ, వైద్య ఆరోగ్య శాఖలో అందుకు భిన్నంగా జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్‌లతో పాటు ఈ నగరాలకు 50 నుంచి 100 కిలోమీటర్ల దూరంలోని పట్టణాల్లోని మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వివిధ గ్రేడ్‌ల ప్రొఫెసర్లు, డాక్టర్లు దశాబ్దాలుగా ఇక్కడే కొనసాగుతున్నారు. అదే సమయంలో రాజధానికి 100 కిలోమీటర్ల ఆవల జిల్లాల్లో పనిచేస్తున్న వారు మాత్రం పదోన్నతులు లభించినా, పట్నం వైపు చూసే పరిస్థితి లేదు. తాజాగా నిర్వహించిన పదోన్నతులు, బదిలీల్లో కూడా తమకు తీవ్ర అన్యాయం జరిగిందని దూర ప్రాంతాల డాక్టర్లు, ప్రొఫెసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ నుంచి కదలని డాక్టర్లు

వైద్య కళాశాలల్లో కొత్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల నేపథ్యంలో ఇప్పటికే సీనియర్లుగా ఉన్న వారిని అసోసియేట్ ప్రొఫెసర్లుగా నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 64 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను అసోసియేట్ ప్రొఫెసర్లుగా నియమించారు. వీరిలో హైదరాబాద్, సికింద్రాబాద్, మహేశ్వరం, వికారాబాద్, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి కేంద్రాలుగా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించినప్పటికీ, వారిని ఈ ప్రాంతాల నుంచి దూరం పంపే సాహసం చేయలేదు. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల పరిధిలో పనిచేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డాక్టర్లు ఆసక్తి చూపించినా అవకాశం ఇవ్వలేదు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారు అక్కడికక్కడే మారారే తప్ప హైదరాబాద్‌కు గానీ, సమీపంలోని ఇతర జిల్లాలకు గానీ వారిని బదిలీ చేయలేదు. జిల్లాల్లో పనిచేసే వారంతా హైదరాబాద్‌నే ఆప్షన్‌గా అడుగుతారని, అందుకే వారికి హైదరాబాద్ ఆప్షన్ తొలగించినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

కొందరికి జిల్లాలంటే తెలీదు..

న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జన్, నెఫ్రాలజీ కేటగిరీలో ఎనిమిది మంది డాక్టర్లను పదోన్నతిపై బదిలీ చేస్తే, వారిలో ఒక్క నెఫ్రాలజిస్టును మాత్రమే ఉస్మానియా ఆస్పత్రి నుంచి వరంగల్ ఎంజీఎంకు బదిలీ చేశారు. మిగతావారు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఉస్మానియా, గాంధీ, ఎంఎన్‌జే, సంగారెడ్డి ఆస్పత్రులను దాటి వెళ్లలేదు. పిల్లల స్పెషలిస్టులను ముగ్గురిని బదిలీ చేస్తే ఒక్కరు వరంగల్ కేఎంసీ నుంచి హైదరాబాద్‌కు రాగా, మరో ఇద్దరు హైదరాబాద్‌లోని నిలోఫర్ నుంచి నిలోఫర్, ఉస్మానియాకు పదోన్నతిపై బదిలీ చేయబడ్డారు. ఆరుగురు గైనకాలజిస్టుల్లో ఆదిలాబాద్, సిద్దిపేట, నర్సంపేటలకు చెందిన వాళ్లను అక్కడే ఉంచి, ఒకరిని పేట్ల బురుజు నుంచి యాదాద్రికి, మరొకరిని సికింద్రాబాద్ నుంచి మెదక్‌కు బదిలీ చేశారు. గాంధీలో పనిచేసే గైనకాలజిస్టును నిలోఫర్‌కు పంపారు. 12 మంది జనరల్ సర్జరీ స్పెషలిస్టుల్లో నిర్మల్, యాదాద్రి, నాగర్‌కర్నూల్, ఖమ్మం వారిని జిల్లాల్లోనే ఉంచి.. సంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్, నల్లగొండకు చెందిన వారిని అక్కడికక్కడే బదిలీలు చేసి మమ అనిపించారు. రేడియాలజీ స్పెషలిస్టులు ఇద్దరిని హైదరాబాద్‌కే పరిమితం చేశారు. ఆప్తల్మాలజీలో ఆరుగురిని బదిలీ చేస్తే.. ఐదుగురిని హైదరాబాద్ నుంచి కదిలించలేదు. ఆర్థోపెడిక్స్‌లో ఎక్కడి వారు అక్కడే ఉన్నారు. గతంలో అసోసియేట్ ప్రొఫెసర్ల నుంచి ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించినవారిలో 8 మంది ఇతర ప్రాంతాల్లో పనిచేసేందుకు ఇష్టం లేక పదోన్నతులనే వదులుకున్నారు.

పత్తిపాక మోహన్ పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రధాని



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ

సిరిసిల్ల కల్చరల్: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన కవి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్‌కు మరో అరుదైన గౌరవం లభించింది. ప్రధాని నరేంద్రమోదీ ఆవిష్కరించిన పుస్తకాల్లో మోహన్ అనువాద పుస్తకం ఉండటం విశేషం. ప్రసిద్ధ గేయరచయిత, భారతరత్న డాక్టర్ భూపెన్ హజారికా శతజయంతి సందర్భంగా అసోం ప్రభుత్వం ఏడాదంతా ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఇంగ్లిష్‌తోపాటు 22 భారతీయ భాషల్లో భారతరత్న భూపెన్ హజారికా పుస్తకాన్ని ప్రచురించి ఆవిష్కరించేందుకు సంకల్పించింది. ఈ మేరకు గౌహతిలో ఆదివారం జరిగిన హజారికా శతజయంతి ప్రారంభ సభలో ప్రధాని మోదీ ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. అస్సామీలో అనురాధశర్మ పూజారి రచించిన పుస్తకాన్ని మోహన్ తెలుగులో అనువదించారు. ఈ సందర్భంగా మోహన్‌ను పలువురు కవులు, సాహితీవేత్తలు అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సర్కార్‌ది మొద్దు నిద్ర

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని విద్యాసంస్థల యాజమాన్యాలు రెండేళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా రేవంత్‌రెడ్డి సర్కారు మొద్దు నిద్ర నటిస్తుండటం సిగ్గుచేటు అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజనీరింగ్ విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి వచ్చిందని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. 'దాదాపు 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారింది. సెమిస్టర్ పరీక్షలు కూడా వాయిదా వేసే పరిస్థితి వస్తుంటే విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్లు? సోమవారం నుంచి నిరవధిక బంద్ చేయనున్నట్లు కాలేజీల యాజమాన్యాలు ప్రకటించినా ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? అల్లరి చేయొద్దు.. అని ఆర్థిక మంత్రి సుద్దులు చెప్పినంత మాత్రాన యాజమాన్యాలు, విద్యార్థుల గోడు తీరదు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, ఫీజు రీయింబర్స్ ఇవ్వడానికి లేని డబ్బులు ముఖ్యమంత్రి కమీషన్ల ప్రాజెక్టులకు ఎలా వస్తున్నాయి? ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు డీఏలు ఇవ్వమంటే 'నన్ను కోసుకొని తిన్నా పైసలు లేవు' అని చెప్పిన ముఖ్యమంత్రి లక్షల కోట్ల టెండర్లు ఎలా పిలుస్తున్నారు?' అని హరీశ్‌రావు నిలదీశారు. ఒక వైపు కాళేశ్వరం కూలింది అంటూనే మల్లన్న సాగర్ నుంచి మూసీలో గోదావరి నీళ్లు ఎత్తిపోసేందుకు రూ.7,000 కోట్ల టెండర్లు పిలిచారని హరీశ్‌రావు పేర్కొన్నారు. గురుకులాలను గాలికి వదిలి, రూ.25 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ. 4,400 కోట్ల టెండర్లు, మూసీ సుందరీకరణకు లక్ష యాభై వేల కోట్ల టెండర్లు.. ఇలా కమీషన్లు దండుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి టెండర్లు పిలుస్తున్నారని ఆరోపించారు.

ప్రజల ప్రాణాలకంటే డబ్బే ముఖ్యమా?

పహల్గాం దాడికి కారణమైన పాక్‌తో క్రికెట్ మ్యాచ్ ఎలా ఆడారు?

మిలాద్ సభలో కేంద్రంపై విరుచుకుపడిన అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి కారణమైన పాకిస్తాన్‌తో భారత్ క్రికెట్ మ్యాచ్ ఎలా ఆడిందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. శనివారం రాత్రి హైదరాబాద్ దారుస్సలేం మైదానంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నిర్వహించిన జల్సా రహమతుల్-లిల్-అలమీన్ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకుల మతాన్ని అడిగి మరీ 26 మందిని దారుణంగా కాల్చి చంపారు కదా? రక్తం, నీరు కలిసి ప్రవహించలేవని చెప్పిన భారత ప్రధాని మోదీ.. రెండు దేశాల మధ్య క్రికెట్ మ్యాచ్ ఎలా జరిగిందో సమాధానం చెప్పాలి' అని నిలదీశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి జాతీయ ప్రయోజనాల కంటే వాణిజ్య లాభాలపై మక్కువ కనిపిస్తోందని విమర్శించారు. దేశభక్తి పేరుతో బీజేపీ వ్యాపారం చేయడం దురదృష్టకరమని మండిపడ్డారు. పౌరుల ప్రాణాల కంటే డబ్బే ఎక్కువ విలువైందా? పాక్‌తో అన్ని సంబంధాలు తెంచుకున్నప్పుడు మ్యాచ్ మాత్రం ఎందుకు? అని ప్రశ్నించారు. పహల్గాం బాధితులకు మోదీ ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ముస్లింలను టార్గెట్ చేసి, వారి ఇళ్లను కూల్చివేస్తున్నారని ఒవైసీ ఆరోపించారు. బహిరంగ సభలో మజ్లిస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇస్లామిక్ పండితులు పాల్గొన్నారు.

సర్కారు కరుణిస్తేనే జీతాల పెంపు



'అలయ్ బలయ్'కి రండి

సీఎంను ఆహ్వానించిన దత్తాత్రేయ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఆదివారం హరియాణా మాజీ గవర్న ర్ బండారు దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. అక్టోబర్ 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న 'అలయ్ బలయ్'కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు.

వేతన సవరణ భారం మోయలేమని తేల్చేసిన ఆర్టీసీ

- 15 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చినా నెలకు రూ.60 కోట్ల భారం
- మహాలక్ష్మి రీయింబర్స్‌మెంట్‌ను ఆ మేరకు పెంచాలని ప్రతిపాదన
- 2021 వేతన సవరణకు కసరత్తు.. ప్రభుత్వానికి నివేదన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) తన ఉద్యోగుల వేతన సవరణ బాధ్యతను ప్రభుత్వానికి వదిలేసింది. ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తేనే ఉద్యోగుల జీతాలు పెంచే అవకాశం ఉంటుందని తేల్చి చెప్పింది. 2017 నాటి వేతన సవరణను గతేడాది ఏప్రిల్‌లో అమలు చేసిన నేపథ్యంలో, ఆ తదుపరి 2021 వేతన సవరణపై సంస్థ దృష్టి సారించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో 2025 వేతన సవరణ గడువు ప్రారంభమవుతున్నందున, 2021 వేతన సవరణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తిరిగి పోలీసు శాఖకు బదిలీ అయ్యే అవకాశం ఉన్నందున, ఈలోపు దీన్ని కొలిక్కి తేవాలని ఆయన ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అక్కడి నుంచి ఆమోదం లభిస్తే నాలుగేళ్ల జాప్యంతో ఆ వేతన సవరణను పూర్తి చేసినట్టవుతుంది.

15 శాతం ఫిట్‌మెంట్ ఇస్తే నెలకు రూ.60 కోట్ల భారం

వేతన సవరణ చేస్తే సంస్థపై పడే భారంపై అధికారులు లెక్కలు వేశారు. హీనపక్షంగా 10 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చినా నెలకు జీతాల భారం అదనంగా రూ.40 కోట్లు పెరుగుతుంది. అదే 15 శాతం ప్రకటిస్తే ఆ మొత్తం రూ.60 కోట్లకు చేరుకుంది. మహాలక్ష్మి పథకం వల్ల రోజువారీ ఆదాయం తగ్గటంతో సంస్థ సొంతంగా ఈ భారాన్ని మోయటం అసాధ్యం. ప్రస్తుతం టికెట్ రూపంలో ఆర్టీసీకి వస్తున్న ఆదాయం రోజుకు రూ.12 కోట్ల లోపే. రోజువారీ ఖర్చులకు కూడా ఆ నిధులు సరిపోవటం లేదు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చాక, మహిళా ప్రయాణికుల నుంచి ఆదాయం 90 శాతం తగ్గిపోయింది. వేతన సవరణ చేస్తే రోజుకు అదనంగా రూ.2 కోట్లు చొప్పున జీతాలకు అదనంగా చెల్లించాలి. దానిని సర్దుబాటు చేయటం ఇప్పుడున్న పరిస్థితుల్లో సంస్థకు అసాధ్యమని ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వానికి తేల్చి చెప్పింది.

రీయింబర్స్‌మెంట్‌ను రూ.350 కోట్లకు పెంచాలి..

మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఆర్టీసీకి నెలకు రూ.310 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కూడా ప్రతినెలా విడుదల కావటం లేదు. గత నెల రూ.190 కోట్లు మాత్రమే విడుదల కావటంతో ఉద్యోగులకు సకాలంలో ఆర్టీసీ జీతాలు చెల్లించలేకపోయింది. ఇప్పుడు ఆ మొత్తాన్ని కనీసం రూ.350 కోట్లకు పెంచితే దానికి సరిపడే ఫిట్‌మెంట్ మేరకు వేతన సవరణ చేస్తామని తాజాగా ప్రభుత్వానికి ఆర్టీసీ ప్రతిపాదించింది. 2017 విడత వేతన సవరణను అప్పట్లో సకాలంలో చేయలేదు. దీంతో కార్మికులు సమ్మె చేయగా, బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదుగురు మంత్రులతో కమిటీ వేసింది. ఆ కమిటీ కార్మిక సంఘాల నేతలతో చర్చించి, ఆర్థిక పరిస్థితి బాగోలేనందున కొంత విరామం తర్వాత వేతన సవరణ చేస్తామని, అప్పటి వరకు మధ్యంతర భృతి ఇస్తామని తేల్చి చెప్పింది. ఆ మేరకు 16 శాతం మధ్యంతర భృతిని ఖరారు చేసింది. 2024 వరకు అదే కొనసాగింది. మళ్లీ కార్మిక సంఘాలు సమ్మెకు సిద్ధం కావటంతో, గత సంవత్సరం ప్రభుత్వం 21 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు అంగీకరించింది. ఇప్పుడు అంతమేర ఫిట్‌మెంట్ ఇచ్చే పరిస్థితి దాదాపు లేదని ఆర్టీసీ పరోక్షంగా స్పష్టం చేసింది. 15 శాతం ఖరారు చేసినా పరిస్థితి చేయిదాటిపోతుందని తేల్చింది. ప్రభుత్వం ఎంతమేర ఆర్థిక సాయం చేస్తే అంతమేర వేతనాలను పెంచేందుకు సిద్ధమవుతోంది.



స్వయంగా పర్యవేక్షిస్తా

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సీఎం రేవంత్‌రెడ్డి

- ఈ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు చాలా అవసరం
- ఇప్పటివరకు బాగా పని చేశారు.. ఇకనుంచి ప్రతీరోజూ కీలకమే
- అభ్యర్థి ఎంపిక విషయం ఏఐసీసీ చూసుకుంటుంది
- గెలిపించాల్సిన బాధ్యత పార్టీ నేతలదే
- ముఖ్యనేతలతో సీఎం సమీక్ష



సమీక్షలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో వివేక్, పొంగులేటి, మహేశ్‌గౌడ్, పొన్నం ప్రభాకర్, తుమ్మల తదితరులు

సాక్షి హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు చాలా అవసరమని, పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా గెలిపించాల్సిన గురుతర బాధ్యత ఇన్‌చార్జిలపై ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ఉప ఎన్నిక కోసం పార్టీ నాయకత్వం ఇప్పటివరకు చాలా బాగా పని చేసిందని, ఇకపై ప్రతీరోజూ కీలకమని, ఈ ఉప ఎన్నికకు సంబంధించిన అన్ని వ్యవహారాలను తానే స్వయంగా పర్యవేక్షిస్తానని ఆయన వెల్లడించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఆదివారం సాయంత్రం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ, సాంస్కృతిక విభాగం చైర్మన్ వెన్నెల గద్దర్‌తో పాటు పార్టీ డివిజన్ ఇన్‌చార్జులుగా పనిచేస్తున్న కార్పొరేషన్ చైర్మన్‌లు పాల్గొన్న ఈ సమావేశంలో.. ఉప ఎన్నికలో గెలుపునకు అవసరమైన కార్యాచరణపై ముఖ్యమంత్రి, పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలి..

పార్టీ నేతలందరూ సమన్వయంతో పనిచేసి, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కోసం ప్రతీ ఒక్కరు పని చేయాలి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి. పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. నియోజకవర్గంలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసా కల్పించాలి. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించాలి. అభ్యర్థి ఎంపిక విషయం ఏఐసీసీ చూసుకుంటుంది. అభ్యర్థి ఎవరైనా పార్టీ గెలుపు కోసం పనిచేయాల్సిన బాధ్యత మీపై ఉంది. మీ పనితీరు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటా. పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి' అని సీఎం స్పష్టం చేశారు. కాగా, ఈనెల 21వ తేదీ కల్లా నియోజకవర్గంలోని 407 పోలింగ్ బూత్‌లలో ప్రతి బూత్‌కు పదిమంది చురుకైన కార్యకర్తలను ఎంపిక చేసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని సమావేశంలో నిర్ణయించారు.



సొరంగం ఘటనపై స్పందన ఏదీ?

నెలలు గడిచినా దర్యాప్తు జాడ లేదు

- ప్రభుత్వం పరిహారం కూడా ఇవ్వలేదు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: 'శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం దుర్ఘటన జరిగి 200 రోజులు దాటినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో స్పందన లేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్నపాటి సమస్యలకే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందంతో హంగామా చేసిన కేంద్ర ప్రభుత్వం.. ఎస్‌ఎల్‌బీసీ ఘటనపై దర్యాప్తు చేయడానికి ఎందుకు ఒక్క బృందాన్ని కూడా పంపలేదు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదం జరిగి 200 రోజులు దాటినా ఆరు మృతదేహాలను ప్రభుత్వం ఇప్పటికీ వెలికితీయలేదని విమర్శించారు. బాధిత కుటుంబాలకు ఎలాంటి పరిహారం కూడా అందించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన రోజున విచారణ జరిపి, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆరుగురు ప్రాణాలను బలిగొన్న వారికి శిక్ష పడేలా చేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చిన్నపాటి సమస్యపై జాతీయ బృందాన్ని పంపించి హంగామా చేసిన కేంద్ర ప్రభుత్వం, శ్రీశైలం డ్యామ్ సొరంగం కూలిపోయిన సంఘటనలో ఎనిమిది మంది కార్మికులు చనిపోయినప్పటికీ ఒక్క ప్రశ్న కూడా లెవనెత్తలేదని అన్నారు. బీజేపీ బడే భాయ్ తెలంగాణ రాష్ట్రంలో చోటే భాయ్‌ని ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు.

కేటీఆర్ ఆరోపణలపై తల్లిదండ్రులు స్పందించాలి

కాంగ్రెస్ హయాంలో గ్రూప్–1 ఉద్యోగాలు భర్తీ కాకూడదనేదే కేటీఆర్ ఆలోచన: ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 ఉద్యోగాలకు ఎంపికైన 563 మంది అభ్యర్థుల తల్లిదండ్రులు కేటీఆర్ ఆరోపణలపై స్పందించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ ఉద్యోగాల కోసం ఒక్కొక్కరు రూ.3 కోట్లు సీఎం రేవంత్‌కు ఇచ్చారన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై వారంతా మీడియా ముందుకువచ్చి వాస్తవాలు చెప్పాలని కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రూ.3 కోట్లు చెల్లించే స్థాయి ఆ తల్లిదండ్రులకు ఉందో లేదో వారే చెప్పాలని కోరారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కేటీఆర్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్–1 ఉద్యోగాలు రాకూడదన్నదే కేటీఆర్ కుట్ర అని ఆరోపించారు. వారి హయాంలో ఎలాగూ ఉద్యోగాలివ్వలేదని, ఇప్పుడు కూడా అదే జరగాలని ఆయన కోరుకుంటున్నారని విమర్శించారు. ఆయనకు రాజకీయ ప్రయోజనం తప్ప ప్రజలపై నిజంగా ప్రేమ లేదని చామల విమర్శించారు.

బీఆర్ఎస్ విమర్శలు తిప్పికొట్టండి..: గ్రూప్–1 పరీక్ష విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు నిరుద్యోగులు తిప్పికొట్టాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ రియాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌లు కోరారు. గ్రూప్–1 పోస్టులు అమ్ముకున్నారని మాట్లాడిన కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో వారు కోరారు. నిరుద్యోగులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ త్వరలోనే డీజీపీని కలిసి తగిన ఆధారాలను సమర్పిస్తామని ఆ ప్రకటనలో రియాజ్, దయాకర్‌లు పేర్కొన్నారు.

సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా నిర్వహించాలి

సీఎంకు ఎమ్మెల్యే కూనంనేని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ స్టేట్ భారతదేశంలో విలీనమైన సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ ప్రజాపరిపాలన దినోత్సవంగా కాకుండా 'తెలంగాణ విలీన దినోత్సవం'గా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన సీఎంకు లేఖ రాశారు. హైదరాబాద్ స్టేట్‌ను విముక్తి చేసేందుకు 1947 సెప్టెంబర్ 11న ఆంధ్రమహాసభ తరుపున కామ్రేడ్ రావి నారాయణరెడ్డి, కామ్రేడ్ మఖ్దూం మొహియుద్దీన్, కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో నాటి చరిత్రాత్మక పోరాటాన్ని ప్రతిబింబించేలా సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా నిర్వహించాలని కోరారు. అలాగే తెలంగాణ స్వాతంత్ర్యోద్యమ, రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠ్యాంశాలలో చేర్చేలా కృషి చేయాలన్నారు. అమరవీరుల స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే హైదరాబాద్‌లో నాటి పోరాట సేనానులు రావి నారాయణరెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి ఆనాటి సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ముఖ్య ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు.

ఓపీఎస్ అమలుచేసే పార్టీలకే మా ఓటు

ఎన్ఎంఓపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ



సాక్షి, హైదరాబాద్: పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేసే పార్టీలకే ఓటు వేస్తామనే నినాదాన్ని విస్తృతం చేస్తున్నట్లు నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఎన్ఎంఓపీఎస్) సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ తెలిపారు. మరో రెండు నెలల్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆదివారం పాట్నాలో ఎన్ఎంఓపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన పెన్షన్ సంఘర్ష్ బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ రాష్ట్ర పరిధిలోనిదని, ఇటీవల దేశంలో పార్టీలు తమ మేనిఫెస్టోలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు, పాత పెన్షన్ అమలు చేస్తామంటున్నాయని, తెలంగాణ, కర్ణాటకలో సీపీఎస్ ఉద్యోగుల మద్దతుతో ఆయా పార్టీలు అధికారంలోకి వచ్చాయన్నారు. తెలంగాణ, కర్ణాటక ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఆయా రాష్ట్రాల్లో పాత పెన్షన్‌ను పునరుద్ధరించాక, బిహార్‌లో సీపీఎస్ ఉద్యోగులు ఆయా పార్టీలకు మద్దతు ఇస్తారని తెలిపారు. ఉద్యోగికి కంట్రిబ్యూషన్‌తో సంబంధం లేకుండా ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఈ సందర్భంగా సభకు హాజరైన ఉద్యోగులతో పాత పెన్షన్ అమలు చేసే పార్టీకే మా ఓటు అని ప్రమాణం చేయించారు.





మీరు నిజమైన సేవను అందించాలంటే... అది కొనలేనిది, డబ్బుతో విలువ కట్టలేనిది అయి ఉండాలి.
– 'భారతరత్న' మోక్షగుండం విశ్వేశ్వరయ్య, రాజనీతిజ్ఞుడు

సాక్షి
సోమవారం, 15 సెప్టెంబర్ 2025

ఆదిమ నిద్రకళ

నిద్ర అనే మాటే ఒక మత్తు, మహత్తు. అలసిన శరీరానికి హాయి... నిద్ర. గడిచిన దినానికి తీపి వీడ్కోలు... నిద్ర. నిద్ర పోవడం అనే దశ నుంచే శిశువు జీవితం ఆరంభమవుతుంది. రోజులో పదహారు గంటలు నిద్రపోతూనే దినదిన ప్రవర్ధమానమవుతాడు. ఏ పాటా రాని తల్లి కూడా పసివాడిని నిద్రపుచ్చడానికి 'ఉళుళుళు హాయి' అని లాలి రాగం తీస్తుంది. ఆ లెక్కన ప్రతి తల్లీ ఒక గాయనే అనుకోవాలి. నిద్ర అనేది మనిషికి ప్రకృతి ప్రసాదించిన చవకైన విలాసం.

నిద్ర అనేది నిజమైన సమవర్తి కూడా! ఏ మనిషైనా తన దగ్గర అన్ని కిరీటాలనూ పక్కన పెట్టాల్సిందే. కేవలం శ్వాసించే మాంసపు బంతులుగా ఆడాల్సిందే. ''ఈ నీడల నాటకరంగం మీద జీవితపు మెరకపల్లాల్లోంచి వచ్చిన వాళ్లందరూ ఒకే హోదాతో నిలబడతారు. ఇక్కడ విభేదాలు లేవు. ఈ కౌగిలి అందరికీ ఒకేరకపు శాంతినిస్తుంది. ఇక్కడ యాచన లేదు. లేదనటం లేదు. అవమానం లేదు. ఈ వాకిలి దగ్గరకు వచ్చినవాడెవ్వడూ ఉత్త చేతులతో తిరిగి వెళ్లడు'' అంటాడు కథక కవి ఆలూరి బైరాగి. నిద్ర అనేది దివ్యలోకాలకు తలుపులు తెరిచే సాధనం. ఏ మనిషికా మనిషి సమాంతర ప్రత్యేక లోకాలను ఆవిష్కరించుకోగలిగే తరుణోపాయం. కలల రెక్కల మీద ప్రతి జీవీ అక్కడ ఎల్లలు లేకుండా తిరుగుతాడు. తెల్లారేసరికి ఏమీ ఎరగనట్టే మామూలుగా ఉండిపోతాడు.

మనిషికి ఉన్నవి రెండే స్థితులు: పగలు పని, రాత్రి నిద్ర. అవి తారుమారవ్వడం ఆధునిక పరిణామం. ఆకలి రుచెరగదు, నిద్ర సుఖమెరగదంటారు. నిద్రలోంచి లేవడమంటే దాదాపు చచ్చి మళ్లీ బతికినట్టే! అందుకే కొందరు నిద్ర లేవగానే కృతజ్ఞతగా దేవుడికి దండం పెట్టుకుంటారు. కానీ అదంతా కాయకష్టం చేసిన రోజుల్లో! ఇప్పుడు మనిషి స్థానాన్ని యంత్రం ఆక్రమించాక, నడుం వంచడం అనేదే పెద్ద పనైపోయింది. లక్షల ఏళ్ల మనిషి నాగరికతా ప్రస్థానంలో 10,000 ఏళ్ల నుంచే మనుషులు నగరాల్లో జీవించడం మొదలుపెట్టారు. పంతొమ్మిదో శతాబ్దం చివరలోనే కరెంట్ మనిషి జీవితంలోకి వచ్చింది. 1970ల తర్వాతే కంప్యూటర్లు ఇళ్లల్లోకి ప్రవేశించాయి. వీటన్నింటికీ మనిషి మెదడు సర్దుకుపోతూ వచ్చింది.

ఈ క్రమంలో చరిత్ర పూర్వ మనుషులు ఎలా నిద్దరోయారు అనేది ఒక ఆసక్తి. చెట్టు కొమ్మలనే పాన్పులుగా చేసుకుని అదే చెట్ల మీద పడుకోవడమూ ఉండేది. ఎటో జారిపోతున్న భావన కలిగి ఉన్నట్టుండి మనం ఇప్పుడు నిద్రలోంచి మేల్కొనడం అనేది మన పూర్వీకుల చెట్ల నిద్ర తాలూకు అవశేషం మన రక్తంలోకి ఇంకిపోవడం వల్ల జరుగుతున్నదని నిద్రా నిపుణులు చెబుతుంటారు. అలా జారిపోతున్న సంవేదన ఆ ఆదిమ మానవులకు ఒక రక్షాకవచంలా పనిచేసి, క్రూర మృగాల పట్ల అప్రమత్తతతో ఉంచింది. అయితే, రెండు లక్షల ఏళ్ల క్రితమే మనుషులకు 'మంచం' లాంటిది ఏర్పాటు చేసుకోవడం తెలుసు అంటారు 'హౌ టు స్లీప్ లైక్ ఎ కేవ్‌మ్యాన్: ఏన్షియెంట్ విజ్‌డమ్ ఫర్ ఎ బెటర్ నైట్స్ రెస్ట్' రచయిత డాక్టర్ మెరిజిన్ వాన్ డెలార్. పట్టు పాన్పు, మబ్బు దుప్పట్లు లేకపోయినా, మట్టిని బల్లపరుపుగా చేసుకొని, దాన్ని మరిన్ని పొరలుగా ఉబ్బుగా దిద్దుకుని, దాన్ని కొమ్మలు, గడ్డి, ఆకులతో మెత్తబరుచుకొని పడుకునేవాళ్లు. పురుగూ పుట్రను తరిమికొట్టే మొక్కలను అక్కడ ఉంచేవాళ్లు. పక్కనే క్యాంప్ ఫైర్ ఉండనే ఉంటుంది. అదే మంటతో ఆ మంచాన్ని నియమిత సమయాల్లో కాల్చుతుండేవాళ్లు. దానివల్ల కూడా పురుగూ పుట్రా ఆ దరికి చేరకుండా ఉండేవి. అవే మంచాలను బహుముఖంగా పని ప్రదేశాలుగానూ, పనిముట్లను సాపుచేసుకోవడానికీ వాడుకునేవాళ్లు. అందుకే చరిత్ర పూర్వ మనుషులనగానే అనాగరికమైన ఊహ రావడాన్ని వ్యతిరేకిస్తారు వాన్ డె లార్. నిద్ర, తిండి విషయంలో వాళ్లు అత్యంత వివేకంతో వ్యవహరించారన్నది నెదర్లాండ్స్‌కు చెందిన ఈ 'స్లీప్ సైంటిస్ట్' వాదన. వ్యాయామం ఉండటం, తిండిలో చక్కెర లేకపోవడం అనే రెండు కారణాల వల్ల వాళ్లకు ఇట్టే నిద్రపట్టేది. ఆ రెండూ రివర్సు కావడం వల్ల ఇప్పుడు నిద్ర కరవవుతోంది. వీటినే సూచనలుగా స్వీకరిస్తే మనం కోల్పోతున్న నిద్రను మళ్లీ పొందొచ్చేమో!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.అష్టమి ఉ.6.40 వరకు, తదుపరి నవమి తె.4.30 వరకు (తెల్లవారితే మంగళవారం), **నక్షత్రం:** మృగశిర ప.11.49 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.7.47 నుండి 9.18 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.10 వరకు, తదుపరి ప.2.47 నుండి 3.36 వరకు, **అమృత ఘడియలు:** రా.1.04 నుండి 2.36 వరకు.

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం: 6.02
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

మాస్టర్



కొంతమంది టోరీలు అంటారు... "ఆమె 16 ఏళ్ల వయసులోనే స్కూల్ మానేసింది. ఆమెకు విశ్వవిద్యాలయ డిగ్రీ లేదు, ఆమెకు విద్య గురించి ఏం తెలుసు?" అని. నాకు డిగ్రీ లేకపోవచ్చు, కానీ నిజ జీవితంలో నాకు మాస్టర్స్ డిగ్రీ ఉంది.

– ఏంజెలా రేనర్, బ్రిటన్ మాజీ డిప్యూటీ పీఎం

మరింతగా..!



నేను ఫేస్‌బుక్‌ను విడిచిపెట్టినప్పుడు, నా వాటా డబ్బు కట్టల్ని (ఈక్విటీ) టేబుల్‌పై వదిలేసి వచ్చాను. నేను డబ్బుకు బానిసగా ఉండాలనుకోలేదు. మరింత పెద్దవైన ఆశయం, లక్ష్యం అనేవాటికి బానిసలా ఉండాలనుకున్నాను.

– చమత్ పలిహాపిటియా, వెంచర్ క్యాపిటలిస్ట్

ప్రశ్నలు



వయసు పెరుగుతున్న కొద్దీ ప్రశ్నలు తగ్గుతూ వస్తాయి. చివరికి ఎవరికి వారు వేసుకునే ఈ ప్రశ్నలు రెండు లేదా మూడుకు తగ్గిపోతాయి. 1. ఎంతకాలం? 2. నాకు మిగిలి ఉన్న సమయంతో నేను ఏం చేయాలి? 3. అటూ ఇటుగా అవే మొదటి రెండు ప్రశ్నలు.

– డేవిడ్ బౌవీ, గేయ రచయిత

కొత్త కారు



డబ్బు మీకు ఆనందాన్ని కొనివ్వలేదు అనే మాట మీరు ఎప్పుడూ వింటుంటారు. నేనైతే... చాలా డబ్బు పెడితే కొంచెం ఆనందం దొరుకుతుందని అనుకునే వాడిని. రెండూ నిజం కాదు! పాత కారు లీజు గడువు ముగియడంతో నేను కొత్త కారు కొన్నాను.

– సెర్గీ బ్రిన్, గూగుల్ కో–ఫౌండర్

సెలవు



ఎదగాలన్న లక్ష్యం లేకపోవటం తప్పేమీ కాదు. కొందరికి స్టార్టప్‌లు, డబ్బు, మెరిసే కార్లు ఆనందాన్నిస్తాయి. కొందరు ఈ ఆనందాన్ని ఒక మంచి సెలవుదినంలో పొందుతారు. మిమ్మల్ని సంతోషపెట్టేది ఏదో అదే చేయండి! ఇతరుల మెప్పు కోసం ఏదీ చేయకండి.

– వరుణ్ అగర్వాల్, లైఫ్ స్టయిల్ ఇన్‌ఫ్లుయెన్సర్

రాత్రికి రాత్రి



మానవ జీవితంలోని మార్గదర్శకాలు ఒకరోజులో, ఒక మనిషి వల్ల ఏర్పడినవి కావు కనుక వాటిపై నాకు నమ్మకం ఉంటుంది. పెద్దవాళ్లు ఏం చెప్పినా ముందు శ్రద్ధగా వినండి. పాటించండి. నిన్నటి మీ గతుకుల దారి, రాత్రెవరో బాగు చేసి వెళ్లినట్లుగా అనిపిస్తుంది.

– క్యాథరిన్ వోర్స్లే, డచెస్ ఆఫ్ కెంట్

అడకత్తెరలో ఇండియా

కామెంట్



కరణ్ థాపర్

ఇండియా–యూఎస్ బాంధవ్యం ఎంత ఘోరంగా దెబ్బ తిన్నది! అటు చూస్తే వాషింగ్టన్ – బీజింగ్ సంబంధాలు మెరుగవుతున్నాయి. ఈ నూతన పరిణామం... అమెరికాతో ఇండియా బాంధవ్యాన్ని ఇంకెంతగా ప్రభావితం చేయబోతోంది? రష్యా చమురు కొనుగోలు ఆపేయకుంటే, ఇండియాపై అగ్రరాజ్యం రెండవ, మూడవ విడత అదనపు సుంకాలు విధిస్తుందా?

''ఇండియా దౌత్యానికి నిజంగా ఇదో పరీక్షా సమయం. కొంతకాలం ముందు నుంచీ పరిస్థితులు ఏమంత బాగోలేవు. ఇప్పుడు అవి మరింత దుర్బలంగా మారాయి''... మాజీ విదేశాంగ కార్యదర్శి శ్యామ్ శరణ్ అభిప్రాయం ఇది. అధ్యక్షుడు ట్రంప్ ''స్వతహాగానే కక్ష సాధింపు మనిషి. ఇండియా పట్ల ఇప్పుడాయన అదే వైఖరితో వ్యవహరిస్తున్నారు''. కాబట్టి ఇండియా–యూఎస్ సంబంధాలు ''తప్పనిసరిగా మరింత క్షీణిస్తాయి''.

'క్వాడ్'ను సైతం వదులుకుంటారా?

వాషింగ్టన్‌తో ఢిల్లీ బాంధవ్యాన్ని తీవ్రంగా దెబ్బ తీసే పరిణామాల విషయానికి వద్దాం. మొదటిది – చైనాతో తనకున్న ఎంతో మంచి బాంధవ్యాన్ని గురించి, షీ జిన్‌పింగ్‌తో తన స్నేహాన్ని గురించి ట్రంప్ అదేపనిగా మాట్లాడుతున్నారు. బీజింగ్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని ఆయన ఎంతో ఇదిగా ఉన్నారు. తాను చైనాలో పర్యటిస్తానని సైతం చెబుతున్నారు. ఆయన ఈ మొత్తం వ్యవహారంలో ఎంత దూరం వెళ్తారన్నదే ఇక్కడ ప్రశ్న.

చైనాతో పెద్ద ఒప్పందం ఒకటి కుదుర్చుకోవడానికి 'క్వాడ్'ను సైతం త్యాగం చేయబోతున్నారా? 'న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రకారం, క్వాడ్ సదస్సు కోసం ఇండియాను సందర్శించే ఉద్దేశం ట్రంప్‌కు లేదు. దీనర్థం ఏమిటి? ఆయన ప్రభుత్వ విదేశాంగ విధానంలో ఇండో–పసిఫిక్ వ్యూహం ఇంకెంతో కాలం కీలకం కాదు. ఈ పరిణామం ఇండియా–యూఎస్ సంబంధాలకు శరాఘాతం లాంటిది. చైనా పట్ల అమెరికా విధానంలో ఒకప్పుడు కేంద్ర స్థానంలో ఉన్న మనల్ని... ఇది అంచుల దాకా నెట్టివేస్తుంది. మన ప్రాధాన్యం పూర్తిగా మసకబారుతుంది.

శరణ్ దీన్ని చాలా సున్నితంగా ఇలా చెప్పారు: ''యూఎస్, చైనాలతో ఇండియా సంబంధాలు... వాటి పరస్పర సంబంధాల కంటే మెరుగ్గా ఉన్నప్పుడు ఇండియాకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది''. అయితే ఇప్పుడీ పరిస్థితి లేదు. వాషింగ్టన్–బీజింగ్ నడుమ ప్రస్తుత సంబంధాలు, కచ్చితంగా వాషింగ్టన్ – ఢిల్లీ నడుమ కంటే బాగున్నాయని చెప్పాలి.



◆ వాషింగ్టన్–బీజింగ్ సంబంధాలు, కచ్చితంగా వాషింగ్టన్ – ఢిల్లీ మధ్య కంటే బాగున్నాయని చెప్పాలి. ఇదంతా చూస్తుంటే – అమెరికా, చైనా నడుమ జి–2 తరహా ఏర్పాటుకు అవకాశం ఉందా అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇండియాకు అది అంగీకారం కాదు.

ఇదంతా చూస్తుంటే – అమెరికా, చైనా నడుమ జి–2 తరహా ఏర్పాటుకు అవకాశం ఉందా అన్న ప్రశ్న తలెత్తుతుంది. సమాధానం అవును అనుకుంటే, ఆసియా ప్రాంతంలో చైనా ప్రాబల్యానికి 'చట్టబద్ధత' కల్పించినట్లే! ఇండియాకు అది అంగీకారం కాదు.

ఈ పరిస్థితుల్లో, ఇండియా, చైనా సంబంధాల్లో ఎంత పురోగతి సాధ్యమవుతుంది? మరోపక్క పాకిస్తాన్‌తో చైనా దృఢ సంబంధాలు సడలిపోయే అవకాశం లేదు. సరిహద్దు సమస్య అలా అపరిష్కృతంగానే మిగిలిపోతుంది. ఆసియాలో ప్రాబల్యం వహించాలని చైనా కోరుకుంటోంది. ఇండియా అందుకు ససేమిరా అంగీకరించదు. వాణిజ్యం విషయానికి వస్తే– అరుదైన ఖనిజాలు, ఎరువులు, సొరంగ తవ్వక యంత్రాల్లో చైనా స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. అందుకే, తియాన్‌జిన్‌లో ఎన్ని చిరునవ్వులు చిందించినా, ఎంత గట్టి కరచాలనాలు చేసినా... ఇండియా–చైనా సంబంధాల్లో గణనీయ పురోగతికి అవకాశాలు అతి తక్కువ.

రష్యా కోసం మూల్యం చెల్లిస్తున్నామా?

రష్యా చమురు విషయానికి వద్దాం. రష్యా మీద ఆర్థికంగా ఒత్తిడి తెచ్చి ఉక్రెయిన్ యుద్ధం ఆపేందుకే ఇండియా మీద 25 శాతం అదనపు సుంకం విధించామని అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ చెప్పారు. ఆ ఎత్తుగడ పారలేదు. దీంతో ట్రంప్ నిస్పృహ చెందారు. ఇప్పుడు ఆయన ఇండియా మీద అదనపు సుంకాలు విధిస్తారా?

రష్యా చమురు గురించి జవాబు చెప్పుకోవలసిన ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. రష్యా చమురుతో ఇండియా ఆదా చేస్తున్నది బారెల్‌కు సుమారు 2 డాలర్లు మాత్రమే! ఈ చమురు కొనుగోళ్ల కారణంగా మనం అమెరికాకు ఏటా 48 బిలియన్ డాలర్ల ఎగుమతులను కోల్పోతాం. రష్యా నుంచి చేసుకునే చమురు దిగుమతులతో మనకు సమకూరే ప్రయోజనం, మనం అమెరికాకు చేసే ఎగుమతులతో పోల్చితే చాలా తక్కువ. ఆర్థికంగా చూసినట్లయితే – రష్యా చమురు కొనుగోళ్లు నిలిపి వేయడం ఉత్తమం. అయితే వ్యూహాత్మక, రాజకీయ కోణాలు అందుకు అనుమతిస్తాయా?


ఇప్పటి విధానం ప్రకారం చూస్తే, రష్యా చమురును ఇండియా కొంటూనే ఉంటుంది. దీనివల్ల రష్యాకు డబ్బు లభిస్తుంది. ఆంక్షల క్లిష్ట సమయంలో ఆర్థిక ప్రయోజనం పొందుతుంది. మరి ఇండియా? అమెరికాకు ఎగుమతులు చెయ్యలేకపోవడమే కాకుండా వాషింగ్టన్‌తో సంబంధాలు పూర్తిగా చెడతాయి. అలా రెండు రకాలా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

ఇప్పటి వరకూ తెర వెనుక నడచిన ఒక అంశాన్ని ఇప్పుడు తెర పైకి తీసుకువచ్చి దీనికి ఒక ముగింపు ఇస్తాను. అమెరికాతో మన సంబంధాలు గడిచిన మూడు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేనంత అథమ స్థాయికి దిగజారి పోయాయి. మనకు పాకిస్తాన్‌తో ఎన్నడూ బాంధవ్యం లేదు. చైనాతో సంబంధాలు మెరుగుపడుతున్నా, ఆ దేశంతో మనకు ఉన్న సమస్యలు చిన్నవేమీ కావు. రష్యాతో మన సంబంధాలు బలోపేతం అయ్యాయి. అయితే అందుకు మనం ఇప్పటికే భారీ మూల్యం చెల్లించుకుంటున్నాం. మరోవంక చైనా, పాకిస్తాన్, రష్యాలతో అమెరికా సంబంధాలు బైడెన్ హయాంలో కంటే ఇప్పుడు మెరుగ్గా ఉన్నాయి. ఇది నిజంగా ఒక వైచిత్రి. తొమ్మిది నెలల్లోనే వీటి మధ్య సాన్నిహిత్యం మెరుగుపడింది. అదే సమయంలో అమెరికాతో మన సంబంధాలు కుప్ప కూలాయి. కాబట్టి ఇండియా దౌత్యానికి ఇది 'బ్యాడ్ టైమ్' అనుకోవాలా? దీనికి సమాధానం అవును అని తప్ప మరో విధంగా చెప్పలేను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

పుస్తక ప్రపంచం

సుదీర్ఘ చరిత్రకు సంక్షిప్త రూపం



'ఇండియా – 5000 ఇయర్స్ ఆఫ్ హిస్టరీ ఆన్ ది సబ్ కాంటినెంట్'



ఆడ్రే ట్రుష్కీ,
దక్షిణాసియా చరిత్ర ప్రొఫెసర్,
రాగర్స్ యూనివర్సిటీ – నెవార్క్

దాదాపు 120 వేల సంవత్సరాల ప్రయాణం నుంచి ఓ 5 వేల సంవత్సరాల భారత ఉపఖండ చరిత్రను వేరు చేసి, సూక్ష్మంలో మోక్షంగా అందించడం సాహసమే! అమెరికాకు చెందిన చరిత్ర పరిశోధకురాలు, బోధకురాలైన ఆడ్రే ట్రుష్కీ ఆ పని చేశారు. ఈ 'ఇండియా... 5000 ఇయర్స్' పుస్తకం రాశారు. మధ్య యుగం కాలంలో సంస్కృతంపైన, మొఘల్ చక్రవర్తి ఔరంగజేబుపైన గతంలో రాసిన పుస్తకాల ద్వారా ఆడ్రే పేరు సుపరిచితమే. ఔరంగజేబును ఆనాటి సమకాలీన హిందూ, ముస్లిములిరువురూ గౌరవభావంతో చూశారనీ, ఆ తర్వాత కాలంలోనే ఆయనను రాక్షసుడిగా చిత్రించడం జరిగిందని ఆమె పేర్కొనడం అప్పట్లో వివాదాస్పదమైంది. ఒక వర్గం దాడులకు దిగవచ్చనే శంకతో ఆమె భారత్‌కు రావడానికి కూడా వెనుకాడాల్సి వచ్చింది. అయితే, బెదిరింపులు ఎన్ని ఉన్నా చరిత్ర పరిశోధకురాలిగా తన అధ్యయనం ఆగదని పేర్కొనే ఆడ్రే నాలుగో పుస్తకం ఈ 'ఇండియా'.

సాధికారికంగా చెబుతూనే, సామాన్యులకు అర్థమయ్యేలా చరిత్ర లోగుట్టు విప్పడం ఈ రచన ప్రత్యేకత. ఈ ప్రసిద్ధ ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ ప్రచురణ ఒక రకంగా ఇది భారత భూఖండ చరిత్ర కాదు. ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దిన పరిణామాలు, ప్రజల చరిత్ర. వలసలు మానవ నాగరికతతో పాటు చరిత్రను మారుస్తాయని భావించిన ఆడ్రే ఆ కోణం నుంచి కలం కదిపారు. గతమెంతో ఘనమనే కీర్తిగానానికి భిన్నంగా రచన చేశారు. అందుకే, ఈ పుస్తకంలోని




ఆనాటి జీవిత కథలు తెలియని కోణం తెర మీదకు తెచ్చి ఆశ్చర్యపరుస్తాయి. సుమారు 65వేల ఏళ్ళ క్రితం ఆఫ్రికా పరిసరాల ప్రాంతాల నుంచి వచ్చి, స్థిరపడిన జనమే 'ఫస్ట్ ఇండియన్స్' అనే మాటను ఆడ్రే పునరుద్ఘాటిస్తారు. వారి జన్యువులే ఇప్పటికీ ప్రధానంగా దక్షిణ భారతావనిలో కనిపిస్తాయంటారు.

సాక్ష్యాధారాల సహితంగానే తప్ప అనుశ్రుత కథలతో చరిత్రను అక్షరీకరించలేమన్నది సరైన శాస్త్రీయ దృక్కోణం. ఈ రచన ఆ కోణంలోనే సాగుతుంది. దానివల్ల కొన్ని అంశాల్లో పాతుకుపోయిన నమ్మకాలను 'ఇండియా' సమర్థించదు. గతంలోకి తొంగి చూస్తున్నప్పుడు చరిత్రలోని భిన్న స్వరాలను వినిపించడం ముఖ్యమని ఆడ్రే భావన. అందుకే, బౌద్ధం, హైందవం వగైరా గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు మహిళల గొంతుకలను వినిపించడానికి ప్రయత్నిస్తారు. ఈ చరిత్ర పునఃకథనంలో నిమ్నవర్గాలను ముందు నిలుపుతారు. అలాగే, ఆ రోజుల్లోనే ఉన్న 'సోకాల్డ్' శూద్ర రాజుల గాథల నుంచి అగ్రవర్ణ ఆధిపత్యాన్ని చూపే అలనాటి సాహిత్య రచనల్ని కూడా చాలామందికి భిన్నంగా అప్పటి చరిత్రపై అవగాహనకు ఆకరాలుగా వాడారు. హైందవం, బౌద్ధం, జైనం, ఇస్లామ్, వేదాలు, మౌర్య సామ్రాజ్యం, చోళులు, మొఘల్ సామ్రాజ్యం, యూరోపియన్ వలస పాలన, భారత స్వాతంత్ర్యోద్యమం, చివరకు తాజాగా పెరిగిన హిందూ జాతీయవాదం దాకా అనేక అంశాలను ఈ రచనలో వివరించారు.

అయిదు వేల ఏళ్ళ సుదీర్ఘకాలాన్ని దాదాపు 700 పేజీల ఒకే సంపుటంలో పొందుపరచాలన్నప్పుడు నిడివి రీత్యా ఉండే ఇబ్బందులు సహజం. అందుకే, చాలామందికి తెలిసిన అంశాలు, చరిత్ర అనగానే ఎక్కువగా కనిపించే రాజవంశ గాథలను రచయిత్రి పక్కనపెట్టేశారు. ఇది కొంతమందికి నచ్చకపోవచ్చు. కానీ రాజుల చరిత్ర, రాజకీయ చరిత్ర ఎంత ముఖ్యమో... సామాజిక, ఆర్థిక చరిత్ర అంతే కీలకమని గుర్తించి, ఈ రచనలో వాటికి ఆమె పెద్ద పీట వేశారు. ఆ రకంగా ఇది రోమిలా థాపర్ లాంటి పలువురి కాలక్రమాణిక చరిత్ర రచనలకు పరిపూరకం. అయితే, ఆధునిక భారత చరిత్రలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, నైజామ్‌లో రజాకార్ల ఆగడాలు, ప్రాంతీయ చరిత్రలను ఆడ్రే ప్రస్తావించక పోవడం ఆశ్చర్యకరమే. భారత్‌పై చైనా దురాక్రమణ, బంగ్లాదేశ్ విమోచన వగైరా ప్రస్తావించిన తీరేమో నిరాశపరుస్తుంది. వెరసి, సుదీర్ఘ చరిత్రకు సంక్షిప్త రూపమే తప్ప ఈ పుస్తకం సమగ్రం కాదు. సర్వజన సమ్మతమూ కాదు. అది గుర్తించి, ఒకే అంశానికున్న పలు పార్శ్వాలను తెలుసుకొనేందుకు చదివితే... ఈ రచన ఆసక్తి అనిపిస్తుందే తప్ప ఆశాభంగం కలిగించదు.

నొప్పిని పోగొట్టే 'అయాన్'

'నొప్పి'ని తగ్గించేందుకు వైద్య శాస్త్రంలో నిరంతరం పరిశోధనలు జరుగుతున్నాయి. అయినా నొప్పికి విరుగుడు కనిపెట్టడంలో ఇంకా పూర్తి విజయాన్ని సాధించలేకపోయారు. కీళ్ల నొప్పి, ఆర్థరైటిస్, గాయాలు... ఇవన్నీ మనిషికి నొప్పి కలిగిస్తాయి. శరీరంలో నొప్పి, సందేశాలను అణచివేసే రసాయనాలు ప్రవేశపెడితే ఈ నొప్పికి విరుగుడుగా ఉంటుంది. శరీరంలో నొప్పికి విరుగుడుగా 'విద్యుత్ చికిత్స' ఉత్తమమని పరిశోధకులు గుర్తించారు. శరీరంలోకి బలహీనమైన విద్యుత్‌ను ప్రసారం చేస్తే అది మత్తు మందులా పనిచేసి రోగికి నొప్పి తెలియకుండా చేస్తుంది.



నొప్పిని కల్గించే ప్రేరణలను మందగింపచేయడమే గాక మెదడుకు సమాచారం వెళ్లకుండా ఈ విద్యుత్ నిరోధిస్తుంది. దీనినే 'ఎలక్ట్రిక్ స్టిములేషన్' పద్ధతి అంటారు. మన భారతీయ పరిశోధకుడు ఒకాయన 'అయాన్ వైద్య చికిత్స' రూపొందించారు. ఈ చికిత్స వలన అనేక మంది రోగులు నొప్పి నుండి విముక్తి పొందినట్లు ఆయన ప్రకటించారు. అమెరికాలోని వైద్య పరిశోధకులు ఈ 'అయాన్ వైద్య చికిత్స' బాగా పనిచేస్తోందని చెప్పారు. మూడవ డిగ్రీ స్థాయి వరకు శరీరం కాలిన రోగులకు విద్యుదావేశం కాబడిన గాలిని తగిలేటట్లు చేస్తే కొంతమేర స్వస్థత చేకూరిందని తెలియజేశారు. అంటే నొప్పికి విద్యుత్ ఒక 'బామ్'గా పనికి వస్తుందన్నమాట. విద్యుత్ పరికరాల సహాయంతో ఋణవిద్యుదావేశం గల గాలిని తయారు చేశారు. ఈ గాలిని బాగా పోగుచేసి నొప్పిగల ప్రదేశం మీదకు పంపారు. ఫలితంగా నొప్పి తగ్గినట్లు వారు గుర్తించారు.

ఈ అయాన్‌లు గల గాలి వైద్యంతో కీళ్ల నొప్పులు, కాళ్ళ నొప్పులు, నడుం నొప్పులు వంటి వాటిని నయం చేయడానికి ప్రయోగించి మంచి ఫలితాలు సాధించారు. శరీరానికి గాయం అయితే ఆ ప్రాంతంలో నొప్పి ఉంటుంది. ఎందుకంటే అక్కడి జీవకణాలకు విద్యుత్ నిరోధం తక్కువగా ఉంటుంది. ఆ కారణంగా ఆ ప్రాంతంలో ఏర్పడే ద్రవపదార్థాలకు విద్యుత్ వాహకత్వం ఉంటుంది. రష్యాలోని పరిశోధకులు ఈ నిజాలు తెలుసుకుని తక్కువ విద్యుత్ నిరోధం గల జీవకణం పైకి విద్యుత్‌ను ప్రవహింప చేశారు. ఫలితంగా అది తిరిగి విద్యుత్ నిరోధక శక్తిని పుంజుకుంది. 'ఇదే నొప్పి నివారణకు విద్యుత్ ఉపయోగపడుతున్న తీరు' అని వివరించారు.

ఈ చికిత్స వలన నొప్పి తగ్గిన వారిలో మళ్ళీ నొప్పి పునరావృతం కాలేదు. రోగి విద్యుత్ చికిత్స సమయంలో గాని ఆ తరువాత నాలుగు గంటల వరకు గానీ ఎటువంటి లోహపు వస్తువులనూ తాకకూడదు. నీటితో శరీరాన్ని శుభ్రం చేసుకోకూడదు. రబ్బరు తొడుగులు ధరించి రోగి చికిత్స చేయించుకోవాలి. లేకపోతే రోగికి సరఫరా చేసిన విద్యుత్ ఎర్త్ అయిపోతుంది.

– డా॥ సి.వి. సర్వేశ్వర శర్మ । పాపులర్ సైన్స్ రచయిత

డేటా పాయింట్

బిలియనీర్ల భారతం



మనదేశంలో ఈ ఏడాది జూలై నాటికి, 'ఫోర్బ్స్' నివేదిక ప్రకారం 205 మంది బిలియనీర్లు ఉన్నారు. వీరి మొత్తం ఆస్తి సుమారు రూ. 82.98 లక్షల కోట్లు (0.94 ట్రిలియన్ డాలర్లు).

దేశం	బిలియనీర్ల సంఖ్య	మొత్తం ఆస్తి విలువ (ట్రిలియన్ డాలర్లలో)
అమెరికా	902	6.8
చైనా	450	1.7
భారత్	205	0.94
జర్మనీ	171	0.79
రష్యా	140	0.58
కెనడా	76	0.36
ఇటలీ	74	0.34
హాంకాంగ్	66	0.34
బ్రెజిల్	56	0.21
యూకే	55	0.24

జ్యోతిర్మయం

మరో జన్మ

'మరో జన్మంటూ ఉంటే ఇలా పుట్టాలి. ఇది చేయాలి. అది చేయాలి' అంటూ అప్పుడప్పుడు బహుశా అందరూ కమ్మని పగటి కలలు కంటూనే ఉంటారు. 'మరో జన్మ ఉంటే...' అన్న సందేహమే అక్కర్లేదు ఆస్తికులకు. ఈ జన్మలోనూ, దీని వెనక జన్మలలోనూ చేసిన పాపపుణ్య ఫలాలలో అనుభవించక మిగిలి ఉన్న దాన్ని అనుభవించాల్సిందే. అందుకు ఒక దేహం కావాల్సిందే. కాబట్టి మనిషిగానో, కుక్కగానో, పిల్లిగానో, మరో ప్రాణిగానో మళ్ళీ జన్మ ఎత్తక తప్పదు' అనేది భారతీయుల విశ్వాసం. తరవాత జన్మ ఒకటి ఉంటుంది అన్న స్పృహ తగినంత బలంగా ఉన్నవాడికి పాపభీతి ఉంటుంది. మరు జన్మలో మనిషిగా పుడతామో, మానుగా పుడతామో, అడవి జంతువుగా పుడతామో నిర్ణయించేది ఈ జన్మలో చేస్తున్న పాపపుణ్యాలే కదా!

ఇళ్ళూ, వాకిళ్ళూ, వస్తువులూ, వాహనాలూ ఇన్ని ఉన్న ఈ నర జన్మే ఇంత అసంతృప్తికరంగా ఉన్నది. రోగభయం, భోగభయం, పదవి భయం, పరువు భయం, లేనిది రాదని భయం, ఉన్నది పోతుందని భయం, శత్రు భయం, మృత్యు భయం – ఇన్ని భయాలతో క్షణం శాంతి లేదు. ఇక ఏ పశుపక్షుల జన్మో ఎత్తితే... కూడూ, గుడ్డా, నీడా, తోడూ లేకుండా అన్నపానాల కోసమే అష్టకష్టాలు పడుతూ బ్రతకటం ఇంకెంత దుర్భరంగా ఉంటుందో!

'జంతూనాం నర జన్మ దుర్లభం' అన్నారు. ఉన్నంతలో ఉత్తమమైన ఈ జన్మ లభించినపుడు, ఏ జంతువుకూ లేనంతగా తెలివీ, వివేకమూ, దూరదృష్టీ, యుక్తాయుక్త విచక్షణా ఉంటాయి. వాటిని ఉపయోగించకుండా... అనాలోచితంగా అత్యాశతో, ఆవేశంతో, మదంతో అకృత్యాలూ, పాపకృత్యాలూ, పరపీడనలూ చేస్తూ; ఈ దుర్లభమైన జన్మను దుర్భరమైన భవిష్యత్ జన్మలకు పునాదిగా మలచుకొంటూ గడపటం విజ్ఞత కాదు. 'చేసిన పాపపుణ్యాల ఫలం అనుభవించేందుకు, ముందు జన్మ కూడా ఉంది' అన్న ధ్యాస వ్యక్తికి ఉంటే, అది అతగాడికీ, సమాజానికీ కూడా మేలు చేస్తుంది.

– ఎం. మారుతి శాస్త్రి


కాళేశ్వరం పుష్కర ఘాట్‌ను తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి


నిండు కుండలా నాగర్జున సాగర్

జలాశయాలల్లో నీళ్లు ఫుల్లు

- గరిష్టానికి చేరిన నిల్వలు
- 1,069 టీఎంసీల సామర్థ్యానికి గాను 879 టీఎంసీలకు పెరిగిన నిల్వలు
- నాగార్జునసాగర్ 26 గేట్లు ఎత్తివేత
- ఈ ఏడాది రెండు పంటలకు ఇక్కట్లు లేనట్టే..!

సాక్షి, హైదరాబాద్/కాళేశ్వరం/నాగార్జునసాగర్: ఎగువ ప్రాంతాల్లో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పోటెత్తుతున్న వరదలతో గోదావరి, కృష్ణా పరీవాహకంలోని జలాశయాల్లో నీటి నిల్వలు దాదాపుగా గరిష్టానికి చేరుకున్నాయి. రాష్ట్రంలో మొత్తం 1,069.34 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన 87 జలాశయాలుండగా, వాటిలో నిల్వలు 879.52 టీఎంసీ (82శాతం)లకు చేరాయి. కృష్ణా పరీవాహకంలో మొత్తం 649.53 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 30 జలాశయాలుండగా ప్రస్తుతం వాటిలో 611.53 (94%) టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ మిగిలిన వరదను కిందకు విడుదల చేస్తున్నారు. జలాశయాల నిర్వహణలో భాగంగా వరదలు పోటెత్తినప్పుడు వాటిని పూర్తిగా నింపకుండా కొంత భాగం ఖాళీ (సాంకేతిక భాషలో ఫ్లడ్ కుషన్ అంటారు)గా ఉంచుతారు. వరదలు తగ్గు ముఖం పట్టిన తర్వాత పూర్తి సామర్థ్యం మేరకు నింపుతారు. ఈ నేపథ్యంలో కృష్ణా పరీవాహకంలోని జలాశయాలు పూర్తిగా నిండినట్టు భావించవచ్చు. ఇక గోదావరి పరీవాహకంలో మొత్తం 419.81 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 57 జలాశయాలుండగా వాటిలో నిల్వలు 267.76 (63.78%) టీఎంసీలకు పెరిగాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ పంప్‌హౌస్‌ల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసి జలాశయాలను నింపుతుండడంతో గోదావరి పరీవాహకంలోని జలాశయాల్లో నిల్వలు సైతం గరిష్ట స్థాయికి పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుత వానాకాలంలో సాగు చేసిన పంటలతో పాటు యాసంగిలో సాగుచేయనున్న పంటలకు సైతం పుష్కలంగా సాగునీరు లభించే అవకాశాలున్నాయి.

జోరుగా కృష్ణా..

ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి వరద కొనసాగుతుండడంతో జూరాల ప్రాజెక్టుకు ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో 72 వేల క్యూసెక్కులు వస్తుండగా, 69,903 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి మరో 13,124 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. జూరాల, తుంగభద్రకు దిగువన శ్రీశైలం జలాశయంలోకి 2.14 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 1.87 లక్షల క్యూసెక్కులను వదిలేస్తున్నారు. సాగర్‌కు మొత్తం 2,39,978 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో సాగర్ ప్రాజెక్టు మొత్తం 26 గేట్లు ఎత్తి 2,73,872 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదనతో 32,927 క్యూసెక్కులు.. మొత్తం 3,06,799 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 588.40 అడుగుల (307.2834 టీఎంసీలు) మేర నీరు ఉంది.

గోదారి పరవళ్లు

గోదావరి పరవళ్లు తొక్కుతోంది. మహారాష్ట్రలోని జైక్వాడ్ నుంచి ఏపీలోని ధవళేశ్వరం బరాజ్ వరకు ప్రాజెక్టులన్నింటికీ నిరంతర వరద కొనసాగుతోంది. రాష్ట్రంలో మంజీరాపై నిర్మించిన సింగూరు ప్రాజెక్టు సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా 12.41 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ మిగిలిన నీళ్లను కిందికు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17.07 టీఎంసీలకు పెరిగాయి. శ్రీరామ్‌సాగర్ పూర్తిగా నిండింది. దీని గరిష్ట నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల మేర నిల్వలను కొనసాగిస్తూ వచ్చిన వరదను వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. కడెం ప్రాజెక్టు సామర్థ్యం 4.7 టీఎంసీలు కాగా, నిల్వలు 4.48 టీఎంసీలను కొనసాగిస్తూ మిగిలిన నీళ్లను కిందికి విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా 18.7 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 2.98 లక్షల క్యూసెక్కుల వరదను కిందికి విడుదల చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బరాజ్‌కు 7.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా మొత్తం 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలేస్తున్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 11.600 మీటర్ల నీటిమట్టంతో గోదావరి పుష్కరఘాట్‌ను తాకుతూ ప్రవహిస్తోంది.

యాదగిరి క్షేత్రంలో 'జూపల్లి'


మంత్రి జూపల్లికి ఆశీర్వచనం చేస్తున్న ప్రధానార్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ముఖ మండపంలో వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్‌శర్మ లడ్డూ ప్రసాదం, శ్రీస్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో.. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు అధికంగా తరలి వచ్చారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి 45 నిమిషాల సమయం పట్టింది. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.35,40,126 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

శ్రీహరికి అంతిమ వీడ్కోలు

- పాడె మోసిన హరీశ్‌రావు, గంగుల కమలాకర్


పాడె మోస్తున్న గంగుల, హరీశ్‌రావు

కోహెడ రూరల్ (హుస్నాబాద్): అనారోగ్యంతో శనివారం మృతి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి అంత్యక్రియలు సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఆయన భౌతిక కాయం వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ నివాళులర్పించారు. అంతిమ యాత్రలో మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ పాల్గొని పాడె మోశారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్‌తో పాటు పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కర్ర శ్రీహరి సతీమణి, కుమారులను పరామర్శించారు.

శ్రీహరి మృతికి కేసీఆర్ సంతాపం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నేత కర్ర శ్రీహరి మృతికి పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శ్రీహరితో తనకున్న ఉద్యమ, రాజకీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గ్రామస్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకు నిబద్ధతతో సేవ చేశారని కేసీఆర్ కొనియాడారు. కర్ర శ్రీహరి నిజాయితీ, నిస్వార్థ సేవలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని, హుస్నాబాద్ నియోజకవర్గానికి ఆయన మరణం తీరని లోటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు కూడా శ్రీహరి సేవలను స్మరిస్తూ సంతాపం తెలిపారు.

క్లుప్తంగా...

డివైడర్‌ను ఢీకొట్టిన మంత్రి పొన్నం ఎస్కార్ట్ వాహనం



కొండపాక (గజ్వేల్): మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్కార్ట్ వాహనం అదుపుతప్పి రాజీవ్ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సిద్దిపేట నుంచి మంత్రి పొన్నం హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో మంత్రి వెంట ఉన్న పోలీస్ ఎస్కార్ట్ వాహనం అదుపు తప్పి రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో వాహనం ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నది. కాగా వాహనంలో డ్రైవరు, పోలీస్ కానిస్టేబుల్, ఫొటోగ్రాఫర్, అటెండర్ ఉన్నారు. వీరిలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం కాలేదు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాస్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాన్ని పక్కకు జరిపించారు. మరో వాహనంలో మంత్రి ఎస్కార్ట్ సిబ్బందిని పంపించారు.

సైబర్ మోసగాడిపై పీడీ యాక్ట్

- తెలంగాణలో మొదటిసారిగా నమోదు

ఖలీల్‌వాడి: లావోస్, థాయ్‌లాండ్ దేశాల్లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు అని చెప్పి అక్కడికి నిరుద్యోగ యువతను పంపించి సైబర్ నేరాలకు పాల్పడేలా ఒత్తిడి చేస్తున్న హైదరాబాద్ జీడిమెట్లలోని వెంకటేశ్వర్‌నగర్‌కు చెందిన కోలనాటి నాగశివ (36)పై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పోతురాజు సాయిచైతన్య తెలిపారు. మంచి ఉద్యోగం, అధిక వేతనాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగ యువతను నాగశివ విదేశాలకు పంపించేవాడని, అక్కడకు వెళ్లిన తర్వాత వారి పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకుని చట్టవిరుద్ధంగా సైబర్ మోసాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాడని పేర్కొన్నారు. పలువురు బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ గ్యాంగ్ అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని, ఇందుకు ప్రధాన సూత్రధారుడైన నాగశివపై పీడీ యాక్ట్ నమోదు చేశామని వివరించారు. సైబర్ కేసుల్లో ఇది తెలంగాణలోనే మొట్టమొదటి పీడీ యాక్ట్ అని తెలిపారు.

పోలీసులు కొట్టారని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తమ ఊరికి బస్సు కావాలంటూ ఓ యువకుడు పెట్టిన పోస్టు అతని ఆత్మహత్యాయత్నానికి దారి తీసింది. అకారణంగా తనను పోలీసులు చావబాదారని మనస్తాపం చెందిన ఆ యువకుడు.. సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఎలుకల మందు తాగాడు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన బండారి శ్రీనివాస్ అనే యువకుడు తమ ఊరికి బస్సు సౌకర్యం కల్పించాలని ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టాడు. దీనిపై నాచుపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి ఫోన్ చేసి దూషించాడు. శనివారం ఉదయం మల్యాల పోలీసులు శ్రీనివాస్‌ను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అక్కడ ఎస్సై నరేశ్ తనను దుర్భాషలాడుతూ రోజంతా చితకబాదారని, అందుకే తాను మనస్తాపంతో ఎలుకల మందు తాగుతున్నానంటూ శ్రీనివాస్ వీడియోలో పేర్కొన్నాడు. అతను ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు.

'నైరుతి' ఉపసంహరణ షురూ

- 3 రోజుల ముందే మొదలైన ప్రక్రియ.. అక్టోబర్ రెండో వారాంతానికి పూర్తి
- ఈ సమయంలోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం: ఐఎండీ
- అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో 3 రోజులపాటు మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల ఉపసంహరణ మొదలైంది. సాధారణంగా సెప్టెంబర్ మూడో వారం చివరలో మొదలవ్వాల్సిన ఈ ప్రక్రియకు ఈసారి సానుకూల వాతావరణ పరిస్థితులు ఉండటంతో ముందే ప్రారంభమైందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. రానున్న రెండు రోజుల్లో రాజస్తాన్, పంజాబ్, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు క్రమంగా నిష్క్రమిస్తూ అక్టోబర్ రెండో వారాంతానికి దేశం నుంచి పూర్తిస్థాయిలో నిష్క్రమిస్తాయని వివరించింది. ఈ సమయంలోనూ చాలా ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు గతేడాది కంటే మూడు రోజుల ముందే.. మే 23న కేరళను తాకాయి. ఆ తర్వాత మూడు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించాయి. జూలై రెండో వారం నాటికి దేశమంతా విస్తరించాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రంలో సగటున 74.06 సెం.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటికే 83.02 సెం.మీ. మేర వర్షం కురిసింది. ఇది సాధారణ వర్షపాతంకన్నా 12 శాతం అధికం.

మూడు రోజులపాటు మోస్తరు వర్షాలు

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదిలి ఉత్తర తెలంగాణ, విదర్భ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వివరించింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. దీని ప్రభావంతో పలుచోట్ల తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలకు అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

లారీ యూరియా ఆ సొసైటీకి పంపండి

- ఎమ్మెల్యే పీఏ నంటూ గన్‌మన్ నిర్వాకం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన


నాగునాయక్

మిర్యాలగూడ: రాష్ట్రంలో యూరియాకు ప్రస్తుతం ఎంత డిమాండ్ ఉందో తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ఓ ఎమ్మెల్యే గన్‌మన్ నేరుగా మార్క్‌ఫెడ్ అధికారికి ఎమ్మెల్యే పీఏ నంటూ ఫోన్ చేసి.. లారీ యూరియాను పక్కదారి పట్టించిన సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. 'హలో నేను ఎమ్మెల్యే పీఏను మాట్లాడుతున్నాను.. ఎమ్మెల్యే సార్ బిజీగా ఉన్నారు. ఒక లారీ లోడ్ యూరియా మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం ఎన్‌డీసీఎంఎస్‌కు పంపండి..'అంటూ 15 రోజుల క్రితం మిర్యాలగూడ ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డి గన్‌మన్ నాగు నాయక్.. మార్క్‌ఫెడ్ డీఎం జ్యోతికి ఫోన్ చేసి సూచించాడు. అది నమ్మిన ఆ అధికారి విషయాన్ని మెసేజ్ ద్వారా జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్‌కు తెలియజేశారు. ఆయన ఆదేశాలతో ఒక లారీ లోడ్ యూరియా ఆ సొసైటీకి వెళ్లింది. ఆ యూరియాను గ్రామంలోని ఓ ప్రైవేట్ ఎరువుల దుకాణం ద్వారా అమ్మినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అధికారులు ఆరా తీయగా, యూరియాకు సంబంధించి ఎమ్మెల్యే ఎలాంటి సిఫారసు చేయలేదని తేలింది. దీంతో గన్‌మన్ నాగు నాయక్‌ను నల్లగొండకు అటాచ్ చేసి ఘటనపై విచారణకు ఆదేశించారు. అయితే ఆ యూరియా పక్కదారి పట్టలేదని, కుక్కడం ఎన్‌డీసీఎంఎస్‌కే వెళ్లగా రైతులకు అందజేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి వివరణ ఇచ్చారు.

ఒక్క గంటలో ఆగమాగం

▶ మొదటి పేజీ తరువాయి

పంజాగుట్ట, అమీర్ పేట, ముషీరాబాద్, తార్నాక, లక్డీకాపూల్, కాచిగూడ, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల్లో కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ నిలిచిపోయింది. హైడ్రా, జీహెచ్ఎంసీ, జలమండలి, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రధాన రహదారులపై నిలిచిన వర్షపు నీరు నాలాల్లోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. కాగా, ఆదివారం రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం సిద్దిపేట జిల్లా నారాయణరావు పేటలో 24.3 సెంటీమీటర్లు నమోదైంది.


రాము


అర్జున్

అఫ్జల్‌సాగర్ నాలాలో మామా అల్లుళ్లు గల్లంతు

భారీ వర్షానికి అఫ్జల్‌సాగర్ నాలా పొంగి ప్రవహించింది. ఈ నాలాలో మాన్గార్ బస్తీకి చెందిన అర్జున్ (26), రాము (25) అనే యువకులు కొట్టుకుపోయారు. వీరిద్దరూ మామా అల్లుళ్లుగా తెలిసింది. వీరి కోసం రెస్క్యూ సిబ్బంది తీవ్రంగా గాలిస్తున్నారు. అర్జున్, రాము ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఆ ఇల్లు అఫ్జల్‌సాగర్ నాలా ప్రక్కనే ఉండటంతో ఇంట్లోకి వర్షపు నీరు చేరింది. ఇంట్లోని సామాన్లు బయటకు తెచ్చే క్రమంలో రాము అదుపు తప్పి నాలాలో పడ్డాడు. అతడిని కాపాడే క్రమంలో అర్జున్ కూడా నాలాలో పడిపోయి వరద ఉధృతికి కొట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడికి చేరుకుని పరిస్థితిని ఆరా తీశారు. ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో నాలాలో దినేశ్ (సన్నీ) అనే యువకుడు గల్లంతయ్యాడు. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసే వినోబా నగర్‌కు చెందిన దినేశ్ (24) విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వచ్చే క్రమంలో నాలాలో వరద ఉధృతి అధికంగా ఉండడంతో తన వాహనాన్ని ఆపి అక్కడ ఉన్న గోడ పక్కన నిలుచున్నాడు. ఇదే సమయంలో గోడ కూలడంతో దినేశ్ బైక్‌తోపాటు నాలాలో పడి కొట్టుకుపోయాడు. దినేశ్‌కు భార్య రాజశ్రీ, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. దినేశ్ కోసం ముషీరాబాద్ పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గాలిస్తున్నారు.

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలో ఆదివారం రాత్రి పది గంటల వరకు నమోదైన అత్యధిక వర్షపాతం

ప్రాంతం	సెంటీమీటర్లు
మెదక్ జిల్లా నారాయణరావుపేట	24.3
అబ్దుల్లాపూర్‌మెట్ తట్టి అన్నారం	12.8
ముషీరాబాద్ బౌద్ధనగర్	12.1
ముషీరాబాద్ జవహర్‌నగర్	11.2
ఉస్మానియా యూనివర్సిటీ	10.1
మెట్టుగూడ	9.5
షేక్‌పేట	9.4
అడిక్‌మెట్	9.3
కాప్రా	9.1
భోలక్‌పూర్	8.5
చిలకల గూడ	7.8
హిమాయత్‌నగర్	7.7
నెరేడ్‌మెట్	7.6
ఉప్పల్	7.5
అల్వాల్	7.4
గచ్చిబౌలి	7.1
గన్‌ఫౌండ్రీ	7.0

స్వగ్రామంలో మావోయిస్టు వెంకటి అంత్యక్రియలు

బెల్లంపల్లి రూరల్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గరియాబంద్ అటవీ ప్రాంతంలో ఈ నెల 11న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ టెక్నికల్ టీమ్ ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు జాడి వెంకటి (56) అలియాస్ విమల్ అలియాస్ మంగన్న అలియాస్ సురేశ్ అంత్యక్రియలు ఆదివారం రాత్రి స్వగ్రామమైన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చంద్రవెల్లిలో నిర్వహించారు. వెంకటి 1996లో భార్య బాలమ్మ అలియాస్ పుష్పతో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లి.. 30 ఏళ్లుగా అక్కడే ఉండి దండకారణ్యం కేంద్రంగా పనిచేశాడు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో.. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ నుంచి అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకొచ్చారు. అమరవీరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పద్మకుమారి, కార్యదర్శి శాంతక్క, తెలంగాణ రాష్ట్ర పౌరహక్కుల సంఘం ఉపాధ్యక్షుడు మాదన కుమారస్వామి, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, గ్రామస్తులు నివాళులర్పించారు. వెంకటి చెల్లెలు రామటెంకి సుజాత తలకొరివి పెట్టింది.

కన్న తల్లినే చెరపట్టే యత్నం

- తండ్రి చేతిలో కుమారుడి హతం


శ్రీధర్

జడ్చర్ల: మద్యం మత్తులో సభ్య సమాజం తలదించుకునే విధంగా కన్నతల్లినే చెరపట్టే ప్రయత్నం చేశాడో యువకుడు. దీంతో భార్యను కాపాడే ప్రయత్నంలో తండ్రి చేసిన దాడిలో కుమారుడు మృత్యువాత పడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని డీటీసీ (జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం) సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. పోలేపల్లి గ్రామానికి చెందిన దంపతులు జడ్చర్ల డీటీసీ సమీపంలో నివసిస్తూ.. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరిలో చిన్న కుమారుడు శ్రీధర్‌కు మినహా అందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. తల్లిదండ్రుల వద్దే ఉంటున్న శ్రీధర్ (28) కొన్ని రోజులుగా తాగుడుకు బానిసగా మారి జులాయిగా తిరుగుతున్నాడు. జల్సాలకు అలవాటు పడి తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ సంపాదించిన డబ్బును బలవంతంగా తీసుకుని తాగుడుకు వెచ్చించేవాడు. అనేకసార్లు మద్యం మత్తులో కన్న తల్లి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. కుమారుడి వేధింపులు భరించలేక విషయాన్ని ఆమె భర్తకు చెప్పింది. దీంతో ఆయన కొడుకును పలుసార్లు మందలించి.. ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించాడు. అయినా శ్రీధర్‌లో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి మద్యం సేవించిన కుమారుడు శ్రీధర్ మధ్యరాత్రి సమయంలో తల్లి దగ్గరకు వచ్చి అత్యాచారం చేయబోయాడు. ఆమె కొడుకు నుంచి తప్పించుకుని ఇంటి బయటకు పరుగెత్తే ప్రయత్నం చేయగా, చేయి పట్టుకుని గదిలోకి లాక్కెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో పక్క గదిలో నిద్రిస్తున్న భర్త మేల్కొని.. భార్యను కాపాడే ప్రయత్నం చేశాడు. దీంతో కొడుకు ఆగ్రహంతో తండ్రిని నెట్టి వేయడంతో అతను కింద పడిపోయాడు. ఈ క్రమంలో తండ్రి పక్కనే ఉన్న కర్రతో కుమారుడి తలపై బాదడంతో ఒక్కసారిగా కిందపడిపోయాడు. తర్వాత చలనం లేకపోవడంతో తమ కుమారుడు మృతి చెందాడని నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


కామారెడ్డి జిల్లా రెడ్డిపేటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం బారులు

రామారెడ్డి (ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట, అన్నారం గ్రామాలలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఒక్కో గ్రామానికి 440 బస్తాల చొప్పున యూరియా రాగా.. వేయి మందికిపైగా రైతులు క్యూలో నిలబడ్డారు. ఒక క్యూ లైన్‌లో టోకెన్, మరో క్యూ లైన్ ద్వారా యూరియా బస్తాలు పంపిణీ చేశారు. దీంతో రైతులు గంటల తరబడి లైన్లలో నిల్చోవాల్సి వచ్చింది. ఇంతా చేస్తే సగం మందికి కూడా యూరియా దొరకక పోవడంతో నిరాశతో వెనుదిరిగారు.



ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకంతో క్యూలో నిలుచున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్


యూరియా కోసం క్యూలో మాజీమంత్రి

కురవి: మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ యూరియా కోసం క్యూలో నిలుచున్నారు. సత్యవతి తనకున్న ఐదున్నర ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగులోని రైతు వేదిక వద్ద ఆదివారం యూరియా కూపన్లు ఇస్తుండటంతో.. రైతు వేదిక వద్దకు వచ్చిన ఆమె, మహిళలు నిలబడి ఉన్న క్యూలో గంటపాటు నిల్చున్నారు. అధికారులు, సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి నేరుగా వచ్చి యూరియా తీసుకోవాలని కోరినా ఆమె క్యూలోనే నిలుచున్నారు. గంట తర్వాత కూపన్ తీసుకెళ్లిన ఆమె, యూరియా కోసం వేరే వ్యక్తిని పంపించారు.

ఇద్దరు రైతుల దుర్మరణం

- యూరియా కోసం వెళ్తుండగా రోడ్డు ప్రమాదం


బానోతు లాల్య


వీరన్న

గూడూరు: యూరియా కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి చెందిన సంఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం జగన్నాయకులగూడెం క్రాస్ వద్ద జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గూడూరు మండలం దుబ్బగూడెం శివారు జోషితండాకు చెందిన బానోత్ లాల్య (75), ధరావత్ వీరన్న (40) కలిసి టీవీఎస్ మోపెడ్‌పై యూరియా టోకెన్ల కోసం బొద్దుగొండ జీపీకి వెళ్తున్నారు. జాతీయ రహదారిపైకి చేరుకోగానే మానుకోట వైపు నుంచి గూడూరుకు వెళ్లే బొలేరో వాహనం ఎదుటి నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం వెనుక కూర్చున్న లాల్య అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న సీఐ సూర్యప్రకాశ్ సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన వీరన్నను పోలీస్ వాహనంలో మానుకోట ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. మానుకోట జిల్లా ఆస్పత్రి ఎదుట మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులతో కలిసి ధర్నా చేశారు.

చొరబాటుదారులకు మద్దతా?

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం • చొరబాటుదారులను, దేశ వ్యతిరేక శక్తులను కాపాడుతోంది

- 'సిందూర్' సమయంలో ఆ పార్టీ నిజస్వరూపం తెలిసిపోయింది
- కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు రాజకీయాలే ముఖ్యం
- దేశ ప్రయోజనాలను ఏనాడూ కాపాడలేదు
- నేను శివ భక్తుడిని.. నన్ను ఎవరు ఎంతగా తిట్టినా భరిస్తా
- అస్సాంలో అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధానమంత్రి


మంగళ్‌దోయిలో బహిరంగ సభలో ప్రసంగిస్తున్న మోదీ

గౌహతి: విపక్ష కాంగ్రెస్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. పాకిస్తాన్ నుంచి పుట్టుకొస్తున్న ఉగ్రవాదులకు, మన దేశంలోకి అక్రమంగా చొరబడుతున్నవారికి ఆ పార్టీ మద్దతిస్తోందని మండిపడ్డారు. మన సైన్యానికి అండగా ఉండడానికి బదులు నిస్సిగ్గుగా ముష్కర మూకలను వెనకేసుకొస్తోందని ధ్వజమెత్తారు. చొరబాటుదారులను, దేశ వ్యతిరేక శక్తులను కాంగ్రెస్ కాపాడుతోందని ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆ పార్టీ నిజస్వరూపం ప్రజలకు తెలిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు రాజకీయాలే ముఖ్యమని, దేశ ప్రయోజనాలను ఆ పార్టీ ఏనాడూ కాపాడలేదని నిప్పులు చెరిగారు. చొరబాటుదారులు మనదేశంలోకి ప్రవేశించి, భూములు ఆక్రమించుకొని, ఇక్కడే తిష్టవేసి జనాభా స్థితిగతులను మార్చేస్తామంటే సహించే ప్రసక్తే లేదని, వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ అస్సాంలో రెండో రోజు ఆదివారం పర్యటించారు. దరాంగ్ జిల్లాలోని మంగళ్‌దోయి, నుమాలీగఢ్‌లో బహిరంగ సభల్లో పాల్గొన్నారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కామాఖ్య మాత ఆశీస్సుల వల్లే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని, ఈ పవిత్రమైన నేలపై అడుగుపెట్టడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. అస్సాంతో, అస్సాం ప్రజలతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. ప్రధానమంత్రి ప్రసంగం ఆయన మాటల్లోనే...

తప్పో ఒప్పో ప్రజలే నిర్ణయిస్తారు

''అస్సాం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ నిన్ననే ఒక వీడియోను నాకు చూపించారు. పాటగాళ్లను, తైతక్కలాడేవాళ్లను బీజేపీ నెత్తిమీద పెట్టుకుంటోందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఒకరు విమర్శిస్తున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. 2019లో అస్సాం గాయకుడు భూపేన్ హజారికాకు మేం భారతరత్న పురస్కారం ఇవ్వడాన్ని తప్పుపడుతూ ఆ మాజీ అధ్యక్షుడు మాట్లాడారు. 1962లో చైనా దురాక్రమణ సమయంలో అస్సాం ప్రజలకు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేసిన గాయాలు ఇప్పటికీ మానలేదు. పైగా భూపేన్ హజారికాను కించపర్చడం ద్వారా ఆ గాయాలపై కాంగ్రెస్ ఉప్పు చల్లుతోంది. భూపేన్‌ను కించపర్చడం చూసి చాలా బాధపడ్డా. ప్రజలే నాకు యజమానులు. భూపేన్‌కు భారతరత్న ఇవ్వడం తప్పో ఒప్పో వారే నిర్ణయిస్తారు. ఆ మహా గాయకుడిని ఎందుకు అవమానించారంటూ కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీయాలి.

'నేషనల్ డెమోగ్రఫీ మిషన్'

అస్సాం ప్రజల కలలు నిజం చేయడానికి బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. మన ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ అక్రమ వలసదారులను బయటకు పంపిస్తుండడం హర్షణీయం. భూములను వలసదారుల చెర నుంచి విడిపించి, మళ్లీ రైతులకు అప్పగిస్తున్నారు. ఆ భూముల్లో రైతులు, స్థానికులు వ్యవసాయ విప్లవం సృష్టిస్తున్నారు. చొరబాటుదారులు మన దేశంలోకి ప్రవేశించి, మన అక్కచెల్లెమ్మలను, తల్లులను అవమానిస్తామంటే చూస్తూ సహించాలా? జాతీయ భద్రతకు ముప్పుగా మారిన వారిని వదిలిపెట్టబోం. బయటకు తరిమికొట్టడం ఖాయం. చొరబాటుదారులకు సమాజంలో ఓ వర్గం నుంచి రక్షణ లభిస్తుండడం సిగ్గుచేటు. అక్రమంగా వలస వచ్చినవారి నుంచి అస్సాంను కాపాడేందుకు పోరాటం జరగాల్సిందే. చొరబాటుదారుల వల్ల మన దేశ జనాభాలో మార్పులు రాకుండా చూడడానికి 'నేషనల్ డెమోగ్రఫీ మిషన్' తీసుకొస్తున్నాం.

'వికసిత్ భారత్'లో ఈశాన్య రాష్ట్రాలు కీలకం

కాంగ్రెస్ పార్టీ అస్సాంను కొన్ని దశాబ్దాల పాటు పరిపాలించింది. బ్రహ్మపుత్ర నదిపై కేవలం మూడు వంతెనలు నిర్మించింది. మేము పదేళ్లలో ఆరు వంతెనలు నిర్మించాం. మనదేశం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోంది. అస్సాంలో 13 శాతం వృద్ధిరేటు నమోదైంది. డబుల్ ఇంజన్ సర్కార్ కృషి వల్లే ఇది సాధ్యమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అస్సాంను హెల్త్‌హబ్‌గా తీర్చిదిద్దుతున్నాయి. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ఈశాన్య రాష్ట్రాలకు కీలక పాత్ర పోషించబోతున్నాయి. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చుకోవాలన్న సంకల్పంతో దేశం మొత్తం ఐక్యంగా ముందుకు కదులుతోంది. ఈశాన్య రాష్ట్రాల్లో అనుసంధానం పెంచడానికి చర్యలు చేపట్టాం. ఏ ప్రాంతమైనా వేగంగా అభివృద్ధి చెందాలంటే అక్కడ బలమైన అనుసంధాన వ్యవస్థ ఉండాలి. 21వ శతాబ్దంలో 25 ఏళ్లు గడిచిపోయాయి. ఈ శతాబ్దంలో తదుపరి అధ్యాయం తూర్పు, ఈశాన్య భారతదేశానిదే.

దేశీయంగానే చమురు, సహజ వాయువు ఉత్పత్తి

ముడి చమురు, సహజ వాయువు దిగుమతులను తగ్గించుకోవడానికి చర్యలు ప్రారంభించాం. మన దేశం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న తరుణంలో ఇంధన అవసరాలు తీర్చుకోవడానికి విదేశాలపై ఆధారపడడం సరైంది కాదు. అందుకే ఈ పరిస్థితిని మార్చాలని సంకల్పించాం. దేశీయంగానే శిలాజ ఇంధనాలు, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని పెంచడానికి ప్రయత్నిస్తున్నాం. ఇంధనాల కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఆ దిశగా ఇథనాల్ ఒక చక్కటి ప్రత్యామ్నాయం అవుతుంది. ఆత్మనిర్భర్ భారత్‌కు ఇంధనం, సెమీకండక్టర్లు చాలా ముఖ్యం. వాటిని దేశీయంగానే తయారు చేసుకుంటే మనకు ప్రయోజనం'' అని అన్నారు.

ఆ గరళం గొంతులో దాచుకుంటా

నన్ను చాలామంది దూషిస్తున్నారు. అవమానించడమే పనిగా పెట్టుకున్నారు. వారు నన్ను ఎంతగా తిట్టినా పట్టించుకోను. నేను శివ భక్తుడిని. అన్నింటినీ భరిస్తా. ఆ గరళాన్ని గొంతులో దాచుకుంటా. కానీ, ప్రజలను అవమానిస్తే మాత్రం ఊరుకోను. ప్రజలే నా రిమోట్ కంట్రోల్. నాకు మరో రిమోట్ కంట్రోల్ లేదు. స్వదేశీ ఉత్పత్తులే కొనుగోలు చేయాలని దేశ ప్రజలను మరోసారి కోరుతున్నా. మన దేశం అభివృద్ధి చెందాలన్నా, మన పిల్లలకు మెరుగైన భవిష్యత్తు దక్కాలన్నా మన దేశంలో తయారైన వస్తువులు, సరుకులే ఉపయోగించుకోవాలి. 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులే మన నిత్య జీవితంలో భాగం కావాలి.

మోదీకి బహుమతిగా పెయింటింగ్‌లు

అస్సాం సభల్లో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని పలుమార్లు కొద్దిసేపు నిలిపివేశారు. కొందరు యువతీ యువకులు మోదీ, ఆయన మాతృమూర్తి హీరాబెన్ మోదీకి సంబంధించిన పెయింటింగ్‌లను సభల్లో ప్రదర్శించారు. వాటిని ఆయనకు బహుమతిగా అందజేయాలన్నదే వారి ఉద్దేశం. ఆ విషయం మోదీ గ్రహించారు. పెయింటింగ్‌ల వెనుక మీ పేరు, చిరునామా రాసి ఇవ్వండి అని కోరారు. వేదిక పైనుంచి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయా పెయింటింగ్‌లను తీసుకోవాల్సిందిగా తన భద్రతా సిబ్బందిని ఆదేశించారు. అలాగే తనకు లేఖ ఇవ్వడానికి ప్రయత్నించిన దివ్యాంగుడికి ఇబ్బంది కలిగించవద్దని ప్రజలకు సూచించారు.

రూ.12,230 కోట్ల ప్రాజెక్టులు

ప్రధానమంత్రి అస్సాంలో ఆదివారం రూ. 12,230 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో రూ.5,000 కోట్ల విలువైన ఇథనాల్ ప్లాంట్ కూడా ఉంది. వెదురుతో ఇక్కడ ఇథనాలు ఉత్పత్తి చేయబోతున్నారు. అలాగే రూ.7,230 కోట్ల విలువైన చమురు శుద్ధి కర్మాగారానికి శంకుస్థాపన చేశారు. పాలీప్రొపైలీన్ ప్లాంట్ నిర్మాణానికి సైతం శంకుస్థాపన చేశారు. దరాంగ్ మెడికల్ కాలేజీకి పునాదిరాయి వేశారు. 2.9 కిలోమీటర్ల పొడవైన నరెంగీ–కురువా వారధి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.


అఖిల భారతీయ రాజభాష సమ్మేళన్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అమిత్‌షా

శాస్త్ర, సాంకేతిక రంగాల భాషగా హిందీ!

- న్యాయ, పోలీస్ విభాగాల్లోనూ హిందీ ఉండాలి
- హోం శాఖ మంత్రి అమిత్‌షా అభిలాష

గాంధీనగర్: మాట్లాడే భాషగా మాత్రమేకాదు శాస్త్ర, సాంకేతిక రంగాలు, న్యాయ, పోలీస్ విభాగాల్లోనూ హిందీ అంతర్లీనంగా కలిసిపోవాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అభిలషించారు. ఆదివారం గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన ఐదవ అఖిల భారతీయ రాజభాష సమ్మేళన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అమిత్‌షా పాల్గొని ప్రసంగించారు. ''హిందీకి ఇతర భారతీయభాషలకు మధ్య ఎలాంటి ఘర్షణ లేనేలేదు. దయానంద సరస్వతి, మహాత్మాగాంధీ, కేఎం మున్షీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి ఎందరో మహానుభావులు హిందీని ఆమోదించారు. హిందీ బాషను దేశవ్యాప్తంగా ప్రోత్సహించారు. గుజరాత్‌లో హిందీ, గుజరాతీ రెండూ తమ స్పష్టమైన ఉనికిను చాటుకుంటూ ముందుకు సాగుతున్నాయి. ఒకే రాష్ట్రంలో రెండు భాషలు ఉన్నాసరే రెండూ అభివృద్ధి చెందగలవని గుజరాత్ నిరూపించింది'' అని అన్నారు.

హిందీ కేవలం భాష కాదు

''హిందీ కేవలం మాట్లాడే భాష కాదు. పరిపాలనా భాష కూడా. శాస్త్ర సాంకేతిక రంగాలు, న్యాయ, పోలీస్ విభాగాల్లోనూ పరిపాలనలో హిందీని ఉపయోగిస్తే బాగుంటుంది. ఇలా అన్ని భాషలను కీలక రంగాల్లో పరిపాలన సౌలభ్యం కోసం వినియోగిస్తే పౌరులు సైతం ఈ భాషలను విరివిగా ఉపయోగిస్తారు. సంస్కృత భాష అనేది మనకు జ్ఞానగంగను ప్రసాదించింది. ఆ జ్ఞానాన్ని ఇంటింటికీ హిందీ మోసుకొచ్చింది. స్థానిక భాషల ద్వారా ఆ జ్ఞానం ప్రతి ఒక్కరికీ చేరువైంది. మాతృభాషలోకాకుండా ఇతర భాషలో చిన్నారులకు కొత్త విషయాన్ని చెబితే మళ్లీ మాతృభాషలోనే దానిని అర్థంచేసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఇందుకోసం మెదడు సామర్థ్యంలో 25 నుంచి 30 శాతం ఖర్చవుతుంది. సామర్థ్యం వృథాను తగ్గించేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎల్లప్పుడూ మాతృభాషలోనే మాట్లాడాలి. లేదంటే పిల్లలకు కొత్త అంశాలను తెల్సుకోవడం కష్టమవుతోంది. ఇది శాస్త్రీయంగా నిరూపితమైంది'' అని అన్నారు. ''గుజరాతీ ఉన్నప్పటికీ గుజరాత్‌లో విద్యాంశాలు హిందీలోనే కొనసాగుతున్నాయి. ఇది మహాత్మాగాంధీ, దయానంద్ సరస్వతి వల్లే సాధ్యమైంది. అలాగే ప్రతి రాష్ట్రంలో ప్రజలు హిందీలోనూ సంప్రతింపులు కొనసాగించాలి'' అని షా కోరారు. 'హిందీ శబ్ద సింధూ అనేది 51,000 పదాలతో మొదలైంది. ఇప్పుడు 7,00,000 పదాలతో అలరారుతోంది. మరో ఐదేళ్లలో ప్రపంచంలోని అన్ని భాషల్లో అత్యధిక పదాల నిఘంటువుగా చరిత్రకెక్కుతుంది'' అని ఆయన అన్నారు.

మోదీ శుభాకాంక్షలు

''హిందీ కేవలం భాష, సమాచారమార్పిడి అనుసంధానం కాదు.. మన భారతీయ సంస్కృతి, ఉనికికి సజీవ వారసత్వ సంపదగా హిందీ భాసిల్లుతోంది. హిందీ దివస్ రోజు మీకందరికీ అంతులేని శుభాకాంక్షలు. హిందీ దివస్ సందర్భంగా భారతీయ భాషలన్నీ పరిఢవిల్లాలని ప్రతిజ్ఞచేద్దాం'' అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఆదివారం పోస్ట్ చేశారు.

నేపాల్ అటార్నీ జనరల్‌గా సబితా భండారీ

కఠ్మాండు: నేపాల్ అటార్నీ జనరల్‌గా మొట్టమొదటిసారిగా మహిళ బాధ్యతలు చేపట్టారు. సీనియర్ న్యాయవాది సబితా భండారీ నేపాల్ ప్రభుత్వ అటార్నీ జనరల్‌గా నియమితులయ్యారు. ఆపద్ధర్మ ప్రభుత్వ ప్రధానమంత్రి సుశీలా కర్కి సిఫారసు మేరకు అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ఆదివారం సబితను నియమించారు. అంతకుముందు అటార్నీ జనరల్ పదవికి రమేశ్ బాదల్ చేసిన రాజీనామాను అధ్యక్షుడు ఆమోదించారు. అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపింది. సబితా భండారీ గతంలో నేషనల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ చీఫ్‌గా బాధ్యతలను నిర్వర్తించారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 48 మంది మృతి

గాజా: గాజా సిటీతోపాటు గాజా స్ట్రిప్ వ్యాప్తంగా ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ ప్రాంతాలపై జరిగిన వైమానిక దాడులు, కాల్పుల ఘటనల్లో కనీసం 48 మంది చనిపోయినట్లు అల్‌జజీరా వార్తా సంస్థ తెలిపింది. వీరిలో 32 మంది గాజా నగరంపై జరిగిన దాడుల్లోనే ప్రాణాలు కోల్పోయారంది. గాజా సిటీలోని రెమాల్ ప్రాంతంలో ఉన్న కౌథర్ టవర్‌ను ఇజ్రాయెల్ ఆర్మీ ఆదివారం ఉదయం నేలమట్టం చేసింది. గంట ముందు అందులోని వారిని ఖాళీ చేయాలంటూ ఇజ్రాయెల్ ఆర్మీ ఆన్‌లైన్ వేదికగా హెచ్చరికలు జారీ చేసింది. ఘటనలో కనీసం 12 మంది చనిపోయారు. షిఫా ఆస్పత్రి సమీపంలోని ఓ వాహనంతోపాటు డెయిర్ అల్ బలాహ్‌లోని టెంట్‌పై జరిగిన దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు సహా 13 మంది ప్రాణాలు కోల్పోయారు. పోషకాహార లోపం సంబంధ కారణాలతో 24 గంటల వ్యవధిలో మరో ఇద్దరు ప్రాణాలొదిలారని ఆరోగ్య విభాగం తెలిపింది.

రొమేనియా గగనతలంలో రష్యా డ్రోన్

బుఖారెస్ట్: రష్యా డ్రోన్ మరో నాటో సభ్య దేశం రొమేనియా గగనతలంలోకి చక్కర్లుకొట్టింది. ఈ విషయాన్ని రొమేనియా ఆదివారం ప్రకటించింది. శనివారం ఉక్రెయిన్‌పై రష్యా దాడి జరిగిన నేపథ్యంలో రొమేనియా వైమానిక దళం అప్రమత్తమైంది. ఆ దేశ యుద్ధవిమానాలు ఉక్రెయిన్ సరిహద్దుల్లోని ప్రాంతాలపై నిఘా ఉంచాయి. ఆ సమయంలో ఒక డ్రోన్ తమ గగనతలంలోకి ప్రవేశించినట్లు గుర్తించామని తెలిపింది. అయితే, అది జనావాసాల మీదుగా ప్రయాణించలేదని, ఎటువంటి ప్రమాదం జరగలేదని పోలెండ్ వివరించింది. అనంతరం తిరిగి ఉక్రెయిన్‌లోకి ప్రవేశించిందని పేర్కొంది. బుధవారం తమ గగనతలంలోకి చొరబడిన కనీసం మూడు రష్యా డ్రోన్లను కూల్చివేసినట్లు నాటో దేశం పోలెండ్ ప్రకటించడం తెల్సిందే.

వలసల వ్యతిరేక ర్యాలీ హింసాత్మకం

- లండన్‌లో పోలీసులతో నిరసనకారుల ఘర్షణ
- నీళ్ల సీసాలు, చేతికందిన వస్తువులతో దాడి
- 26 మంది పోలీసులకు గాయాలు
- 24 మంది నిరసనకారుల అరెస్టు

లండన్: వలసదారులకు వ్యతిరేకంగా యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) రాజధాని లండన్‌లో చేపట్టిన నిరసన ర్యాలీ హింసాత్మకంగా మారింది. విదేశీయులను బయటకు పంపించాలన్న డిమాండ్‌తో అతివాద నేత టామీ రాబిన్సన్ పిలుపు మేరకు శనివారం జరిగిన ర్యాలీలో ఏకంగా 1,50,000 మంది పాల్గొన్నారు. 'యునైట్ ద కింగ్‌డమ్ ర్యాలీ' పేరిట సెంట్రల్ లండన్‌లో కదం తొక్కారు. పార్లమెంట్ సమీపంలోనే భారీ ప్రదర్శన నిర్వహించారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులతో ఘర్షణకు దిగారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారుల దాడిలో 26 మంది పోలీసులు గాయపడినట్లు మెట్రోపాలిటన్ పోలీసు విభాగం అధికారులు తెలిపారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని వెల్లడించారు. పోలీసులపై నిరసనకారులు నీళ్ల సీసాలతోపాటు చేతికందిన వస్తువులు విసిరేశారని, దూరంగా నెట్టేయడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. హింస ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా, లండన్‌లో జరిగిన ఘర్షణకు సంబంధించిన 24 మందిని అరెస్టుచేశారు. వారిపై వివిధ అభియోగాలు నమోదు చేశారు. 25 మందిని అరెస్టు చేసినట్లు తొలుత ప్రకటించగా, ఆదివారం ఆ సంఖ్యను 24గా సవరించారు. నిరసన తెలపడం చట్టబద్ధమైన హక్కు అయినప్పటికీ కొందరు హింసకు పాల్పడాలన్న ఉద్దేశంతో ర్యాలీలో పాల్గొన్నారని ఓ పోలీసు అధికారి చెప్పారు. పోలీసులపై జరిగిన దాడిని హోం సెక్రెటరీ షబానా మహమూద్ ఖండించారు. చట్టాన్ని ఉల్లంఘించివారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. మరోవైపు జాత్యహంకారానికి వ్యతిరేకంగా లండన్‌లో మరో ర్యాలీ సైతం జరిగింది. 'స్టాండ్ అప్ టు రేసిజం' పేరిట జరిగిన ఈ ర్యాలీలో 5,000 మందికిపైగా జనం పాల్గొన్నారు. వలసదారులను వ్యతిరేకించడం, వారిపై కక్షగట్టడం సరైంది కాదంటూ నినదించారు.

వలసల వల్ల విధ్వంసమే: ఎలాన్ మస్క్

లండన్‌లో నిర్వహించిన యాంటీ ఇమ్మిగ్రేషన్ ర్యాలీని టెస్లా సంస్థ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సమర్థించారు. వలసదారులను వ్యతిరేకించేవారికి పూర్తి మద్దతు ప్రకటించారు. నిరసనకారులను ఉద్దేశించి వీడియో లింక్ ద్వారా ప్రసంగించారు. నియంత్రణ లేని వలసల వల్ల దేశానికి భారీ నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యూకేలో ప్రభుత్వాన్ని మార్చేసే దిశగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పార్లమెంట్‌ను రద్దుచేసి, మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మితిమీరిన వలసల కారణంగా దేశం విధ్వంసం అంచున ఉన్నట్లు హెచ్చరించారు. ఇప్పుడున్నవి రెండే మార్గాలని తేల్చిచెప్పాలి. పోరాటం చేయాలని, లేదంటే చచ్చిపోయే పరిస్థితి వస్తుందని స్పష్టంచేశారు. పోరాటమా? మరణమా? ఏదో ఒకటి తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. కీర్ స్టార్మర్ ప్రభుత్వం వెంటనే అధికారం నుంచి తప్పుకోవాలని ఎలాన్ మస్క్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ మార్పును తాను కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఎందుకీ నిరసనలు?

యూకేలో వలసదారుల పట్ల స్థానికుల్లో వ్యతిరేకత నానాటికీ పెరిగిపోతోంది. లండన్ శివారులో ఇటీవల 14 ఏళ్ల బాలిక లైంగిక దాడికి గురైంది. ఇథియోపియా నుంచి వలసవచ్చిన ఓ వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు తేలింది. దాంతో వలసదారులకు వ్యతిరేకంగా నిరసనలు ఊపందుకుంటున్నాయి. ఇమ్మిగ్రెంట్లు తలదాచుకుంటున్న ఇళ్లు, హోటళ్లను జనం ముట్టడించారు. వలసదారుల కారణంగా ఇంగ్లండ్ సంస్కృతి నాశనమవుతోందని జనం మండిపడుతున్నారు. తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మౌలిక సదుపాయాలపై ఒత్తిడి పడుతోందని అంటున్నారు. వలసదారులను వారి స్వదేశాలకు పంపించాలని పట్టుబడుతున్నారు. అవకాశాలు స్థానికులకే దక్కాలని అంటున్నారు.

నిరసనలకు లొంగేది లేదు: స్టార్మర్

వలసలదారుల వ్యతిరేక నిరసనలకు బ్రిటన్ ఎప్పటికీ తలవంచబోదని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఆదివారం స్పష్టంచేశారు. లండన్‌లో జరిగిన హింసను ఖండించారు. జాతీయ జెండాను ముసుగుగా కప్పుకొని హింసాకాండకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎరుపు, తెలుపు ఇంగ్లిష్ జెండా దేశ వైవిధ్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. చర్మం రంగు లేదా నేపథ్యం ఆధారంగా పౌరులను లక్ష్యంగా చేసుకోవడాన్ని, వారిని వ్యతిరేకించడాన్ని సహించబోమని స్టార్మర్ హెచ్చరించారు.


లండన్ వీధిలో నిండిపోయిన నిరసనకారులు

140 కోట్ల జనాభా ఉన్న దేశం మొక్క జొన్న కంకి కొనలేదా?

భారత్‌పై అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ ఆగ్రహం



న్యూయార్క్: భారత్‌పై అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ కక్షపూరిత వ్యాఖ్యలు చేశారు. 140 కోట్ల జనాభా ఉన్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న భారతదేశం అమెరికా నుంచి ఒక్క మొక్కజొన్న కంకి కూడా కొనడంలేదని వ్యంగ్య వ్యాఖ్యలుచేశారు. అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు తగ్గించాలి లేదా తమ నుంచి వ్యాపారపరంగా ఎదురయ్యే గట్టి పోటీని తట్టుకోవాలని భారత్‌కు తేల్చిచెప్పారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో లుట్నిక్ మాట్లాడారు. కొన్ని దేశాల విషయంలో స్నేహం ఒకవైపు నుంచే కొనసాగుతోందని అన్నారు. తాము స్నేహం చేస్తున్న దేశాలు తమను వాడుకొని లాభపడుతున్నాయని విమర్శించారు. వారి ఉత్పత్తులను అమెరికాలో విక్రయించుకుంటూ, అమెరికా ఉత్పత్తులను మాత్రం వారి దేశాల్లో అనుమతించడం లేదని తప్పుపట్టారు. కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థల్లో అమెరికాకు ప్రవేశం కల్పించడం లేదన్నారు. బంధం అనేది ఇరువైపుల నుంచి ఉండాలని తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్లు గుర్తుచేశారు. 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశం అమెరికా నుంచి ఒక్క మొక్కజొన్న కంకి కూడా ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇండియాది తప్పుడు విధానం కాదా? అని ప్రశ్నించారు. ఇండియా ఉత్పత్తులను అమెరికాలోకి అనుమతిస్తున్నామని, అదే పని ఇండియా ఎందుకు చేయడం లేదని పేర్కొన్నారు. పైగా తమ ఉత్పత్తులపై ఇండియాలో టారిఫ్‌లు అధికంగా ఉన్నాయని ఆక్షేపించారు. ఎదుటివారు మనకు ఎలాంటి మర్యాద ఇస్తారో మనం కూడా వారికి అలాంటి మర్యాదే ఇవ్వాలన్నది అమెరికా విధానమని లుట్నిక్ స్పష్టంచేశారు.

టారిఫ్‌లతో సమస్య మరింత సంక్లిష్టం

- చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ

బీజింగ్: రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై భారీగా టారిఫ్‌లు విధించాలంటూ జీ7 దేశాలకు అమెరికా ప్రభుత్వం పిలుపు ఇవ్వడాన్ని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఖండించారు. టారిఫ్‌లు, ఆంక్షలు సమస్యను మరింత సంక్లిష్టంగా మారుస్తాయే తప్ప ఒరిగేదేమీ ఉండదని అన్నారు. ఎలాంటి యుద్ధాల్లో తాము పాల్గొనడం లేదన్నారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా యుద్ధాలకు ముగింపు పలకాలన్నదే తమ విధానమని ఉద్ఘాటించారు. టారిఫ్‌లను పెంచాలన్న ఆలోచన ఎవరికీ మేలు చేయదని అన్నారు. అమెరికా ట్రెజరీ సెక్రెటరీ బెస్సెంట్ జీ7 దేశాల ఆర్థిక శాఖ మంత్రులతో మాట్లాడుతూ.. భారత్, చైనాలో టారిఫ్‌లు పెంచాలని సూచించారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం ముగిసిపోవాలని నిజంగా కోరుకుంటే తాము చెప్పినట్లు చేయాలని పేర్కొన్నారు. దీనిపై వాంగ్ యీ స్పందించారు. చైనా బాధ్యతయుతమైన అతిపెద్ద దేశమని పేర్కొన్నారు. శాంతి, భద్రత వంటి అంశాల్లో చైనాకు మంచి రికార్డు ఉందన్నారు.

ఏఐ నకిలీ వార్తల సూత్రధారుల భరతం పట్టండి

- కఠిన చర్యలకు వీలుగా న్యాయ, సాంకేతిక పరిష్కారాలు వెతకండి
- కేంద్ర ప్రభుత్వానికి సూచించిన పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ: కృత్రిమమేధ(ఏఐ)తో సృష్టించిన నకిలీ వార్తలు సమాజంపై పెను దుష్ప్రభావం చూపుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం పరిష్కార కొరడాతో ముందుకు రావాలని ప్రసార, సమాచార సాంకేతికతపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఉద్బోధించింది. ఏఐతో సృష్టించిన నకిలీ వార్తల విస్తృతి కట్టడికి ఏఐతో అడ్డుకట్టవేయాలని ఈ మేరకు ఏఐను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సంబంధిత ముసాయిదా నివేదికలో స్టాండింగ్ కమిటీ సూచించింది. 'తప్పుడు సమాచారం ఎక్కడ ఉందో తెల్సుకునేందుకు సాంకేతికతను ఉపయోగించాలి. కానీ ప్రస్తుత సమాజంలో తప్పుడు సమాచారానికి సాంకేతికతనే సృష్టికర్తగా మారిన దురవస్థ దాపురించింది'అని ముసాయిదా ఆవేదన వ్యక్తంచేసింది. బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే సారథ్యంలోని స్టాండింగ్ కమిటీ ఇటీవలే తన నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేసింది. 'ఏఐతో నకిలీ వార్తలను తామరతుంపరగా సృష్టించి అన్ని సామాజిక మాధ్యమాల్లోకి వెదజల్లుతున్న సృష్టికర్తల ఆచూకీ కనిపెట్టి వాళ్ల భరతం పట్టాలి. ఈ క్రతువులో కేంద్ర సమాచార, ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖలతో పాటు ఇతర మంత్రిత్వ శాఖలు, విభాగాలు కలసికట్టుగా పనిచేయాలి. ఏఐ నకిలీ వార్తలను రూపొందిస్తున్న వ్యక్తులు, సంస్థలను చట్టం ముందు నిలబెట్టేలా పటిష్టమైన న్యాయ, సాంకేతిక పరిష్కారాలను కనుగొనాలి'అని సూచించింది.

శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి

''మంత్రిత్వశాఖల మధ్య అంతర్గత సహకారం ఉంటే ఏఐ కంటెంట్ సృష్టికర్తలకు ఏఐ జనిత వీడియోలు, సమాచారంపై లైసెన్సుల జారీపై మరింత పట్టు సాధించగలరు. ఏఐ వీడియోలు, కంటెంట్‌పై ఇది ఏఐ జనితం అనే లేబుల్‌ను కచ్చితంగా ముద్రించాలనే నిబంధనను తు.చ. తప్పకుండా అమలుచేయాలి' అని సూచించింది. నకిలీ సమాచారం జాడ కనిపెట్టడం, కట్టడిచేయడం, తొలగించడం వంటి విధుల్లో ఏఐ, మెషీన్ లెర్నింగ్ సాంకేతికతలను విరివిగా వాడాల్సిన తరుణమిది అని నివేదిక అభిప్రాయపడింది. ఏఐ నకిలీ వార్తలను సృష్టించడం, ప్రచారంచేయడం వంటి నేరాలకు కఠిన శిక్షలను అమలుచేసేలా నేరశిక్షాస్మృతిలో సవరణలు చేయడం, జరిమానా మొత్తాలను పెంచడం వంటివి చేయాలని సూచించింది.

సాక్షి హైదరాబాద్

సోమవారం। 15। సెప్టెంబర్। 2025

గరిష్టం/కనిష్టం
31.0/22.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్ష సూచన ఉంది. గరిష్టంగా 31, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని సమాచారం.

ప్రశాంతంగా మిలాద్ ర్యాలీలు







నగరంలో ఆదివారం మిలాద్‌–ఉన్‌–నబీ ర్యాలీలు ప్రశాంతంగా ముగిశాయి. ముస్లిం యువకులు, చిన్నారులు, మత పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పాతబస్తీలోని చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున సామూహిక ర్యాలీలు నిర్వహించారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, అదనపు పోలీసు కమిషనర్ విక్రం సింగ్ మాన్, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా తదితరులు ర్యాలీకి స్వాగతం పలికి ముస్లిం మత పెద్దలను సత్కరించారు. నగర వ్యాప్తంగా మిలాద్ ర్యాలీలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. –చార్మినార్



త్యాగధనులను స్మరించుకోవాలి

–గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో కిషన్‌రెడ్డి, ఈటల, రాంచందర్‌రావు తదితరులు

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ రాష్ట్ర విముక్తి కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమర వీరులను స్మరించుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు సర్దార్ పటేల్ పోలీసు చర్య ద్వారా ఐక్యత, స్వేచ్ఛలో గౌరవాన్ని దేశానికి బహుమతిగా అందించారని కొనియాడారు. భారత సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన 'సంస్థాన్' అనే వర్చువల్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు.

వాడవాడలా జాతీయ జెండాలు ఎగరాలి

సెప్టెంబర్ 17ను విమోచన దినంగా పాటిస్తూ తెలంగాణలో వాడవాడలా, ఇంటింటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ రాష్ట్రాన్ని దేశంలో కలపకుండా నాటి నిజాం నవాబు, ప్రత్యేక దేశంగా ఉంచాలని, పాకిస్తాన్‌లో కలపాలని ప్రయత్నించాడని గుర్తు చేశారు. 13 నెలల పాటు హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రజలను రజాకార్లు హింసించడంతో పాటు ఇళ్లపై, మహిళలపై దాడులు చేశారని చెప్పారు. దేశంలో విలీనమైన తర్వాత కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చరిత్రను మరుగు పర్చి విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని విమర్శించారు. మజ్లిస్ పార్టీ మెప్పు కోసమే ఆ పార్టీలు ఇలా చేస్తున్నాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, ఏవీఎన్ రెడ్డి, పీఐబీ అదనపు డైరెక్టర్ శృతిపాటిల్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, కార్పొరేటర్లు కొంతం దీపిక, చీర సుచిత్ర, సరళ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగంగానే నగరీకరణ

హెచ్‌ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



కార్యక్రమానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎన్వీఎస్ రెడ్డి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: నగరీకరణ దేశ సమగ్ర అభివృద్ధిలో భాగమని, దానిని ఒక సమస్యగా పరిగణించరాదని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. అధిక జనాభా, పర్యావరణ సమస్యలు, కాలుష్య నియంత్రణ, వేగంగా పెరుగుతున్న నగరీకరణ వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి ఆర్కిటెక్టులు సాంకేతిక పరిజ్ఞానంతో వినూత్నంగా ఆలోచించాలని, సామాజిక, ఆర్థిక కోణంలో సాంకేతిక పరిష్కారాలను అన్వేషించాలని సూచించారు. ఆదివారం నగరంలో జరిగిన అఖిల భారత 'ఆర్కిటెక్చర్ రికనెక్ట్ సమ్మిట్'లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశంలో అత్యధిక జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి ఉందన్నారు. చైనా తరహాలో పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యమిచ్చి, వ్యవసాయ రంగం నుంచి వీలైనంత మందిని పారిశ్రామిక రంగానికి మళ్లించాలన్నారు. నగరీకరణ ప్రక్రియలో భాగంగానే దేశాభివృద్ధి మరింత శీఘ్రతరమవుతుందన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ గొప్ప ప్రజా రవాణా వ్యవస్థగా ఆదరణ పొందడానికి అనేక కొత్త ఆవిష్కరణలే కారణమని చెప్పారు. రవాణా ఆధారిత అభివృద్ధిపై ప్రత్యేక ఆలోచనలు చేయాలని, అందుకు అనుగుణంగా నగరాలలో మెట్రో మార్గాల వెంబడి బహుళ అంతస్తుల నివాస గృహాలను, కమర్షియల్ కాంప్లెక్సులను, విద్యా సంస్థలను అభివృద్ధి చేయాలని మెట్రో ఎండీ సూచించారు. తాము చేపట్టిన ఇంధన పొదుపు , పర్యావరణ హిత చర్యల తో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులను పొందినట్లు వెల్లడించారు. నగరీకరణ గణనీయంగా పెరిగినప్పుడు రవాణా పరమైన సమస్యలు కూడా అదే స్థాయిలో పెరుగుతాయన్నారు. అందుకు నిర్మాణ రంగ నిపుణులు తగు పరిష్కార మార్గాలను శోధించాలని కోరారు.

సాంకేతిక చిక్కుల్లో

సారథి

స్లాట్ బుకింగ్‌లో చుక్కలు చూపిస్తున్న టెక్నాలజీ

- డ్రైవింగ్ లైసెన్సు రెన్యూవల్స్‌లో డాటా ఎర్రర్
- ఒక్క స్లాట్ కోసం 4 ఓటీపీలు, 8 క్యాప్చర్లు
- ఆర్టీఏ అధికారులు, వాహనదారుల ఇబ్బందులు



సాక్షి, సిటీబ్యూరో: రవాణా శాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సరికొత్త సాంకేతిక వ్యవస్థ సారథి పరివాహన్ పోర్టల్ వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. స్లాట్ నమోదు మొదలు కొని వివిధ రకాల పౌరసేవల్లో సాంకేతిక చిక్కులు ఎదురవుతున్నాయి. మరోవైపు ఈ టెక్నాలజీ ఆర్టీఏ అధికారులకు సైతం తలనొప్పిగానే మారింది. దేశవ్యాప్తంగా వాహనాల రిజిస్ట్రేషన్‌ల కోసం వాహన్, డ్రైవింగ్ లైసెన్సుల వివరాల నమోదు కోసం సారథి పరివాహన్ సాంకేతిక వ్యవస్థలను కేంద్రం అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లో సారథి సాంకేతిక వ్యవస్థను మొదట తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఖైరతాబాద్‌తో పాటు మిగతా కార్యాలయాల్లో దశల వారీగా విస్తరించారు. లెర్నింగ్ లైసెన్సులు, డ్రైవింగ్ లైసెన్సుల రెన్యువల్స్, అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్లు, తదితర పౌరసేవల కోసం వాహన వినియోగదారులు సారథి పోర్టల్ నుంచే స్లాట్‌లను నమోదు చేసుకోవాల్సిఉంటుంది. లైసెన్సుల వివరాలను కూడా సారథి నుంచి పొందవచ్చు. దేశవ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా డ్రైవింగ్ లైసెన్సులను బదిలీ చేసుకొనే సదుపాయంలో భాగంగా దీన్ని అభివృద్ధి చేశారు. సాంకేతికంగా రకరకాల చిక్కులు ఎదురవుతున్నట్లు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని క్యాప్చర్లా..

కొత్తగా డ్రైవింగ్ నేర్చుకొనేవాళ్లు మొదట లెర్నింగ్ లైసెన్సు తీసుకోవాలి. శిక్షణ అనంతరం నెల రోజుల నుంచి 6 నెలల్లోపు ఎప్పుడైనా శాశ్వత డ్రైవింగ్ లైసెన్సు కోసం పరీక్షలకు హాజరు కావచ్చు. లెర్నింగ్ లైసెన్సు కోసం స్లాట్ నమోదు చేసుకోవడం గతంలో ఎంతో తేలిగ్గా ఉండేది. తేదీ, సమయం నిర్ధారణ అయిన తర్వాత ఒకే ఓటీపీ (వన్‌టైమ్ పాస్‌వర్డ్)తో మొత్తం స్లాట్ బుకింగ్ పూర్తయ్యేది. కానీ.. ఇప్పుడు సారథిలో ఒక్క స్లాట్ కోసం వాహనదారుడి మొబైల్ ఫోన్‌కు 8 క్యాప్చర్‌లు, 4 ఓటీపీలు వస్తున్నాయి. పైగా ఈ క్యాప్చర్‌లు క్లిష్టంగా ఉండడంతో సకాలంలో నమోదు చేయలేకపోతున్నారు.

- డాక్యుమెంట్‌లు అప్‌లోడ్ చేసే సమయంలో ఒక ఓటీపీ వస్తే రోడ్డు భద్రతపై రెండు నిమిషాల నిడివి కలిగిన వీడియోను వీక్షించేందుకు మరో ఓటీపీని ఎంటర్ చేయాల్సివస్తోంది. ఆ తర్వాత స్లాట్ బుకింగ్‌కు ఒక సెక్యూరిటీ నెంబర్ వస్తుంది. డాక్యుమెంట్‌లు ప్రింట్ తీసుకొనేందుకు మరో ఓటీపీ ఎంటర్ చేయాలి.

ఒక్కో ఓటీపీకి 10 నిమిషాల వ్యవధి ఉండడంతో మొత్తం ప్రక్రియ పూర్తయ్యే వరకు గంటకు పైగా పడుతోందని వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో క్యాప్చర్ల నమోదు మరో క్లిష్టతరమైన ప్రక్రియ. ఏ ఒక్కటి తప్పుగా నమోదు చేసినా మళ్లీ మొదటికి వెళ్లాల్సి రావడం గమనార్హం. దీంతో తేలిగ్గా స్లాట్ నమోదు చేసుకోవడం ఇబ్బందిగా మారింది. ఆర్టీఏ ఏజెంట్‌లు, మీ సేవ కేంద్రాల నిర్వాహకులు కేవలం స్లాట్ బుకింగ్ కోసం రూ.200 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆధార్ కష్టాలు...

- ఆధార్ అప్‌డేట్ చేసుకోకుండా సారథి సేవలను పొందడం కూడా సాధ్యం కాదు. గతంలో అంటే 2013 కు ముందు 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రంగా ఆధార్ పొందిన వారు సారథిలో ఎలాంటి పౌరసేవలను పొందలేకపోతున్నారు. దీంతో ఆధార్ అప్‌డేట్ తర్వాతే ఆర్టీఏ పౌరసేవలను పొందాల్సివస్తోంది.
- 'అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్‌లలో ఇది తీవ్రమైన జాప్యానికి దారితీస్తోంది. వీసాలు తీసుకొని ప్రయాణానికి సిద్ధంగా ఉన్నవాళ్లు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సిరావడంతో సకాలంలో పర్మిట్లను పొందలేకపోతున్నారు' అని బంజారాహిల్స్‌కు చెందిన శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ కేంద్రంగా తాము నిర్వహిస్తున్న డ్రైవింగ్ స్కూల్లో ప్రతిరోజూ పదుల సంఖ్యలో ఫిర్యాదులు నమోదవుతున్నాయని ఆయన చెప్పారు.

డాటా ఎర్రర్...

వాహనదారులు ఎదుర్కొంటున్న మరో సమస్య 'డాటా ఎర్రర్'. కాలపరిమితి ముగిసిన డ్రైవింగ్ లైసెన్సుల పునరుద్ధరణలో ఈ సమస్య ఎదురవుతోంది. సారథి సాంకేతిక వ్యవస్థను నిర్వహిస్తున్న నేషనల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎన్ఐఎస్) గ్రేటర్‌లోని అన్ని డ్రైవింగ్ లైసెన్సుల డాటాను ఈ పోర్టల్‌లో నిక్షిప్తం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కొంతమంది వాహనదారులు తమ డ్రైవింగ్ లైసెన్సులను రెన్యువల్ చేసుకొనేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవడంతో 'డాటా ఎర్రర్' అని దర్శనమివ్వడం గమనార్హం.

వానొస్తే ప్రాణాలు గల్లంతే!

నగరంలో వానొస్తే ప్రాణాలు గల్లంతే అనే దుస్థితి నెలకొంది. ఆదివారం సాయంత్రం గంటసేపు వర్షం దంచికొట్టడంతో రహదారులు చెరువులను తలపించాయి. నాలాలు ఉప్పొంగాయి. ముషీరాబాద్‌తో పాటు తట్టి అన్నారంలో 12.8 సెంటీ మీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. వరద ప్రవాహంలో నాంపల్లి పరిధి హబీబ్‌నగర్‌లోని అఫ్జల్‌సాగర్‌లో ఇద్దరు, ముషీరాబాద్‌లో మరొకరు కొట్టుకుపోయారు. కిలో మీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయింది. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, జలమండలి బృందాలు రంగంలోకి దిగి వరద నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాయి. –సాక్షి, సిటీబ్యూరో



మలక్‌పేటలో..


కోఠి- అబిడ్స్ రోడ్లలో..




ముషీరాబాద్‌లో..

ఇంటర్నెట్ కట్‌కట



అడ్డగోలుగా కత్తిరింపులు.. రోడ్లపైనే కేబుళ్ల గుట్టలు

- మూడు వారాలైనా పునరుద్ధరణకు నోచుకోని సేవలు
- వివిధ ఆఫర్లలో ముందే చార్జీలు చెల్లించిన వినియోగదారులు
- ఆన్‌లైన్ సేవల అంతరాయాలపై విరుచుకుపడుతున్న సిటిజన్లు



సాక్షి, సిటీబ్యూరో: 'ఆవుల కుమ్ములాటలో దూడలు బలైనట్లు' దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ–ఇంటర్నెట్ ఆప్టికల్ సర్వీసు ప్రొవైడర్లు(ఐఎస్‌పీ), ఎంఎస్‌ఓలు, లోకల్ కేబుల్ ఆపరేటర్లు (ఎల్‌సీఓలు) మధ్య నెలకొన్న పోరులో అమాయక వినియోగదారులు బలవుతున్నారు. మూడు వారాలు దాటినా ఇంటర్నెట్ సేవలు, టీవీ ప్రసారాలను పునరుద్ధరించకపోవడంతో.. ఇంటి నుంచి విధులు నిర్వహించే ఐటీ, అనుబంధ రంగాల ఉద్యోగులు సహా పిల్లలకు ఆన్‌లైన్ తరగతులు బోధించే తల్లిదండ్రులు ఇబ్బందిపడాల్సి వస్తోంది. వివిధ ఆఫర్లలో భాగంగా ముందే ఏడాది/ఆరు నెలల చార్జీలు చెల్లించిన వినియోగదారులు సైతం ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది.

- ఆగస్టు 17న రామంతాపూర్ గోఖలేనగర్ ఘటనతో విద్యుత్‌శాఖ అప్రమత్తమైంది. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు, కార్మికులు, సాధారణ పౌరుల మృత్యువాతకు కారణమవుతున్న ఈ ప్రమాదకరమైన ఆప్టికల్ కేబుల్ వైర్ల తొలగించాలని నిర్ణయించింది. ఆ మేరకు కొద్ది రోజులుగా గ్రేటర్ జిల్లాల్లో ఎక్కడికక్కడే కేబుళ్లను కట్ చేస్తోంది. స్తంభాలపై లైన్లు వేస్తున్నప్పుడు మిన్నకుండిపోయి.. తీరా వేసిన తర్వాత కట్ చేయడం ఏమిటనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. ఐఎస్‌పీలు, ఎంఎస్‌ఓలు, ఎల్‌సీఓలు తప్పు చేస్తే.. వినియోగదారులకు శిక్ష వేయడం ఎంత వరకు సబబు అనే ప్రశ్న తలెత్తుతోంది.

రూ.100 కోట్లకుపైగా నష్టం

- గ్రేటర్ పరిధిలో ఐదు లక్షలకుపైగా విద్యుత్ స్తంభాలు ఉన్నట్లు అంచనా. ఏదైనా విద్యుత్ స్తంభంపై కేబుల్ వేయాలంటే ముందస్తుగా ఆ శాఖ అనుమతి తీసుకోవాలి. ఇందుకు ఒక్కో స్తంభానికి ఏటా రూ.50 నుంచి రూ.100 ఫీజు చెల్లించాల్సి ఉంది. 15 మీటర్ల ఎత్తులోనే కేబుల్ అమర్చుకోవాలి. మెజారిటీ కేబుళ్లు ఆరేడు అడుగుల ఎత్తులోనే వేలాడుతున్నాయి. ఒక స్తంభానికి, మరో స్తంభానికి మధ్య 50 మీటర్లకు మించరాదు.. కానీ మెజార్టీ స్తంభాలకు టన్నుల కొద్దీ బరువైన కేబుల్ ఉండలు వేలాడుతున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షానికి మధ్యలో ఏదైనా చెట్టు కొమ్మ విరిగి లైన్‌పై పడితే.. ఆ బరువుకు రెండు వైపులా ఉన్న స్తంభాలు నేల కూలుతున్నాయి.
- దెబ్బతిన్న ఇన్సులేటర్లు, జాయింట్లను పునరుద్ధరించేందుకు లైన్‌మెన్లు స్తంభాలపైకి ఎక్కడం చాలా కష్టంగా మారింది. కేబుళ్ల నుంచి ఎర్తింగ్ రివర్స్ వల్ల షాక్‌తో కిందపడిపోతున్న ఘటనలు లేకపోలేదు. కనీస అనుమతులే కాదు కనెక్షన్, మీటర్ తీసుకోకుండా ఏకంగా కేబుల్ జంక్షన్ బాక్సులకు కరెంట్‌ను వినియోగిస్తున్నారు. ఏళ్ల తరబడి కళ్లముందే ఈ చౌర్యం జరుగుతున్నా.. క్షేత్రస్థాయి ఇంజినీర్లు పట్టించుకోలేదు. కొత్తగా అనేక ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్లు (ఐఎస్‌పీ), ఎంఎస్‌ఓలు, లోకల్ కేబుల్ ఆపరేటర్లు (ఎల్‌సీఓలు) పుట్టుకురావడం, వ్యాపారంలో పోటీతో ఎవరికి వారు స్తంభాలపై కేబుళ్లను వేసుకుంటూ ముందుకెళ్లడం, ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు పాత వైర్లను అలాగే వదిలేసి, కొత్తగా మరో ఆప్టికల్ కేబుల్‌ను అమర్చుతుండటం, తాజాగా వాటన్నింటినీ తొలగిస్తుండటంతో ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా నష్టపోవాల్సి వచ్చిందని ఆయా సర్వీసు ప్రొవైడర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫోన్లకూ తప్పని సిగ్నల్ సమస్య

కేవలం ఆపరేటర్లే కాదు సేవల వినియోగంలో భాగంగా ముందే ఆఫర్ల పేరుతో (సంవత్సరం /ఆరు నెలలు) చార్జీలు చెల్లించిన గృహ, వ్యాపార, వాణిజ్య సంస్థల వినియోగదారులు సైతం ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. మూడు వారాలైనా ఆయా సర్వీసులు పునరుద్ధరించపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వినియోగదారుల నుంచి వస్తున్న ఒత్తిళ్లను తట్టుకోలేక..ఆయా సర్వీసు ప్రొవైడర్లు కాల్ సెంటర్లు/ వ్యక్తిగత ఫోన్లు స్విచ్ ఆఫ్ చేస్తున్నారు. మెజార్టీ ప్రజలు గృహ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో వైఫై సర్వీసులను వాడుతున్నారు. ప్రభుత్వ, ప్రవేటు కార్యాలయాల్లోనూ ఈ తరహా సేవలనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఆప్టికల్ కేబుళ్లన్నింటినీ కట్ చేయడంతో సర్వీసులు నిలిచిపోయి సిగ్నల్ సమస్యలు తలెత్తుతున్నాయి. రోజంతా టీవీ సీరియల్స్, ఓటీటీ సినిమాలు, యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్ సర్వీసులకు అలవాటు పడిన గృహిణులు.. ప్రస్తుతం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించే పనిలో పడ్డారు. కట్ చేసిన కేబుళ్లను అక్కడే రోడ్లపైనే గుట్టలుగా వదిలేసి వెళ్లుండటం, అటుగా వచ్చిపోయే వాహనదారులు ఆయా వైర్ల మధ్య చిక్కుకుని ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల రాకపోకల సమయంలో కేబుళ్లు టైర్ల మధ్య చిక్కుకుపోయి ప్రమాదాలకు కారణమవుతోంది.

సినీ నటుడిని బెదిరిస్తున్న యువతిపై కేసు

బంజారాహిల్స్: ఏఐ టెక్నాలజీతో ఓ బాలీవుడ్ నటుడి ఫోటోలను నగ్నంగా మార్ఫింగ్ చేస్తూ ఆయన స్నేహితులకు, దర్శక, నిర్మాతలకు, కుటుంబ సభ్యులకు పోస్ట్ చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న యువతిపై బంజారాహిల్స్‌లో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ముంబై నివాసి, ఫ్రీలాన్స్ నటుడు ఆనంద సురేష్ కుమార్ రెన్వా (36)ను జియా ఉనిస్సా నస్రీన్ అనే మహిళ మూడు సంవత్సరాలుగా నిరంతరం వేధిస్తోంది. అతని ఇన్‌స్టాగామ్, వాట్సప్, ఫోన్ అకౌంట్స్ హ్యాక్ చేసి, అతని పేరుతో ఏఐ ద్వారా మార్ఫింగ్ చేసిన సెమీ న్యూడ్, న్యూడ్ ఫోటోలు, వీడియోలు సృష్టించింది. ఆ మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలను పరిశ్రమలోని దర్శకులకు, రెండు ప్రొడక్షన్ హౌస్‌లకు పంపించి అరాచకానికి పాల్పడిందని, ఈ కారణంగా తన వృత్తిపై తీవ్ర ప్రభావం చూపిందంటూ బాధిత నటుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాదాపు 15 నుంచి 20 నకిలీ ఖాతాల ద్వారా అతన్ని అవమాన పరిచేలా పలు సందేశాలను, వీడియోలను పంపింది. అతని కుటుంబాన్ని లక్ష్యంగా చేయడంతో తీవ్ర మానసిక ఒత్తిడి ఏర్పడిందని, హృద్రోగ లక్షణాలు కూడా వచ్చాయని బాధితుడు పేర్కొన్నాడు. అంతేకాకుండా అతని సోదరికి కూడా అశ్లీల సందేశాలు పంపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సూడాన్ డ్రగ్ పెడ్లర్ డిపోర్టేషన్

● 12 ఏళ్లుగా మన దేశంలో అక్రమంగా నివాసం ● ఎట్టకేలకు స్వదేశానికి పంపిన పోలీసులు



మహ్మద్ యాగౌబ్ అలీని స్వదేశానికి పంపుతున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న సూడాన్ దేశీయుడిని హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) పోలీసులు డిపోర్టేషన్ చేశారు. 2016 అక్టోబర్‌లోనే పాస్‌పోర్టు గడువు ముగిసినా.. 12 ఏళ్లుగా అక్రమంగా మన దేశంలోనే ఉంటున్న మహ్మద్ యాగౌబ్ అలీ అలియాస్ జబల్ అలియాస్ కుర్బాను పోలీసులు డిపోర్టేషన్ చేశారు. ఈమేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2011లో సూడాన్‌లో ఉన్నత విద్యను పూర్తి చేసిన తర్వాత అలీ..2012లో స్టూడెంట్ వీసాపై హైదరాబాద్‌కు వచ్చాడు. సికింద్రాబాద్ పీజీ కళాశాలలో బీసీఏ కోర్సులో ప్రవేశం పొందాడు. ఈక్రమంలో ఈసీఐఎల్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఇక్కడే టాంజానియన్ జాతీయుడితో సంబంధం ఏర్పడింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో బీసీఏ రెండో సంవత్సరం చదువు మధ్యలోనే ఆపేసి..మాదక ద్రవ్యాల దందాను ప్రారంభించాడు. 2018లో కుషాయిగూడ పోలీసులు డ్రగ్స్ కేసులో అరెస్టు చేసి, చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏడాదిన్నర తర్వాత 2019లో బెయిల్‌పై బయటికి వచ్చిన అలీ..2020లో సైనిక్‌పురిలోని తన కజిన్ సోదరుడితో కలిసి మళ్లీ గంజాయి దందా మొదలుపెట్టాడు. పెడ్లర్‌తో పాటు డ్రగ్స్‌కు బానిసైన అలీ..టోలిచౌకిలోని పారామౌంట్ కాలనీలో చరస్, హెరాయిన్ సరఫరా చేస్తుండగా రాజేంద్రనగర్ పోలీసులకు చిక్కాడు. ఏడాది పాటు చంచల్‌గూడ జైలులో గడిపిన అలీ బెయిల్‌పై బయటికి వచ్చిన తర్వాత కూడా మళ్లీ దందా మొదలుపెట్టాడు. ఈసారి హెచ్-న్యూ పోలీసులు అలీతో పాటు సూడాన్ దేశీయుడు మహ్మద్ అబ్దుల్ రహ్మాన్ ఉస్మాన్‌ను కూడా అరెస్టు చేశారు. వీరి నుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. పదేపదే డ్రగ్స్ రవాణా చేస్తుండటంతో అలీని దేశం నుంచి బహిష్కరించాలని నిర్ణయించారు. ఈక్రమంలో హెచ్-న్యూ పోలీసులు డిపోర్టేషన్ ప్రక్రియను ప్రారంభించిన తర్వాత మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్ కోర్టులో డ్రగ్స్ కేసులో ట్రయల్‌లో ఉన్నట్లు తెలిసింది. కేసు విచారణలో ఉన్నందున బహిష్కరించలేమని గమనించిన పోలీసులు.. ట్రయల్‌ను వేగవంతం చేసేందుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించారు. విచారణ గత నెలలో పూర్తి కావడంతో అలీని సూడాన్‌కు డిపోర్టేషన్ చేశారు.

సందడిగా గాంధీ మెడికల్ కాలేజీ ఫౌండేషన్ డే



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకల్ని ప్రారంభిస్తున్న వైద్య ప్రముఖులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ 71వ వ్యవస్థాపక దినోత్సవం గాంధీ అలుమ్నీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సందడిగా నిర్వహించారు. వైద్య రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తెలంగాణ వైద్యరంగానికి, వైద్య విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమవంతు సేవలు అందిస్తున్నామన్నారు. సీపీఆర్, బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్‌ఎస్)లపై వేలాది మందికి ఉచిత శిక్షణ అందించామన్నారు. యుజీ, పీజీ, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన 64 మంది వైద్యవిద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ప్రశంసాపత్రాలు, నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పుస్తకాలను వితరణగా అందించారు. రిటైర్డ్ ప్రొఫెసర్లు సుధారమణి, అరవింద్‌కుమార్, అశోక్‌కుమార్‌లకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. గాంధీలో వైద్యవిద్య అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు పలువురు పూర్వ విద్యార్థులు తమవంతు సాయంగా రూ.20 లక్షలు అందించారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి అభ్యర్థన మేరకు ఆస్పత్రిలోని పలు విభాగాలకు అవసరమైన వైద్యపరికరాలు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కార్యక్రమంలో అలుమ్నీ వ్యవస్థాపక అధ్యక్షుడు, నిమ్స్ మాజీ డైరక్టర్ డాక్టర్ రాజారెడ్డి, కేఎన్‌ఆర్ హెల్త్‌వర్సిటీ వైస్‌చైర్మన్ పీవీ నందకుమార్, జీఎస్‌టీ అడిషనల్ కమిషనర్ దొంతి గాంధీ, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ మహేష్, గాంధీ ప్రిన్సిపాల్ ఇందిర, అలుమ్నీ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీఆర్ లింగమూర్తి, వెంకటరత్నం, వైద్యులు, పూర్వవిద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలనీ క్లబ్ ఎన్నికల్లో వై.వై రెడ్డి ప్యానెల్ ఘనవిజయం



ఎమ్మెల్యే కాలనీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీలో 'ఎమ్మెల్యేస్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్' ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ ఎన్నికల్లో డాక్టర్ వై.వై రెడ్డి ప్యానెల్ ఘనవిజయం సాధించింది. అధ్యక్షుడిగా వై.వై రెడ్డి ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కె.లక్ష్మీరెడ్డి, కార్యదర్శిగా రాంచంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఉపేందర్‌రెడ్డి, కోశాధికారిగా మధుసూదన్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ జనరల్ సభ్యులుగా వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కె. మహేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఎమ్మెల్యే కాలనీ) సభ్యులుగా కిషన్‌రెడ్డి, శంతన్‌రెడ్డి, రఘురామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు.

ఫిలింనగర్‌లో బంగారు నగల చోరీ..

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని సినార్ వ్యాలీ ఫేజ్-1లో భారీ చోరీ జరిగింది. అల్మరాలో ఉంచిన బంగారు నగలు కనిపించకపోవడంతో బాధితురాలు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సినార్ వ్యాలీలో నివసించే రాధికా శర్మ అనే యజమానురాలు తన పుట్టింటి వాళ్లు ఇచ్చిన నగలను సెంటిమెంట్‌గా అల్మరాలో దాచుకుంది. ఇటీవల తమ మామకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఎక్కువగా ఆస్పత్రుల చుట్టూ తిరిగింది. రెండు రోజుల క్రితం అల్మరాలో ఉంచిన నగల కోసం చూడగా అవి కనిపించలేదు. తన గది క్లీన్ చేయడానికి జ్యోతి అనే పని మనిషి మాత్రమే వస్తుందని, ఈ నగల చోరీ వెనుక ఆమె ఉండవచ్చని అనుమానం వ్యక్తంచేస్తూ బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జింఖానా క్లబ్ చైర్మన్‌గా శివరామకృష్ణ



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ది హైదరాబాద్ జింఖానా క్లబ్ చైర్మన్‌గా గూడూరు శివరామకృష్ణ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన క్లబ్ ఎన్నికల్లో నాగ కిషోర్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. చైర్మన్‌గా గూడురు శివరామకృష్ణ, వైస్ చైర్మన్‌గా ఎస్.మధుసూదన్‌రెడ్డి, సెక్రటరీగా ఎన్.నాగ కిషోర్, జాయింట్ సెక్రటరీగా వెన్నం అనిల్‌రెడ్డి, ట్రెజరర్‌గా గడ్డిపాటి హరీష్, డైరెక్టర్లుగా కనుమూరి నారాయణరాజు, రఘురామ్, కంజర్ల సదాశివయాదవ్, కంటిపూడి శ్రీనివాస్‌చౌదరి, అత్తలూరి సుధీర్‌కుమార్, రవికుమార్ వడ్లమూడి విజయం సాధించారు. మొత్తం 2064 ఓట్లకు గాను 1420 ఓట్లు పోలయ్యాయి.

'వెల్‌నెస్'కు వచ్చి బ్లాక్‌మెయిల్!

- నిర్వాహకుడిని ముగ్గులోకి దింపిన ఇద్దరు మహిళలు
- రహస్య వీడియోలతో బెదిరింపులు
- అరెస్టు చేసిన పోలీసులు



నిందితులను అరెస్ట్ చేసిన దృశ్యం

గోల్కొండ: ఆరోగ్యం బాగాలేదని, చికిత్స చేయాలంటూ వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చిన ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి చివరికి వైద్యం చేస్తున్న వ్యక్తిని బుట్టలో వేసుకున్నారు. ముగ్గులోకి దింపి మోసగించారు. చివరికి కటకటాల పాలయ్యారు. టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ ఆదివారం ఇక్కడ వివరాలు వెల్లడించారు. చేవెళ్ల మండలం దామరగిద్దలో మిట్ట వెంకట రంగారెడ్డి అనే వ్యక్తి వెల్‌నెస్ సెంటర్ నిర్వహిస్తున్నారు. గత నెల 6వ తేదీన మంజుల, రజని అనే ఇద్దరు మహిళలు అమర్ అనే వ్యక్తితో కలిసి వెల్‌నెస్ సెంటర్‌కువచ్చారు. మహిళలు ఇద్దరికి ఆరోగ్యం బాగాలేదని ఇక్కడే ఉంచి చికిత్స చేయాలని అమర్ కోరగా..అందుకు వెంకట రంగారెడ్డి అంగీకరించాడు. ఈ క్రమంలో రజని, మంజులతో వెంకట రంగారెడ్డికి సాన్నిహిత్యం పెరిగింది. వీరు శంషాబాద్‌లోని ఓ హోటల్‌కు వెళ్లగా ముందే వేసుకున్న పథకం ప్రకారం రహస్య కెమెరాతో వెంకట రంగారెడ్డి వీరితో సన్నిహితంగా ఉన్న దృశ్యాలను చిత్రించారు. అనంతరం అమర్‌తో కలిసి అతన్ని బెదిరించారు. ఈ నెల 4వ తేదీన మంజుల, రజని, అమర్, వెంకట రంగారెడ్డి కలిసి గోల్కొండ సమీపంలోని తారామతి బారాదరి రెస్టారెంట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు వెంకట రంగారెడ్డిని బెదిరించి రూ.50 లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. రూ.25 లక్షలకు బ్లాంక్ చెక్కులు రాయించుకున్నారు. అనంతరం బాధితుడి కారు తీసుకుని ఉడాయించారు. ఈ విషయంపై బాధితుడు గత శనివారం గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు అమర్, రజినీ రెడ్డి, కీసర మంజుల వీరికి సహకరించిన సి.రాజేష్, దూదేకుల మౌలిలను అరెస్టు చేశారు. వారి వద్ద బాధితుడు రాసి ఇచ్చిన చెక్కులతో పాటు కారు స్వాధీనం చేసుకున్నారు.

అదనపు కట్నం తేవాలంటూ భార్య గొంతుకోసిన భర్త

తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాధితురాలు



నిందితుడు వేణుగోపాల్

నాగోలు: అదనపు కట్నం తేవాలంటూ భార్యను వేధించి గొంతుకోసి హత్యాయత్నం చేసిన ఘటన ఆదివారం నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ఏపీలోని ఒంగోలు జిల్లా కొణిజేడుకు చెందిన ఉప్పుతల్లి వేణుగోపాల్, అదే జిల్లా కందుకూరుకు చెంది హైదరాబాద్‌లో సెటిలైన కేపీహెచ్‌బీ నివాసి తన్నీరు మహాలక్ష్మికి 2024 ఆగస్టులో వివాహం జరిగింది. అనంతరం వీరు హయత్‌నగర్‌లో కొద్ది రోజులు నివాసం ఉన్నారు. ఆ తర్వాత నాగోలు లక్ష్మీనర్సింహకాలనీలోని ఓ అద్దె ఇంట్లోకి మారారు. మద్యానికి బానిసైన వేణుగోపాల్ రోజూ మహాలక్ష్మిని వేధించడం ప్రారంభించాడు. అదనపు కట్నం తేవాలని డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బంధువుల ఇంట్లో గృహప్రవేశం వేడుకలకు రావాలని భార్య మహాలక్ష్మి..కోరగా ఆగ్రహించిన వేణుగోపాల్ ఆమెతో ఘర్షణకు దిగాడు. జేబులో ఉన్న పేపర్ కట్టర్ తీసి ఆమె గొంతు కోశాడు. మహాలక్ష్మి ప్రతిఘటించగా ఆమె కుడి చేతి చిటికెన వేలు తెగిపోయి తీవ్రంగా గాయపడింది. బయటకు పరుగెత్తి సహాయం కోసం కేకలు వేసింది. పక్కింటివారు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాగోలు పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి గాయపడిన మహిళను వైద్యం కోసం నాగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వేధింపులకు గురి చేస్తూ హత్యాయత్నానికి పాల్పడిన తన భర్త పై చట్టపరమైన చర్యలు చేపట్టి న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు నాగోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితున్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగోలు ఇన్‌స్పెక్టర్ మక్బుల్ జానీ తెలిపారు.

ప్రైవేట్ హాస్టల్ వద్ద ఘర్షణ..పలువురికి గాయాలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఓ హాస్టల్ వద్ద శనివారం అర్ధరాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. హాస్టల్‌లో ఉండే ఇద్దరు వ్యక్తులపై అదే కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేపీహెచ్‌బీ కాలనీ మూడవ రోడ్డులోని హాస్టల్‌లో నివాసం ఉండే బి.ప్రసన్నకు శనివారం రాత్రి కడుపునొప్పి రావడంతో స్థానికంగా నివాసం ఉండే తన సోదరులు శివ, వినయ్‌లకు ఫోన్ చేసి మందులు కావాలని చెప్పింది. వారు మందులు తీసుకుని ప్రసన్న హాస్టల్ వద్దకు వచ్చి ఆమెకు ఇచ్చారు. అనంతరం వారు అక్కడే నిలబడి మాట్లాడుకుంటుండగా..అటువైపుగా బైక్‌పై వచ్చిన సత్య, విజయ్‌లు..మమ్మల్ని ఎందుకు దూషించారు అంటూ శివ, వినయ్‌పై దాడికి దిగారు. వారు ఎంత సర్ది చెప్పినా వినకుండా దాడి చేయడంతో పక్కనే ఉన్న మరో హాస్టల్‌లోకి పరుగు తీశారు. విజయ్ తన ఇతర స్నేహితులను కూడా పిలిపించడంతో వారంతా కలిసి హాస్టల్‌లోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. కర్రలతో హాస్టల్ కిటికీలు, తలుపులను ధ్వంసం చేసి విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ అనూహ్య ఘటనతో హాస్టల్‌లోని విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రసన్న ఫిర్యాదు మేరకు సత్య, విజయ్‌లతో పాటు వీరికి సహకరించిన దుర్గా ప్రసాద్ అలియాస్ అన్నవరం, పృథ్వీ అజయ్ వర్మ తదితరులుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దాడిలో గాయపడిన శివ, వినయ్, సందీప్‌లను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

మేధా స్కూల్ సీజ్

- ఓల్డ్ బోయిన్‌పల్లిలో మత్తు పదార్థాల కలకలం
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



మేధా స్కూల్‌ను సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లిలో మత్తు పదార్థాల కలకలంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఆదివారం ఎక్కడ చూసిన ప్రజల్లో ఈ విషయంపై చర్చ జరిగింది. ఏ ఇద్దరు కలసినా మత్తు పదార్థాల తయారీ కేంద్రంగా మారిన మేధా స్కూల్ పైన చర్చించుకోవడం కనిపించింది. సికింద్రాబాద్‌కు అతి చేరువలో ఉండే ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో మేధా ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల తయారీని గుర్తించి పోలీసులు గుట్టురట్టు చేయడంతో ప్రజలు ఆందోళన చెందారు. ఓ వైపు స్కూల్ నడుపుతూనే.. మరోవైపు మత్తు పదార్థాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి జిల్లాలకు, కల్లు కాంపౌండ్‌లకు సప్‌లై చేస్తున్నట్లు తెలిసింది.

స్కూల్ సీజ్..విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం...

స్కూల్‌లో మత్తు పదార్థాల తయారీ అంశం వెలుగు చూడడంతో విద్యాశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈమేరకు ఆదివారం స్కూల్‌ను సీజ్ చేశారు. పాఠశాలను పరిశీలించిన అధికారులు అనుమతులు రద్దు చేస్తూ సీజ్ చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులలో ఆందోళన మొదలైంది. విద్యాసంవత్సరం మధ్యలో స్కూల్ మూసేస్తే విద్యార్థుల పరిస్థితి ఎంటని, వాళ్లు ఎక్కడ చదువుకోవాలనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. అయితే విద్యాశాఖ అధికారులు మాత్రం ఇతర పాఠశాలలో చేర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామంటున్నారు. విద్యా సంవత్సరం పూర్తయ్యే వరకు ఇతర పాఠశాలల్లో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అమ్మను ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించినందుకు...

కుమారుడిపై తండ్రి హత్యాయత్నం

ఫిలింనగర్: అమ్మను ఎందుకు కొడుతున్నావమని ప్రశ్నించిన కుమారుడిపై తండ్రి కత్తితో గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్‌లోని దీన్‌దయాళ్‌నగర్ బస్తీలో నివసించే అల్లం నర్సింహ్మా రోజూ పీకలదాకా మద్యం తాగి ఇంటికి వస్తూ భార్యపై అనుమానం పెంచుకుంటూ ఆమెను తీవ్రంగా కొడుతుండేవాడు. ప్రతిరోజూ భార్యను అనుమానించడమే కాకుండా తాగిన మైకంలో ఆమెను కొడుతుండడంతో ఇదేమి పద్ధతి అని కుమారుడు సురేష్ పలుమార్లు తండ్రిని నిలదీయగా అతన్ని కూడా కొట్టేవాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో భార్యపై దాడి చేసి తీవ్రంగా కొట్టగా సురేశ్ అడ్డుకున్నాడు. ఈ క్రమంలో నర్సింహ్మా జేబులో ఉన్న కత్తి తీసి కొడుకు మెడను కోశాడు. తీవ్ర రక్తస్రావం మధ్య సురేష్‌ను అపోలో హాస్పటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పారు. మెడకు తీవ్రంగా గాయాలయ్యాయని వైద్యులు వెల్లడించారు. తనతో పాటు తల్లిపై హత్యాయత్నానికి పాల్పడిన తండ్రిపై చర్యలు తీసుకోవాలంటూ సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో లేబర్ కాంట్రాక్టర్ ఆత్మహత్య

సుభాష్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన లూనా మేది(45) సూరారం హాట్‌సన్ మిల్క్ కంపెనీలో లేబర్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. కాగా గత మూడు నెలలుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న లూనామేది తన కింద పనిచేసే కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం ఇస్తున్న జీతాలు ఇవ్వకుండా సొంతానికి వాడుకున్నాడు. దీంతో సదరు కార్మికులు తరచూ జీతాలు ఇవ్వమని అడగటంతో పనికి రావడం మానేశాడు. ఈ క్రమంలో మానసికంగా కుంగిపోయిన లూనా మేది ఆదివారం లేబర్ అడ్డా గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు కన్నా మాదే ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కన్వెన్షన్ ప్రహరీ కూలి ఒకరు మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు
- కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు



వట్టినాగులపల్లిలో కూలిన కన్వెన్షన్ ప్రహరీ

గచ్చిబౌలి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న కన్వెన్షన్ ప్రహరీ గోడ కూలి ఒకరు మృతి చెందగా మరో నలుగురు కూలీలకు తీవ్ర గాయాలైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వట్టినాగులపల్లిలో ప్రధాన రహదారి వెంట ఎలాంటి అనుమతులు లేకుండా కన్వెన్షన్‌ను నిర్మిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో డ్రైనేజీ కోసం కూలీలు కందకం తవ్వుతుండగా ప్రహరీ గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో గోడ శిథిలాలు ఐదుగురు కూలీలపై పడ్డాయి. తీవ్ర గాయాలు కావడంతో ఆదిలాబాద్‌కు చెందిన శేఖర్ మండల్ (24)ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. బీహార్ మీర్జాపూర్‌కు చెందిన కుల్దాన్(22), కేబుల్ వర్కర్లుగా పని చేసే సూర్యాపేట జిల్లా నందిగామకు చెందిన గుంజా నర్సింహ్మ(21), ఉదయ్ మహేశ్వర్(25), బీహార్‌కు చెందిన కూలి రవి పాశ్వాన్(18)లకు తీవ్ర గాయాలయ్యాయి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని కాంటినెంటల్ హస్పిటల్‌లో కుల్దాన్, నర్సింహ్మ, ఉమ మహేశ్వర్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. సిటిజన్ హస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రవి పాశ్వాన్ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.కోటి కాజేసి మిస్సింగ్!

- ఓవర్సీస్ కన్సల్టెన్సీ నిర్వాహకుడి వ్యవహారం
- హంగేరీ వర్సిటీలో సీట్లంటూ 17 మందికి టోకరా
- కేసు నమోదు చేసిన సెంట్రల్ క్రైమ్ స్టేషన్ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: విదేశీ యూనివర్సిటీలో సీట్లు, ప్లేస్‌మెంట్ల పేరుతో ప్రచారం చేసుకుని..17 మంది నుంచి రూ.కోటి వరకు వసూలు చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన గ్లోబల్ హారిజన్స్ కన్సల్టెన్సీ నిర్వాహకుడు ఫహద్ బిన్ సాలంపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో (సీసీఎస్) కేసు నమోదైంది. రూ.22.3 లక్షల మోసపోయిన పురానీహవేలీకి చెందిన వ్యాపారి మహ్మద్ కబీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం దీన్ని రిజిస్టర్ చేసిన అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. మెహదీపట్నంలోని సఫ ఆర్కేడ్‌లో కన్సల్టెన్సీ నిర్వహించే సాలం హంగేరీలో ఉన్న బుడాపెస్ట్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీతో పాటు వివిధ విదేశీ విశ్వవిద్యాలయాల్లో సీట్లు ఇప్పిస్తానని, ఆపై కచ్చితంగా ప్లేస్‌మెంట్ లభిస్తుందని ప్రచారం చేసుకున్నాడు. ఇది చూసిన కబీర్ తన కుమారుడు మహ్మద్ అష్రఫ్‌తో పాటు సమీప బంధువు మహ్మద్ ముష్రఫ్‌కు బుడాపెస్ట్ యూనివర్సిటీలో సీట్ల కోసం సాలంను సంప్రదించాడు. అతడి కన్సల్టెన్సీలో ఉన్న హంగులు, ఆర్భాటాలతో పాటు ఆకర్షణీయమైన బ్రోచర్లు చూసి నమ్మాడు. అష్రఫ్, ముష్రఫ్‌లకు సీట్లు ఇప్పిస్తానంటూ సాలం చెప్పడంతో కబీర్ ఈ ఏడాది మే 15 నుంచి జులై రెండు వరకు మూడు దఫాలుగా రూ.22.3 లక్షలు చెల్లించారు. ఆన్‌లైన్ ద్వారా ఈ చెల్లింపులు జరిగిన తర్వాత కూడా సాలం నుంచి స్పందన లేకపోవడంతో కబీర్ పదేపదే అతని వద్దకు వెళ్లారు. ఆపై చెల్లింపులకు సంబంధించిన ఇన్వాయిస్‌లు ఇచ్చిన సాలం..వర్సిటీ జారీ చేసినట్లు నకిలీ ఆఫర్ లెటర్లను బోగస్ ఈ-మెయిల్స్ ద్వారా పంపాడు. బాధితులను పూర్తిగా నమ్మించడానికి జూమ్ ద్వారా ఇంటర్వ్యూలు కూడా నిర్వహించాడు. సాలం అందించిన పత్రాలపై అనుమానం వచ్చిన కబీర్ వర్సిటీ అధికారులను సంప్రదించగా అవి నకిలీవని తేలాయి. దీంతో ఆగస్టు 3న అతడి కన్సల్టెన్సీకి వెళ్లగా అది తాళం వేసి ఉంది. టోలిచౌకిలోని సాలం ఫ్లాట్‌కు తాళం కనిపించడం...ఫోన్లు స్విచ్ఛాఫ్ కావడంతో అతడి ఆచూకీ కోసం అనేక చోట్ల ప్రయత్నించి విఫలమయ్యాడు. గత నెలలో కువైట్ నుంచి వచ్చిన సాలం బంధువు అతడు అదృశ్యమైనట్లు మెహిదీపట్నం ఠాణాలో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ విషయాలు తెలిసిన కబీర్ శనివారం సిటీ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడు, బంధువులే కాకుండా మరో 15 మంది నుంచి సాలం డబ్బు వసూలు చేశాడని, ఆ మొత్తం రూ.కోటి వరకు ఉంటుందని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. అజ్ఞాతంలో ఉన్న సాలం ఆచూకీ కోసం ప్రత్యేక బృందం గాలిస్తోంది.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
ఈ తరహా ప్రకటనలపై డిస్కౌంట్ కూడా కలదు
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE
■ ఈస్ట్ ఫేసింగ్ & కార్నర్ 200+227=427 గజాల 2 ప్లాట్‌లు అమ్మబడును @ మహేశ్వరం 100 అడుగుల హైవే రోడ్‌కి 2వది పార్క్‌కు ఆనుకొని HMDA ఫైనల్ అప్రూవల్ Rs:11400 గజం. 9966521191 [SCA25008101]

PLOT FOR SALE
■ ఫ్యూచర్ సిటీ@ కడ్తాల్ టౌన్‌లో DTCP అప్రూవల్ వెంచర్‌లో అన్ని డెవలప్‌మెంట్స్‌తో వెంటనే ఇల్లు కట్టుకునే ప్లాట్స్ కలవు బ్యాంక్ లోన్ కలదు. సంప్ర: 9666695886 [HA-1503]
■ డైరెక్ట్ కంపెనీ ఆఫర్, HMDA పరిధిలో RRR దగ్గరలో, కేవలం 121 గజాలు 3,60,000 వేలకే, Nr. యాదగిరిగుట్ట, నెమిల Village EMI కలదు. Ph: 8341294298 [HA-8267]

CHITS
■ కపిల్ చిట్స్ 1L-కోటివరకు చిట్స్ కలవు. పాతచిట్స్ & కొత్త చిట్స్ 10L చీటీ వేసిన వారికి స్పెషల్ గిఫ్ట్ ఇవ్వబడును. హెల్త్ ఇన్సూరెన్స్ చేయబడును. 9948208005 [SCA25008024]

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, Kondala Ramakrishna Padmanabham S/o Kondala Balaiah Ramakrishna Naidu R/o: 1-4-887/1&2, And Flat No 204 Sri Sai Rajendra Pride BOB Colony Gandhinagar Secunderabad Hyderabad-80 TG, has Changed my name as Kondala Ramakrishna Padmanabham Naidu. [HA-01571]

OLD AGE HOME
■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చీర్యాల్. మీల్స్ భోజన వసతి. 7981467036, 939103 9990, 6281125552 [H-783382]

Services

BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800538]

BUSINESS OFFER
■ రుణాలు: ఇల్లు కొనుటకు 80% ఇళ్లు కట్టుటకు 80%, ప్లాట్ కొనుటకు 60%, ఇంటి తనఖా 60%, ప్లాట్ తనఖా 50% ఆదాయ పత్రం లేకున్నా, ప్లాన్ లేకున్నా, కమర్షియల్, ఇండస్ట్రీ రుణాలు, Best Bank and Best Rates, up to 20Cr. సంప్రదించండి: 9100168293, 9949632678 No ADVANCE, No COMMISSION (CLEAR PROFILES, T&C Apply). [SCA25008103]
■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్ లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి : 7406393937 [HA-503]

Wanted
■ Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్ కై జీ+కమీ+2 వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 32, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15606]
■ 30 to 70 yrs బ్యాంకు అనుబంధ సంస్థలో జీతం, ఇన్సెంటివ్స్ 35 వేలు (మేనేజర్స్, టీం లీడర్స్ ఎగ్జిక్యూటివ్స్) Q: 10th/డిగ్రీ రిటైర్డ్, బిజినెస్, టీచర్స్, ఇన్సూరెన్స్ ఏజెంట్, రియల్ ఎస్టేట్, గృహిణి,మార్కెటింగ్ ✆ 90524 70111 [B-247]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9010244403	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	9912225453

వివరాలకు : 6-2-2491, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

వడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో వేముల లక్ష్మణ్

హిమాయత్‌నగర్: అఖిల భారత వడ్డెర సంక్షేమ సేవా సంఘాన్ని బలోపేతం చేసేందుకు జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్ అన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా గుంజా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా అశోక్, జాతీయ సంయుక్త కార్యదర్శిగా మొక్కల శేఖర్, యువజన విభాగం అధ్యక్షుడిగా డా.వేముల లోకేష్, కార్యదర్శిగా డా.వేముల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శిగా వేముల మధుసూదన్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

వాక్‌వేలో లారీల అక్రమ పార్కింగ్..



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును ఆనుకుని ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో బైక్‌లు, కార్లే కాదు.. ఏకంగా లారీలే అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం వందలాది మంది వాకర్లు, సందర్శకులు వచ్చే వాక్‌వేలో అడ్డుగా లారీలు పార్కింగ్ చేస్తుండడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమ పార్కింగ్‌లను నియంత్రించడానికి జీహెచ్‌ఎంసీ సెక్యూరిటీ గార్డ్‌లను కూడా నియమించింది. అయితే ఈ సెక్యూరిటీ గార్డులు చెప్పినా కొంతమంది వినిపించుకోకుండా అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిలదీస్తున్న సిబ్బందిపై దాడికి పాల్పడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువై వాక్‌వేలో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని సందర్శకులు, వాకర్లు వాపోతున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



బీఆర్‌ఎస్ సీనియర్ నేతలతో మాట్లాడుతున్న వజ్రనాథ్

వెంగళరావునగర్: బీఆర్‌ఎస్ బలోపేతానికి 15 ఏళ్లుగా నిస్వార్థంగా పని చేస్తున్న యూసుఫ్‌గూడ సీనియర్ నేతలకు నేడు తీవ్రమైన అన్యాయం చేశారని పార్టీ సీనియర్ నాయకులు మాగంటి వజ్రనాథ్ అన్నారు. ఆదివారం యూసుఫ్‌గూడలో బీఆర్‌ఎస్ డివిజన్ సీనియర్ నాయకులతో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా 35 బూత్‌లకు చెందిన నేతలు తమకు జరిగిన అన్యాయాన్ని వజ్రనాథ్ దృష్టికి తీసుకు వచ్చారు. ఎంతోకాలంగా సేవలందించిన తమకు కాదని వేరేవారికి బూత్‌లు అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ తమ సోదరుడైన దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎన్నడూ సేవ చేసిన వారిని మరవలేదన్నారు. నాయకుల నుంచి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరికీ తగిన న్యాయం చేశారని, అయితే ఆయన మరణించిన తర్వాత సీనియర్లకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళి తగిన న్యాయం చేయడానికి ప్రయత్నిస్తానని, కార్యకర్తలకు, సీనియర్లకు నిరంతరం తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో సీనియర్లకు అన్యాయం చేయడం పార్టీకి మంచిది కాదన్నారు.

వేదాల్లోనే జీవన విధానం



మాట్లాడుతున్న డాక్టర్ మల్లు రవి

వెంగళరావునగర్: ఆయుర్వేద ప్రొఫెసర్లు, వైద్యులు తమ వద్ద ఉన్న శక్తిని, వైద్యవిద్యను ప్రజలకు సక్రమంగా చూపించనందునే ఆదరణ నోచుకోలేకపోయిందని పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అన్నారు. ఆదివారం నిమ్స్ మే ఆడిటోరియంలో జాతీయ ఆయుర్వేద సదస్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ దేశంలోని జీవన విధానానికి అనేక పురాణాలు, వేదాలు ఉన్నాయని, ఆయుర్వేద పుస్తకాల్లో మందులతో పాటుగా జీవన విధానాన్ని వివరించారన్నారు. ప్రశాంతత అల్లోపతిలో లేదని, ఆయుర్వేదంలోనే ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న రెండు ఆయుర్వేద వైద్య కళాశాలల్లో సిబ్బంది కొరతను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మల్లు ప్రసాద్, డాక్టర్ సారం పాణి , డాక్టర్ కిషన్ , డాక్టర్ ప్రేమానందరావు, డాక్టర్ రవినాయక్, సినీనటుడు శుభలేఖ సుధాకర్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ నర్సింహా పాల్గొన్నారు.

రాజీ మార్గం..రాజమార్గం..

లోక్ అదాలత్‌లో 305 కేసుల పరిష్కారం..



ఇ-పెట్టీ కేసులు 51

జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో అత్యధిక కేసులు

బంజారాహిల్స్: సత్వర న్యాయం పొందాలంటే కక్షిదారులు కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని, వివాదాలను రాజీతో ముగించేందుకు లోక్ అదాలత్ వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని గత మూడు వారాలుగా పోలీసులు అవగాహన కల్పించడమే కాకుండా అర్హత ఉన్న కేసుల విషయంలో నోటీసులు జారీ చేసి లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు ఒప్పించారు. దీంతో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. వెస్ట్‌జోన్ పరిధిలో లోక్అదాలత్‌కు అర్హత ఉన్న 305 కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి. ఇరువర్గాలు విజ్ఞతతో ఆలోచించి తెలివైన రాజీ నిర్ణయం తీసుకుంటే మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించవచ్చని భావించిన చాలామంది లోక్అదాలత్‌కు మొగ్గుచూపారు.

- భార్యాభర్తల కేసుల్లో ఇద్దరూ కలిసి ఉంటే వారి సంతానంతో పాటు ఇరు కుటుంబాలు సంతోషంగా ఉంటాయని పోలీసులు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.
- ఈ సారి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే దిశగా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.
- లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరించుకుంటే ఇద్దరూ విజేతలేనని న్యాయమూర్తులు కూడా పేర్కొనడంతో చాలామంది ముందుకు వచ్చారు.
- సివిల్ వివాదాలు, రాజీకాగల క్రిమినల్ కేసులను పరిష్కరించుకున్నారు.
- రోడ్డు ప్రమాద నష్టపరిహార దావాల్లో పలువురు బీమా కంపెనీలతో రాజీ కుదుర్చుకున్నారు.
- న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులే కాకుండా ఇంకా కోర్టు దాకా వెళ్లని ప్రీ లిటిగేషన్ దశలో ఉన్న వివాదాలను పరిష్కరించుకున్నారు.
- రోడ్డు ప్రమాదాలు, సివిల్, చీటింగ్, వివాహ, భూ తగాదా, కొట్లాటలు, బ్యాంక్ లావాదేవీలు, సైబర్ క్రైమ్, చెక్‌బౌన్స్, ట్రాఫిక్ చలానాలు, డ్రంకన్ డ్రైవ్ కేసుల పరిష్కారానికి అదాలత్ సరైన మార్గం చూపించింది.
- పరిష్కరించిన వాటికి కోర్టు ఫీజు లేకపోవడం మరో విశేషం.
- ఈ లోక్ అదాలత్‌లో వెస్ట్‌జోన్ పరిధిలో మొత్తం 305 కేసులు పరిష్కారం కాగా, ఇందులో 59 కేసులు పరిష్కరించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 50 కేసులు పరిష్కరించి బంజారాహిల్స్ రెండో స్థానంలో నిలిచింది.
- 51 ఇ-పెట్టీ కేసులు కూడా లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. లోక్ అదాలత్‌కు అర్హత ఉన్న 578 మందికి నోటీసులు అందించగా, అందులో 305 పరిష్కారం కావడం గత లోక్అదాలత్‌తో పోలిస్తే ఎక్కువేనని చెప్పాలి.

ఏ ఠాణా పరిధిలో ఎన్ని కేసులు..

ఠాణా పేరు	పరిష్కారమైన కేసులు
బంజారాహిల్స్	50
మాసబ్‌ట్యాంక్	31
జూబ్లీహిల్స్	59
ఫిలింనగర్	40
పంజగుట్ట	34
మధురానగర్	24
ఎస్సార్‌నగర్	38
బోరబండ	25

డి సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం..



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో ఏర్పాటైన డి సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శనను టాలీవుడ్ సినీ నిర్మాత పాయల్ సరాఫ్ ఆదివారం ప్రారంభించారు. విభిన్నమైన పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్ర ఉత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నేరుగా వీవర్స్ నుంచి వినియోగదారుడికి అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శనను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. డి సన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకులు భవిన్ మాట్లాడుతూ ఈ నెల 18 వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో ప్రత్యేక కలెక్షన్స్ వేదికగా పట్టన్ పటోలా, బంధనీ, బనారసీ, జరీ కోటా, కాశ్మీరి, మహేశ్వరి, కంచిపురం, మోడల్ అహింసా సిల్క్, లక్నోవీ, అజ్రక్ చీరలు, సూట్లు, కుర్తీలు, డ్రెస్ మెటీరియల్, బెడ్‌షీట్లు, ఆభరణాలు అందుబాటులో ఉంచామన్నారు. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ఉద్దేశమన్నారు.

యాదవ ఉపాధ్యాయులకు సత్కారం




యాదవ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి.కృష్ణ యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ అన్నారు. యాదవ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఇటీవల జరిగిన గురువుల దినోత్సవాన్ని పురస్కరించుకుని యాదవ ఉపాధ్యాయులకు పురస్కార మహోత్సవం నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి శరత్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జవహర్ నగర్ కార్పొరేటర్ మేకల లలిత యాదవ్, సంఘం అధ్యక్షుడు డేగల శ్రీనివాస యాదవ్‌తో కలిసి 60 మంది యాదవ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


శస్త్ర చికిత్సలో ఖచ్చితత్వం, ఆధునికతపై దృష్టి

బంజారాహిల్స్: శస్త్ర చికిత్సలో ఖచ్చితత్వం, ఆధునికతపై దృష్టి సారించామని అపోలో హాస్పిటల్స్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఆర్థ్రోప్లాస్టీ ఆర్థ్రోస్కోపీ సమ్మిట్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎస్.సోమశేఖర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆర్థ్రోస్కోపీ సొసైటీ హైదరాబాద్, ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ సహకారంతో అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం జూబ్లీహిల్స్‌లోని అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ రీసెర్చ్‌లో 9వ ఆర్థ్రోస్కోపీ సమ్మిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ యువ ఆర్థోపెడిక్ సర్జన్లకు సరైన శస్త్ర చికిత్స నైపుణ్యాలు మెరుగుపరచడంలో భాగంగా నాలెడ్జ్, ప్రాక్టికల్ స్కిల్స్ పెంచేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అందించే జ్ఞానంపై నిపుణుల నుంచి సానుకూల స్పందన లభిస్తుందన్నారు. ఎంతోమంది విద్యార్థులు తమ శస్త్ర చికిత్స ఖచ్చితత్వాన్ని, నైపుణ్యాన్ని మెరుగుపరచుకునేందుకు ఇది ఉపకరించిందన్నారు. ఈ సమ్మిట్‌లో మోకాలు, హిప్ రీప్లేస్‌మెంట్ సమస్యలకు చికిత్స చేయడానికి వినూత్న విధానాలపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో సమ్మిట్ కోర్సు డైరెక్టర్ డాక్టర్ మిథిన్ ఆచి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు..



పాస్టర్లు, బ్రాహ్మణులతో కలిసి స్వాగతం పలుకుతున్న బాబా ఫసియుద్దిన్..

రహమత్‌నగర్: మీలాద్-ఉన్-నబీ వేడుకలు రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలో ఘనంగా జరిగాయి, ముస్లింలు వాహనాలు, ఒంటెలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బోరబండ, రహమత్ నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో యువకులు స్వాగత వేదికలను ఏర్పాటు చేసి షర్బత్ పంపిణీ చేశారు. బోరబండలో పాస్టర్లు, బ్రాహ్మణులతో కలిసి స్థానిక కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ తన మత సామరస్యాన్ని చాటుకున్నారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవి,నగర మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబాసుల్తానా ర్యాలీకి స్వాగతం పలికి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.రహమత్‌నగర్‌లో పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, జూబ్లీహిల్స్ నియోజక వర్గం కాంగ్రెస్ నాయకుడు నవీన్ యాదవ్ షర్బత్ పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరుగకుండా బోరబండ, మధురానగర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వెంకటేశ్వరకాలనీలో..

వెంకటేశ్వరకాలనీ: ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వరనగర్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని జహీరానగర్ ఆల్ కరీం హోటల్ వద్ద షేక్ వసీం, మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో ఈద్-మిలాద్-ఉన్-నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఖైరతాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పి.విజయారెడ్డి హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

పెన్షన్‌ను పునరుద్ధరించాలి

హిమాయత్‌నగర్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన పెళ్లి కాని ఆడబిడ్డలకు న్యాయపరంగా అందాల్సిన కుటుంబ పెన్షన్‌ను తప్పుడు రూల్స్‌తో నీరుగార్చి వారికి పెన్షన్ రాకుండా అన్యాయానికి గురి చేసిన టీజీఎస్పీడీసీఎల్ సంస్థ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుని, ఆపిన పెన్షన్ ను వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.ఎం.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులు గుడి మల్కాపూర్‌కు చెందిన సారేపల్లి మంజుల, చింతల్ బస్తీకి చెందిన భువనేశ్వరిలతో కలిసి ఆయన మాట్లాడారు. జీవో 315, 353, 122 ప్రకారం పెళ్లికాని ఆడబిడ్డలు కుటుంబ పెన్షన్లకు అర్హులన్నారు. పెన్షన్ జీఎంగా పనిచేస్తున్న ఓ అధికారిణి ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం అందిస్తూ ప్రభుత్వ జీవోలు తుంగలో తొక్కి చాలా మందికి పెన్షన్ నిలిపివేసిందని ఆరోపించారు. సమావేశంలో ఎం.నర్సయ్య పాల్గొన్నారు.

అధైర్యపడవద్దు అండగా ఉంటా



గురుబ్రహ్మనగర్ బస్తీలో పర్యటిస్తున్న ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ నందగిరిహిల్స్ సమీపంలోని గురుబ్రహ్మనగర్ బస్తీలో ఆదివారం ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పర్యటించారు. ఇక్కడ రోడ్డు నిర్మాణం కోసం 12 గుడిసెలను తొలగించాలని ఇటీవల అధికారులు సూచించిన నేపథ్యంలో ఆ ప్రాంతంలో పర్యటించి ఆమె ఒక దగ్గర 10 గుడిసెలు, ఇంకో దగ్గర 5 గుడిసెలు, మరో దగ్గర 3 గుడిసెలు.. ఇలా ఇష్టానుసారంగా ఎక్కడంటే అక్కడ గుడిసెలు కూల్చడమేంటని ప్రశ్నించారు. ఏదైనా నిర్ణయం తీసుకుంటే బస్తీ అంతటికీ ఒకే విధంగా ఉండాలని కోరారు. అధైర్యపడవద్దని, ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. ఇలాంటి చర్యలు మంచివి కావని హితవు పలికారు.

అద్దె అడిగితే బెదిరిస్తున్నారు

వెంగళరావునగర్: తమ ప్లాట్‌లో అద్దెకు ఉంటున్న వ్యక్తులు కిరాయి ఇవ్వకపోగా బెదిరిస్తున్నారని ఓ వృద్ధురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్‌కాలనీకి చెందిన డాక్టర్ కె.జానకీ స్వర్ణలత అమెరికాలో డాక్టర్‌గా పనిచేస్తూ కొన్నేళ్లుగా అక్కడే ఉంటున్నారు. వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని తన ఇంటిని శివప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తికి 2016 వరకు లీజుకు ఇచ్చారు. లీజు గడువు ముగియడంతో తిరిగి పొడిగించలేదు. అయితే అప్పటి వరకు అతని వద్ద క్లర్క్‌గా పని చేసిన నెక్కంటి రమేష్, ఒకే యూ ట్యూబ్ చానల్ నిర్వాహకుడు శ్రీనివాస్‌తో కలిసి చట్టవిరుద్ధంగా ప్లాట్‌ను ఆక్రమించుకున్నాడు. తనకు 8 ఏళ్లుగా కిరాయి ఇవ్వకపోగా ఖాళీ చేయడం లేదు. దీంతో ఆమె ఇక్కడ జీపీఏ హోల్డర్‌గా వ్యక్తికి అధికారం ఇచ్చింది. ఎన్నోసార్లు ఖాళీ చేయమని అడిగినా తమ ప్లాట్‌లో చట్టవిరుద్ధంగా ఉంటున్న రమేష్, శ్రీనివాస్ జీపీఏ హోల్డర్‌తో పాటుగా తనను బెదిరింపులకు గురి చేస్తున్నారని వైద్యురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం వారు సోమాజిగూడ డివిజన్ పరిధిలోని జయప్రకాశ్ నగర్, ఇంజనీర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం పెద్ద ఎత్తున శంకుస్థాపనలు జరుగుతున్నాయన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీత, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వ్యూహాత్మకంగా ముందుకెళ్లాలి



మాజీ మంత్రి హరీష్‌రావుతో మాగంటి మహానందకుమారి, వజ్రనాథ్..

వెంగళరావునగర్: రానున్న ఉప ఎన్నికల్లో వ్యూహాత్మకంగా ముందుకెళ్లాలని మాజీ మంత్రి టి.హరీష్ రావు అన్నారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తల్లి మహానందకుమారి, ఆయన సోదరుడు వజ్రనాథ్ ఆదివారం హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని సమస్యలపై హరీష్‌రావు ఆరా తీశారు. అదేవిధంగా త్వరలో జరగనున్న ఉప ఎన్నికలపై చర్చించారు. నియోజకవర్గంలోని నాయకులను, కార్యకర్తలను కలుపుకుని ముందుకు వెళ్లాలని వారికి సూచించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలిచే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

స్వదేశీ వస్త్రాలను ఆదరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దీపికా దినేష్, శ్రీనివాసరావు

శ్రీనగర్‌కాలనీ: స్వదేశీ వస్త్రాలను ఆదరించాలని, మహిళల వస్త్ర వైభవానికి పట్టుచీర ప్రతీక అని ఇండియన్ సిల్క్ గ్యాలరీ బ్రాండ్ అంబాసిడర్ దీపికా దినేష్ అన్నారు. ఆదివారం శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈనెల 16 నుంచి 23 వరకు కేంద్ర చేనేత, జౌళి శాఖ సహకారంతో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట నిర్వహిస్తున్న సిల్క్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. భారతీయ కళాత్మక నైపుణ్యానికి, నాణ్యమైన పట్టువస్త్రాలకు వేదికగా ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిలుస్తుందన్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో అద్భుత శైలిగల పట్టు వస్త్రాలు లభిస్తాయని, దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని దేశంలో ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు ఆయా ప్రాంతాల పట్టు వస్త్రాలను ఈ ప్రదర్శనలో ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్‌కుమార్ తెలిపారు.

రావణ దహనానికి భారీ ఏర్పాట్లు



సమావేశంలో పాల్గొన్న సమితి సభ్యులు

ఖైరతాబాద్: దసరా పండుగ సందర్భంగా చింతల బస్తి రాంలీలా మైదానంలో నిర్వహించే రావదణ దహన కార్యక్రమాన్ని ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని దసరా సమ్మేళన సమితి ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ బాబు తెలిపారు. ఆదివారం సమ్మేళన సమితి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ బాబు మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా రావణ దహన కార్యక్రమాన్ని చింతలబస్తి రాంలీలా మైదానంలో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వేషధారణలతో రథం, అశ్వంపై భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు సూరి, దాసరి అంజయ్య, చింతల బస్తి కార్యదర్శి చిన్నేశ్వర్, ప్రేమ్‌నగర్ ప్రధాన కార్యదర్శి కె.భగవాన్ దాస్, సుధీర్ కుమార్, దాసరి ప్రసాద్, సురేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విస్తరణ జరిగినా తొలగని ట్రాఫిక్ సమస్య



బోరబండలో నిలిచిపోయిన వాహనాలు

రహమత్‌నగర్: రహదారి విస్తరణ జరిగినా బోరబండలో ట్రాఫిక్ సమస్య తీరడం లేదు. నిత్యం వాహనాలు నిలిచి పోతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దీంతో హైటెక్ సిటీ,సైబ్ టవర్, త్రీ,ఎర్రగడ్డ, అమీర్‌పేట్ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు.బోరబండ మీదుగా హైటెక్ సిటీకి నిత్యం వేలాది వాహనాలు రాక పోకలు కొనసాగిస్తుంటాయి. ఇరుకైన రహదారులు మూలంగా బోరబండ బస్టాప్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సమస్య తీవ్రతను గుర్తించిన అప్పటి డిప్యూటీ మేయర్, ప్రస్తుత బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ స్థానిక వ్యాపారుల నుంచి అడ్డంకుల ఎదురైన లెక్క చేయకుండా జీహెచ్‌ఎంసీ అధికారులను ఒప్పించి 2018లో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీరిపోతుందని వాహన దారులు ఆనంద పడ్డారు. కాని కథ మళ్లీ మొదటికి వచ్చింది. రహదారి ఇరువైపుల పక్కన తోపుడు బండ్లు, చిరు వ్యాపారుల కారణంగా రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో అంబులెన్స్ సైతం ట్రాఫిక్‌లో చిక్కుపోయిన సంఘటనలు ఉన్నాయి. ప్రధానంగా సాయంత్రం వేళల్లో ఈ దారిపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. బోరబండ నుండి పోలీస్ స్టేషన్ సందు వరకు వెళ్లాలంటే గంటల సమయం పడుతోంది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహన దారులు కోరుతున్నారు.

ఉత్సాహభరితంగా పెట్స్ వాకథాన్..





బంజారాహిల్స్: దేశంలో మొట్టమొదటి సాంకేతిక ఆధారిత ఓమ్ని ఛానల్ పెట్ కేర్ బ్రాండ్ జిగ్లి జూబ్లీహిల్స్‌లోని జిగ్లీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ప్రతిష్టాత్మక వాకథాన్ నిర్వహించింది. వాకథాన్‌లో పాల్గొన్న పెట్స్ యజమానులకు సర్టిఫికెట్లు, పతకాలు, ట్రోఫీలను అందజేశారు. కాస్మో ఫస్ట్ గ్రూప్ సీఈఓ పంకజ్ పోద్దార్ మాట్లాడుతూ పెంపుడు జంతువులు, వాటి యజమానుల మధ్య విడదీయరాని బంధానికి ఉత్సాహభరితమైన వేడుకగా అభివర్ణించారు. పెంపుడు జంతువులు సంరక్షణలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో వాకథాన్ కార్యక్రమం ద్వారా రూ. లక్ష సేకరించామని, 110 మందికి పైగా కార్యక్రమానికి హాజరై తోడ్పాటునందించారన్నారు. ఈ మొత్తాన్ని జంతువుల సంక్షేమానికి అందజేయనున్నట్లు తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

ఎస్‌డబ్ల్యూయూ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహమూద్



సాక్షి,సిటీ బ్యూరో: ఐఎన్‌టీయూసీ- టీజీఎస్ ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మరోసారి సయ్యద్ మహమూద్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ మహమూద్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు మరోసారి అవకాశం కల్పించిన సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్లు గొడిశాల అబ్రహాం, జక్కుల మల్లేష్, జయ, హఫీజ్ ఖాన్‌లు మహమూద్‌ను అభినందించారు.

బహుజన బతుకమ్మ పాట ఆవిష్కరణ



బహుజన బతుకమ్మ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో విమలక్క, జస్టిస్ రాధారాణి

బంజారాహిల్స్: ప్రకృతి రక్షణే–ప్రజల రక్షణ అంటూ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రూపొందించిన బహుజన బతుకమ్మ–2025 పాటను యలవర్తి ధనలక్ష్మి ఆవిష్కరించారు. ఆదివారం ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పోతుల ఆహ్వానం పలకగా, విమలక్క అధ్యక్షత వహించారు. విశ్రాంతి హైకోర్టు జస్టిస్ రాధారాణి ముఖ్యఅతిథిగా, విశ్రాంత ఆచార్యులు జయధీర్ తిరుమలరావు ప్రధానోపన్యాసం చేశారు. బహుజన బతుకమ్మ గురించి విశ్రాంత ఆచార్యులు కె.లక్ష్మి వివరించారు. విమలక్క సబ్బండ ప్రజలను కలిపేందుకు ప్రయత్నిస్తున్నారని వక్తలు అభినందించారు. ప్రకృతి విధ్వంసాలకు మానవ తప్పిదాలే కారణమని అన్నారు. కార్యక్రమంలో మాదాల రవి, అంబటి నాగన్న, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, తొలివెలుగు రఘు, జ్యోత్స్నా, భద్ర, రఫీ, పీడీఎస్‌యూ పూర్వ నాయకుడు శ్రీను, సోగరా బేగం, నాగిరెడ్డి, రఘునందన్, మల్లేష్, కస్తూరి శ్రీను, యాదగిరి, సైరా భాను, నాగరాజు, దుశ్చర్ల సత్యనారాయణ, భరత్, పృధ్విరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సంఘటితమైతేనే మనుగడ



లక్డీకాపూల్: రైతును బతికించాలని, రైతుకు అండగా ఉండాలనే నినాదంతో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ చేస్తున్న వినూత్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 25 మంది రైతులను సత్కరించారు. బేగంపేటలోని హరిత ప్లాజాలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఒకప్పుడు గ్రామాల్లో పంటలు, వ్యవసాయం గురించి మాట్లాడేవారు. కానీ ఇప్పుడు నలుగురు కలిస్తే రాజకీయం గురించి మాట్లాడుతున్నారని అన్నారు. గ్రామాల్లో పంట పండించిన వారు వారే ఒక కంపెనీ పెట్టి నేరుగా తమ ఉత్పత్తులను అమ్మాలని, నిజాయితీ రాజకీయాలకు రైతులే పునాది వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం రైతు విలువ పెంచాలని, టోల్ గేట్ దగ్గర రైతులకు ఉచితం అని పెట్టాలని సూచించారు. ప్రపంచంలో ఎన్ని టెక్నాలజీలు వచ్చినా రైతు లేనిదే మనం తినలేమన్నారు .కార్యక్రమంలో డా. స్రవంతి, పబ్బ శరణ్య, కోమటి రమేష్ బాబు, కొన్నె దేవేందర్, బత్తిని రాజేశ్, గీతానంద్, రాగి స్వప్న, గంగాధర్, నాగేంద్ర, వంశీకృష్ణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో డిజైర్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్ప్చర్స్, స్టేకిడ్ స్టోరీస్ , డీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఛాప్–2025 ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

వెడ్డింగ్ డెస్టినేషన్‌గా రాష్ట్రం ఎదగాలి

పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు



టీసీఈఐ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్‌ను ప్రారంభించిన మంత్రి జూపల్లి



వెడ్డింగ్ డెకరేషన్‌లను పరిశీలించిన జూపల్లి,స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్

మణికొండ: రాష్ట్రంలో అనేక వెడ్డింగ్ డిస్టినేషన్ పర్యాటక కేంద్రాలు ఉన్నాయని, వాటిని ప్రమోట్ చేయాలని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం హైదరాబాద్ నగర శివారు వట్టి నాగులపల్లిలోని అక్షర కన్వెన్షన్‌లో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ(టీసీఈఐ) ఆధ్వర్యంలో సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ గ్లోబల్–2025ను ఆయన ప్రారంభించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తులను మాత్రమే కాకుండా రెండు కుటుంబాలు, రెండు సంస్కృతులను కలిపే వారధిగా వెడ్డింగ్ ప్లానర్‌లు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వెడ్డింగ్ డిస్టినేషన్ అనగానే రాజస్థాన్, గోవా, కేరళకు వెళుతున్నారని, ఆ పరిస్థితిని మార్చేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు.

ఈ నెల 27వ తేదీన పర్యాటక దినోత్సవం సందర్భంగా అనుమతులు, అందమైన వేదికలను పరిచయం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ నగరానికి 150 కిలోమీటర్ల దూరం లోపే ఉన్న అనంతగిరి, నాగార్జునసాగర్, సోమశిలలను వెడ్డింగ్ డిస్టినేషన్లుగా ప్రచారం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అలాంటి వివాహాలకు సహకారం అందిస్తామన్నారు. గ్లోబల్ కాంగ్రెస్‌కు 450 మందికి పైగా ప్రతినిధులు, 600 మందికి పైగా సందర్శకులు హాజరయ్యారు. డిజైనర్లు తమ నైపుణ్యంతో ప్రత్యేక డెకార్ కాన్సెప్ట్‌లతో అందరినీ అలరించారు. కార్యక్రమంలో టీసీఈఐ అధ్యక్షుడు ఎ.బలరాంబాబు, జాతీయ కార్యదర్శి రవి బురా, కోశాధికారి తైఫిక్ ఎం ఖాన్, సమన్వయకర్త ఎం. సాయిశ్రవణ్, అలీ బక్తియార్, స్టెఫానీ, గిడియాన్, పర్వరిట్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను వెంటనే నెరవేర్చాలి



మాట్లాడుతున్న కార్మిక సమైక్య నాయకులు

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ కార్మిక సమైక్య వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి రామన్న డిమాండ్ చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య సలహాదారు లచ్చయ్య, ప్రధాన కార్యదర్శి బి.యాదగిరితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీలను ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో ఉన్న పోడుభూములు, భూమిలేని నిరుపేదలకు ఒక్కొక్కరికి 3 ఎకరాల చొప్పున భూమిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలని కోరారు. పేదలకు 200 గజాల ఇళ్ల స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నర్సింగ్‌రావు, మల్లేష్, సుజాత, సాగర్, ఎంకన్న, భవాని, వెంకట్, సోమయ్య, రజిత, పద్మావతి, లత, దుర్గాభవాని, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు'పై ఆంక్షల పేరిట కుట్ర

బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

కాచిగూడ: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మానుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోగా అనేక ఆంక్షలు, కోతలు విధించడం సిగ్గుచేటని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలను ఎత్తేస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. సుమారు రూ.8వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రంలోని 12 లక్షల 75 వేల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించకపోతే రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రంలో ఎక్కడికక్కడ మంత్రులను, ప్రజా ప్రతినిధులను, అధికారులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

తెలుగు సాహిత్య విమర్శపై భారతీయ, పాశ్చాత్య ప్రభావం

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు



ఆన్‌లైన్ ద్వారా ప్రసంగిస్తున్న దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: భారతీయ, పాశ్చాత్య ప్రభావ సమ్మిళితమే తెలుగు సాహిత్య విమర్శ అని హెచ్‌సీయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఆచార్య హెచ్ఎస్ బ్రహ్మానంద తెలుగు సాహిత్య విమర్శ, పాశ్చాత్య ప్రభావం అనే గ్రంథంపై ఆయన ప్రసంగించారు. సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన బ్రహ్మానంద పుస్తకం తెలుగులో సాహిత్య విమర్శ ఆరంభ, వికాసాల్లో ఆంగ్ల సాహిత్యంతోపాటు భారతీయ భాషల్లో సంస్కృతి, అలంకార శాస్త్రాల ప్రభావం కూడా ఉందని విశ్లేషించిన ఉత్తమ గ్రంథమని అభివర్ణించారు. సీపీ బ్రౌన్ చేసిన కృషి తెలుగు పరిశోధనకు ఎంతో విలువైందని రాబర్ట్ కాల్డ్వెల్ తెలుగు సంస్కృత జన్యం కాదని ప్రతిపాదించిన ద్రావిడ భాషాజన్య సిద్ధాంతం వంటివి నేటికీ చర్చనీయాంశాలుగానే ఉన్న విషయాన్ని బ్రహ్మానంద తన గ్రంథంలో పేర్కొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు తెలుగు, ఇతర ప్రొఫెసర్లు ప్రసంగించారు.

డాక్టర్ వంశీరెడ్డికి అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు



అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ వంశీరెడ్డి

బాలానగర్: జేఎన్‌టీయూలోని యూసీఈఎస్‌టీహెచ్‌లోని సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.వంశీరెడ్డికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు–2025 దక్కింది. ఈ మేరకు ఆదివారం మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో యాక్ట్ నౌ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవార్డును ప్రదానం చేశారు. దివంగత భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం విలువలైన ఆవిష్కరణ, సేవ, నాయకత్వ స్ఫూర్తిని ప్రతిబింబించే వ్యక్తులను యాక్ట్ నౌ సంస్థ ఈ అవార్డుతో సత్కరిస్తోంది. పర్యావరణ కాలుష్య పర్యవేక్షణ, నియంత్రణలో సుస్థిర పద్ధతులు, సహజ వనరుల నిర్వహణకు భౌగోళిక సాంకేతికత, వినియోగం వంటి అంశాల్లో డాక్టర్ వంశీరెడ్డి చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. డాక్టర్ వంశీరెడ్డి తన అంకితభావం, అద్భుతమైన పరిశోధనలతో విద్యారంగంలో పురోగతికి మాత్రమే కాకుండా, పర్యావరణ సవాళ్లకు ఆచరణాత్మక పరిష్కారాలను కూడా అందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల మూసివేతకు కుట్ర

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



సీఐటీయూలో చేరిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో పాలడుగు భాస్కర్

కుత్బుల్లాపూర్: అంగన్‌వాడీ వ్యవస్థను కాపాడుకోవడానికి పోరాటాలే శరణ్యమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీఎన్‌జీవోకు చెందిన 200 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సీఐటీయూలో చేరారు. భాస్కర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం శ్రీవిద్య, నూతన విద్యావిధానాన్ని తీసుకువస్తున్నాయని, అంగన్‌వాడీ సెంటర్లను మూసివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. అంగన్‌వాడీలు ఐక్యంగా పోరాడాలని, వారికి సీఐటీయూ వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. అనంతరం కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు 8 సెక్టార్ల కన్వీనర్‌గా శ్యామల, కమిటీ సభ్యులుగా అనసూయ,, శ్యామల, అర్చన, గీత, మమత, అనంతలక్ష్మీ, లక్ష్మి, అరుంధతి, హర్ష, సురేఖ, రమణ, పరమేశ్వరి, సునీత, లలితలను ఎన్నుకున్నారు. కార్యక్రమములో సీఐటీయూ నాయకులు అంజయ్య, స్వాతి, తిమ్మప్ప పాల్గొన్నారు.

లౌకిక వాదానికి పెట్టింది పేరు తెలంగాణ

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



అవార్డు అందజేసిన మహేష్ కుమార్ గౌడ్, చిన్నారెడ్డి తదితరులు

హిమాయత్‌నగర్ : లౌకికవాదానికి తెలంగాణ రాష్ట్రం పెట్టింది పేరని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అధికార భాషగా హిందీ ఈ దేశ సమగ్రతకు బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్, తెలంగాణ హిందీ జర్నలిస్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'హిందీ దివస్'కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ చైర్మన్ రాజేశ్ కుమార్ అగర్వాల్, తెలంగాణ హిందీ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎస్. కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్లోబలైజేషన్ ప్రభావంతో ఇంగ్లీష్ ప్రాధాన్యం పెరిగినా, హిందీ తన స్థానాన్ని కోల్పోలేదని పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భాషాలు, మతాలు వేరైనా, పరస్పరం గౌరవించుకుంటూ కలిసిమెలిసి జీవించాలని, మార్వాడీలపై దాడులు సరికాదని అన్నారు. ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, రాష్ట్ర ప్రణాళిక కమిషన్ చైర్మన్ డా.చిన్నారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు అన్వేష్ రెడ్డి, తాహెర్, తెలంగాణ హిందీ జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.సర్వర్, ప్రదీప్ సురానా, లక్ష్మీనారాయణ రాఠీ, సి.ఎ.మురళి మనోహర్ పలోడ్, టీమ్ అగర్వాల్, మహావీర్ అగర్వాల్, మధు సూదన్ సస్థాలియా, సురేశ్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి అవార్డులు...

హిందీ దివస్ సందర్భంగా హిందీ మిలాప్ ఎడిటర్ వినయ్ వీర్ అవార్డును కవి, జర్నలిస్టు అర్విండ్ యాదవ్‌కు ప్రదానం చేశారు. సీనియర్ జర్నలిస్టు సదాశివ శర్మ అవార్డును మిడ్‌నైట్ రిపోర్టర్ డా.చైతన్యసింగ్, విద్యారణ్య హరిబెలికే అవార్డును హిందీ కవి మీనా లలిత్ కు అందజేశారు.

నిఫ్ట్ ఫ్యాషన్ షో పోస్టర్ ఆవిష్కరణ



నిఫ్ట్ ఫ్యాషన్ షో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాముయాదవ్

కాచిగూడ: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్(నిఫ్ట్) ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న ఫ్యాషన్ షో పోస్టర్‌ను ఆదివారం కాచిగూడలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిఫ్ట్ డైరెక్టర్ కన్నెబోయిన రాము యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు నేర్పించిన నూతన సాంకేతిక పరిజ్ఞానంతో చేసిన డిజైన్ దుస్తులను ఈ ఫ్యాషన్ షో ద్వారా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఆదరణ పొందుతున్న డిజైన్లతోపాటు వివిధ రాష్ట్రాలకు సంబంధించిన వస్త్ర సంప్రదాయాలను ఈ ఫ్యాషన్ షోలో విద్యార్థులు ప్రదర్శించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుండె గణేశ్, నిఫ్ట్ చైర్‌పర్సన్ కె.గీతా రాముయాదవ్, అకాడమిక్ ఇన్‌చార్జి భవాని, నందిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం త్యాగాలు చేసేది కమ్యూనిస్టులే..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న సాంబశివరావు

కుత్బుల్లాపూర్: ప్రజల కోసం కమ్యూనిస్టులే త్యాగాలు, పోరాటాలు చేస్తున్నారని, అందుకే పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలైనా ప్రజల గుండెల్లో సీపీఐ నిలిచిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కుత్బుల్లాపూర్‌లో సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆ పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జాతీయ సమితి సభ్యుడు యూసుఫ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి ఆదర్శవంతమైన కమ్యూనిస్టు నేత అని, దేశ రాజకీయాల్లోనే కాకుండా విద్యార్థి, యువజన నాయకుడిగా అంతర్జాతీయ రాజకీయాల్లో సైతం ప్రత్యక్షంగా పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆయన ఎంత సౌమ్యుడో రాజకీయ, సైద్ధాంతిక అంశాల్లో అంత నిక్కచ్చిగా ఉండేవారని అన్నారు. నిత్యం ప్రజా జీవితంలో ఉండే కమ్యూనిస్టులకు ఎలాంటి మచ్చ ఉండని నిస్వార్థపరులని, సురవరం, సీతారాం ఏచూరి, గద్దర్ లాంటి వారు మరణించినప్పుడు ప్రజలు నీరాజనాలు పలికారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం నుంచి సెక్యులర్, సోషలిజం పదాలను తొలగించాలని కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్ బోస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్ రెడ్డి, సాయిలు గౌడ్, . ధర్మేంద్ర, ఏసురత్నం, స్వామి, జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, కిషన్, కృష్ణ, హరినాథ్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి, మాధవి, ప్రమీల, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

9 ఆదివాసీ తెగల మేధోమథన సదస్సు



చలో భద్రాచలం సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నేతలు

లాలాపేట: ఆదివాసీ హక్కుల సాధనకుగాను ఈ నెల 28న ఉమ్మడి ఖమ్మం జిల్లా భద్రాచలంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ సోయం బాబూరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓయూలో జరిగిన 9 ఆదివాసీ తెగల రాష్ట్రస్థాయి మేధోమథన సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 342(2) ప్రకారం లంబాడీ, బంజారా, సుగాలీలను ఎస్టీ జాబితాలో కలపలేదనీ, దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు గెజిట్ నోటిఫికేషన్‌లు, కమిషన్ల రిపోర్టులు ఉన్నాయని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ సాధనకు డిసెంబర్ 9న హైదరాబాద్‌లో, తరువాత దేశ రాజధాని ఢిల్లీలో బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. ఈ సభలకు ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, తాను వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా జాతి ప్రయోజనాలు కాపాడేందుకు పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. తొమ్మిది ఆదివాసీ సంఘాల సమన్వయ కర్త రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివాసీ తెగల నాయకులు గొంది వెంకటరమణ, పాపయ్య, భాస్కర్ రావు, తెల్లం వెంకటేశ్వర్లు, జనార్దన్, రామస్వామి, కృష్ణ, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, లక్ష్మణ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీలను వెనక్కి పంపించేలా ఉద్యమించాలి

డాక్టర్ జిలుకర శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జిలుకర శ్రీనివాస్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మార్వాడీలను పల్లెలు, మండల కేంద్రాల నుంచి వెనక్కి పంపించేవిధంగా ఉద్యమించాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉపాధి, ఉద్యోగం, వ్యాపారం తెలంగాణ ప్రజల హక్కు – మార్వాడీ గో బ్యాక్ పేరిట సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మార్వాడీలు హిందువులు కారని, వాళ్ళు జైన మతస్థులు అని, వారి వల్ల తెలంగాణ ప్రజలకు నష్టం జరుగుతుందని అన్నారు. తెలంగాణ సంస్కృతిని పాడు చేసే గుజరాత్, రాజస్థాన్ మార్వాడీల పండుగలకు ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. తెలంగాణలో స్థానికుల వ్యాపారాలను కాపాడేందుకు చట్టం చేయాలని, అందుకు రాష్ట్రం ప్రభుత్వం వెంటనే ఒక కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. మార్వాడీ గో బ్యాక్ ఉద్యమ కన్వీనర్ పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణలో మార్వాడీలు కొత్త షాపులు పెట్టకుండా స్థానికులే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణది గొప్ప సంస్కృతి అని, ఉత్తరాది పెత్తనం వల్ల అది కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రచయిత సుంకిరెడ్డి నారాయణరెడ్డి, దేవకి దేవి, రాఘవాచారి, సంగిశెట్టి శ్రీనివాస్, కమటం వేణు, బిరెల్లి రాములు, ప్రొఫెసర్ తిరుపతి, ఆరూరి సుధాకర్, చెరిపల్లి ఆనంద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

24న ట్యాంక్‌బండ్‌పై బీసీ బతుకమ్మ

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

కవాడిగూడ: బీసీ బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద బీసీ మహిళలతో ''బీసీ బతుకమ్మ''నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆదివారం బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల మణిమంజరి సాగర్ ఆధ్వర్యంలో దోమలగూడ బీసీ భవన్‌లో బీసీ మహిళా సంఘం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల ప్రగాఢ ఆకాంక్ష అయినటువంటి బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం, మహిళా బిల్లులో బీసీ మహిళలకు కోట కల్పించాలని, ప్రధాని నరేంద్ర మోడీ మనసు కరిగి బీసీల ఆకాంక్షలు నెరవేర్చాలని బీసీల బతుకమ్మను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మణి మంజరి మాట్లాడుతూ చరిత్రలో మొదటి సారిగా బీసీ డిమాండ్ల సాధన కోసం బీసీల బతుకమ్మ ద్వారా బీసీల గొంతుకను వినిపిస్తామని అన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తారకేశ్వరి, కార్యనిర్వాహక కార్యదర్శులు ఎ. సంధ్యారాణి, కె. సుజాత, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సిద్ధాంతం శ్యామల, పద్మావతి, కోడూరి శ్రీదేవి, బి.సరిత, వరలక్ష్మీ, జి.లావణ్య యాదవ్, రేణుక, వరికుప్పల మధు, గూడూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి 11
హైదరాబాద్, సోమవారం, 15, సెప్టెంబర్, 2025

సిటీ ప్లస్




కలం.. కలకాలం..

పాఠకులతో నేరుగా రచయితల సంభాషణ

- నగరంలో వేదికలు కల్పిస్తున్న పలు క్లబ్స్
- ఇటీవల కాలంలో పెరుగుతున్న సంస్కృతి
- సంతోషం వ్యక్తం చేస్తున్న రచయితలు
- పరస్పరం అభిప్రాయాలు పంచుకుంటూ
- తమ అభిమాన పాఠకులతో మాటామంతీ

ఒకప్పుడు రచయిత తాను రాసిన నవలలను ప్రచురణ సంస్థ ద్వారా మార్కెట్‌లోకి విడుదల చేసి పాఠకుల చెంతకు చేర్చేవాడు. లేదంటే అప్పట్లో వచ్చిన వారపత్రికలు, సీరియళ్లు తదితర మాధ్యమాల ద్వారా తన నవల ఇతివృత్తాన్ని పాఠకులతో పంచుకునేవారు. ప్రస్తుతం వారపత్రికలు ఆదరణ కోల్పోవడం, సామాజిక మాధ్యమాల ప్రభావం కారణంగా రచయితలు నేరుగా పాఠకులతో సంభాషించేందుకు ఆసక్తి చూపుతున్నారు. తద్వారా పుస్తక ప్రియుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఇలా హైదరాబాద్‌లో రచయితలను, పాఠకులను ఒక చోటకు చేర్చేందుకు పలు క్లబ్స్ సైతం ఏర్పాటయ్యాయి. అంతేకాదు వాటికి డిమాండ్ కూడా పెరుగుతోంది. నవలలను పాఠకుడికి చేర్చడం, పాఠకుడి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం, తద్వారా పరస్పరం తమ అభిప్రాయాలను పంచుకోవడం ప్రస్తుతం ట్రెండ్‌గా నడుస్తోంది.
- బంజారాహిల్స్

దశాబ్దం క్రితం రచయితలు పాఠకులతో ముచ్చటించడానికి తమ నవలను పరిచయం చేయడానికి అక్షర పుస్తక విక్రయశాలతో పాటు, సప్తపర్ణి, లా మకాన్, రవీంద్ర భారతి, ఆంధ్ర సారస్వత పరిషత్, విశాలాంధ్ర బుక్‌హౌస్, స్టార్ హోటళ్లు, ప్రసాద్ ల్యాబ్స్, ప్రెస్‌క్లబ్స్ తదితర వేదికలను ఎంచుకునేవారు. ప్రస్తుతం వీటితోపాటు ఈ క్లబ్స్ కూడా రచయితలకు బాసటగా నిలుస్తున్నాయి.



గొప్ప అనుభూతినిచ్చింది..

'ఎట్ ది ఎండ్ ఆఫ్ ది రెయిన్ బో' అనే పుస్తకాన్ని రచించా. ఇది భావోద్వేగ ప్రేమకు ప్రతీక. నిజజీవిత సమస్యలు, సామాజిక అంచనాలు తాకుతుంది. పోరాటాలు, భావోద్వేగాలను అన్వేషిస్తూ ఆశను కలిగిస్తుంది. కష్టాల ద్వారా ప్రేమ బలాన్ని చూపుతుంది. ఆఫ్‌లైన్ క్లబ్ ద్వారా పాఠకులతో నేరుగా ముఖాముఖిలో పాల్గొన్నా. వారి అభిప్రాయాలను విని, సందేహాలను నివృత్తి చేశా. రాయడం కన్నా.. సారాంశాన్ని పాఠకులతో పంచుకోవడం గొప్ప అనుభూతినిచ్చింది.
- కావ్య కృష్ణన్, రచయిత్రి

ఆవిష్కరణ కేంద్రాలుగా..


రచయితలు, పాఠకులను ఒక చోట చేర్చడం, ఆఫ్‌లైన్ క్లబ్ రచయితల సమావేశాలు ఏర్పాటు చేయడం, రచయితలను, పాఠకులను ఒక చోట చేర్చడం నగరంలో కొంతకాలంగా జరుగుతున్న ట్రెండ్. వారానికోమారు గచ్చిబౌలి, మాదాపూర్, కోకాపేట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, బేగంపేట, కూకట్‌పల్లి, హిమాయత్ నగర్ తదితర ప్రాంతాల్లో రచయితలతో సమావేశాలు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నారు. పాఠకుల నుంచి వస్తున్న ఆదరణను రచయితలు కూడా ఆస్వాదిస్తున్నారు.

పాఠకులతో ప్రత్యేక సెషన్స్..

తాము రాసిన నవల సారాంశాన్ని, అందులోని పాత్రలను కూలంకషంగా చర్చించేందుకు పాఠకులు ముందుకొస్తున్నారు. పలువురు రచయితల తమ పుస్తక ప్రయాణాన్ని, ఆ పుస్తకాల్లోని కథల సారాంశాన్ని చర్చిస్తున్నారు. ఆఫ్‌లైన్ క్లబ్స్ ఇన్‌స్టాలో చురుకుగా ఉంటూ కొత్త రచయితలను ప్రోత్సహించడమే కాకుండా పాత రచయితలను కూడా ఈ వేదికలకు దగ్గరచేస్తున్నారు. ప్రతి సెషన్ కూడా పుస్తక సంతకంతో ముగుస్తోంది. ఇది రచయితలకు, పాఠకులకు ఒక మధురానుభూతిని కల్పిస్తుంది. కెఫేల్లో కాఫీ విత్ ఆథర్ పేరుతో ఇటీవల కాలంలో ఈ తరహా కార్యక్రమాలు జోరందుకున్నాయి.

ఆఫ్‌లైన్ క్లబ్ పేరుతో..

పాఠకులతో నేరుగా ముచ్చటించేందుకు పలువురు రచయితలు ఎదురు చూస్తున్న తరుణంలో కొన్ని క్లబ్స్ వేదికలుగా మారుతున్నాయి. ఇందులో భాగంగానే ఆఫ్‌లైన్ క్లబ్ పేరిట కొంత మంది యువతీ, యువకులు ఓ క్లబ్‌ను ఏర్పాటుచేసి, రచయితలను ఆహ్వానిస్తూ.. పాఠకులతో ముచ్చటించే సదావకాశాన్ని కలిగిస్తున్నాయి. ఇందుకోసం వీరు స్టార్ హోటళ్లను, పెద్ద పెద్ద హాళ్లను ఎంచుకోకుండా ఆసక్తిగలవారు ఉండేచోటనే ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ఇందుకోసం కెఫేలు బుక్ చేసుకుంటూ నెల రోజుల ముందు నుంచే ఆ రచయితతో మాట్లాడుతూ ఫలానా తేదీన రచయితతో ఇంటరాక్షన్ ఉంటుందని తెలియజేయడం, ఆ తర్వాత పరస్పర భావాలు పంచుకోవడానికి వేదికగా నిలుస్తున్నారు.







యువ రచయితల సంఖ్య పెరుగుతోంది..

ఔత్సాహిక యువ రచయితలను ప్రోత్సహిస్తూ.. పాఠకులను, రచయితలను ఒకే వేదికపై చేర్చి ఓ గొప్ప సాహిత్య సంఘాన్ని నిర్మించాలన్నదే లక్ష్యం. ఇప్పటి వరకూ ఎందరో రచయితలతో ఈ ఇంటరాక్షన్ సెషన్స్ నిర్వహించాం. నగరంలో యువ రచయితల సంఖ్య పెరుగుతోంది. పాఠకులతో ముచ్చటించాలనుకునే రచయితలు ఇన్‌స్టా ద్వారా ఆఫ్‌లైన్ క్లబ్‌లోగానీ, ఆథర్ బ్యాంటర్ క్లబ్‌లోగానీ సంప్రదించవచ్చు.
- బిశ్వరూప్ బారిక, ఆఫ్‌లైన్ క్లబ్ వ్యవస్థాకురాలు



పాఠకులు ఉత్సాహంగా సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు

ఇటీవల యువ రచయిత చైతన్య ముంగందతో ఆయన రాసిన 'ప్రేమ కావ్యం' నవలపై క్లబ్‌లో ముచ్చటించాం. జూబ్లీహిల్స్‌లోని ఓ కెఫే దీనికి వేదికైంది. ఈ ప్రేమ కావ్యం ఓ మధ్య తరగతి జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. ఆశయాలు, బాధ్యతలు, సంబంధాలను సమతుల్యం చేస్తూ.. ఓ విద్యార్థి ప్రొఫెషనల్‌గా మారడాన్ని చిత్రీకరించింది. పాఠకులు ఎంతో ఉత్సాహంగా తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.
- మహ్మద్ నుస్రత్ ఖాద్రి

హిట్ సీక్రెట్.. సిటీ కాన్సర్ట్..

- అప్పుడు 'బుట్ట బొమ్మ', ఈసారి 'వైబుంది బేబీ'
- అమ్మ తెలుగమ్మాయి.. అందుకే తెలుగు ఇష్టం
- అక్టోబర్ 11న కార్డెక్స్ గ్రూప్ ఆధ్వర్యంలో లైవ్ కాన్సర్ట్
- 'సాక్షి'తో పాన్ ఇండియన్ సింగర్ అర్మాన్ మాలిక్



వైబుంది.. బేబీ వైబుందిలే.. అంటూ 'మిరాయ్'తో మరోసారి తెలుగు సంగీత ప్రియులను ఉర్రూతలూగించిన ప్రముఖ సింగర్ అర్మాన్ మాలిక్.. నగరంలోనూ ఏదో వైబుంది అంటూ హైదరాబాద్‌పై తన ప్రేమను వెలిబుచ్చారు. తన తల్లి తెలుగమ్మాయని అందుకే ముంబైతో పాటు హైదరాబాద్ కూడా తనకు హోమ్ టౌన్ అని తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. నగరంలోని గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్ వేదికగా అక్టోబర్ 11న తన తదుపరి లైవ్‌కాన్సర్ట్‌తో సందడి చేయనున్నారు. కార్డెక్స్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కాన్సర్ట్ పోస్టర్ రిలీజ్ కార్యక్రమాన్ని తన తల్లిదండ్రులతో కలిసి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'సాక్షి' అర్మాన్ ముచ్చటించారు. - సాక్షి, సిటీబ్యూరో



హైదరాబాద్ ఎప్పుడు వచ్చినా ఓ వైబ్ ఉంటుంది.. ఇక్కడి అభిమానుల ఆదరణ ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. లైవ్ కాన్సర్ట్ ఎప్పుడు పెట్టినా అది సూపర్ హిట్. కాన్సర్ట్ తర్వాత వచ్చే సినిమాలో నా సాంగ్స్ హిట్టవుతున్నాయి. కాకతాళీయమే అయినా.. ఓ బహుమతిలా అనిపిస్తుంది. నాకు తెలుగు అర్థం అవుతుంది. ఐ లవ్ తెలుగు. మా అమ్మది ఇక్కడే కాబట్టి భాషతో పాటు ఇక్కడి ప్రజలన్నా నాకు ఇష్టం. అందుకే మళ్లీ మళ్లీ రావాలనిపిస్తుంది. గతేడాది హైదరాబాద్ అంతా తిరిగేశా. చార్మినార్, ఫలక్‌నూమా ప్యాలెస్, ఓల్డ్ సిటీ బాగా నచ్చాయి. ఇక్కడి ఫుడ్ యమ్మీ. ఈసారి కాన్సర్ట్ గతంకంటే విభిన్నమైంది. ఇందులో నాకు నచ్చిన తెలుగు పాటలతో పాటు హిందీ, పాప్ ఇంగ్లిష్ పాటలతో ప్రదర్శన ఉంటుంది. మల్టిపుల్ జానర్స్‌తో ప్లాన్ చేశాం.

సినిమాలో ఎప్పడని అడుగుతున్నారు..

'మిరాయ్'లో వైబుంది పాటతో పాటు పడి పడి లేచే, నిన్నిలా.. వంటి హిట్ సాంగ్స్ పాడినప్పటికీ.. నా ఆల్ టైం ఫేవరెట్ 'బుట్ట బొమ్మ'.. అల్లు అర్జున్ డ్యాన్స్ అద్భుతం. మ్యూజిక్ డైరెక్టర్ తమన్ కంపోజింగ్ చాలా ఇష్టం. 'వైబుంది' పాట కన్నడ, హిందీలోనూ నేనే పాడాను. విభిన్న భాషల్లో నా కాన్సర్ట్ సమయంలో నా మైక్ నా అభిమానుల వైపు పెడతాను, మధ్య మధ్యలో వారు కొనసాగిస్తారు. సింగర్‌గానే కాకుండా అప్పుడప్పుడు టాలీవుడ్, బాలీవుడ్ నుంచి నేను సినిమాల్లో ఎప్పుడు నటిస్తాననే ప్రశ్న ఎదురవుతోంది. కథ నచ్చి అవకాశం వస్తే అది కూడా జరగొచ్చు. మా అమ్మకు, అమ్మమ్మకు కూడా నేను యాక్టర్ కావాలనే కోరికుంది. అలాంటి రోజు వస్తే మూడు భాషల్లోనూ విడుదలయ్యే సినిమా చేస్తా.

22 నుంచి నవకర్ నవరాత్రి ఉత్సవ్

జలవిహార్‌లో దాండియా వేడుకలు



ఖైరతాబాద్ : నెక్లెస్ రోడ్డులోని జలవిహార్ ప్రాంగణం దాండియా వేడుకలకు వేదిక కానుంది. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 1 వరకూ నవకర్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవ్–2025 సీజన్–8 పేరుతో దీనిని నిర్వహించనున్నారు. మానేపల్లి జ్యువెలర్స్, అన్విత సమర్పణలో జరిగే ఈ వేడుకలకు సంబంధించిన ఎంట్రీ పాస్ పోస్టర్‌ను బాలీవుడ్ గర్బా కొరియోగ్రాఫర్ జిగర్ సోనీ, ఆర్గనైజర్లు కవిత, సలోని జైన్‌తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా ప్రతి రోజూ గర్బా, దాండియా, సంగీతం, మహా ఆర్తి, లైవ్ ఢోలు, ఫుడ్ కోర్టులు, సెలబ్రిటీల కార్యక్రమాలు, ప్రత్యేక బహుమతులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కొరియోగ్రాఫర్ సోని ఆధ్వర్యంలో యువతకు గర్బా, దాండియా నృత్యంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన డీజే మ్యూజిక్, దాండియా నృత్యాలు అలరించాయి.

అలరించిన ఛాప్-2025

శిల్పారామంలో భరతనాట్యం, చేతివృత్తుల ప్రదర్శన

మాదాపూర్ : ఛాప్–2025 పేరుతో మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన చేతివృత్తుల ప్రదర్శన, భరతనాట్య ప్రదర్శన సందర్శకులను అలరించింది. ఆదివారం సెలవు కావడంతో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ఏర్పాటు చేసిన ఉత్పత్తులను కొనేందుకు సందర్శకులతో స్టాల్స్ కిటకిటలాడాయి. ప్రదర్శన ఈ నెల 17 వరకూ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఛాప్ ప్రదర్శనలో భాగంగా శ్రీనిరాయణీయ నాట్యాలయ గురువు సంతోష్ కుమార్ తమాంగ్ శిష్యబృందం ప్రదర్శించిన భరతనాట్యం అలరించింది. పుష్పాంజలి, షణ్ముఖ కౌతం, జతిస్వరం, శబ్దం, దేవీకీర్తనం, రామ భజన, కీర్తనం, కృతి, తిల్లాన, మంగళం వంటి అంశాలను కళాకారులు ఉర్విజ, సోమా, అవ్య, పార్వతి, యోహానా, హర్షిత రెడ్డి, రుచిత, శ్రీచందన, భవ్య, పద్మ ప్రదర్శించారు.



తాజ్ వేదికగా..

జ్యువెలరీ ప్రదర్శన..

20 వేల నూతన డిజైన్లతో అతిపెద్ద ఎగ్జిబిషన్

సాక్షి, సిటీబ్యూరో : బ్రైడల్, హాఫ్–శారీ జ్యువెలరీ వంటి 20 వేల నూతన డిజైన్లతో ప్రపంచంలోనే అతిపెద్ద జ్యువెలరీ ఎగ్జిబిషన్ నగరంలో ప్రారంభమైంది. తాజ్‌కృష్ణ వేదికగా ఈ సమకాలీన వజ్రాలు, జెమ్‌స్టోన్స్, పోల్కీ, టెంపుల్ జ్యువెలరీ కళాఖండాల ప్రదర్శనను ఆదివారం నుంచి నిర్వహిస్తున్నారు. ఓ ప్రముఖ జ్యువెలరీ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో 20వేలకు పైగా డిజైనరీ కలెక్షన్ ఆభరణాల ప్రియులను ఆకర్షిస్తున్నాయని, సూపర్ స్టార్ మహేష్, ఆయన కూతురు సితార బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించే ఈ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ కంకారియా మాట్లాడుతూ నగరంలో ప్రదర్శిస్తున్న అతిపెద్ద ఎగ్జిబిషన్ క్యూరేషన్, ఆభరణాల సేవలను ఆభరణాల ప్రియులకు మరింత చేరువ చేస్తుందని తెలిపారు.





మిల్లెట్స్‌తో.. ఆరోగ్యానికి మేలు..

మాదాపూర్ మినర్వా హాల్స్‌లో ప్రముఖ సినీనటి లయ

సాక్షి, సిటీబ్యూరో : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, ఆరోగ్యంపై ఇటీవల కాలంలో శ్రద్ధ పెరిగిందని, అందుకే ఆరోగ్యానికి మేలు చేసే మిల్లెట్స్‌పై దృష్టిపెట్టాలని, ఇవి ఆరోగ్యనికి మేలు చేస్తాయని ప్రముఖ సినీనటి లయ అన్నారు. నగరంలోని మాదాపూర్‌లో మినర్వా హాల్స్‌లో 'మిల్లెట్ మదర్స్' ఆదివారం ప్రారంభించారు. మిల్లెట్ నేషనల్ మీడియా పోర్టల్ ఆధ్వర్యంలో కార్పొరేట్ ఉద్యోగులకు పోషక విలువలతో కూడిన మిల్లెట్ లంచ్ బాక్సులు అందించేలా దీనిని రూపొందించారని తెలిపారు. 'హైదరాబాద్ మామ్స్ మీ కిచెన్‌ను ఆదాయ వనరుగా మార్చుకోండి' అనే థీమ్‌తో దీనిని రూపొందించారు. కార్పొరేట్ ఉద్యోగుల్లో పెరుగుతున్న అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల సమస్యను ఎదుర్కోడానికి దీనిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిల్లెట్స్ నేషనల్ మీడియా పోర్టల్ చైర్మన్ ప్రసన్న శ్రీనివాస్ సరకడం పాల్గొన్నారు.



క్లుప్తంగా...

దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం : సీఎం

ఇంజనీర్స్ డే సందర్భంగా సీఎం రేవంత్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: తమ మేధోశక్తితో మానవ మనుగడకు ఎన్నో ఫలాలను అందించిన ఘనత ఇంజనీర్లదేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజనీర్లందరికీ ముఖ్యమంత్రి ఇంజనీర్స్ డే సందర్భంగా ఆదివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రగతికి, ఆర్థికాభివృద్ధికి, బలమైన పునాదులు నిర్మించిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినమైన సెప్టెంబర్ 15ను ఆయన జ్ఞాపకార్థం ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నామన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరుగా, దార్శనికుడిగా, విద్యాప్రదాతగా, నిపుణుడిగా, పారిశ్రామిక ప్రగతి చోదకుడిగా ప్రత్యేకతను చాటారని కొనియాడారు. అత్యుత్తమ ఇంజనీరింగ్ సాంకేతికతతో వివిధ రంగాల్లో ఆయన చేసిన కృషి దేశ ఇంజనీరింగ్ రంగానికి ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. మూసీ వరదల నుంచి హైదరాబాద్ నగరాన్ని రక్షించేందుకు జల నియంత్రణ ప్రణాళికలు, ఎన్నో గొప్ప నిర్మాణాలు చేపట్టడంలో ప్రత్యేక చొరవ చూపించారన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు మోక్షగుండం విశ్వేశ్వరయ్యని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

పుష్పగిరిలో అరుదైన కాలభైరవుని కుడ్య శిల్పం



మైదుకూరు: వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రసిద్ధి చెందిన దక్షిణ కాశీ పుష్పగిరి క్షేత్రానికి సమీపంలో ఉన్న శివపాద ఆలయ ముఖ ద్వారంపై ద్వార పాలకుల కుడ్య శిల్పాల్లో కాలభైరవుడి శిల్పం లభించిందని, ఇది అరుదైన కుడ్య శిల్పమని రచయిత, ఔత్సాహిక చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆదివారం తెలిపారు. శివుని రూపాల్లో భయానక రూపం కాల భైరవుడని, అతడి వాహనం శునకమని, ఆయుధాలుగా త్రిశూలం, ఖడ్గం, కపాల, కొడవలి, వజ్ర, పాము, పినాక విల్లును సాధారణంగా కలిగి ఉంటాడని వివరించారు. మూడు కన్నులు కలిగి ఉండటం ఆ భైరవుని దివ్యత్వానికి నిదర్శనమని తెలిపారు. ఈ అరుదైన కుడ్య శిల్పంలో కుడివైపు పైచేతిలో పద్మాన్ని కలిగి ఉండటం ప్రత్యేకమని, కింది చేతిలో గద ధరించి, ఎడమ వైపు పైచేతిలో సర్పాన్ని, ఇంకొకటి కటి హస్తంతో ఉండటం విశేషమన్నారు. ఇప్పటి వరకు వెలుగు చూడని ద్వార పాలకుల శిల్పాలలో ఇది ప్రత్యేకమైనదన్నారు. ఈ శిల్పం 13వ శతాబ్దానికి చెందిందని ప్రముఖ స్థపతి, వాస్తు శిల్పి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి స్పష్టం చేశారని రచయిత తెలిపారు.

ఐదడుగుల మునక్కాయ



మునగ చెట్టుకు రెండు నుంచి మూడు అడుగుల పొడవు ఉండే మునక్కాయలు సాధారణం. అయితే వైఎస్సార్ కడప జిల్లా, కడపలో భాగ్యనగర్ కాలనీకి చెందిన వేణుగోపాల్ ఇంటి ఆవరణలో పెంచిన మునగచెట్టుకు మాత్రం ఏకంగా ఐదు అడుగుల మునక్కాయ ఉండటం అందరినీ ఆశ్చర్యపరిచింది.

- కడప అగ్రికల్చర్

'పచ్చ'దండులో భీకరపోరు

నువ్వా, నేనా సై!

కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు.. కాంట్రాక్టులు, పోస్టింగులు, సెటిల్‌మెంట్ల దందా

- తమ మాటే చెల్లుబాటు కావాలని ఎంపీల పట్టు
- మీ జోక్యం ఏమిటని మండిపడుతున్న ఎమ్మెల్యేలు
- విశాఖలో బాలకృష్ణ చిన్నల్లుడు భరత్ ఓవర్ డామినేషన్
- గాజువాకలో వేలు పెట్టడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా అసహనం
- విజయవాడలో చిన్నిదే అంతా

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బాబు గారి పీపీపీ..

బినామీలకే ప్రాపర్టీ

ప్రైవేట్ పరమయ్యే కాలేజీల్లో ఎన్‌ఆర్‌ఐ కోటా ఎంబీబీఎస్ సీటు ఏడాదికి రూ.57.50 లక్షలు

ముఖ్యమంత్రి ఆదేశాలతో యుద్ధ ప్రాతిపదికన అధికారుల ప్రతిపాదనలు

- ప్రస్తుతం కొత్త ప్రభుత్వ కళాశాలల్లో ఎన్‌ఆర్‌ఐ కోటా సీటు రూ.20 లక్షలే
- ఇకపై ఆ ఫీజును ఏకంగా రూ.37.50 లక్షలు అధికంగా పెంచేస్తున్న దుస్థితి..
- అటు ప్రైవేటు కళాశాలలో కంటే కూడా రూ.17.9 లక్షలు అధికం
- ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటుకు కట్టబెట్టడంలో చంద్రబాబు భారీ కుట్ర..
- కారుచౌకగా ప్రభుత్వాస్తులు కట్టబెట్టి భారీగా ఆదాయం గడించేలా స్కెచ్
- ప్రైవేటు కళాశాలల్లో అధిక ఫీజులు కట్టలేకే పలువురు విద్యార్థులు విదేశీ బాట
- కూటమి సర్కారు నిర్ణయంతో పీపీపీ కాలేజీల్లో ఆ స్థాయిని మించి ఫీజులు
- మధ్య తరగతి వర్గాలకు మేలు చేసే గత ప్రభుత్వ నిర్ణయానికి తూట్లు



వైఎస్ జగన్ హయాంలో నిర్మించిన పులివెందుల మెడికల్ కాలేజీ

సాక్షి, అమరావతి: చంద్రబాబు కూటమి ప్రభుత్వం పీపీపీకి ఇస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 15 శాతం ఎన్‌ఆర్‌ఐ కోటా ఎంబీబీఎస్ సీట్లలో ఒక్కో సీటుకు ఏడాదికి ఏకంగా రూ.57.50 లక్షల చొప్పున ఫీజు వసూలు చేసుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఇంత భారీగా ఫీజులు నిర్ణయించడం వెనుక రేపటి టెండర్లలో పోటీ పెంచి.. మీకింత–నాకింత పేరుతో భారీగా కమీషన్లు దండుకునే కుట్ర దాగి ఉందని వైద్య రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఈ సీట్లకు రూ.20 లక్షల చొప్పునే ఫీజు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ లెక్కన ఏకంగా ఒక్కో సీటుపై అదనంగా ఏటా రూ.37.50 లక్షలు పెంచడం అంటే దోపిడీ ఏ స్థాయిలో ఉండనుందో ఇట్టే స్పష్టమవుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వైద్య కళాశాలల్లో మెరుగైన నిర్వహణ కోసం గత వైఎస్ జగన్ ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ సీట్లకు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో కంటే తక్కువ ఫీజులను ఖరారు చేసింది. అయితే, అప్పట్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని ప్రస్తుత కూటమి పార్టీలు తీవ్రంగా తప్పు పట్టాయి. సెల్ఫ్ ఫైనాన్స్ విధానం ఒక నేరంగా చిత్రీకరించి టీడీపీ ఆందోళనలు చేసింది. ప్రస్తుత విద్యా శాఖ మంత్రి లోకేశ్ అయితే, తాము అధికారం చేపట్టిన వంద రోజుల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. తీరా గద్దెనెక్కాక ఆ విధానం రద్దు చేయకపోగా, ఏకంగా కళాశాలలనే ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టి.. విద్యార్థుల నుంచి ఇష్టారాజ్యంగా దోపిడీ చేసుకోండని వారికి లైసెన్స్‌లు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా వైఎస్ జగన్ తీసుకొచ్చిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 10 కళాశాలలను పీపీపీలో ప్రైవేట్‌కు కట్టబెట్టడానికి ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. రూ.కోట్ల విలువ చేసే ఈ కళాశాలల భూములను ఎకరం రూ.వందకే లీజుకు ఇవ్వడంతో పాటు, కళాశాలలు, బోధనాస్పత్రిపై 66 ఏళ్ల హక్కులు కల్పించడంతోపాటు వైద్య సేవలకు ఫీజులు వసూలు చేసేలా ప్రతిపాదనలు రూపొందించారు.

ప్రైవేట్ కళాశాల కంటే ఫీజు ఎక్కువ

ప్రైవేట్ కళాశాలల్లో ఎన్‌ఆర్‌ఐ కోటాకు రూ.39.60 లక్షల ఫీజు ఉంది. నీట్‌లో రాణించినప్పటికీ డిమాండ్‌కు తగ్గ ఎంబీబీఎస్ సీట్లు లేక ఏటా రాష్ట్రంలో వందల సంఖ్యలో విద్యార్థులు నష్టపోతున్నారు. దీంతో పిల్లలను ఎలాగైనా వైద్య విద్య చదివించాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు రూ.లక్షల్లో ఖర్చు పెట్టి విదేశాలకు పంపుతున్నారు. ఇలా వెళ్లే విద్యార్థులు విదేశాల్లో విద్యను అభ్యసించే సమయంలో, అనంతరం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తరహా సమస్యలకు చెక్ పెట్టడంతో పాటు, మధ్యతరగతి వారికి అందుబాటులో ఉండేలా ఎన్‌ఆర్‌ఐ కోటా ఫీజును కొత్త కళాశాలల్లో రూ.20 లక్షలుగా గత ప్రభుత్వం ఖరారు చేసింది.

- దీంతో అప్పటి వరకు ప్రైవేట్‌లో సంపన్న కుటుంబాలకే పరిమితం అయిన ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లు మధ్య తరగతి పిల్లలకు కూడా అందుబాటులోకి వచ్చినట్లైంది. అయితే ఇప్పుడు ఆ ఫీజును ఏకంగా మరో రూ.37.50 లక్షల మేర పెంచి మొత్తంగా రూ.57.50 లక్షలు చేసి.. పెట్టుబడిదారులకు భారీ లాభం చేకూర్చాలని ప్రభుత్వం చూస్తోంది.
- సర్కారు నిర్ణయం కారణంగా ప్రైవేట్ కళాశాలలతో పోల్చినా పీపీపీ కళాశాలల్లో ఎన్‌ఆర్‌ఐ కోటా ఫీజు రూ.17.9 లక్షలు అధికంగా ఉండటం గమనార్హం. ఇలా ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేట్ వైద్య కళాశాలల కంటే అధికంగా ఫీజులు వసూలు చేసుకునే హక్కులు ప్రైవేట్ వ్యక్తులకు కల్పిస్తూ పైకిమాత్రం పీపీపీతో విద్యార్థులకు ఎటువంటి నష్టం వాటిల్లదంటూ చంద్రబాబు మోసానికి పాల్పడుతున్నారు.

దండుకుందాం రండి.. మాకింత.. మీకింత!

సంపద సృష్టి హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ప్రజల సంపదను కొల్లగొట్టే పనిలో పడ్డారు. ప్రభుత్వాస్తులను కారు చౌకగా అస్మదీయులకు కట్టబెట్టడమే కాకుండా, తద్వారా వ్యాపారం చేసి వారిని మరింత సంపన్నులుగా తీర్చిదిద్దే కుట్రకు తెరలేపారు. ఇందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) కార్యక్రమాన్ని ఆయుధంగా మలుచుకున్నారు. దేశంలో మునుపెన్నడూ లేని విధంగా పీపీపీ పేరిట దోపిడీ కార్యక్రమాలకు తెరతీశారు. ఇందుకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణే కళ్లెదుట కనిపిస్తున్న సాక్ష్యం.

- ముఖ్యమంత్రి చంద్రబాబు ఒత్తిడి మేరకు పీపీపీ కోసం రూపొందించిన ప్రతిపాదనల్లో విస్తుపోయే విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఎన్‌ఆర్‌ఐ కోటా ఎంబీబీఎస్ సీటును ఏటా రూ.57.50 లక్షలకు పెంచడమే కాకుండా.. ఇక్కడ పెట్టుబడి పెడితే విద్యార్థుల నుంచి ఎంబీబీఎస్ ఇతర కోటా సీట్లు, పీజీ, నర్సింగ్ ఇతర వైద్య విద్యా కోర్సుల ఫీజులతో పాటు, ఆస్పత్రుల్లో వైద్య సేవలు, డయగ్నోస్టిక్స్, మందులకు చార్జీల రూపంలో మరింత ఆదాయం వస్తుందని వైద్య శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేయడం విస్తుగొలుపుతోంది.

విద్యార్థులపై భారం లేదంటూనే మోసం

- మెడికల్ కళాశాలలు పీపీపీ విధానంలో నిర్వహణవల్ల విద్యార్థులపై ఎటువంటి భారం ఉండదని చంద్రబాబు ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇవన్నీ బూటకపు ప్రకటనలేనని అధికారుల ప్రతిపాదనల ద్వారా తేటతెల్లం అవుతోంది.
- సాధారణంగా ఏ ప్రభుత్వమైనా పీపీపీ ప్రాజెక్టుల్లో అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు ఎక్కువ మేలు తలపెట్టేలా చూస్తుంది. కానీ, స్వతహాగా నయా పెత్తందారు అయిన చంద్రబాబు మాత్రం అస్మదీయులకు భారీ లబ్ధి చేకూరేలా రెడ్ కార్పెట్ వేస్తున్నారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కట్టబెట్టడమే కాక, వైద్య విద్య వ్యాపారం రూపంలో అస్మదీయులు భారీగా ఆర్జించడానికి మార్గం సుగమం చేస్తున్నారు.
- పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని సన్నాయి నొక్కులు నొక్కుతూనే కళాశాలల్లో ఎంబీబీఎస్ ఫీజు ఏడాదికి ఏకంగా రూ.అరకోటికి పైగా వసూలు చేసుకోవడానికి పేటెంట్ ఇచ్చేస్తున్నారు.

'పద్మావతి'కే ఫలహారం!

ఏపీలో ఏడు ప్రధాన దేవాలయాల క్లీనింగ్ పనులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సరఫరా టెండరు ఖరారు

ప్రభుత్వ పెద్ద బంధువు భాస్కరనాయుడు సంస్థ పద్మావతి హాస్పిటాలిటీకే కాంట్రాక్టు



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Revenue (Endowments) Department – Centralized e-Tendering – Selection of service provider - Facility Management Services (FMS) in Seven Major Devasthanams – Approval of Award of Contract to M/s Padmavathi Hospitality & Facilities Management Services, Tirupati for a period of two years – Orders – Issued.

REVENUE (VIGILANCE.VII) DEPARTMENT

G.O.RT.No. 1014 — Dated: 04-09-2025
Read the following:-

1. Sri Varaha Lakshmi Narasimha Swamy Devasthanam, Simhachalam, Visakhapatnam District.
2. Sri Veera Venkata Satyanarayana Swamy Temple, Annavaram, Kakinada District.
3. Sri Venkateswara Swamy Temple, Dwaraka Tirumala, Eluru District.
4. Sri Durga Malleswara Swamy Varla Devasthanam, Vijayawada, NTR District.
5. Sri Bhramaramba Mallikarjuna Swamy Varl Devasthanam, Srisailam, Nandyal District.
6. Sri Kalahasteeswara Swamy Devasthanam, Srikalahasti, Tirupati District.
7. Swayambhu Sri Varasiddhi Vinayaka Swamy Devasthanam, Kanipakam, Chittoor District.

ఏడు ఆలయాల్లో పనుల కాంట్రాక్ట్‌ను పద్మావతి సంస్థకు అప్పగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: అనుకున్నంతా అయింది.. చేయాలనుకున్నది నిస్సిగ్గుగా చేసేశారు. ఏపీ దేవదాయ శాఖ ఆదాయాన్ని కొల్లగొట్టేందుకు రూట్ క్లియర్ చేసుకున్నారు. ఈ శాఖ పరిధిలో రాష్ట్రంలో అధిక ఆదాయం వచ్చే ఏడు ప్రధాన ఆలయాల్లో క్లీనింగ్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల నిర్వహణ.. వాటికి సంబంధించి ఔట్ సోర్సింగ్ సిబ్బంది సరఫరా కాంట్రాక్టును ప్రభుత్వ 'పెద్ద'లకు బాగా కావాల్సిన వారి సంస్థ పద్మావతి హాస్పిటాలిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ సంస్థకే కట్టబెట్టేశారు. ఇందుకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్–జులై మధ్య జరిగిన టెండర్లకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీచేసేసింది. ఈ టెండరు దక్కించుకున్న సంస్థ యజమానిగా భావిస్తున్న కనుమూరి భాస్కరనాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బంధువు, సన్నిహితుడు అన్న ప్రచారం ఉంది.

ఫిర్యాదులున్నా అదే సంస్థకు..

నిజానికి.. విజయవాడ దుర్గగుడి, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం.. ఈ ఏడు ప్రధాన ఆలయాల్లో 2015కు ముందు ఏ ఆలయానికి ఆ ఆలయం వేర్వేరుగా టెండర్లు నిర్వహించి ప్రతీ ఆలయంలో ఒక్కో సంస్థ పనులు నిర్వహించే పరిస్థితి ఉండేది. కానీ, గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2015–19 మధ్య ఈ ఏడు ప్రధాన ఆలయాల్లో ఉమ్మడి టెండర్ల విధానాన్ని అమలుచేశారు. అప్పట్లో ఆ పనుల కాంట్రాక్టును ఇదే పద్మావతి సంస్థ దక్కించుకుంది. ఆయా గుళ్లలో క్లీనింగ్ పనులు చేసిన వారికి నిబంధనల ప్రకారం పీఎఫ్ వంటివి సరిగా చెల్లించలేదని, గుళ్లలో చేయాల్సిన క్లీనింగ్ పనులను కూడా సరిగ్గా చేయకుండా బిల్లులు మాత్రం దండుకున్నారని అప్పట్లో ఈ సంస్థపై పెద్దఎత్తున ఫిర్యాదులొచ్చాయి. విషయం కోర్టులకు కూడా వెళ్లడంతో 2020 తర్వాత అప్పటి సీఎం వైఎస్ జగన్ తిరిగి ఏ ఆలయానికి ఆ ఆలయం టెండర్లు నిర్వహించే విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టారు. అనంతరం.. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాలతో 2024లో తిరిగి చంద్రబాబు ప్రభుత్వం రావడంతో భాస్కరనాయుడు చక్రం తిప్పారు. నిబంధనలు మార్చి ఆయా పనులకు మళ్లీ ఉమ్మడిగా టెండర్లు నిర్వహించేలా పైరవీలు చేశారు. ఈ టెండర్ల ప్రక్రియలో కేవలం రెండంటే రెండు సంస్థలు మాత్రమే పోటీపడ్డాయి. ఇందులో భాస్కరనాయుడుకి చెందిన పద్మావతి హాస్పిటాలిటీస్ సంస్థ ఎల్–1గా నిలిచింది.

నిబంధనలు అనుకూలంగా లేవని..

ఈ ఏడు దేవాలయాలకు కలిపి ఉమ్మడిగా ఒకే టెండరు ద్వారా కాంట్రాక్టరును ఎంపిక చేసేందుకు గత మే నెలలో దేవదాయ శాఖ తొలిసారి టెండర్లు ఆహ్వానించింది. అందులో నిబంధనలు అనుకూలంగాలేవన్న సాకుతో ఆ టెండరును రద్దుచేసేశారు. మళ్లీ నిబంధనలు మార్చి జూన్‌లో టెండర్లు పిలిచారు. పద్మావతి హాస్పిటాలిటీస్ సంస్థకు ప్రయోజనం చేకూర్చేందుకే ఇలా నిబంధనలు మార్చి తిరిగి టెండరు పిలిచారన్న ఆరోపణలు అప్పుడే వెల్లువెత్తాయి.

రెండేళ్లలో అదనంగా రూ.25 కోట్లు చెల్లింపు..

ప్రస్తుతం అన్ని ప్రధాన ఆలయాల్లో ఎలక్ట్రికల్ తదితర పనులు చేపట్టేందుకు ప్రత్యేక సిబ్బంది ఉన్నప్పటికీ, ఆయా పనుల నిర్వహణకు శానిటేషన్ పనులతో కలిపి ఉమ్మడిగా టెండరు పిలిచారు. ఏడు ఆలయాల్లో ఆయా పనులకు సామగ్రి, యంత్రాలకు దేవదాయ శాఖ నెలకు రూ.70 లక్షల చొప్పున నిర్ధారించగా.. టెండరు దక్కించుకున్న 'పద్మావతి' సంస్థ రూ.76.66 లక్షలు కోట్ చేసింది. వాస్తవానికి.. ఈ పనులు చేసేందుకు సింహచలం ఆలయంలో 120 మంది, అన్నవరంలో 413 మంది, ద్వారకా తిరుమలలో 212 మంది, విజయవాడ దుర్గగుడిలో 215 మంది, శ్రీకాళహస్తిలో 249 మంది, కాణిపాకంలో 190 మంది, శ్రీశైలంలో 641 మంది కలిపి మొత్తం 2,040 మంది సిబ్బంది ఉన్నారు. అలాగే, స్కావెంజర్ తదితర పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లతో కలిపి రూ.15వేల చొప్పున.. సూపర్‌వైజరుకు రూ.25,508 చొప్పున.. ఎలక్ట్రీషియన్ వంటి టెక్నికల్ సిబ్బందికి రూ.20,731 చొప్పున ప్రభుత్వం టెండరు నిర్ధారించగా.. పద్మావతి హాస్పిటాలిటీ సంస్థ ఆ వేతనాల మొత్తాలకు అదనంగా 4.95 శాతం చెల్లించాలని కోట్ చేసింది. దీంతో.. ఈ ఏడు ప్రధాన ఆలయాల్లో ఆయా పనులకు రెండేళ్ల కాలానికి దాదాపు రూ.100 కోట్ల మేర ఆయా ఆలయాలు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పుడు టెండరు దక్కించుకున్న సంస్థకు అదనంగా దాదాపు రూ.25 కోట్లు చెల్లించాల్సి వస్తుందని దేవదాయ శాఖ వర్గాలు తెలిపాయి.

మీడియా ముందుకు రావొద్దు!

- పార్టీలో అంతర్గత విభేదాలపై నేతలకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ హెచ్చరిక
- స్థానిక ఎన్నికల వేళ విభేదాలకు దూరంగా ఉండాలని పార్టీ నేతలకు హితవు
- పీసీసీ చీఫ్, సీఎంకు వరంగల్ విభేదాలపై కమిటీ నివేదిక
- కేటీఆర్ తాను తీసుకున్న గోతిలో తానే పద్దాడన్న కమిటీ చైర్మన్ మల్లురవి



పీసీసీ క్రమశిక్షణ కమిటీ భేటీలో చర్చిస్తున్న కమిటీ చైర్మన్ మల్లు రవి, సభ్యులు అనంతుల, కమలాకర్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థలకు ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ పిలుపునిచ్చింది. విభేదాలకు దూరంగా ఉండాలని హితవు పలికింది. అంతర్గత విభేదాల పేరుతో ఎవరైనా మీడియా ముందుకొచ్చి మాట్లాడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. కమిటీ చైర్మన్, ఎంపీ మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదివారం గాంధీభవన్‌లో సమావేశమైంది. కమిటీ సభ్యులు అనంతుల శ్యామ్‌మోహన్, కమలాకర్‌రావు తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై కమిటీ చర్చించింది. వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి సురేఖ, పార్టీ నేతలు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలపై రూపొందించిన నివేదికను.. సీఎం రేవంత్‌తోపాటు, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అందజేయాలని కమిటీ నిర్ణయించింది. ఈ అంశంపై నిర్ణయం తీసుకునే అధికారం వారికే ఇవ్వాలని తీర్మానించింది. సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణపై ఫిర్యాదు రావడంతో ఆయన వివరణ కోరింది.

కమిటీ ముందుకు నర్సారెడ్డి

సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డి క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై తనపై వచ్చిన ఫిర్యాదుల గురించి వివరణ ఇచ్చారు. అనంతరం నర్సారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తనపై నమోదైన పోలీస్ కేసు గురించి కమిటీ వివరణ అడిగిందని చెప్పారు. తనపై ఫిర్యాదు చేసిన నాయకులు పార్టీకి సేవ చేసిన వారు కాదని, బీజేపీకి పనిచేసిన వారని చెప్పారు. అలాంటి వారు ఆరోపణలు చేస్తే కమిటీ తనను వివరణ ఎందుకు అడిగిందో అర్థం కావడం లేదన్నారు. గజ్వేల్‌తో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావుకు సంబంధం లేదన్నారు.

రాజగోపాల్‌రెడ్డి అంశం మా దృష్టికి రాలేదు: చైర్మన్ మల్లురవి

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురించి తాము చర్చించలేదని మల్లురవి చెప్పారు. కమిటీ భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరి ప్రయోజనాల కోసమో క్రమశిక్షణ కమిటీలో చర్చ జరగదన్నారు. రాజగోపాల్‌రెడ్డి అంశం తమ దృష్టికి రాలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే అది క్రమశిక్షణ కమిటీకి వస్తుందని చెప్పారు. కాంగ్రెస్ నుంచి బయటకెళ్లిన వారంతా మళ్లీ పార్టీ గూటికి రావాలని కోరారు. పార్టీలో అంతర్గత విభేదాల పేరుతో రచ్చకెక్కితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మాజీ మంత్రి కేటీఆర్ తాను తవ్వుకున్న గోతిలో తానే పడ్డాడని ఎద్దేవా చేశారు. గత పదేళ్లలో ఆయన ఏం చేశారో ఒక్కసారి చూసుకుని తమను ప్రశ్నించాలన్నారు. పదేళ్లలో ఎంతో మందిని చేర్చుకున్న ఆయన కూడా రాజీనామాలు చేయించారా అని ప్రశ్నించారు. అసలు ఆ ఎమ్మెల్యేలు తాము పార్టీనే మారలేదని చెపుతుంటే కేటీఆర్‌కు వచ్చిన ఇబ్బందేంటో అర్థం కావడం లేదన్నారు.



మాజీ సీఎం బూర్గుల రామకృష్ణారావు వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి పొన్నం, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులు

బూర్గులకు కాంగ్రెస్ ఘన నివాళి

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీ ఘనంగా నివాళులర్పించింది. బూర్గుల వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి గాంధీభవన్‌లో పూలమాలలు వేసి.. రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, కాంగ్రెస్ నేతలు అనంతుల శ్యాంమోహన్, కమలాకర్‌రావు, టి.నర్సారెడ్డి, బండి సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి పోషణ మాసోత్సవాలు

- చిన్నారులు, మహిళల్లో పోషకాహార చైతన్యమే లక్ష్యం
- నెల రోజులపాటు కార్యక్రమాలు
- శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. చిన్నారులు, మహిళల ఆరోగ్యం, పోషకాహారాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేలా అంగన్వాడీ సిబ్బందితో.. ప్రతి ఇంటికీ పోషణ సందేశం చేరవేసేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఈమేరకు రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులకు మంత్రి సీతక్క లేఖలు రాశారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి ఐసీడీఎస్ ప్రాజెక్టుకు రూ.30 వేలు, ప్రతి జిల్లాకు రూ.50 వేలు చొప్పున విడుదల చేశామన్నారు. ఈ నిధులతో గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పోషణపై చైతన్య కార్యక్రమాలు, అవగాహన శిబిరాలు, ఆరోగ్య పరీక్షల క్యాంపులు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించడం, చక్కెర, ఉప్పు, నూనె వాడకంపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 'వోకల్ ఫర్ లోకల్' నినాదంతో గ్రామీణ స్థాయిలో ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించి.. ఆత్మనిర్భరతను పెంచే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఆదివారం హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ప్రాంగణంలో ఉన్న బూర్గుల రామకృష్ణారావు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తదితరులు

ఏఐతో రోజుకు 55 నిమిషాలు ఆదా



మీటింగ్స్, ఈ-మెయిల్స్, ఫైళ్ల నిర్వహణను సులభతరం చేస్తున్న ఏఐ టూల్స్

- ఏఐతో పని సులువైందంటున్న 86 శాతం మంది ఉద్యోగులు
- కార్యాలయాల్లో ఏఐ వినియోగంతో జెన్‌జెడ్ స్పీడ్
- పాతతరం వారికి నూతన టెక్నాలజీ వినియోగాన్ని నేర్పుతున్న జెన్‌జెడ్
- ఇంటర్నేషనల్ వర్క్‌ప్లేస్ గ్రూపు సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అందిపుచ్చుకుని వేగంగా పనులు పూర్తిచేయడంలో జెనరేషన్ జెడ్ (జెన్‌జెడ్–1997–2012 మధ్య జన్మించినవారు) దూసుకుపోతోంది. కేవలం ఏఐను వినియోగించుకోవడమే కాకుండా దీన్ని ఏ విధంగా వాడుకోవాలన్నదానిపై పాతతరం ఉద్యోగులకు నేర్పించడంలో కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయాలు ఇంటర్నేషనల్ వర్క్‌ప్లేస్ గ్రూపు తాజాగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. సమావేశాలకు సిద్ధం కావడం, ఈ–మెయిల్స్ పంపడం, ఫైళ్ల నిర్వహణ.. ఇలా రోజువారి ఆఫీసు కార్యాకలాపాల్లో ఏఐ టూల్స్‌ను జెన్‌జెడ్ వినియోగిస్తోంది. దీంతో సగటున రోజుకు 55 నిమిషాల సమయం ఆదా అవుతున్నట్లు సర్వే వెల్లడించింది. ఈ టూల్స్ వల్ల వారు ఒకసారి చేసిన పనిని తిరిగి చేయాల్సిన అవసరం లేకుండా కొత్త కార్యకలాపాలపై దృష్టిసారించడానికి వీలుకలుగుతోందని తేలింది. అమెరికా, బ్రిటన్‌లలో రెండువేల మంది ఉద్యోగులపై నిర్వహించిన ఈసర్వేలో 86 శాతం మంది ఉద్యోగులు ఏఐతో చాలా ప్రయోజనం పొందుతున్నట్లు తెలిపారు. అంతేకాదు 76 శాతం మంది తమ పదోన్నతుల్లో ఏఐ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. అదే జెన్‌జెడ్‌లో అయితే 87 శాతం మంది పదోన్నతులు పొందడంలో ఏఐ కీలకపాత్ర పోషించిందని తెలిపారు.

ఏఐ వినియోగం తప్పనిసరి

రానున్న కాలంలో పనిచేసేచోట ఏఐ వినియోగం తప్పనిసరి కానుందని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. దీనికి అనుగుణంగా వ్యాపారసంస్థలు తమ విభాగాల్లో జెన్‌జెడ్‌ను ప్రోత్సహిస్తూ పాతతరం వారికి కొత్త టూల్స్‌పై అవగాహన కల్పించే విధంగా శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ విధంగా హైబ్రీడ్ టీమ్స్‌ను ఏర్పాటు చేసుకుని ముందుకెళ్తున్నట్లు సర్వే వెల్లడించింది. ఏఐ టూల్స్ ద్వారా కొత్త వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని 82 శాతం మంది పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ వర్క్‌ప్లేస్ గ్రూపు సీఈవో మార్క్ డిక్సన్ మాట్లాడుతూ రోజువారి దైనందిన కార్యకలపాల్లో ఏఐ వినియోగం అన్నది తప్పనిసరి అవుతోందని, దీంతో వీటిని వినియోగించే జెన్‌జెడ్ యువతకు అవకాశాలు మరింత పెరుగుతున్నాయని చెప్పారు. పాతతరం కొత్తతరం కలిసి పనిచేయడం ద్వారా అధిక ఉత్పత్తిని పెంచవచ్చని 82 శాతం మంది అభిప్రాయపడినట్లు తెలిపారు. కొత్తతరం డిజిటల్ వినియోగిస్తుంటే దీనికి సీనియర్ ఉద్యోగుల వృత్తి అనుభవాన్ని జోడించడం ద్వారా మెరుగైన ఫలితాలను పొందుతున్నట్లు చెప్పారు. కంపెనీలు తమ లాభాలను పెంచుకోవడానికి జెన్‌జెడ్‌తో కలిసి సీనియర్లు పనిచేసే విధంగా పనిసంస్కృతిని పెంచుకుంటున్నట్లు డిక్సన్ తెలిపారు.



పుస్తకం పఠనం వల్ల దీర్ఘాయుష్షు కలుగుతుందంటున్నారు యేల్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు. 50 సంవత్సరాలకు పైబడ్డ 3,635 మంది వ్యక్తుల జీవన విధానంపై 12 సంవత్సరాల పాటు అధ్యయనం చేయగా పుస్తకాలు చదవని వారి కంటే పుస్తకాలు చదివే వారు 23 నెలలు ఎక్కువ కాలం జీవించారని తేలింది..

మంచిమాట

ఓర్పు తుఫానులోనూ చెదరని ప్రశాంతత



మన జీవితంలో సవాళ్లు మనల్ని ముంచెత్తే తుఫానులా వస్తాయి. ఆ అలల తాకిడికి మన మనసు అలజడి చెందుతుంది. కానీ, ఆ తుఫాను మధ్యలో నిశ్చలంగా నిలబడిన కొండలా మనల్ని నిలబెట్టేదే ఓర్పు. బయటి ప్రపంచం ఎంత అల్లకల్లోలంగా ఉన్నా, మన అంతరంగంలో తుఫానులోనూ చెదరని ప్రశాంతతను నింపుకునే శక్తి ఇది. ఓర్పు కేవలం నిరీక్షించడం కాదు, అది ఆత్మ బలానికి అసలైన నిర్వచనం.

ఓర్పు అనేది మనసును నియంత్రించే ఒక శక్తి. సనాతన ధర్మంలో ఇది ఒక అత్యున్నత విలువగా పరిగణించబడింది. భగవద్గీతలో శ్రీ కృష్ణుడు కష్టాలను, సుఖాలను సమంగా చూడమని అర్జునుడికి ఉపదేశిస్తాడు. అదే నిజమైన జ్ఞానానికి, స్థిరత్వానికి పునాది అని వివరిస్తాడు.

క్షమా వీరస్య భూషణం
శక్తిమతాం క్షమా శ్రేయః

ఓర్పు అనేది వీరులకు ఆభరణం. శక్తిమంతులకు ఓర్పు ఒక గొప్ప ధర్మం. ఈ సూక్తి ఓర్పును బలహీనతగా కాకుండా, అత్యంత ఉన్నతమైన ధైర్యంగా, శక్తిగా గుర్తిస్తుంది. నిజమైన బలం శారీరక శక్తిలో కాదు, ప్రతికూల పరిస్థితుల్లో కూడా శాంతంగా, స్థిరంగా ఉండగల మానసిక శక్తిలో ఉందని ఇది నొక్కి చెబుతుంది.

శనైర్గచ్ఛన్ శనైర్గచ్ఛన్ పంథాః
సంపూర్ణో భవతి

నెమ్మదిగా, ఓర్పుతో అడుగులు వేసేవాడు దారిని పూర్తిగా చేరుకుంటాడు. అంటే, ఓర్పుతో, నిలకడగా కృషి చేసేవారు ఖచ్చితంగా తమ గమ్యాన్ని చేరుకుంటారు. ఇది ఆధునిక జీవితంలో కూడా అంతే సత్యం. పరీక్షల్లో విజయం సాధించడానికి రోజూ కొంతసేపు చదవాలి, ఒక్క రోజులో కాదు. ఒక వ్యాపారం విజయవంతం కావడానికి ఎన్నో ఏళ్ల నిరంతర కృషి, ఓర్పు అవసరం. ఓర్పు అనేది మన లక్ష్యంపై మనకున్న నమ్మకాన్ని, నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

క్షమా బలం అశక్తానాం,
శక్తానాం భూషణం క్షమా

ఓర్పు అనేది బలహీనులకు బలం, శక్తిమంతులకు ఆభరణం. ఓర్పును అలవరచుకోవడం ద్వారా బలహీనులు కూడా శక్తివంతులుగా మారగలరు. అది ఒక శక్తిమంతుని కీర్తిని, గౌరవాన్ని పెంచుతుంది. ఈ సూక్తి ఓర్పు సార్వత్రిక శక్తిని, అది అందరికీ ఎలా ప్రయోజనకరంగా ఉంటుందో స్పష్టం చేస్తుంది.


ఓర్పు అనేది కేవలం నిరీక్షించడం కాదు, అది జీవితాన్ని అర్థవంతంగా, ప్రశాంతంగా జీవించే ఒక గొప్ప కళ. ఓర్పును అలవరచుకోవడం ద్వారా మనం అనవసరమైన ఆందోళనల నుండి విముక్తి పొందవచ్చు, ప్రశాంతంగా ఆలోచించి సరైన నిర్ణయాలు తీసుకోవచ్చు. కష్టాల పర్వతాలను చిన్న మెట్లుగా మార్చగల శక్తి ఓర్పుకు మాత్రమే ఉంది. ఓర్పు అనే బలం మనకు జీవితంలో ఎలాంటి తుఫానులనైనా ఎదుర్కొనే ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ఈ గొప్ప గుణాన్ని మన జీవితంలో నిత్యం సాధన చేయడం ద్వారా విజయం, ప్రశాంతత, ఆనందం తప్పక లభిస్తాయి.

– కె. భాస్కర్ గుప్తా
(వ్యక్తిత్వ వికాస నిపుణులు)

భారతంలో సత్యవంతుడి భార్య సావిత్రి, తన భర్త జీవితం ముగిసే రోజున యమధర్మరాజు వెంట వెళ్లి, తన పట్టుదల, వాదన, అపారమైన ఓర్పుతో తన భర్త ప్రాణాలను తిరిగి తెచ్చుకుంది. ఈ కథ ఓర్పు దృఢ సంకల్పానికి ఉండే అద్భుత శక్తికి నిదర్శనం. అలాగే, హరిశ్చంద్రుడు తన సర్వస్వాన్ని కోల్పోయినా, చివరి క్షణం వరకు సత్యానికే కట్టుబడి ఉన్నాడు. ఆయన సత్యనిష్ఠకు, ఓర్పుకు అంతర్జాతీయంగా ప్రసిద్ధి.

ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్ విద్యుత్ బల్బును కనిపెట్టే క్రమంలో వేలసార్లు విఫలమయ్యారు. ప్రతి వైఫల్యం తర్వాత, ఆయన 'ఈసారి పని చేయని ఇంకో మార్గాన్ని కనుగొన్నాను' అని ఓర్పుతో, పట్టుదలతో కృషి చేశారు. ఆయన ఓర్పు కారణంగానే ప్రపంచం చీకటి నుంచి వెలుగులోకి వచ్చింది. అలాగే, మహాత్మాగాంధీ తన జీవితంలో ఎదురైన ఎన్నో అవమానాలను, కఠిన పరిస్థితులను ఓర్పుతో ఎదుర్కొని, అహింసను, సత్యాగ్రహాన్ని తన ఆయుధాలుగా మలచుకున్నారు. ఆయన ఓర్పు, శాంతం, అకుంఠిత విశ్వాసంతో ప్రపంచంలోనే అతిపెద్ద బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఓడించి, భారతదేశానికి స్వాతంత్య్రం సాధించారు. ఇది ఓర్పుకు, దాని శక్తికి ఉన్నతమైన ఉదాహరణ.

ఈ పక్షం.. పితృపక్షం



ఈ ఏడాది పితృ పక్షాలు గ్రహణంతో ప్రారంభం అయ్యాయి. తిరిగి గ్రహణంతోనే ముగియనున్నాయి. అంటే.. సెప్టెంబర్ 7వ తేదీ చంద్రగ్రహణంతో ప్రారంభమై.. సెప్టెంబర్ 21, ఆదివారం, అమావాస్య నాడు సంభవించబోయే సూర్య గ్రహణం రోజున ముగియనున్నాయి.

సుమారు 100 ఏళ్ల తర్వాత ఈ ఘటన చోటు చేసుకుంటున్నట్లు పండితులు, పెద్దలు చెబుతున్నారు. వివేకవంతులు ఈ రోజులను సద్వినియోగం చేసుకుంటారు. అదెలా గంటే...

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం.. పితృ దోషాల వల్ల అనేక రకాల సమస్యలు కలిగే అవకాశం ఉంది. ముఖ్యంగా చేపట్టిన పనులలో పదే పదే ఆటంకాలు కలగడం, కీర్తి, గౌరవ ప్రతిష్ఠలకు భంగం వాటిల్లడం, కుటుంబంలో స్త్రీకి చిన్న వయసులోనే వైధవ్యం ప్రాప్తించడం, ఎవరో ఒకరికి మానసిక స్థితి సరిగా లేకుండా ఉండటం, అన్నిటికంటే ముఖ్యంగా సంతాన భాగ్యం లేకపోవడం, ఒకవేళ సంతానం కలిగినా ఆ పుట్టిన సంతానం జీవించకపోవడం వంటి సమస్యలు సంభవించే అవకాశం ఉంది. ఇవన్నీ పితృ శాపాల వల్ల లేదా పితృదేవతలు అసంతృప్తికి గురవడం వల్ల కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. అందువల్ల పితృ పక్షాల సమయం పూర్వీకుల ఆశీస్సుల కోసం అలాగే పితృదేవతలను సంతృప్తి పరిచేందుకు అనుకూలమైన సమయం. అలాగే.. మహాలయ పక్షంలో ఆచరించే శ్రాద్ధ కర్మలు, దానాలు, పుణ్య కార్యాల వల్ల సంతానం లేని వారికి సంతానం కలిగి, వంశాభివృద్ధి అవుతుంది. పితృదోషాల వల్ల జీవితంలో ఎదురయ్యే సమస్యలు, అడ్డంకులు, ఆటంకాలు తొలగిపోతాయని పెద్దలు చెబుతారు. .

పితృపక్షంలో రోజూ సాయంత్రం పితృదేవతా నిలయమైన నైరుతి మూలన దీపం వెలిగించడం ద్వారా శుభ ఫలితాలు ఉంటాయని, అలాగే.. పితృదేవతలను స్మరించుకుంటూ వారి కోసం ధ్యానం చేస్తే ఆ ఇంట్లో సుఖ శాంతులు కలుగుతాయని కూడా బలమైన నమ్మకం.

అలాగే.. పితృదేవతలకు రోజూ అపరాహ్న వేళ అంటే మధ్యాహ్నం 12 గంటల సమయంలో జల తర్పణాలు వదలాలి. ఒకవేళ జల తర్పణాలు 15 రోజులు వదలడం వీలు కాని వాళ్లు మహాలయ అమావాస్య రోజునైనా తర్పణం వదలాలి. కాకులకు, జంతువులకు ఆహారం పెట్టాలి. పేదవారికి అన్నదానం, వస్త్ర దానం చేయడం, పండితులకు, గురువులకు భోజనం పెట్టి తాంబూలం ఇవ్వడం వంటివి మంచి ఫలితాలను ఇస్తాయి.

పితృ పక్షం సమయంలో ఇంట్లో పూజలు, హోమాలు ఆచరించడం పుణ్యప్రదం. పితృపక్షంలో ఇప్పటికే వారం రోజులకు పైగా గడిచిపోయింది. ఇంకా వారం కూడా పూర్తిగా లేదు. అందువల్ల చివరి రోజైన మహాలయ అమావాస్య వరకు వాయిదా వేయకుండా వీలయినప్పుడల్లా పేదలకు అన్నదానం చేయడం మంచిది. ఇక మహాలయ అమావాస్య రోజున తర్పణాలు వదిలే కార్యక్రమం పూర్తి చేశాక.. దసరా శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాక మాత్రమే తిరిగి శుభకార్యాలు ప్రారంభించాలి.

– డి.వి.ఆర్.

తాత్త్వికథ

బొమ్మలాట



ఒక ఊర్లో ఓ మోతుబరి రైతు ఉండేవాడు. బాగా సంపాదించిన అతడికి వయసుపైబడింది.

వృద్ధాప్యం సమీపించే కొద్దీ అతడిలో ప్రాణ భయం పట్టుకుంది. ఒక రోజు పొలం పనుల మీద పక్క ఊరికెళ్ళాడు. చిన్నగా మొదలైన వాన చినుకులు కొద్దిసేపటికే పెద్ద వర్షంగా మారింది. అటూ ఇటూ చూశాడు. దూరంగా పెద్ద మర్రిచెట్టు కనిపించింది. గబగబా నడుచుకుంటూ వెళ్ళి చెట్టుకింద నిలబడ్డాడు. ఆ మర్రి చెట్టు కింద మట్టితో బొమ్మలు తయారు చేసే కుమ్మరి ఉన్నాడు. రకరకాల అందమైన బొమ్మలు తయారు చేసి అమ్మకానికి పెట్టి ఉన్నాడు.

ఇంతలో వాన ఉధృతమయ్యింది.

వానకి మట్టి బొమ్మలు కొన్ని చిన్నచిన్నగా కరిగిపోసాగాయి.దాన్ని కళ్ళారా చూసిన రైతు, ఆ కుమ్మరి దగ్గరకు వెళ్ళి "నీకు బాధగా లేదా?" అని అడిగాడు.

"బాధగా లేదు. ఇది సహజం!" అని బదులిచ్చాడు కుమ్మరి.

"ఎందుకు బాధ లేదని చెబుతున్నావు? నీకు నష్టం జరుగుతోంది కదా" అని మళ్ళీ ప్రశ్నించాడు రైతు."ఈ మట్టి బొమ్మలు ఆకాశంలో నుంచి ఊడి పడలేదు. అవి మట్టితో తయారు చేసినవి.

మట్టినుంచి వచ్చినవి మట్టిలోకే కదా పోతాయి. దానికెందుకు బాధపడాలి. నాకు దేవుడిచ్చిన శరీరం ఉంది. మరింత కష్టపడి మరిన్ని బొమ్మలు తయారు చేయగలను, ఈ జానెడు పొట్ట నింపుకోగలను.


నిజంగా ఈ మట్టిబొమ్మల మీద నాకు ఏ హక్కూ లేదు. కారణమేమిటంటే అవి ప్రకృతిలో ఉచితంగా దొరికిన మట్టితో తయారు చేయబడినవి. అది ప్రకృతి నాకిచ్చిన అవకాశం.

ఈ మట్టిని బొమ్మలుగా మార్చి నా పొట్ట గడుపుకుంటున్నానని ప్రతి క్షణం గుర్తు తెచ్చుకుంటాను. అందుకే నేను లాభాలకు పొంగిపోను, నష్టాలకు క్రుంగి పోను. నిజం చెప్పాలంటే ఈ కరిగిపోతున్న మట్టిని చూస్తూ ఉంటే నాకు చాలా ఆనందంగా ఉంది. ఎందుకంటే అవి పుట్టింటికి వెళ్తున్నాయన్న స్పృహ నాకుంది" అని బదులిచ్చాడు.

కుమ్మరి చెప్పిన జీవిత సత్యం విని రైతు ఆశ్చర్యపోయాడు. అదే విషయాన్ని తనకి అన్వయించుకున్నాడు. 'మన జీవితం కూడా మూన్నాళ్ళ ముచ్చటే కదా. దేవుడు ఆడించే బొమ్మలాటే కదా. ఎక్కడినుంచి వచ్చామో, అక్కడికి వెళ్ళడం ఎవ్వరికైనా తప్పదు కదా' అని గుర్తు తెచ్చుకున్నాడు. ఇంతలో వాన నిలవడంతో అక్కడినుంచి కదిలాడు రైతు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా


● మహేశ్‌బాబు


● ప్రభాస్


● ఎన్టీఆర్


● అల్లు అర్జున్

ఫారిన్ పోదాం చలో... చలో

సూట్‌కేసులు సర్దుకుని మరికొన్ని రోజుల్లో ఫారిన్‌కు మకాం మార్చనున్నారు కొందరు టాలీవుడ్ హీరోలు. వెకేషన్ కోసం అయితే కానే కాదు... సినిమాల చిత్రీకరణ కోసమే. ఈ స్టార్ హీరోల ఫారిన్ షూటింగ్ వివరాలు ఈ విధంగా...

కెన్యా టు హైదరాబాద్

కెన్యా టు హైదరాబాద్ చక్కర్లు కొట్టనుందట 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' (వర్కింగ్ టైటిల్) సినిమా టీమ్. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ కెన్యాలో జరిగింది. ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలోని ఓ ప్రముఖ స్టూడియోలో షూటింగ్ జరుగుతోంది. అయితే కెన్యా షెడ్యూల్ ఇంకా పూర్తి కాలేదట. ఈ సినిమాకి కీలకమైన ఫారెస్ట్ నేపథ్యంలో సాగే సన్నివేశాల చిత్రీకరణ అంతా కెన్యా అడవుల్లో జరిపేలా ప్లాన్ చేశారట రాజమౌళి. హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయ్యాక ఈ టీమ్ మళ్లీ కెన్యాకు వెళ్లనుందని సమాచారం. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ ఫారెస్ట్ అడ్వెంచరస్ మూవీ 2027లో రిలీజ్ కానుంది.

ఆటా పాటా...

ప్రభాస్ నటిస్తున్న తొలి హారర్ కామెడీ చిత్రం 'ది రాజాసాబ్'. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, రిద్ధి కుమార్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. పాటలను అతి త్వరలోనే విదేశాల్లో చిత్రీకరించడానికి యూనిట్ ప్లాన్ చేస్తోందట. ఇప్పటికే దర్శకుడు మారుతి గ్రీస్ వెళ్లి, అక్కడి లొకేషన్స్‌ను చూసొచ్చారట. త్వరలోనే ఈ టీమ్ అక్కడికి వెళ్లి రెండు పాటలను, కొంత టాకీ పార్టును షూట్ చేయనుంది. అయితే ఫారిన్ షూటింగ్ షెడ్యూల్‌కు ముందు 'ది రాజాసాబ్' టీమ్ కేరళకు వెళుతుందని, అక్కడ ప్రభాస్ పరిచయ పాటను చిత్రీకరిస్తారని సమాచారం. మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జనవరి 9న విడుదల కానుంది.

పది దేశాల్లో డ్రాగన్

డ్రాగన్ విదేశీయానం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. హీరో ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'డ్రాగన్'. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా కోసం కర్ణాటకలో వేసిన ఓ భారీ సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇదిలా ఉంటే... ఈ సినిమా కథలో ఇంటర్‌నేషనల్ టచ్ ఉంటుందట. దీంతో తర్వాతి షూటింగ్ షెడ్యూల్ కోసం 'డ్రాగన్' టీమ్ విదేశాలకు వెళ్లనుందని తెలిసింది. అంతేకాదు... పదికి పైగా దేశాల్లోని లొకేషన్స్‌లో 'డ్రాగన్' చిత్రీకరణ జరగనుందని సమాచారం. కల్యాణ్‌రామ్, కొసరాజు హరికృష్ణ, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 25న రిలీజ్ కానుంది.

ఏడారిలో...

హీరో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో 'ఏఏ22 ఏ6' (వర్కింగ్ టైటిల్) అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ముంబైలో దాదాపు 50 రోజులకు పైగా ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. నెక్ట్స్ షెడ్యూల్ అబుదాబిలో జరగనుందని, అతి త్వరలో అక్కడ షూట్ ప్రారంభం కానుందని తెలిసింది. అల్లు అర్జున్ పాల్గొనగా కీలక యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట అట్లీ. ఈ చిత్రంలో దీపికా పదుకోన్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027లో రిలీజ్ కానుందనే ప్రచారం జరుగుతోంది.

ఇలా షూటింగ్ కోసం త్వరలో విదేశాలు ప్రయాణం కానున్న హీరోలు మరికొందరు ఉన్నారు.

క్రమశిక్షణే లక్ష్మణరేఖగా...


● మురళీమోహన్, రామసత్యనారాయణ, గోపాలకృష్ణ, జయసుధ

జయసుధ హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం 'లక్ష్మణ రేఖ' 50 ఏళ్లు (1975 సెప్టెంబరు 12న విడుదల) పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఎన్. గోపాలకృష్ణ దర్శకత్వంలో షణ్ముగం చెట్టియార్, ఏవీ కృష్ణారావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం పేరే దర్శకుడు గోపాలకృష్ణ ఇంటి పేరుగా మారిపోయింది. ఈ చిత్రం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో 'గోల్డెన్ జూబ్లీ వేడుక'ను నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్వహించారు. ఈ చిత్ర దర్శకుడు గోపాలకృష్ణ, నటీనటులు జయసుధ, మురళీమోహన్‌తోపాటు ఈ చిత్రానికి కో డైరెక్టర్‌గా చేసిన రాజేంద్రప్రసాద్‌లను సన్మానించారు. "క్రమశిక్షణ, అంకితభావాలను లక్ష్మణ రేఖలుగా మలచుకుని ముందుకు సాగుతున్నాం" అని చిత్రయూనిట్‌కి చెందినవారు పేర్కొన్నారు. ఈ వేడుకలో సీనియర్ దర్శకులు ధవళ సత్యం, పీఎస్ రామచంద్రరావు, తెలుగు నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ఫిల్మ్‌నగర్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కాజా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలోచింపజేస్తుంది

– నిర్మాత రామాంజనేయులు జవ్వాజి



విజయ్ ఆంటోనీ హీరోగా 'అరువి' ఫేమ్ అరుణ్ ప్రభు దర్శకత్వంలో రూపొందిన తమిళ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'శక్తి తిరుమగన్'. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీల సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ పతాకంపై రామాంజనేయులు జవ్వాజి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. తెలుగులో 'భద్రకాళి' టైటిల్‌తో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో రామాంజనేయులు జవ్వాజి మాట్లాడుతూ– "'మార్గన్'కు ముందు 11 సినిమాలకు నిర్మాతగా చేశాను. సమాజంలో జరుగుతున్న కొన్ని అంశాలను ఆధారంగా చేసుకుని తీసిన సినిమా 'భద్రకాళి'. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రం మొదలైన రెండు నిమిషాల్లోనే ప్రేక్షకులు విజయ్‌గారి పాత్రకు కనెక్ట్ అవుతారు. ఈ చిత్రంలో ప్రేక్షకులను ఆలోచింపజేసే అంశాలు కూడా ఉన్నాయి. అరుణ్ ప్రభు మంచి కథ రాశారు. తమిళంలో మాత్రమే 'శక్తి తిరుమగన్' టైటిల్ ఉంది. మిగతా అన్ని భాషల్లో (తెలుగు, కన్నడ, హిందీ) 'భద్రకాళి' టైటిల్‌తోనే రిలీజ్ చేస్తున్నాం. మా 'మార్గన్'ను రిలీజ్ చేసిన ఏషియన్ సునీల్, సురేష్, రానాగార్లే 'భద్రకాళి'ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ప్రస్తుత అజయ్ దీషన్‌తో 'బూకి', మలయాళంలో ఓ సినిమా చేస్తున్నాం. 'బిచ్చగాడు' కాంబినేషన్ విజయ్ ఆంటోనీ, శశిగార్లు తమిళంలో 'నూరు సామి' సినిమా చేస్తున్నారు. తెలుగులో 'వంద దేవుళ్ళు' టైటిల్ అనుకుంటున్నాం. మా బ్యానర్‌లో సత్యదేవ్‌తో 'ఫుల్ బాటిల్' సినిమా చేస్తున్నాం" అని అన్నారు.

ప్రతి పాట ఓ సవాల్

– గీత రచయిత శ్రీమణి



"ఇటీవల సంగీతంలో సౌండ్ డిజైనింగ్ మారింది. ఈ సౌండ్‌కు తగ్గట్లుగా సాహిత్యం కూడా మారుతూ వస్తోంది. పదేళ్ల తర్వాత మన పాట విన్నా మంచి సాహిత్యం రాశారు అనిపించేలా నా పాటల ద్వారా నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకుంటున్నాను" అని తెలిపారు గీత రచయిత శ్రీమణి. '100 పర్సెంట్ లవ్' సినిమాతో గీత రచయితగా పరిచయమైన శ్రీమణి దశాబ్ద కాలానికి పైగా రాణిస్తున్నారు. నేడు (సోమవారం) ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీమణి తన కెరీర్ జర్నీ గురించి మాట్లాడుతూ – "ఇటీవల 'తండేల్' చిత్రంలో 'బుజ్జి తల్లి, హైలెస్సా' పాటలతో పాటు 'లక్కీ భాస్కర్' లోని 'నిజమా కలా', 'ఆయ్' సినిమాలోని పాట నాకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. ఈ పాటలన్నీ కథలో ఉన్న సన్నివేశం తాలూకు లోతైన భావం చెప్పడమే. నేనీ పాటలు రాయగలనని నమ్మి నాకు అవకాశం ఇచ్చిన సంగీత దర్శకులకు, దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. ఇక ప్రేమ పాటలు నా దగ్గరకు వచ్చినప్పుడు ఎలాంటి కొత్త ఎక్స్‌ప్రెషన్‌తో రాయగలను అనేది, అలాగే హీరో ఎలివేషన్ సాంగ్ వచ్చినప్పుడు హీరో క్యారెక్టరైజేషన్ ఓ డిఫరెంట్ కోణంలో ఎలా చెప్పగలను? అనేది ఛాలెంజ్ అవుతుంది. ఇలా ప్రతి పాటా ఓ సవాలే. నన్ను గీత రచయితగా పరిచయం చేసిన దర్శకుడు సుకుమార్ గారు 'గీత గోవిందం' సినిమాలో 'వచ్చిందమ్మా పాట..'ను మెచ్చుకున్నారు. మహేశ్‌బాబుగారి 'మహర్షి' లోని పాటలు విని, 'సిరివెన్నెల' సీతారామ శాస్త్రిగారు అభినందించారు. 'రంగ్ దే'లోని 'ఊరంతా..', 'మహర్షి'లోని 'ఇదే కదా..', 'ఉప్పెన' లోని 'నీ కళ్లు నీలి సముద్రం..' పాటలను దేవిశ్రీ ప్రసాద్ మెచ్చుకున్నారు. ప్రస్తుతం దుల్కర్ 'ఆకాశంలో ఓ తార', సాయి దుర్గా తేజ్ 'సంబరాల ఏటిగట్టు', నిఖిల్ 'ది ఇండియా హౌస్' చిత్రాలతో పాటు మరి కొన్ని చిత్రాలకు సాహిత్యం అందిస్తున్నాను" అన్నారు.

తల్లిదండ్రులు చూడాల్సిన సినిమా బ్యూటీ

– దర్శకుడు మారుతి



● మారుతి, ఎస్‌కేఎన్, వీకే నరేశ్, విజయ్‌పాల్

"'బ్యూటీ' ప్రతి తల్లిదండ్రులు చూడాల్సిన సినిమా. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీశాం. ఫాదర్ ఎమోషన్స్‌తో సుబ్బు మంచి కథ రాశాడు" అని దర్శక–నిర్మాత మారుతి అన్నారు. అంకిత్ కొయ్య నీలఖి జంటగా 'భలే ఉన్నాడే' ఫేమ్ జె.ఎస్.ఎస్. వర్ధన్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'బ్యూటీ'. జీ స్టూడియోస్, మారుతీ టీం ప్రొడక్ట్స్, వానర సెల్యులాయిడ్ పతాకాలపై విజయపాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో... "'బ్యూటీ' చిత్రం అందరికీ నచ్చుతుంది" అన్నారు జేఎస్ఎస్ వర్ధన్. "'బ్యూటీ'ని థియేటర్స్‌లో చూడండి" అని తెలిపారు విజయ్‌పాల్ రెడ్డి. "ఆడపిల్లలు అడిగిందల్లా కొనివ్వలేని పేరెంట్స్ పడే బాధ గురించి 'బ్యూటీ'లో అద్భుతంగా చూపించారు వర్ధన్" అని అన్నారు ఎస్‌కేఎస్.

ప్రేక్షకులకు కావాల్సింది వండండి: "నిర్మాత విజయ్‌గారు 'త్రిబాణధారి బార్బరిక్' అనే మంచి సినిమా తీశారు. ఆ సినిమాను ఆడియన్స్ థియేటర్స్‌లో చూడలేదని ఆ చిత్ర దర్శకుడు (మోహన్ శ్రీవాత్సవ) చెప్పుతో కొట్టుకున్నాడు. ఆడియన్స్ థియేటర్స్‌కు రావడం లేదని తిడతారా? చెప్పుతో కొట్టుకుంటారా? ఒక సినిమా ఫెయిలైతే కంటెంట్ నచ్చలేదని రియలైజ్ అవ్వండి. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడానికి పిచ్చి మాటలు మాట్లాడకండి. ఆడియన్స్‌కు ఏం కావాలో అది వండిపెట్టడానికి ట్రై చేయాలి. అంతేకానీ... నువ్వు చేసిన వంటని బలవంతంగా వాడిని తినమంటావ్ ఎందుకు?" అని దర్శకుడు మారుతి పేర్కొన్నారు.



శభాష్ సర్వేశ్... హైజంప్‌లో ఫైనల్‌కు అర్హత

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పురుషుల హైజంప్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ సర్వేశ్ అనిల్ కుశారే సత్తా చాటుకున్నాడు. ఫైనల్‌కు అర్హత సాధించి ఈ ఘనత సాధించిన తొలి భారతీయ హైజంపర్‌గా గుర్తింపు పొందాడు. ఆదివారం జరిగిన గ్రూప్ 'బి' క్వాలిఫయింగ్ రౌండ్‌లో **30 ఏళ్ల సర్వేశ్ 2.25 మీటర్ల ఎత్తు ఎగిరి సంయుక్తం**గా ఏడో స్థానంలో నిలిచాడు. అయితే ఓవరాల్‌గా 'ఎ', 'బి' గ్రూప్‌లలో కలిపి తొమ్మిదో స్థానంలో నిలువడం ద్వారా ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. రేపు హైజంప్ ఫైనల్ జరుగుతుంది. అర్హత నిబంధనల ప్రకారం 2.30 మీటర్ల ఎత్తు లేదంటే టాప్–12 స్థానాల్లో నిలిచే ఉత్తమ ప్రదర్శనతో ఫైనల్ బెర్త్ లభిస్తుంది. సర్వేశ్ ఉత్తమ ప్రదర్శన 2.27 మీటర్లు. 2022లో ఈ ప్రదర్శన నమోదు చేయగా, ఈ సీజన్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ 2.26 మీటర్లు. 2023లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో సర్వేశ్ రజతం నెగ్గాడు. పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సంపాదించినప్పటికీ క్వాలిఫయింగ్ రౌండ్లోనే వెనుదిరిగాడు. మిగతా పోటీల్లో పురుషుల 10 వేల మీటర్ల రేసులో గుల్‌వీర్ ఫైనల్స్ చేరడంలో విఫలమయ్యాడు. అయితే 5000 మీటర్ల పరుగులోనూ అతను పాల్గొనాల్సి ఉంది. ఈ నెల 19న ఈ ఈవెంట్ జరుగుతుంది.

అలవోకగా... అలవాటుగా...


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్ యాదవ్

సూర్యకుమార్

భారత జట్టు పాకిస్తాన్‌పై మరోసారి తమ బలాన్ని ప్రదర్శించింది. ఏమాత్రం పోటీ లేని మ్యాచ్‌లో ఏకపక్షంగా దాయాది జట్టుపై ఆధిపత్యం ప్రదర్శించి అతి సునాయాస విజయాన్ని అందుకుంది. ఇటీవల పాక్‌తో మ్యాచ్‌తో ఫలితం గురించి ఆలోచించాల్సిన అవసరం లేని విధంగా, అలవాటుగా మారిపోయినట్లుగా, అలవోకగా మరో గెలుపు మన ఖాతాలో చేరింది. ముందుగా భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో తేలిపోయిన పాక్ బ్యాటర్లు తక్కువ స్కోరుకే పరిమితం కాగా... ఆ తర్వాత మన ప్రధాన బ్యాటర్లంతా పని పూర్తి చేశారు. దాంతో 25 బంతుల ముందే టీమిండియా ఛేదన ముగిసింది. భారత్‌లో అక్కడక్కడా ఈ మ్యాచ్ ఆడటంపై నిరసనలు, విమర్శలు వినిపించినా... మైదానంలో మాత్రం ప్రేక్షకుల సంఖ్య సంతృప్తికర స్థాయిలో కనిపించింది. టోర్నీ తర్వాతి దశలో ఇరు జట్లు మరోసారి తలపడే అవకాశం ఉంది.

పాకిస్తాన్‌పై భారత్ ఘనవిజయం

- 7 వికెట్లతో టీమిండియా గెలుపు
- రాణించిన కుల్దీప్, అక్షర్
- మెరిసిన సూర్యకుమార్, అభిషేక్ శర్మ
- శుక్రవారం ఒమన్‌తో చివరి లీగ్ మ్యాచ్



దుబాయ్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో ఆసక్తిని రేపిన పోరులో భారత్ పైచేయి సాధించింది. ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (44 బంతుల్లో 40; 1 ఫోర్, 3 సిక్స్‌లు), షాహీన్ అఫ్రిది (16 బంతుల్లో 33 నాటౌట్; 4 సిక్స్‌లు) రాణించారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 18 పరుగులిచ్చి 3 వికెట్లు తీయగా... అక్షర్ పటేల్, బుమ్రా చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 15.5 ఓవర్లలో 3 వికెట్లకు 131 పరుగులు సాధించి గెలిచింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (37 బంతుల్లో 47 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), అభిషేక్ శర్మ (13 బంతుల్లో 31; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ (31 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత్ తమ తర్వాతి మ్యాచ్‌లో శుక్రవారం ఒమన్‌తో తలపడుతుంది.

ఆదుకున్న ఫర్హాన్, అఫ్రిది...

ఇన్నింగ్స్ తొలి బంతిని 'వైడ్'గా వేసిన పాండ్యా... అదనపు బంతికి సయీమ్ అయూబ్ (0)ను అవుట్ చేశాడు. దాంతో తొలి బంతికే భారత్‌కు వికెట్ దక్కినట్లయింది. అయూబ్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 'గోల్డెన్ డక్'గా వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్లో బుమ్రా రెండో బంతికే మొహమ్మద్ హారిస్ (3)ని వెనక్కి పంపాడు. ఈ దశలో ఫర్హాన్, ఫఖర్ (17) కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. బుమ్రా వరుస ఓవర్లలో ఫర్హాన్ ఒక్కో సిక్స్ కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి పాక్ స్కోరు 42 పరుగులకు చేరింది. పాకిస్తాన్‌పై అటు వన్డేలు, ఇటు టి20ల్లో కలిపి బుమ్రా బౌలింగ్‌లో ఒక పాక్ బ్యాటర్ సిక్స్ కొట్టడం ఇది మొదటిసారి మాత్రమే. అతను వేసిన 400వ బంతికిగానీ ఇది సాధ్యం కాకపోవడం విశేషం! అయితే పవర్‌ప్లే తర్వాత భారత బౌలర్లు ప్రత్యర్థిని పూర్తిగా కట్టి పడేశారు. పరుగులు తీయడంలో పాక్ తీవ్రంగా ఇబ్బంది పడగా, మరో వైపు వరుసగా వికెట్లూ పడ్డాయి. ముగ్గురు భారత స్పిన్నర్లను ఏమాత్రం ఆడలేక పాక్ 19 పరుగుల వ్యవధిలో తర్వాతి 4 వికెట్లు చేజార్చుకుంది. ఫఖర్, సల్మాన్ ఆగా (3)లను వరుస ఓవర్లలో అక్షర్ వెనక్కి పంపగా... కుల్దీప్ వరుస బంతుల్లో హసన్ (5), నవాజ్ (0) పని పట్టాడు. 7–16 మధ్య 10 ఓవర్లలో పాక్ 2 ఫోర్లు, ఒక సిక్స్‌తో కేవలం 41 పరుగులే చేయగలిగింది. ఒకదశలో వరుసగా 33 బంతుల పాటు బౌండరీనే రాలేదు. అయితే చివర్లో షాహీన్ అఫ్రిది దూకుడుగా ఆడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. హార్దిక్ వేసిన చివరి ఓవర్లో అతను 2 సిక్స్‌లు బాదాడు.

అర్ధ సెంచరీ భాగస్వామ్యం...

ఛేదనను భారత్ జోరుగా మొదలు పెట్టింది. అఫ్రిది వేసిన తొలి ఓవర్లో మొదటి రెండు బంతుల్లో 4, 6 బాదిన అభిషేక్... అతని తర్వాతి ఓవర్లో కూడా ఇలాగే 4, 6 కొట్టాడు. అయితే ఈ రెండు ఓవర్ల మధ్య అయూబ్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన శుబ్‌మన్ గిల్ (7 బంతుల్లో 10) మరుసటి బంతికి వెనుదిరిగాడు. అయూబ్ తర్వాతి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన అభిషేక్... అదే ఓవర్లో అవుటయ్యాడు. ఈ దశలో సూర్య, తిలక్ ఎక్కడా తగ్గకుండా ఇన్నింగ్స్‌ను నడిపించారు. తొలి 6 ఓవర్లలో భారత్ 61 పరుగులు చేసింది. ఆ తర్వాత చకచకా పరుగులు రాబట్టిన సూర్య, తిలక్ మూడో వికెట్‌కు 52 బంతుల్లో 56 పరుగులు జోడించారు. విజయానికి చేరువవుతున్న దశలో తిలక్ అవుటైనా...శివమ్ దూబే (10 నాటౌట్)తో కలిసి సూర్య గెలిపించాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 21 బంతుల్లో అభేద్యంగా 34 పరుగులు జత చేశారు. సూఫియాన్ బౌలింగ్‌లో మిడ్ వికెట్ మీదుగా సూర్య కొట్టిన భారీ సిక్స్‌తో మ్యాచ్ ముగిసింది.

ఆసియా కప్‌లో నేడు

యూఏఈ x ఒమన్
వేదిక: అబుదాబి
సాయంత్రం గం. 5:30 నుంచి

శ్రీలంక x హాంకాంగ్
వేదిక: దుబాయ్
రాత్రి గం. 8:00 నుంచి

సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

10 అంతర్జాతీయ టి20ల్లో పాకిస్తాన్‌పై భారత్ సాధించిన విజయాల సంఖ్య. ఇప్పటి వరకు రెండు జట్ల మధ్య 14 టి20 మ్యాచ్‌లు జరిగాయి. నాలుగింటిలో మాత్రమే పాక్ గెలిచింది.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: అయూబ్ (సి) బుమ్రా (బి) పాండ్యా 0; ఫర్హాన్ (సి) పాండ్యా (బి) కుల్దీప్ 40; హారిస్ (సి) పాండ్యా (బి) బుమ్రా 3; ఫఖర్ (సి) తిలక్ (బి) అక్షర్ 17; సల్మాన్ (సి) అభిషేక్ (బి) అక్షర్ 3; హసన్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 5; నవాజ్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 0; ఫహీమ్ (ఎల్బీ) (బి) వరుణ్ 11; షాహీన్ అఫ్రిది (నాటౌట్) 33; సూఫియాన్ (బి) బుమ్రా 10; అబ్రార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 127. వికెట్ల పతనం:** 1–1, 2–6, 3–45, 4–49, 5–64, 6–64, 7–83, 8–97, 9–111. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 3–0–34–1, జస్‌ప్రీత్ బుమ్రా 4–0–28–2, వరుణ్ చక్రవర్తి 4–0–24–1, కుల్దీప్ యాదవ్ 4–0–18–3, అక్షర్ పటేల్ 4–0–18–2, అభిషేక్ శర్మ 1–0–5–0. **భారత్ ఇన్నింగ్స్:** అభిషేక్ (సి) ఫహీమ్ (బి) అయూబ్ 31; గిల్ (స్టంప్డ్) హారిస్ (బి) అయూబ్ 10; సూర్యకుమార్ (నాటౌట్) 47; తిలక్ వర్మ (బి) అయూబ్ 31; దూబే (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (15.5 ఓవర్లలో 3 వికెట్లకు) 131. వికెట్ల పతనం:** 1–22, 2–41, 3–97. **బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 2–0–23–0, అయూబ్ 4–0–35–3, అబ్రార్ 4–0–16–0, నవాజ్ 3–0–27–0, సూఫియాన్ 2.5–0–29–0.



'షేక్ హ్యాండ్' లేదు!

సాధారణంగా టాస్ వేసిన తర్వాత ఇరు జట్ల కెప్టెన్లు చేతులు కలపడం ఆనవాయితీ. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఇది కానీ, ఒక చిరునవ్వు కానీ వివాదానికి, అనవసరపు చర్చకు దారి తీసే అవకాశం ఉంది. అందుకే కావచ్చు అటు సూర్యకుమార్ యాదవ్ గానీ ఇటు సల్మాన్ ఆగా కానీ అందుకు సాహసించలేదు. 'షేక్ హ్యాండ్' ఇవ్వకుండా, కనీసం ఒకరివైపు మరొకరు చూడకుండా ఇద్దరూ చెరో వైపునకు వెళ్లిపోయారు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఇరు జట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకోకుండా వెళ్లిపోయారు. టోర్నీ ఆరంభానికి ముందు జరిగిన కెప్టెన్ల సమావేశంలో ఏసీసీ అధ్యక్షుడు, పీసీబీ చైర్మన్ మొహసిన్ నఖ్వీకి సూర్యకుమార్ షేక్ హ్యాండ్ ఇవ్వడం మన అభిమానులకు అసంతృప్తిని కలిగించింది. ఆ ఒక్క విజువల్‌ను మళ్లీ మళ్లీ చూపిస్తూ సోషల్ మీడియాలో అంతా సూర్యను, బీసీసీఐని ఆడుకున్నారు. దాంతో ఈసారి అతను కూడా జాగ్రత్త పడ్డాడు!

- ప్రపంచ అథ్లెటిక్స్ ఫలితాలు
- దులీప్ ట్రోఫీ ఫైనల్ వివరాలు

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫన్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

జైస్మీన్, మీనాక్షి 'పసిడి' పంచ్

- భారత మహిళా బాక్సర్లకు రెండు స్వర్ణాలు
- రజతం నెగ్గిన నుపుర్
- పూజా రాణి ఖాతాలో కాంస్యం


మీనాక్షి


జైస్మీన్


లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్లు నాలుగు పతకాలతో మెరిశారు. జైస్మీన్ లంబోరియా (57 కేజీలు), మీనాక్షి హుడా (48 కేజీలు) పసిడి పతకాలతో అదరగొట్టగా... నుపుర్ షెరాన్ (ప్లస్ 80 కేజీలు) రజత పతకం, పూజా రాణి (80 కేజీలు) కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. ఆదివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో హరియాణాకు చెందిన మీనాక్షి ఫైనల్లో 4–1తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత కిజైబీ నజిమ్ (కజకిస్తాన్)ను బోల్తా కొట్టించి తన కెరీర్‌లో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. గత జూలైలో జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో కిజైబీ చేతిలో ఎదురైన పరాజయానికి మీనాక్షి ఈ గెలుపుతో బదులు తీర్చుకుంది. శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన 57 కేజీల ఫైనల్లో హరియాణాకే చెందిన జైస్మీన్ 4–1తో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత జూలియా జెరెమెటా (పోలాండ్)ను ఓడించి విశ్వవిజేతగా అవతరించింది. 'నా అనుభూతిని మాటల్లో వర్ణించలేను. గత రెండు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో క్వార్టర్ ఫైనల్స్‌లో వెనుదిరిగాను. ఈసారి ఎలాగైనా విజేతగా తిరిగి రావాలనే లక్ష్యంతో నా ఆటతీరులో మార్పులు చేసుకొని అనుకున్న ఫలితాన్ని సాధించాను' అని జైస్మీన్ వ్యాఖ్యానించింది. ప్లస్ 80 కేజీల ఫైనల్లో నుపుర్ 2–3తో అగాటా కమర్స్కా (పోలాండ్) చేతిలో పోరాడి ఓడిపోయింది. 80 కేజీల సెమీఫైనల్లో పూజా రాణి 1–4తో ఎమిలీ (ఇంగ్లండ్) చేతిలో పరాజయం పాలై కాంస్య పతకాన్ని దక్కించుకుంది.

10 ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో స్వర్ణ పతకాలు నెగ్గిన భారత మహిళా బాక్సర్లు. ఈ జాబితాలో మేరీకోమ్, నిఖత్ జరీన్, సరితా దేవి, జెన్నీ, లేఖ, నీతూ, లవ్లీనా, స్వీటీ బూరా, జైస్మీన్, మీనాక్షి ఉన్నారు.

పరాజయంతో ప్రారంభం

- తొలి వన్డేలో భారత మహిళల జట్టు ఓటమి
- ప్రతీక, మంధాన, హర్లీన్ శ్రమ వృథా
- 8 వికెట్లతో ఆస్ట్రేలియా ఘనవిజయం
- రాణించిన లిచ్‌ఫీల్డ్, బెత్ మూనీ, అనాబెల్


ప్రతీక


స్మృతి మంధాన

ముల్లాన్‌పూర్: టాపార్డర్ బ్యాటర్లు అద్భుతంగా రాణించినప్పటికీ బౌలింగ్ వైఫల్యంతో భారత మహిళల జట్టు తొలి వన్డేలో పరాజయం చవిచూసింది. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో నెగ్గిన ఆస్ట్రేలియా అమ్మాయిల జట్టు వన్డే సిరీస్‌లో శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు ప్రతీక రావల్ (96 బంతుల్లో 64; 6 ఫోర్లు), స్మృతి మంధాన (63 బంతుల్లో 58; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్లీన్ డియోల్ (57 బంతుల్లో 54; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో కదంతొక్కారు. ఓపెనింగ్ వికెట్‌కు ప్రతీక, మంధాన 114 పరుగులతో చక్కని ఆరంభమిచ్చారు. మిడిలార్డర్‌లో రిచా ఘోష్ (20 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్), దీప్తి శర్మ (16 బంతుల్లో 20 నాటౌట్; 2 ఫోర్లు) రెండు పదుల స్కోర్లు చేశారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మేగన్ షుట్ 2 వికెట్లు తీయగా, కిమ్ గార్త్, అనాబెల్, అలానా కింగ్, తాలియా తలా ఒక వికెట్ తీయడంతో భారత్ 100 పరుగుల అనంతరం వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయింది. భారత్ నిర్దేశించిన లక్ష్యం సులువైంది కాదు కానీ... కంగారూ బ్యాటర్లు మాత్రం సులువుగా పరుగులు రాబట్టారు. దీంతో వేగంగా లక్ష్యంవైపు ఆస్ట్రేలియా అమ్మాయిల జట్టు దూసుకెళ్లింది. చివరకు 44.1 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 282 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (80 బంతుల్లో 88; 14 ఫోర్లు), బెత్ మూనీ (74 బంతుల్లో 77 నాటౌట్; 9 ఫోర్లు), అనాబెల్ సదర్లాండ్ (51 బంతుల్లో 54 నాటౌట్; 6 ఫోర్లు) ధాటిగా ఆడారు. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్, స్నేహ్ రాణా చెరో వికెట్ తీశారు. 17న రెండో వన్డే కూడా ఇదే వేదికపై జరుగుతుంది.

స్కోరు వివరాలు

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతీక (సి) పెరీ (బి) అలానా కింగ్ 64; స్మృతి మంధాన (రనౌట్) 58; హర్లీన్ డియోల్ (స్టంప్డ్) హీలీ (బి) షుట్ 54; హర్మన్‌ప్రీత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అనాబెల్ 11; జెమీమా (సి) అలానా కింగ్ (బి) తాలియా 18; రిచా ఘోష్ (సి) ఆష్లే గార్డ్‌నర్ (బి) షుట్ 25; దీప్తి శర్మ (నాటౌట్) 20; రాధా యాదవ్ (సి) పెరీ (బి) కిమ్ గార్త్ 19; శ్రీచరణి (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 281. వికెట్ల పతనం:** 1–114, 2–142, 3–162, 4–207, 5–232, 6–244, 7–274. **బౌలింగ్:** మేగన్ షుట్ 7–0–45–2, కిమ్ గార్త్ 10–1–56–1, ఆష్లే గార్డ్‌నర్ 7–0–35–0, ఎలీస్ పెరీ 3–0–15–0, జార్జియా 7–0–36–0, అనాబెల్ సదర్లాండ్ 6–0–31–1, అలానా కింగ్ 6–1–28–1, తాలియా మెక్‌గ్రాత్ 4–0–33–1.

ఆస్ట్రేలియా మహిళల ఇన్నింగ్స్: అలీసా హీలీ (బి) క్రాంతి గౌడ్ 27; లిచ్‌ఫీల్డ్ (సి) సబ్–అరుంధతి (బి) స్నేహ్ రాణా 88; ఎలీస్ పెరీ (రిటైర్డ్ హర్ట్) 30; బెత్ మూనీ (నాటౌట్) 77; అనాబెల్ (నాటౌట్) 54; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (44.1 ఓవర్లలో 2 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1–45, 2–166. **బౌలింగ్:** క్రాంతి గౌడ్ 8–0–55–1, స్నేహ్ రాణా 10–0–51–1, దీప్తి శర్మ 10–1–59–0, శ్రీచరణి 8.1–0–55–0, రాధా యాదవ్ 8–0–61–0.

రన్నరప్‌తో సరి

- డబుల్స్ ఫైనల్లో ఓడిన సాత్విక్–చిరాగ్ జోడీ
- సింగిల్స్ తుది పోరులో లక్ష్య సేన్‌కు నిరాశ



హాంకాంగ్: ఈ ఏడాది తొలి టైటిల్ సాధించాలని ఆశించిన భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టికి నిరాశ ఎదురైంది. ఈ సీజన్‌లో తొలిసారి ఓ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత పొందిన సాత్విక్–చిరాగ్ ద్వయం ఆఖరి మెట్టుపై తడబడింది. ఆదివారం ముగిసిన హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో సాత్విక్–చిరాగ్ జంట రన్నరప్‌గా నిలిచింది. లియాంగ్ వె కెంగ్–వాంగ్ చాంగ్ (చైనా) జోడీతో జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జంట 21–19, 14–21, 17–21తో పరాజయం పాలైంది. 'టైటిల్ సాధించేందుకు బరిలోకి దిగాం. కానీ చైనా జోడీ మాకంటే మెరుగ్గా ఆడింది. తదుపరి టోర్నీలో టైటిల్ కోసం మళ్లీ ప్రయత్నిస్తాం' అని చిరాగ్ వ్యాఖ్యానించాడు. రన్నరప్‌గా నిలిచిన సాత్విక్–చిరాగ్ జోడీకి 19,000 డాలర్ల (రూ. 16 లక్షల 77 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7800 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. ప్రపంచ నాలుగో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా)తో జరిగిన ఫైనల్లో లక్ష్య సేన్ 15–21, 12–21తో ఓటమి పాలయ్యాడు. రెండు గేముల్లోనూ ఆరంభంలో లక్ష్య సేన్ ఆధిక్యంలో నిలిచినా దానిని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాడు. లక్ష్య సేన్‌కు 19,000 డాలర్ల (రూ. 16 లక్షల 77 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7800 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.


ఉదిత

తుది పోరులో తడబాటు

- మహిళల ఆసియా కప్ హాకీ టోర్నీ రన్నరప్ భారత్
- ఫైనల్లో చైనా చేతిలో ఓటమి

హాంగ్జౌ (చైనా): వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ మహిళల హాకీ టోర్నీకి నేరుగా అర్హత సాధించాలని ఆశించిన భారత జట్టుకు నిరాశే ఎదురైంది. ఆసియా కప్ టోర్నీలో భారత జట్టు రన్నరప్ ట్రోఫీతో సంతృప్తి పడింది. ఆతిథ్య చైనా జట్టుతో ఆదివారం జరిగిన ఫైనల్లో సలీమా టెటె నాయకత్వంలోని టీమిండియా 1–4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. మ్యాచ్ మొదలైన తొలి నిమిషంలోనే లభించిన పెనాల్టీ కార్నర్‌ను నవ్‌నీత్ కౌర్ గోల్‌గా మలచడంతో భారత్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత చైనా పుంజుకోవడంతో భారత్ ఈ ఆధిక్యాన్ని కాపాడుకోవడంలో విఫలమైంది. 21వ నిమిషంలో జిజియా ఒయు గోల్‌తో చైనా స్కోరును 1–1తో సమం చేసింది. ఆ తర్వాత హాంగ్ లీ (41వ నిమిషంలో), మెరోంగ్ జు (51వ నిమిషంలో), జియాకి జాంగ్ (53వ నిమిషంలో) ఒక్కో గోల్ చేసి చైనాకు విన్నర్స్ ట్రోఫీతోపాటు ప్రపంచ కప్ బెర్త్‌ను అందించారు. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు ఐదు పెనాల్టీ కార్నర్‌లు... చైనాకు ఆరు పెనాల్టీ కార్నర్‌లు రాగా... రెండు జట్లు ఒక్కో దానిని మాత్రమే సద్వినియోగం చేసుకున్నాయి. భారత క్రీడాకారిణి ఉదిత 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డును గెల్చుకుంది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో జపాన్ 2–1తో దక్షిణ కొరియాను ఓడించింది.

వైశాలి విజయం

సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి ఖాతాలో ఆరో విజయం చేరింది. ప్రపంచ మాజీ చాంపియన్ మరియా ముజీచుక్ (ఉక్రెయిన్)తో ఆదివారం జరిగిన పదో రౌండ్ గేమ్‌లో వైశాలి 42 ఎత్తుల్లో గెలిచింది. పదో రౌండ్ తర్వాత వైశాలి 7.5 పాయింట్లతో కాటరీనా లాగ్నో (రష్యా)తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచింది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 356	నిఫ్టీ ▲ 109
81,905	25,114

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	22,141	▲	98
డోజోన్స్	45,877	▼	231
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,283	▼	14
డాక్స్	23,698	▼	6
షాంఘై	3,871	▼	5
నికాయ్	44,768	▲	396

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.95	88.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.40	121.40
€	యూరో	ఎస్‌బీఐ	101.90	104.66
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.11	60.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.25	59.51
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.43	70.09
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.59	24.06
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.10	24.35
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.49	13.32

60 తర్వాత.. ఆచితూచి..!



మనలో చాలా మంది పదవీ విరమణ ప్రణాళిక గురించి పెద్దగా పట్టించుకోరు. ఎప్పుడో వృద్ధాప్యంలో పలకరించే రిటైర్మెంట్ గురించి యవ్వనంలో ఉన్నప్పుడు చర్చించడం వారికి నచ్చదు! మధ్య వయసు వచ్చే వరకు అభిరుచులు, ఆకాంక్షలు, కోరికల చుట్టూ సాగిపోతుంటారు. దీంతో రిటైర్మెంట్‌కు ప్రాధాన్యం పక్కకు వెళ్లిపోతుంది. తీరా రిటైర్మెంట్ పలకరించిన తర్వాత, అప్పటి వరకు తాము వెనకేసింది అవసరాలకు ఎంత మాత్రం సరిపోదని తెలుసుకుని ఆందోళన చెందాల్సి వస్తుంది. అనారోగ్యంతో ఒక్కసారి ఆస్పత్రిపాలైతే పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి రావచ్చు. లిక్విడిటీ తగినంత లేని సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల.. క్లిష్ట సమయాల్లో రోజువారీ ఖర్చులకు సైతం కటకట ఎదుర్కోవాల్సి రావచ్చు. మెరుగైన రాబడి లేని సాధనాలను నమ్ముకోవడం వల్ల రిటైర్మెంట్ ఫండ్ దీర్ఘకాలం పాటు అవసరాలను తీర్చలేకపోవచ్చు. అందుకే పదవీ విరమణ తర్వాత.. ముఖ్యంగా 60 ఏళ్ల తర్వాత వేసే ప్రతి అడుగు ఆర్థికంగా ఆచితూచి ఉండాలి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

- అర్థవంతంగా ఆర్థిక నిర్ణయాలు
- పొదుపు నిధిని దీర్ఘకాలం కాపాడుకోవాలి
- మెరుగైన రాబడులకు మార్గం చూడాలి
- పెట్టుబడుల్లో ఈక్విటీలకూ చోటు ఉండాలి
- హెల్త్ ఇన్సూరెన్స్‌కు అగ్ర ప్రాధాన్యం ఇవ్వాలి

ఉద్యోగంలో మాదిరే పదవీ విరమణ తర్వాత కూడా క్రమం తప్పకుండా ఆదాయం వచ్చే ప్రణాళిక ఉండాలి. లేదంటే ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. అప్పటి వరకు సమకూర్చుకున్న ఫండ్ (పొదుపు నిధి)ను వివిధ సాధనాల్లో పెట్టుబడి పెట్టి.. ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని ఉపసంహరించుకునే ఏర్పాటు చేసుకోవాలి. ''పెట్టుబడి నుంచి మొదటి ఏడాది 3–4 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. రెండో ఏడాది నుంచి ద్రవ్యోల్బణం సూచీ స్థాయిలో ఉపసంహరణకు పరిమితం కావాలి'' అని నెర్డిబర్డ్ వెల్త్ అడ్వైజరీ ప్రిన్సిపల్ ఆఫీసర్ శిల్పా భాస్కర్ గోలే సూచించారు. ఉపసంహరణలో చిన్న తేడా వచ్చినా రిటైర్మెంట్ నిధిని ఎక్కువ కాలం పాటు కాపాడుకోలేరు. ఉదాహరణకు రూ.2 కోట్ల నిధి ఉందనుకోండి. ఏటా 8 శాతం వృద్ధి చెందుతూ, ప్రతి నెలా రూ.లక్ష ఉపసంహరించుకుంటే తమవద్దనున్న నిధి 6 శాతం ద్రవ్యోల్బణం అంచనా ఆధారంగా 21 ఏళ్ల అవసరాలకు సరిపోతుంది. అలా కాకుండా ప్రతి నెలా రూ.1.5 లక్షల చొప్పున ఉపసంహరించుకుంటూ వెళితే అదే నిధి 13 ఏళ్ల అవసరాలనే తీర్చగలదు. ఎంత ఉపసంహరించుకోవాలన్న స్పష్టత కొరవడితే, తొలినాళ్లలో అధికంగా ఖర్చు చేయొచ్చు. ఖర్చులకు అనుగుణంగా ఉపసంహరణలు కొనసాగితే, తర్వాతి సంవత్సరాలకు పెద్దగా మిగిలి ఉండదని 5నాన్స్ డాట్ కామ్ వ్యవస్థాపకుడు దినేష్ రోహిరా హెచ్చరించారు. పేరుకే రిటైర్మెంట్. కానీ, నేడు చాలా మంది ఆ తర్వాత కూడా ఏదో ఒక పని చేస్తున్నారు. అలాంటి మార్గాలను గుర్తించాలి. దీనివల్ల రిటైర్మెంట్ ఫండ్ నుంచి తక్కువ ఉపసంహరణకు పరిమితం కావొచ్చు. ఫలితంగా రిటైర్మెంట్ నిధిని ఎక్కువ కాలం కాపాడుకోవచ్చు.





ఈక్విటీ పెట్టుబడులపై అప్రమత్తత...

పదవీ విరమణ తర్వాత ఈక్విటీ పెట్టుబడులకు పూర్తిగా దూరం కావాల్సిన అవసరం లేదు. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్/డెట్ సెక్యూరిటీల రాబడిపై ద్రవ్యోల్బణం క్షీణత ప్రభావాన్ని చాలా మంది అర్థం చేసుకోరు. పదవీ విరమణ తర్వాత పెట్టుబడుల్లో వృద్ధి భాగం లేకపోతే, పొదుపు నిధి విలువ వేగంగా తగ్గిపోతుంది. కనుక 70 ఏళ్లు దాటిన వారు సైతం తమ మొత్తం పెట్టుబడుల్లో 10–15 శాతాన్ని అధిక నాణ్యతతో కూడిన డివిడెండ్ ఇచ్చే స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలని దినేష్ రోహిరా సూచించారు. దీనివల్ల పెట్టుబడి ద్రవ్యోల్బణాన్ని మించి వృద్ధి చెందుతుంది. అదే సమయంలో ఈక్విటీలపై ఎక్కువగా ఆధారపడడం కూడా మంచిది కాదు. ఎందుకంటే రిటైర్మెంట్ ఆరంభంలో ఎక్కువ మొత్తం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసినట్టయితే.. సరిగ్గా అప్పుడే ఈక్విటీల్లో బేర్ దశ (పతనకాలం) ఆరంభమై కొన్నేళ్ల పాటు కొనసాగితే.. అవసరాల కోసం ఈలోపు చేసే ఉపసంహరణలతో పెట్టుబడి విలువ గణనీయంగా పడిపోతుంది. కనుక 5–7 ఏళ్ల అవసరాలకు సరిపడా మొత్తాన్ని సురక్షిత డెట్ సాధనాల్లో తప్పకుండా ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీని వల్ల అంతకాలం పాటు ఈక్విటీ పెట్టుబడులను కదిలించకుండా ఉంటే ఆ మొత్తం మెరుగ్గా వృద్ధి చెందేందుకు అవకాశం ఇచ్చినట్టు అవుతుంది.



వైద్యపరంగా సన్నద్ధత..

వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు సర్వ సాధారణం. వైద్యపరమైన ద్రవ్యోల్బణం 12–14%గా ఉంటోంది. కనుక ఈ సమయంలో హెల్త్ ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండాలి. ఇది లేకపోతే పొదుపు నిధిపై ఆధారపడాల్సి వస్తుంది. ఆర్థిక కోణం నుంచి చూస్తే ఇది పెద్ద తప్పిదం అవుతుంది. రిటైర్మెంట్ ఫండ్ అన్నది జీవితాంతం అవసరాలను తీర్చడం కోసం. వైద్యం కోసం దాన్ని వాడటం మొదలు పెడితే తక్కువ కాలంలోనే ఖాళీ అయిపోతుంది. కనుక రిటైర్మెంట్ తర్వాత ప్రీమియం భారమైనా సరే హెల్త్ ఇన్సూరెన్స్ కవర్‌ను కొనసాగించాలి. ప్రీమియం భారమనిపిస్తే రూ.5 లక్షలకు బేసిక్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుని, రూ.5 లక్షల డిడక్టబుల్‌తో రూ.50 లక్షలకు సూపర్ టాపప్ ప్లాన్ తీసుకోవచ్చు. ఉద్యోగ సమయంలో కంపెనీ గ్రూప్ హెల్త్ పాలసీ ఉందని, వ్యక్తిగత హెల్త్ పాలసీ లేదా ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్‌ను చాలా మంది తీసుకోరు. ఉద్యోగ విరమణ తర్వాత తీసుకుంటే అప్పుడు భారీ ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. కనుక గ్రూప్ హెల్త్ ప్లాన్‌పై ఆధారపడకుండా వ్యక్తిగతంగా కుటుంబానికి హెల్త్ ఇన్సూరెన్స్ ఉండేలా చూసుకోవాలి.

పన్ను ప్రయోజనం

ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) పన్ను పరంగా మెరుగైన సాధనాలు కావు. వీటి రాబడి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. తమకు వర్తించే శ్లాబు రేటు ప్రకారమే ఎఫ్‌డీ రాబడిపైనా పన్ను చెల్లించాల్సి వస్తుంది. గతంలో మాదిరి డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో స్వల్పకాల/దీర్ఘకాల పెట్టుబడుల ప్రయోజనాలు ఇప్పుడు లేవు. ఎప్పుడు విక్రయించినా ఎఫ్‌డీల మాదిరే ఆదాయం వార్షిక ఆదాయానికి కలిపి చూపించాల్సిందే. వీటికి బదులు పన్ను ఆదా కోసం అయితే ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వీటిలో రాబడికి ఈక్విటీ పెట్టుబడులకు మాదిరే స్వల్ప, దీర్ఘకాల మూలధన పన్ను నిబంధనలు అమలవుతాయి. రిస్క్ దాదాపు ఉండదు.

రుణ భారం

రిటైర్మెంట్ నాటికి ఎలాంటి రుణం మిగిలి ఉండకూడదు. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు బకాయిలు, గృహ రుణాలు ఏవైనా సరే గుడ్‌బై చెప్పేయాలి. లేదంటే రిటైర్మెంట్ కోసం ఉద్దేశించిన పొదుపు నిధిని రుణ చెల్లింపుల కోసం వినియోగించాల్సి వస్తుంది. దీనివల్ల ఆర్థిక స్వేచ్ఛను కోల్పోవాల్సి వస్తుంది.

యాన్యుటీ ప్లాన్లు



యాన్యుటీ ప్లాన్లు.. హామీతో కూడిన రాబడిని ఇస్తాయి. కానీ, రిటైర్మెంట్ నిధి మొత్తాన్ని యాన్యుటీ ప్లాన్లలో ఇన్వెస్ట్ చేయడం మంచి నిర్ణయం అనిపించుకోదు. ఒక్కసారి యాన్యుటీ ప్లాన్ కొనుగోలు చేసిన తర్వాత చివరి వరకు ఒకే విధమైన రాబడికి లాక్ అయినట్టే. వ్యయాలు, వైద్య అత్యవసరాలు లేదా పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా రాబడి పెరగదు. యాన్యుటీలకు పన్ను ప్రయోజనాలు కూడా లేవు. కనుక కొంత వరకు యాన్యుటీకి కేటాయించుకుని, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, డెట్ ఫండ్స్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో కొంత చొప్పున ఇన్వెస్ట్ చేసుకోవాలి. సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) రూపంలో ఆదాయ మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

ఎస్టేట్ ప్లానింగ్

60 తర్వాత తప్పకుండా పట్టించుకోవాల్సిన అంశం ఎస్టేట్ ప్లానింగ్. స్థిర, చరాస్తులు, ఆర్థిక ఆస్తులను ఎలా నిర్వహించాలి? ఎలా పంపిణీ చేయాలన్నది ఇది నిర్దేశిస్తుంది. కేవలం ధనవంతుల కోసమే ఇదని భావిస్తుంటారు. కానీ, ఆస్తులున్న ప్రతి కుటుంబానికి అవసరమే. కనీసం వీలునామా రూపంలో అయినా ఎవరికి ఏ మేరకు పంపిణీ చేయాలో సూచించాలి. తద్వారా భవిష్యత్తులో వారసుల మధ్య వివాదాలు లేకుండా జాగ్రత్తపడొచ్చు. ఇక్కడ వీలునామా అన్నది తమ మరణానంతరం తమ వారసులకు ఏవేవి, ఎలా చెందాలో సూచించే పత్రం. అదే ఎస్టేట్ ప్లానింగ్ అయితే జీవించి ఉన్న సమయంలోనూ ఆయా ఆస్తుల రక్షణ, వాటిని తమ అభీష్టం మేరకు నిర్వహించడానికి వీలు కల్పిస్తుంది. ఒకవేళ ఏదైనా అనారోగ్యం కారణంగా కుటుంబ యజమాని అశక్తుడిగా మారిన సందర్భంలో అప్పటికే ఎస్టేట్ ప్లానింగ్ ఉంటే, అందులో పేర్కొన్న విధంగా ఆస్తుల నిర్వహణను కుటుంబ సభ్యులు లేదా ట్రస్టీలు చూసుకుంటారు. ఎస్టేట్ ప్లానింగ్ లేదా వీలునామా ఉన్నప్పటికీ.. పెట్టుబడులకు నామినీని నమోదు చేయడం కూడా అవసరమే. దీనివల్ల వీటి క్లెయిమ్ సులభతరం అవుతుంది.

లిక్విడ్ ఆస్తులకు చోటు ఉండాలి

కొంత మంది రిటైర్మెంట్ తర్వాతి అవసరాల కోసం ప్రాపర్టీని (ఇల్లు/ఫ్లాట్) సమకూర్చుకుంటుంటారు. స్థిరాస్తి రూపంలో ఉండడం వల్ల లిక్విడిటీ (నగదు లభ్యత) సమస్య ఎదురుకావొచ్చు. అవసరమైనప్పుడు ప్రాపర్టీని వెంటనే నగదుగా మార్చుకోవడం సాధ్యపడదు. ఇక నిర్వహణ వ్యయాలు, పన్నులు, న్యాయ వివాదాల రిస్క్‌లు ఎలానూ ఉంటాయ్. రిటైర్మెంట్ కోసమని ప్రాపర్టీలను సమకూర్చుకున్నప్పటికీ.. పదవీ విరమణ తర్వాత స్థిరమైన ఆదాయానికి ప్రణాళిక ఉండాలి. ఇందుకు ప్రాపర్టీని విక్రయించడం లేదంటే రివర్స్ మార్ట్‌గేజ్‌కు వెళ్లడం మంచి ఆప్షన్ అవుతుంది. రివర్స్ మార్ట్‌గేజ్‌లో ప్రాపర్టీని బ్యాంక్ తనఖా పెట్టుకుని, నెలవారీ కోరుకున్నంత ఆదాయాన్ని నిర్ణీత కాలం పాటు చెల్లిస్తుంది. ఇంటిని విక్రయించనక్కర్లేదు. అదే ఇంట్లో నివాసం ఉండొచ్చు. మీ తదనంతరం వారసులు అప్పటి వరకు ఉన్న బకాయిని చెల్లించి అదే ఇంటిని స్వాధీనం చేసుకోవచ్చు. లేదంటే బ్యాంక్ వేలం వేసి, బకాయి పోను మిగిలినది వారసులకు చెల్లిస్తుంది. ఇంటి కోసం రుణం తీసుకుని మనం ఎలా అయితే నిర్ణీత కాలం పాటు ఈఎంఐ చెల్లిస్తామో.. రివర్స్ మార్ట్‌గేజ్‌లో బ్యాంక్ అలా మనకు చెల్లిస్తుంది. ఏకమొత్తంలో చెల్లింపులకూ కొన్ని బ్యాంక్‌లు అవకాశం కల్పిస్తున్నాయి.



జియో బ్లాక్‌రాక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్



జియోబ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ తొలి యాక్టివ్ ఈక్విటీ ఫండ్ 'జియోబ్లాక్‌రాక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్' న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) ఈ నెల 23న ప్రారంభం కానుంది. ''ఇది మాకు తొలి యాక్టివ్ ఫండ్ అవుతుంది. మరో మూడు నాలుగు యాక్టివ్ ఈక్విటీ ఫండ్స్ కూడా త్వరలో రానున్నాయి. ఈటీఎఫ్‌లను సైతం తీసుకొస్తాం'' అని జియోబ్లాక్‌రాక్ ఏఎంసీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ రిషి కోహ్లీ ప్రకటించారు. అంతర్జాతీయంగా నిరూపితమైన ఎస్ఏఈ ప్లాట్‌ఫామ్‌పై దీన్ని నిర్మించామని, 400 సంకేతాల ఆధారంగా, టెక్నాలజీ సాయంతో పెట్టుబడులు పెట్టనున్నట్టు, దీనివల్ల వ్యక్తుల ప్రమేయానికి సంబంధించి రిస్క్ తగ్గుతుందని జియోబ్లాక్‌రాక్ తెలిపింది. నష్టాల రిస్క్‌ను పరిమితం చేయడం, స్థిరమైన రాబడిని తెచ్చిపెట్టడం జియోబ్లాక్‌రాక్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ లక్ష్యమని పేర్కొంది. జియోబ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ అన్నది జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్లాక్‌రాక్ ఆధ్వర్యంలోని జాయింట్ వెంచర్ కంపెనీ కావడం గమనార్హం.

న్యూ ఫండ్ ఆఫర్స్...

ది వెల్త్ కంపెనీ ఎంఎఫ్ నుంచి ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ..

వివిధ మార్కెట్‌క్యాప్‌లవ్యాప్తంగా ఇన్వెస్ట్ చేసే 'ఫ్లెక్సీ క్యాప్ ఫండ్'ను ది వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ ప్రవేశపెట్టింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) సెప్టెంబర్ 24న ప్రారంభమై అక్టోబర్ 8న ముగుస్తుంది. ఇది తమ తొలి ఫండ్ అని సంస్థ ఎండీ మధు లూనావత్ తెలిపారు. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో ఇది ఇన్వెస్ట్ చేస్తుందని, నిఫ్టీ 500 టీఆర్ఐ దీనికి బెంచ్‌మార్క్‌గా ఉంటుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ఈక్విటీ సంస్థల తరహాలో కూలంకషంగా అధ్యయనం చేసి ఫండమెంటల్స్, వేల్యుయేషన్లు, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కేటాయింపులు ఉంటాయని మధు వివరించారు. ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ పాంటోమత్ గ్రూప్‌లో ది వెల్త్ కంపెనీ భాగంగా ఉంది. పలు ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్స్ (ఏఐఎఫ్)ను కూడా నిర్వహిస్తోంది.

హెచ్‌డీఎఫ్‌సీ 'డైవర్సిఫైడ్ ఈక్విటీ ఆల్ క్యాప్' ఎఫ్‌వోఎఫ్ ..

హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ తాజాగా డైవర్సిఫైడ్ ఈక్విటీ ఆల్ క్యాప్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్‌వోఎఫ్)ను ఆవిష్కరించింది. ఇది సెప్టెంబర్ 24 వరకు అందుబాటులో ఉంటుంది. వివిధ మార్కెట్‌క్యాప్‌లవ్యాప్తంగా దేశీయంగా ఈక్విటీ ఆధారిత స్కీముల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. పలు ఫండ్ మేనేజర్ల అనుభవం, వివిధ రకాల పెట్టుబడుల ధోరణులు, క్రమశిక్షణతో కూడుకున్న రీబ్యాలెన్సింగ్ ప్రయోజనాలన్నింటినీ ఈ ఒక్క ఫండ్‌తో పొందవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎండీ నవ్‌నీత్ మునోట్ తెలిపారు. ఎన్ఎఫ్‌వో వ్యవధిలో కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

దక్షిణాదిన తొలి 'హంటర్‌హుడ్' ఫెస్టివల్	ఫెడ్‌వైపు ఇన్వెస్టర్ల చూపు ఈ వారం మార్కెట్‌పై నిపుణుల అంచనా

ఎన్‌టీపీసీ | బ్రోకరేజ్: యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు


ప్రస్తుత ధర: రూ. 332 టార్గెట్: రూ. 400

ఎందుకంటే: ఎందుకంటే: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం ఎన్‌టీపీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ఠ పనితీరు చూపింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో వార్షికంగా నికర లాభం 11 శాతం వృద్ధితో రూ. 6,108 కోట్లను తాకింది. అంచనాలను 13 శాతం అధిగమించినప్పటికీ త్రైమాసికవారీగా 23 శాతం క్షీణించింది. రెగ్యులేటరీ డిఫరల్ పద్దు సర్దుబాటు తదుపరి నికర లాభం రూ. 4,101 కోట్లుగా నమోదైంది. అయితే విద్యుదుత్పత్తి క్షీణించడంతో కన్సాలిడేటెడ్ ఆదాయం, నిర్వహణ లాభం(ఇబిటా) అంచనాలను అందుకోలేకపోయాయి. గ్రూప్ స్థాయిలో మూడేళ్ల కాలానికి(2026–28) కంపెనీ రూ. 2.65 లక్షల కోట్ల పెట్టుబడి వ్యయ ప్రణాళికలు అమలు చేయనుంది. విడిగా(స్టాండెలోన్)చూస్తే రూ. 87,661 కోట్ల పెట్టుబడులు వెచ్చించే యోచనలో ఉంది. రెగ్యులేటెడ్ ఈక్విటీలో వృద్ధికి ఇది ఊతిమివ్వనుంది. కంపెనీకున్న పటిష్ఠ యాజమాన్యం, వెండార్ నెట్‌వర్క్ కారణంగా థర్మల్ ఆధారిత విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటులో ఎగ్జిక్యూషన్ రిస్క్‌లకు చోటు తక్కువే. ఈ ఏడాది సొంత అవసరాల కోసం బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 45 మిలియన్ టన్నులు(ఎంటీ)గా పెట్టుకుంది. ఈ బాటలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27)లో 56 ఎంటీ, ఆపై ఏడాది(2027–28) 60 ఎంటీ చొప్పున సొంత అవసరాల కోసం బొగ్గు ఉత్పత్తి చేపట్టనుంది. థర్మల్ బిజినెస్ ఆధారంగా ఎస్‌వోటీపీ పద్ధతిలో 2026–27 పీ/బీవీకి 2.1 రెట్లు షేరు టార్గెట్ ధరను నిర్ణయించాం. కొత్త థర్మల్, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటులో ఆలస్యం, డిస్కమ్‌ల ఆర్థిక పరిస్థితులు(ప్రధానంగా ఆయా రాష్ట్ర డిస్కమ్‌ల నుంచే కంపెనీకి చెల్లింపులు అందవలసి ఉంటుంది), థర్మల్ ప్లాంట్లలో తక్కువ పీఎల్ఎఫ్ తదితర అంశాలను కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.



స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఎస్‌డబ్ల్యూపీ మంచిదా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో అధిక పెట్టుబడులు ఉన్నప్పుడు తక్కువ అస్థిరతలు ఉన్న సాధనాల్లోకి ఎలా మళ్లించాలి? లేదంటే స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఉన్న పెట్టుబడులకు సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ)ను ఎంపిక చేసుకోవచ్చా?

– హరిహరన్ అనంతనారాయణన్

స్మాల్‌క్యాప్ పెట్టుబడుల్లో రిస్క్ అధికంగా ఉంటుంది. మీరు చెప్పిన విధంగా చేస్తే ఫలితం ఎలా ఉంటుందో చూద్దాం. ఉదాహరణకు 2006 నుంచి రూ.కోటి మొత్తాన్ని స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి, ఏటా 10 శాతం చొప్పున క్రమానుగతంగా ఉపసంహరించుకుంటూ (ఎస్‌డబ్ల్యూపీ) వచ్చినప్పటికీ.. ఆ పెట్టుబడి రూ.6.3 కోట్లకు వృద్ధి చెంది ఉండేది. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో రాబడులు ఏ స్థాయిలో ఉంటాయన్నది ఇది తెలియజేస్తుంది. అయినప్పటికీ ఏటా 10 శాతం ఉపసంహరించుకోవాలని నేను సూచించను. దీనికి బదులు 2 శాతం చొప్పున ఉపసంహరించుకుంటే.. రూ.కోటి పెట్టుబడి రూ.18.7 కోట్లు అయి ఉండేది. నా సూచన ఏమిటంటే.. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు ఉంటే, ఏటా ఉపసంహరించుకునే రేటు 3 శాతం మించకుండా ఉండేట్టు అయితే, మీ పెట్టుబడులను అలాగే కొనసాగించుకోవచ్చు. దీనివల్ల మార్కెట్ల పతనాల్లో ఆందోళన చెందకుండా నిశ్చింతగా ఉండొచ్చు. వచ్చే 20–30 ఏళ్లలో ఈక్విటీ మార్కెట్లు 2008 తరహా అతిపెద్ద పతనాలను రెండు లేదా మూడు పర్యాయాలు చూసే అవకాశం ఉంటుంది. అలాంటి సమయాల్లో స్మాల్ క్యాప్ పెట్టుబడుల విలువ మరింత పడిపోతుంది. అందుకే మీ ఉపసంహరణను 2%కి పరిమితం చేసినట్టయితే ఈ పతనాలను మీరు తట్టుకోగలరు. మార్కెట్ల పట్ల నమ్మకం, ఈ తరహా మార్కెట్ సైకిల్స్‌ను గతంలో చూసిన అనుభవం అన్నవి మీ పెట్టుబడుల విధానాన్ని కొనసాగించుకునేందుకు ఎంతో అవసరం. అప్పుడు దీర్ఘకాలంలో విజయం సాధించగలరు. మరో ఉదాహరణ చూద్దాం. ఒక వేళ మీరు ఈక్విటీ సేవింగ్స్ ఫండ్‌లో రూ.కోటి ఇన్వెస్ట్ చేసి.. ఏటా 4 శాతాన్ని ఉపసంహరించుకుంటే (2005లో మొదలైందని భావించినప్పుడు) అప్పుడు మీ పెట్టుబడి రూ.1.73 కోట్లుగా మారేది. అదే స్మాల్‌క్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి ఏటా 4% ఉపసంహరించుకున్నప్పుడు పెట్టుబడి రూ.15.6 కోట్లు అయ్యేది. అధిక రాబడి కోరుకుంటే అస్థిరతలకు అలవాటు పడాలి. అస్థిరతలను సమర్థవంతంగా ఎదుర్కొంటే మెరుగైన రాబడులు పొందొచ్చు. ఆ తరహా అధిక అస్థిరతలను భరించలేకపోతే మరింత రక్షణాత్మక పెట్టుబడి సాధనాలను పరిశీలించొచ్చు.



అధిక రేటింగ్ కలిగిన అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయాలన్నది నా ఆలోచన. దీర్ఘకాలం కోసం ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయొచ్చా?

– రమేష్

దీర్ఘకాలం కోసం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైన నిర్ణయం అవుతుంది. కాకపోతే పెద్ద మొత్తంలో పెట్టుబడిని ఒకే విడత పెట్టేయడం అనుకూలం కాకపోవచ్చు. ఇన్వెస్ట్ చేసిన తర్వాత మార్కెట్లు పడిపోతే ఇన్వెస్టర్లు ఆందోళనకు గురవుతారు. ఉదాహరణకు మీరు రూ.50 లక్షలను ఈక్విటీ ఫండ్ లేదా అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. మార్కెట్లు పడితే పోర్ట్‌ఫోలియో విలువ సైతం క్షీణిస్తుంది. కాకపోతే అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ అచ్చమైన ఈక్విటీ పథకాలతో పోల్చి చూస్తే మార్కెట్ పతనాల్లో స్థిరత్వాన్ని ప్రదర్శిస్తాయి. ఎందుకంటే అవి డెట్ సాధనాల్లోనూ కొంత ఇన్వెస్ట్ చేస్తాయి. మీరు ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్న మొత్తాన్ని ఒకే విడత కాకుండా.. పలు విడతలుగా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ల ఉద్ధాన, పతనాల తాలూకూ ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. కనుక పెట్టుబడిని ఒకే విడత కాకుండా, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో కొంత కాలం పాటు ఇన్వెస్ట్ చేసుకునేలా ప్రణాళిక వేసుకోండి.

ఆధార్ హౌసింగ్ | బ్రోకరేజ్: యూఎల్‌జేకే రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 507 టార్గెట్: రూ. 624

ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఈ ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ఠ పనితీరు ప్రదర్శించింది. త్రైమాసికవారీగా ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర వడ్డీ ఆదాయం నిలకడను చూపుతూ రూ. 519 కోట్లను అధిగమించింది. గతేడాది(2024–25) ఇదే కాలంతో పోలిస్తే మాత్రం 19 శాతం ఎగసింది. ఈల్డ్స్(రిటర్న్) మందగించినప్పటికీ రుణాల్లో పటిష్ఠ వృద్ధి ఇందుకు దోహదపడింది. నికర వడ్డీ మార్జిన్లు 8.8 శాతంగా నమోదయ్యాయి. త్రైమాసికవారీగా(క్యూ4తో) చూస్తే 0.3 శాతం, వార్షికంగా(గతేడాది క్యూ1) 0.1 శాతం చొప్పున బలహీనపడ్డాయి. ఇందుకు నిధుల సమీకరణ వ్యయాలు ప్రభావం చూపినప్పటికీ ఓ మాదిరి పట్టణాలలో విస్తరణ, అధిక లిక్విడిటీ కొంతమేర ఆదుకున్నాయి. వెరసి నికర లాభం వార్షికంగా 19 శాతం పుంజుకుని రూ. 237 కోట్లను దాటింది. త్రైమాసికవారీగా ఇది 3 శాతం క్షీణత. అయితే నిర్వహణా ఆదాయ, నిర్వహణా వ్యయాల(కాస్టుటు ఇన్‌కమ్) నిష్పత్తి 36.1కు మెరుగుపడటం, 25–27 బేసిస్ పాయింట్ల రుణ వ్యయాల(క్రెడిట్ కాస్ట్) అంచనా నేపథ్యంలో కంపెనీ యాజమాన్యం 4.2–4.3 శాతం రిటర్న్ ఆన్ అసెట్(ఆర్‌వోఏ)ను లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఏడాది కంపెనీ మార్జిన్లలో పటిష్ఠ రికవరీకితోడు.. ఆర్జన మెరుగుపడనున్నట్లు అంచనా వేస్తున్నాం. ఇందుకు బ్రాంచీల నుంచి ఉత్తమ పనితీరు, అధిక రేటింగ్‌గల చౌక నిధుల(లయబిలిటీలు)ను సమీకరించగలగడం సహకరించనున్నట్లు భావిస్తున్నాం. కంపెనీ ప్రధానంగా గ్రామీణ, సెమీఅర్బన్ ప్రాంతాలలో వ్యాపార విస్తరణపై దృష్టిపెట్టింది. హౌసింగ్‌కు పెరుగుతున్న డిమాండ్, పట్టణాలకు వెల్లువెత్తుతున్న వలసలు, అవసరాలకు అనుగుణమైన రుణ ప్రొడక్టులు తదితరాలు కంపెనీకి లబ్ధిని చేకూర్చే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...

నేడు ఎంజీయూ స్నాతకోత్సవం

హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవం సోమవారం జరగనుంది. కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. స్నాతకోత్సవంలో 22 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలను.. గవర్నర్ ప్రదానం చేయనున్నారు.

7441 మందికి బీఈడీ సీట్లు

సాక్షి, హైదరాబాద్: రెండో దశ కౌన్సెలింగ్‌లో 7441 మందికి బీఈడీ సీట్లు కేటాయించినట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ జె.పాండురంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 12076 సీట్లకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చినట్టు తెలిపారు. తొలి దశలో 9955 సీట్లు కేటాయిస్తే, 4474 మంది మాత్రమే రిపోర్టు చేశారని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18లోగా రిపోర్టు చేయాలని సూచించారు.

శ్రీవారి సన్నిధిలో న్యాయమూర్తులు



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక



ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్

హారన్ మోగించరు.. గీత దాటరు



దేశానికే ట్రాఫిక్ పాఠాలు నేర్పుతున్న ఐజోల్ సిటీ	స్వీయ క్రమశిక్షణ, స్వయం నియంత్రణలో ఆదర్శం	సైలెంట్ సిటీ ఆఫ్ ఇండియా'గా పేరు	ఇంతకాలం విమానంలో తప్ప నేరుగా రవాణా వసతి నామమాత్రం	ఐజోల్‌కు అందుబాటులో రైల్వే వసతి

ఆ ప్రాంతం పేరు జొకోసంగ్.. నగరంలోని అతి ప్రధాన రోడ్డు.. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు అధికంగా ఉండటంతో సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒకవైపు వెళ్లే ట్రాఫిక్ అధికంగా ఉంది.. ఆ వైపు వాహనాలు నిలిచి పెద్ద వరస ఏర్పడింది.. మరోవైపు మాత్రం రోడ్డు ఖాళీగా ఉంది.. కానీ రోడ్డు మధ్యలో డివైడర్ లేకున్నా.. ఒక్క వాహనం కూడా గీత దాటలేదు.

ఆ నగర పర్యటనకు వచ్చిన ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థుల బృందం ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయింది. ప్రజల్లో ఆ పరిణతికి అభినందనలు అంటూ నగర మేయర్‌కు లేఖ రాసింది. ఆ సిటీని చూసి నేర్చుకోండి అంటూ ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులకు సచిత్ర లేఖ పంపింది. **ఆ నగరమే ఈశాన్య రాష్ట్రమైన మిజోరం రాజధాని**

ఐజోల్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఐజోల్ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేవు.. కానీ, కూడళ్లలో వాహనాలు అదుపు తప్పవు. రాత్రి వేళ ట్రాఫిక్ పోలీసులు లేనప్పటికీ వాహనాలు నియంత్రణ కోల్పోవు. రోడ్డు మీద వందల సంఖ్యలో వాహనాలు ముందుకు సాగుతున్నా.. ఎక్కడా హారన్లు వినపడవు, వాహనాలు ఒకదాని వెనక ఒకటి వరస కట్టి వెళ్తాయే తప్ప ఓవర్‌టేక్ చేయవు.. డ్రైవర్లు పరస్పరం అరుచుకోవటం, తిట్టుకోవటం మచ్చుకు కూడా కనిపించవు.. పాదచారులు ఫుట్‌పాత్‌ల మీదుగా మాత్రమే నడుస్తారు, అర్ధరాత్రి వేళ రోడ్డు ఖాళీగా ఉన్నప్పుడు కూడా రోడ్ల మీదుగా నడవరు. ఇవన్నీ నమ్మశక్యం కాని నిజాలు. ఐజోల్ నగరంలో ఏ మూలకెళ్లినా ఇవే దృశ్యాలు కనిపిస్తాయి.

ప్రకృతి ఒడిలో కొలువై..

కొండలు, లోయలు, దట్టమైన అడవులు, నదులు, వాగులు వంకలు.. స్వచ్ఛమైన ప్రకృతిలో కొలువైన ఆ నగరంలో వాతావరణం స్వచ్ఛంగా ఉంటుంది. దాదాపు 2.20 లక్షల వాహనాలున్నప్పటికీ హారన్ల మోతలు లేకపోవటంతో శబ్ద కాలుష్యం ఉండదు. ఇది స్థానికుల క్రమశిక్షణ ఫలితం. అందుకే ఐజోల్ నగరాన్ని 'ది సైలెంట్ సిటీ ఆఫ్ ఇండియా'అంటారు. ఇక్కడి ప్రజల్లో స్వీయ క్రమశిక్షణ పుట్టుకతో వస్తుందని అంటున్నారు. 4.21 లక్షల జనాభా ఉన్న నగరంలో నేరాలు అతి తక్కువ. మద్య నిషేధం కట్టుదిట్టంగా అమలవుతుండటంతో ప్రశాంతత రాజ్యమేలుతోంది. ప్రభుత్వ నిబంధనలు తు.చ.తప్పకుండా పాటిస్తున్న ప్రజలు, ఎలాంటి ఉల్లంఘనలకు ఆసక్తి చూపరు. దీంతో ఆ నగరంలో ప్రజల క్రమశిక్షణపై అధ్యయనానికి దేశంలోని చాలా నగరాలు ఆసక్తి చూపుతున్నాయి.

ఇంతకాలం విమానయానంతోనే..

ఐజోల్‌కు వెళ్లాలంటే ఇంతకాలం విమానయానమే అవకాశంగా ఉంది. అది ఖర్చుతో కూడుకున్నది కావటంతో చాలామంది అక్కడికి వెళ్లలేకపోయారు. ఇప్పుడు దేశంలోని ఇతర ప్రాంతాలతో శనివారం నుంచి రైల్వే అనుసంధానం అందుబాటులోకి రావడంతో అధ్యయనాల కోసం నగరానికి వచ్చే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

కొండలతో కూడుకున్న ప్రాంతం కావటంతో విశాలమైన రోడ్ల నిర్మాణానికి వీలు లేదు. కొండ అంచుల్లో వెనకవైపు లోయల్లోకి పిల్లర్లు ఏర్పాటు చేసి వాటి ఆధారంగా ఇళ్లను నిర్మిస్తుంటారు. ఉన్న కాస్త స్థలంలో 30 అడుగుల వెడల్పు రోడ్లు మాత్రమే ఉంటాయి. దీంతో ప్రజలు ఎలాంటి ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడకుండా క్రమశిక్షణతో రోడ్లను వాడుకుంటున్నారు. రోడ్లపై డివైడర్లు ఉండవు, కేవలం ట్రాఫిక్ లైన్స్‌మాత్రమే గీసి ఉంటాయి. అయినా.. ఓ వైపు ఉన్న వాహనం ఎట్టి పరిస్థితిలో గీత దాటి మరోవైపు వెళ్లదు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు మాన్యువల్‌గా మాత్రమే ట్రాఫిక్ నియంత్రిస్తుంటారు. వారు చేయి ఎత్తగానే టక్కున వాహనాలు నిలిచిపోతాయి. ముందు వాహనాలు మందగమనంతో సాగినా వెనక వాహనదారులు పొరపాటున కూడా హారన్ మోగించరు.



సారీ చెప్పి ఓవర్‌టేకింగ్..

- ఎవరైనా అత్యవసరంగా ముందుకు సాగాల్సి ఉంటే, వాహనాలను ఓవర్‌టేక్ చేసి పక్క వాహనదారుకు సారీ చెప్పి మరీ వెళ్లటం అక్కడి ప్రత్యేకత. రాత్రి వేళ ట్రాఫిక్ పోలీసులు లేని సమయంలో కూడా కూడళ్లలో వాహనదారులు నియంత్రణ కోల్పోరు.
- ఘాట్ రోడ్లు కావటంతో అన్నీ మలుపులు తిరిగిన రోడ్లే ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో కూడా హారన్ల మోత వినిపించదు. మరీ షార్ప్ కర్వ్ ఉండి, భారీ వాహనాలు వచ్చే రోడ్డయితే స్వల్పంగా ఒకసారి హారన్ మోగిస్తారు.
- తక్కువ వెడల్పు రోడ్లే అయినా, అన్ని చోట్లా ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. పాదచారులు కచ్చితంగా ఫుట్‌పాత్‌పైనే నడుస్తారు. అర్ధరాత్రి వేళ రోడ్లు ఖాళీగా ఉన్నా.. ఫుట్‌పాత్‌ల గుండానే ముందుకు సాగుతారు.
- టాక్సీలకు రోడ్ల మీదే పార్కింగ్ కల్పించారు. వాటికి 20 శాతం స్థలం ఉంటుంది. అవి వరసగా ఆగి ఉన్నా.. పక్కనుంచి మిగతా వాహనాలు ప్రశాంతంగా ముందుకు సాగిపోతుంటాయి.
- ఫుట్‌పాత్‌ల వినియోగం, ట్రాఫిక్ నిబంధనలు, పార్కింగ్, హారన్లు మోగించకపోవటం, అక్రమ నిర్మాణాలు రాకుండా నియంత్రించటం.. తదితర అంశాలపై పాఠశాలల స్థాయిలోనే విద్యార్థులకు అవగాహన కల్పించటం అక్కడి ప్రభుత్వాలు నిరంతరం కొనసాగిస్తున్నాయి.



శ్రీవారిని దర్శించుకున్న లోక్‌సభ స్పీకర్

లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణసింగ్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకు న్నారు. వారికి టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు, అదనపు ఈవో సీహెచ్. వెంకయ్య చౌదరి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగ నాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, చైర్మన్, అదనపు ఈవో శ్రీవారి చిత్ర పటం లడ్డూ ప్రసాదాలు అందజేశారు. -తిరుమల

ఆలయం వెలుపల లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ తదితరులు

జాతీయ లోక్ అదాలత్‌లో 1,65,522 కేసుల పరిష్కారం

- డీజీపీ జితేందర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1,65,522 కేసులు పరిష్కారమైనట్టు డీజీపీ డా.జితేందర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం కేసుల్లో కాంపౌండెడ్ ఎఫ్ఐఆర్ కేసులు 20,964, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కేసులు 883, ఈ–పెట్టీ కేసులు 75,430, మోటార్ వెహికిల్ యాక్ట్ కేసులు 61,205, సైబర్ క్రైం కేసులు 7,040 ఉన్నట్టు తెలిపారు. పోలీస్ యూనిట్ల వారీగా అత్యధికంగా కేసులు పరిష్కారమైన ఐదు పోలీసు యూనిట్లలో హైదరాబాద్ (29,023 కేసులు), రాచకొండ (22,278), నల్లగొండ (14,002), వరంగల్ (10,309), రామగుండం (8,358) ఉన్నట్టు పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా జడ్జిలు, మేజిస్ట్రేట్‌లు, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీల సమన్వయంతోనే పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారమైనట్టు డీజీపీ పేర్కొన్నారు.

సైబర్ నేరాల్లో రూ.12.94 కోట్ల రిఫండ్

జాతీయ లోక్ అదాలత్‌లో రాష్ట్రవ్యాప్తంగా 4,539 సైబర్ నేర బాధితులకు రూ.12.94 కోట్ల రిఫండ్ ఆర్డర్లు ఇచ్చినట్టు టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు నిర్వహించిన అన్ని లోక్ అదాలత్‌లలో కలిపి మొత్తం 18,872 మంది బాధితులకు రూ.138.04 కోట్ల రీఫండ్ ఆర్డర్లు అందజేసినట్టు చెప్పారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఆనందాలు.. అనుబంధాలు

మహిళలకు గాజుల పండుగ

- పురుషులకు కండువా పండుగ
- ఆత్మీయతలు, అనుబంధాలకు నాంది
- పల్లెల్లో మొదలైన సరికొత్త సంస్కృతి
- ఉత్సాహంగా యువ రైతులు

ఎప్పుడూ వ్యవసాయ పనులంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు తోటలు, పొలాల చుట్టూ తిరిగే రైతులు.. తమ కుటుంబాలతో గ్రామాల్లో వేడుక చేసుకుంటున్నారు. సంఘాల వారీగా మహిళలు గాజుల పండుగను.. పురుషులు కండువా (టవల్) పండుగను సంతోషంగా జరుపుకొంటున్నారు. ఇటీవలి కాలంలో జగిత్యాల జిల్లాలో జరుగుతున్న రైతు కుటుంబాల పండుగలు కొత్త సంస్కృతిని సృష్టించాయి. యువ రైతులు తమ భార్యలతో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. దీంతో జిల్లాలో ఎక్కడో ఒక చోట పండుగలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవలి కాలంలో జిల్లాలోని మేడిపల్లి, జగిత్యాల, మల్లాపూర్, మెట్‌పల్లి ప్రాంతాల్లో జరిగాయి.

- జగిత్యాల అగ్రికల్చర్

గ్రామాల్లో కలిసిమెలిసి ఉన్నప్పటికీ, చిన్న చిన్న విభేదాలు ఉంటున్నాయి. దీంతో, వాటిని రూపుమాపేందుకు, అందరూ కలిసి ఆత్మీయంగా పలకరించుకునేందుకు గ్రూపులు, సంఘాల వారీగా దంపతులు ఈ పండుగను జరుపుకొంటున్నారు. పండుగలో భాగంగా మహిళలందరూ కొత్త చీరలు ధరించి వేడుకకు హాజరవుతారు. ఒకరికొకరు బొట్టు పెట్టి, గాజులు వేస్తుంటే, పురుషులు ఒకరికొకరు కండువాలు వేస్తారు. అనంతరం, భర్త కాళ్లు మొక్కి భార్య ఆశీర్వచనాలు తీసుకుంటుంది. ఈ కార్యక్రమం అంతా ఉమ్మడిగా జరుపుకొంటున్నారు. ఇటీవలి కాలంలో ఇలాంటి పండుగ ఓ ఆనవాయితీగా మారింది. సోషల్ మీడియాలో ఇలాంటి కార్యక్రమాలను పోస్టు చేస్తుండటంతో, ప్రతి గ్రామంలో ఇలాంటి అనుబంధాల పండుగలు జరుపుకొనేందుకు రైతు సంఘాలు సిద్ధమయ్యాయి.

అనుబంధాలు పెనవేసుకునేలా..



భర్తల కాళ్లకు మొక్కి ఆశీర్వచనం తీసుకుంటున్న మహిళలు

రోజంతా ఆడుతూ.. పాడుతూ..

ఈ కార్యక్రమం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించుకుంటున్నారు. మహిళలు, పురుషులు కలిసి వంట చేయడం, ఆ భోజనాన్ని అందరూ కలిసి తింటుంటారు. ఎప్పుడూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే మహిళలు.. ఒకరికొకరు మైదాకు పెట్టుకుంటున్నారు. ఆటలాడుతూ, నవ్వుతూ.. తమ కష్టాన్ని మరిచిపోతున్నారు. గెలుపొందిన వారికి బహుమతులు ఇస్తున్నారు. డీజే సౌండ్ బాక్స్‌లు పెట్టుకుని పాటలు పాడుతూ, హుషారుగా డ్యాన్స్‌లు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో భార్యభర్తలు కలిసి డ్యాన్స్‌లు చేస్తుండటం విశేషం. కార్యక్రమంలో ఇంట్లోని వృద్ధులు కూడా పాల్గొంటున్నారు.



గాజులు వేసుకుంటున్న మహిళా రైతులు



మైదాకు పెట్టుకున్న మహిళలు

కొత్త అనుభూతి ఇచ్చింది



మా రైతు సంఘం ఆధ్వర్యంలో మహిళలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు అంతా కలిసి తొలిసారిగా పండుగ చేసుకున్నాం. మహిళలు ఒకరికొకరు గాజులు వేస్తే, మేము టవల్స్ వేసుకున్నాం. అందరం కలిసి విందులో పాల్గొని.. ఆనందంగా గడిపాం.

- ఎం.సుదర్శన్ రెడ్డి, సౌమ్య, వెంగళాపూర్, గొల్లపల్లి మండలం

సంతోషంగా గడిపాం



ఇలాంటి పండుగలతో చిన్న చిన్న విభేదాలు దూరమవుతాయి. వీటితో మాలో ఉత్తేజం కలుగుతోంది. పిల్లలతో కలిసి డ్యాన్స్‌లు చేసాం. ఆటలు ఆడుకున్నాం. ఒకరితో ఒకరు అనుబంధాలను పంచుకున్నాం, ఆప్యాయంగా పలకరించుకున్నాం.

- ఎ.అనంత రెడ్డి, సౌజన్య, వెంగళాపూర్, గొల్లపల్లి మండలం

మానసిక ప్రశాంతత వైపు రైతన్నలు

ఒకవైపు యూరియా కొరత, మరోవైపు అధిక వర్షాలతో సాగు చేసిన పంట పండుతుందో.. లేదోనన్న ఆందోళన ఉన్నప్పటికీ.. రైతులు కుటుంబం, స్నేహితులు, బంధువులతో ఆనందంగా గడుపుతూ మానసిక ఒత్తిడి తగ్గించుకుంటున్నారు. నవ్వుల పోటీలు సైతం నిర్వహించి, ప్రతి ఒక్కరు అందులో పాల్గొనేలా కమిటీ సభ్యులు సూచనలు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామంలోని కుల సంఘాలు, రైతు సంఘాలు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్నాయి.

ఇంటింటా ఓటీటీ!



ఓటీటీల్లో కొన్నింటి జాబితా...

వినోద ప్రపంచంలో సరికొత్త శకం

- ఓటీటీలతో నట్టింట్లోకి సినిమా
- కంటెంట్, భాష ఏదైనా క్షణాల్లో కళ్ల ముందుకు..
- పల్లె, పట్నం తేడా లేకుండా ఆధునిక వినోదం

కరకగూడెం(భద్రాద్రి కొత్తగూడెం జిల్లా): ఒకప్పుడు వారాంతంలో కొత్త సినిమా విడుదలైతే థియేటర్లలోనే చూడాలన్న తపన. అందుకోసం క్యూ కట్టి టికెట్ సాధించడం ఓ అనుభవం! అయితే, కుటుంబాలతో సహా థియేటర్లకు వెళ్లడంలో ఇక్కట్లు, టికెట్లు, ఇతర ఖర్చుల భారం వెరసి గతమంతా జ్ఞాపకంగా మిగిలిపోయే పరిస్థితి ఎదురవుతోంది. ఇదే సమయాన థియేటర్లకు వెళ్లకుండానే అదే వినోదం మొబైల్, ట్యాబ్, ల్యాప్‌టాప్, స్మార్ట్ టీవీల్లోకి చేరింది. ఈ మార్పుకు కారణం ఓటీటీ ప్లాట్‌ఫాంలు. ఇన్నాళ్లు ప్రధాన నగరాలు, ఓ మోస్తరు పట్టణాలకే పరిమితమైన ఆండ్రాయిడ్ టీవీలు, ఇంటర్నెట్ కనెక్షన్లు పల్లెలకు సైతం చేరడంతో.. వారికీ ఓటీటీలు అందుబాటులోకి వచ్చినట్లయింది.



కరకగూడెంలోని ఓ ఇంట్లో టీవీలో సినిమా వీక్షిస్తున్న కుటుంబం

వినోద విప్లవానికి నాంది

ఓటీటీ అనేది కేబుల్, డీటీహెచ్ వంటి వ్యవస్థలను దాటుకుని ఇంటర్నెట్ ద్వారా కంటెంట్ అందించే వేదిక. దీనినే 'వీడియో ఆన్ డిమాండ్' అని కూడా అంటారు. దీంతో సినిమా చూసేందుకు ప్రత్యేకంగా సమయం కేటాయించాల్సిన అవసరం లేదు. ఎక్కడ ఉన్నా.. ఏ పని చేస్తున్నా.. సినిమా చూస్తూ మధ్యలో ఆపేసి మళ్లీ కుదిరినప్పుడే చూడొచ్చు. ప్రపంచంలోని అన్ని భాషల సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టీవీ షోలు, డాక్యుమెంటరీలు, క్రీడలు, వార్తలు ఇలా అన్నీ ఒకరి సినిమా టికెట్ ధరతో కుటుంబమంతా చూసే అవకాశం దక్కడం అందరినీ ఆకట్టుకుంటోంది.

ఆకర్షణగా ఒరిజినల్ కంటెంట్

నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, జియో సినిమా, ఆహా వంటి ఓటీటీ ప్లాట్‌ఫాంలు సొంతంగా వెబ్ సిరీస్‌లు, సినిమాలు రూపొందిస్తున్నాయి. కొత్త టాలెంట్, వినూత్న ఆలోచనలకు ఇవి వేదికగా నిలుస్తున్నాయి. అభిరుచి కలిగిన నిర్మాతలు, దర్శకులు తమ సృజనాత్మకతను చాటడానికి అవకాశం ఏర్పడుతోంది.

హద్దుల్లేని వినోదం

ఓటీటీల్లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు అన్ని ప్రపంచ భాషల్లోనూ కంటెంట్ అందుబాటులో ఉంది. డబ్బింగ్, సబ్ టైటిళ్లతో ఫ్రెంచ్, స్పానిష్ సినిమాలు కూడా ఇంట్లోనే చూడగలుగుతున్నారు. కరోనా మహమ్మారి సమయంలోనే కాక నిర్వహణ భారంతో థియేటర్లు మూతపడగా కొత్త సినిమాలన్నీ ఓటీటీల్లో విడుదలయ్యాయి. ఈ ధోరణి కొనసాగుతూ ప్రేక్షకులకు వినోదం మరింత చేరువవుతోంది.

కొన్ని పరిమితులు, సవాళ్లు కూడా..

ఓటీటీ వినోదానికి కొన్ని పరిమితులున్నాయనే చెప్పాలి. అధిక డేటా వినియోగం, ఇంటర్నెట్ నాణ్యత సమస్యలు గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ప్రతీ ప్లాట్‌ఫాంకి సబ్‌స్క్రిప్షన్ తీసుకోవడం కొంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. అయినా ఇలాంటి సమస్యలు ఓటీటీల వినోద ప్రవాహాన్ని అడ్డుకోవడం లేదు. ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తూనే కొత్త ఆలోచనలు, ప్రతిభావంతులైన దర్శకులు, రచయితలకు అవకాశాలు చూపుతున్నాయి.



ఆటోలో కూర్చొని ట్యాబ్‌లో క్రికెట్ మ్యాచ్ వీక్షిస్తున్న యువత



టీవీ ముందు కుటుంబం



ఓటీటీలు ఒక వరం

అన్నిసార్లు థియేటర్లకు వెళ్లలేం. కానీ ఓటీటీలో నచ్చిన సినిమా కుదిరిన సమయంలో చూడొచ్చు. ఏ భాష అయినా తెలుగు వెర్షన్‌లో చూడగలుగుతున్నాం. ఒకసారి సబ్‌స్క్రైబ్ చేసుకుంటే ఎన్నో సినిమాలు చూసే అవకాశం ఉంది.

- ఈసం దీపిక, పద్మాపురం



కుటుంబమంతా ఆస్వాదించే అవకాశం

ఓటీటీ వచ్చాక ఇంట్లోనే కుటుంబంతో కలిసి సినిమాలు చూస్తున్నాం. నాకు పాత సినిమాలంటే చాలా ఇష్టం, ఓటీటీలు, యూట్యూబ్‌లో అన్నీ ఉంటున్నాయి. కుటుంబమంతా కలిసి గడిపే సమయం పెరిగింది. ఇది సంతోషాన్ని ఇస్తోంది.

- కొత్తకొండ మురళి, కరకగూడెం



ఔత్సాహికులకు అవకాశాల గని..

మారుమూల గ్రామానికి చెందిన నాకు సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టాలనేది కల. ఓటీటీ వేదికగా ఆ అవకాశం దక్కింది. ఇటీవల 'మోతెవరి లవ్ స్టోరీ' వెబ్ సిరీస్‌లో నటించా. ఓటీటీలు, ఇంటర్నెట్ ద్వారా నాలాంటి ఎందరికో అవకాశాలు లభిస్తున్నాయి.

- తొలెం శ్రీనివాస్, నటుడు, పినపాక



సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణా విమోచన దినోత్సవంపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్



ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరుబాట అంటూ పీడీఎస్‌యూ రూపొందించిన పోస్టర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



దమ్ మారో దమ్..

- గంజాయి మత్తులో జోగుతున్న యువత
- గంజాయి సేవించే విధానంలో కొత్త పంథా..
- ఉడకబెట్టి గంజాయి ద్రావణాన్ని తాగుతున్న విద్యార్థులు
- అరకునుంచి రైళ్లలో దిగుమతి చేసుకుంటున్న వ్యాపారులు
- ప్రత్యేక కోడ్ లాంగ్వేజ్‌తో ఇన్‌స్టా గ్రామ్‌లో చాటింగ్‌లు
- 'స్కోర్' అంటే గంజాయి.. 'సెక్షన్' అంటే కలుసుకునే ప్రదేశం
- గంజాయి పొగ పీల్చేందుకు పఫ్ స్మార్ట్ మెటల్ బ్యాంగ్ మూటర్ పైప్‌ను వినియోగిస్తున్న యువకులు
- ప్రొద్దుటూరులో శరవేగంగా అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్న గంజాయి



ఇటీవల గంజాయి విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డ యువకులు



పొట్లాల్లో విక్రయిస్తున్న గంజాయి

ప్రొద్దుటూరు క్రైం: 'రేయ్ రాజు ఎక్కడున్నావ్ రా.. నా దగ్గర 'స్కోర్' అయిపోయింది. నిన్ననే నువ్వు తీసుకున్నావ్ అంట కదా.. అర్జంట్‌గా స్కోర్ తీసుకొని సెక్షన్‌కు రా.. అక్కడికి నేను వస్తున్నాను' ఇటీవల గంజాయి కేసుల్లో పట్టుబడిన విద్యార్థుల సెల్‌ఫోన్లను పోలీసులు పరిశీలించగా ఇలాంటి సంభాషణలు కనిపించాయి. వాటిని చూసి పోలీసులు సైతం నివ్వెర పోయారు. గంజాయి అనేది ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదు. ఎప్పటి నుంచే అందుబాటులో ఉంది. అయితే నాడు వృద్ధులు, భిక్షాటన చేసే వాళ్లు సేవించేవాళ్లు. అప్పట్లో దీన్ని వ్యాపార దృక్పథంతో కాకుండా వ్యసన పరులు గంజాయి మొక్కలను ఇంటి పెరట్లో పెంచేవారు. అయితే ప్రస్తుతం గంజాయి రూ. లక్షలు కురిపించే వ్యాపారంగా మారింది. వైఎస్సార్ కడప జిల్లాలో వ్యాపార కేంద్రంగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో గంజాయి వ్యాపారం రోజురోజుకు విస్తరిస్తోంది. అన్ని వ్యాపారాల మాదిరే ఇప్పుడు గంజాయి వ్యాపారం కూడా ఇక్కడ పెద్ద ఎత్తున జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

విద్యార్థులే లక్ష్యంగా వ్యాపారం

ప్రొద్దుటూరులో కొన్నేళ్ల క్రితం వరకు గంజాయి ఊసేలేదు. ప్రతి శనివారం ఇతర ప్రాంతాల నుంచి భిక్షాటన నిమిత్తం ఇక్కడికి వచ్చే కొందరు వ్యక్తుల వద్ద మాత్రమే దొరికేది. అయితే ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయిని ఆదాయ వనరుగా మార్చారు. కొందరు వ్యక్తులు విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని గంజాయి వ్యాపారం చేస్తున్నారు. అరకు నుంచి ప్రొద్దుటూరుకు రైళ్లలో తెస్తున్నారు. అక్కడ 1 కిలో రూ. 5000లకు తీసుకొచ్చి ప్రొద్దుటూరులో రూ.15 వేలకు విక్రయిస్తున్నారు. కిలోల లెక్కన కొనుగోలు చేసిన వ్యక్తులు పొట్లాల రూపంలో స్థానికంగా ఉన్న విద్యార్థులకు అమ్ముతున్నారు. ఒక్కో పొట్లం రూ.200, రూ.300 రూ.500లకు విక్రయిస్తున్నారు. గ్రూప్ ప్యాక్ అయితే (విద్యార్థులు పెట్టుకున్న పేరు) రూ. 1000కి విక్రయిస్తారు. ఒక్క పొట్లం గంజాయిని 5–6 మంది కలిసి సేవిస్తారు. గ్రూప్ ప్యాక్ అయితే 10 మందికి పైగా కలిసి ఉపయోగిస్తారు. ఇక్కడి నుంచి జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కడప, గండికోట ప్రాంతాలకు కూడా గంజాయిని పంపిస్తున్నట్లు తెలుస్తోంది.

అరకొర దాడులతో కట్టడి సాధ్యమా

పట్టణంలో పెద్ద ఎత్తున గంజాయి వ్యాపారం సాగుతోంది. విద్యార్థులు సైతం దీని బారిన పడటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయితే పోలీసుల అరకొర దాడులు, నిఘా లోపం కారణంగా గంజాయి కట్టడి కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా గతేడాది ఆగస్టు నుంచి ఇప్పటి వరకు ప్రొద్దుటూరు పోలీసులు 10 గంజాయి కేసులు నమోదు చేసి 35 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 12కిలోలుపైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ప్రొద్దుటూరు ఎక్సైజ్ పోలీసులు గంజాయి స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజుల వ్యవధిలోనే 7 కేసులు నమోదు చేసి 20 మందిని అరెస్ట్ చేశారు. 13 కిలోలుపైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి సేవించే వారికి క్యాన్సర్ ముప్పు

గంజాయి ప్రభావం శరీరంలోని అన్ని భాగాలపై పడుతుందని నిపుణులు చెబుతున్నారు. గంజాయి నుంచి విడుదలయ్యే టెట్రాహైడ్రోకానాబినాల్ రసాయనం మనిషి జుట్టులో 90 రోజులు, మూత్రంలో 30 రోజులు, లాలాజలంలో 24 గంటలు, రక్తంలో 12 గంటల పాటు ఉంటుంది. అయితే ఆయా వ్యక్తులు ఎన్ని సార్లు గంజాయిని తీసుకుంటారనే దానిపై ఇది ఆధారపడి ఉంటుందని నిపుణులు అంటున్నారు. దీనిలోని టీహెచ్‌సీ రసాయనం శరీరంలోని అనేక కణజాలాలు, అవయవాలకు చేరుతుంది. టీహెచ్‌సీ మత్తును పెంచుతుందని, గంజాయిని పీల్చుకున్న వెంటనే ఇది రక్తంతో పాటు మెదడుకు చేరకుంటుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో మెదడులోని న్యూరాన్లు అదుపు తప్పుతాయని అంటున్నారు. తద్వారా నిరాశ, మానసిక సమస్య వస్తుంది. గంజాయి సేవించే వారిలో క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటుంది.

గంజాయి సేవించే విధానంలో కొత్త పంథా..

సాధారణంగా గంజాయి పొగను పీల్చుకొని ఆనందం పొందుతుంటారు. అయితే ప్రొద్దుటూరులోని యువకులు కొత్తదనంతో గంజాయిని ఆస్వాదిస్తున్నారు. గంజాయి ఎండు మొక్కలను నీళ్లలో ఉడకబెట్టి వాటి ద్రావణాన్ని తాగుతూ మత్తులోకి వెళ్తున్నారు. కొందరు విద్యార్థులు గంజాయి పొగను పీల్చడానికి పఫ్ స్మార్ట్ మెటల్ బాంగ్ షూటర్ పైప్‌ను ఉపయోగిస్తున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో తెప్పించుకొని మరీ వాడుతున్నారు. ఇంకొందరు యువకులైతే ఓసీబీ పేపర్‌లో గంజాయి చుట్టుకొని సేవిస్తున్నారు. ఓసీబీ పేపర్లు కూడా స్థానికంగా ఉన్న కొన్ని దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ఇక యువకులు అధిక శాతం సిగరేట్లలో గంజాయి నింపుకొని తాగుతున్నారు.



గంజాయి పొగపీల్చడానికి యువకులు ఉపయోగిస్తున్న మెటల్ బ్యాంగ్ షూటర్ పైప్

గంజాయినే ఎందుకు వాడుతున్నారంటే..



'మార్కెట్‌లో లభించే అనేక రకాల మద్యం మత్తును కలిగిస్తుంది కదా.. అవన్నీ అందుబాటులో ఉండగా గంజాయికి ఎందుకు అలవాటు పడ్డారు..' అని గంజాయి కేసులో పట్టుబడిన యువకులను పోలీసులు ప్రశ్నించారు. అందుకు వారు చెప్పిన సమాధానం ఏంటంటే.. 'మద్యం తాగితే మహా అంటే రెండు, మూడు గంటలు మత్తులో ఉంటాం. అదీ గాక మద్యానికి ఎక్కువ డబ్బు ఖర్చు అవుతుంది. కానీ గంజాయి పొగను ఒక సారి పీల్చితే రెండు, మూడు రోజుల పాటు అదే మత్తులో ఉంటాం. పైగా తక్కువ ఖర్చుతో ఇది లభిస్తుంది. అందుకే దీనికి అలవాటు పడ్డాం..'అని యువకులు బదులిచ్చారు. కాగా ప్రొద్దుటూరులోని బొల్లవరం బైపాస్‌రోడ్డు, రామేశ్వరం ప్రభుత్వ పక్కా గృహాల సముదాయ ప్రాంతం, మోడంపల్లె బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో యువకులంతా పోగై గంజాయిని సేవిస్తున్నారు. పట్టణంలోని రామేశ్వరం, జిన్నా రోడ్డు, మోడంపల్లె, దస్తగిరిపేట, శ్రీనివాసనగర్, అమృతానగర్ తదితర ప్రాంతాల్లో గంజాయి సేవించే యువకులు అధికంగా ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసు వర్గాల సమాచారం.

ప్రత్యేక కోడ్ లాంగ్వేజ్..

ప్రొద్దుటూరులో ఇంజినీరింగ్ కాలేజీలతో పాటు ఇంటర్, డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ఇటీవల ఎక్సైజ్, పోలీసు అధికారులు దాడులు నిర్వహించి గంజాయి విక్రయిస్తున్న పలువురిని అరెస్ట్ చేశా రు. ఇలా అరెస్ట్ అయిన నాలుగైదు కేసుల్లోనూ ఇంటర్, డిగ్రీ, బిటెక్ చదువుతున్న విద్యార్థులే ఉన్నారు. పోలీసుల విచారణలో అనేక విష యా లు వెలుగు చూశాయి. విద్యార్థులు ప్రత్యేక కోడ్ లాంగ్వేజ్‌తో ఇన్‌స్టాగ్రాంలో చాటింగ్ చేస్తున్నారు. గంజాయికి వీరు పెట్టుకున్న పేరు 'స్కోర్'. వీరంతా కలుసుకునే ప్రాంతాన్ని 'సెక్షన్' గా పిలుచుకుంటారు. మొబైల్‌లోని వారి ఇన్‌స్టా గ్రాంలను ఎవరైనా చెక్ చేసినా గుర్తు పట్టకుండా ఉండేందుకు ఈ కోడ్ లాంగ్వేజ్‌ను ఎంచుకున్నారు.

గంజాయి అమ్మకాలపై నిఘా పెట్టాం



గంజాయి అమ్మకాలపై నిఘా పెట్టాం. మాకు సమాచారం వచ్చిన వెంటనే ఆకస్మిక దాడులు చేస్తున్నాం. ఇటీవల పట్టుబడిన వారిలో విద్యార్థులే అధికంగా ఉన్నారు. తల్లిదండ్రులు దృష్టి సారించపోతే పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుంది. గంజాయికి బానిస అవుతున్న వారు కొత్త పద్ధతుల్లో మత్తును ఆస్వాదిస్తున్నారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తుంటే మాకు సమాచారం అందించండి.

– సురేంద్రారెడ్డి, ప్రొద్దుటూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

చింతలపూడిలో నల్ల బంగారం

- మెట్టలో విస్తారంగా బొగ్గు నిక్షేపాలు
- ఎట్టకేలకు రేచర్ల బ్లాక్‌కు టెండర్ల ప్రక్రియ
- నేడు ప్రీబిడ్ సమావేశం
- 22 కిలోమీటర్ల పరిధిలో 2.225 మిలియన్ టన్నుల నిల్వలు
- వచ్చేనెల 27 వరకు టెండర్ల దాఖలుకు గడువు
- నవంబర్ నెలాఖరుకు ఈ–ఆక్షన్



చింతలపూడి ప్రాంతంలో అధునాతన యంత్రాలతో బొగ్గు అన్వేషణ చేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లా చింతలపూడికి మహర్దశ పట్టనుంది. సుమారు రెండు దశాబ్దాలుగా విస్తృతంగా చర్చల్లో ఉన్న బొగ్గు నిల్వల వ్యవహారం కొలిక్కి వచ్చింది. ఏయే ప్రాంతాల్లో ఏ మేర నిల్వలు ఉన్నాయనే గుర్తింపులు పూర్తి చేసి వేలం దశకు కేంద్రం తీసుకువచ్చింది. దీనిలో భాగంగా జిల్లాలో మొదటిగా చింతలపూడి మండలం రేచర్ల బొగ్గు బ్లాక్‌కు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. సోమవారం ప్రీబిడ్ సమావేశం నిర్వహించి వచ్చే నెల 27 వరకు టెండర్లు తీసుకునేలా కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.

గ్రేడ్–1 నిల్వలు

జిల్లాలోని మెట్ట ప్రాంతమైన చింతలపూడి నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో అపార బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. అది కూడా గ్రేడ్–1 నిల్వలు ఉన్నట్టు అధికారికంగా నిర్ధారించారు. 1964 నుంచి 2004 వరకు కేంద్ర ప్రభుత్వం నాలుగు దఫాలుగా రకరకాల సర్వేలు నిర్వహించింది. మళ్లీ 2006 నుంచి 2016 వరకు సర్వే ప్రక్రియ అత్యంత వేగంగా కొనసాగింది. ప్రధానంగా ఏలూరు, ఖమ్మం జిల్లాల సరిహద్దులో 2,500 చదరపు కిలోమీటర్ల పరిధిలో అపార నల్ల బంగారం నిక్షేపాలున్నట్టు గుర్తించింది. గతంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ దీనిపై కేంద్రానికి కూడా నివేదిక పంపింది. ఈ పరిణామాల క్రమంలో చింతలపూడి, టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం మండలాల్లో కొన్ని గ్రామాల్లో గ్రేడ్–1 బొగ్గు భూగర్భంలో ఉన్నట్టు గుర్తించారు. గతంలో చింతలపూడి మండలంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నిపుణుల బృందం సర్వే నిర్వహించింది.



జీఎస్ఐ సర్వేలో బొగ్గు నిల్వలు ఉన్న ప్రాంతం నుంచి సేకరించిన శాంపిల్స్ (ఫైల్)

లక్నోకు చెందిన బీర్బల్ సహాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలియోబొటానీ అనే సంస్థ 2013లో ఉభయగోదావరి, కృష్ణా, ఖమ్మం జిల్లాల్లో సర్వే చేసింది. ప్రధానంగా గోదావరి పరీవాహక ప్రాంతంలోని చింతలపూడి, ముసునూరు మండలాల్లో సర్వే నిర్వహించింది. గతేడాది కేంద్రానికి నివేదిక సమర్పించి బొగ్గు ఉన్న ప్రాంతాలను బ్లాక్‌లుగా విభజించి వేలం ప్రక్రియకు శ్రీకారం చుట్టేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఈ ఏడాది మార్చిలో దేశవ్యాప్తంగా 80 గనుల వేలానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చింతలపూడి బ్లాక్‌ను వేలం జాబితాలో ఉంచినా సింగరేణి సహా ప్రధాన కంపెనీలు పోటీకి రాకపోవడంతో వేలం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో గత వారంలో లాంఛనాలు పూర్తి చేసి టెండర్‌కు సన్నద్ధమయ్యారు. దీనిలో జిల్లాలోని చింతలపూడి మండలం రేచర్ల బొగ్గు బ్లాక్‌తో పాటు దేశవ్యాప్తంగా మరో 13 బ్లాక్‌లకు కలిపి టెండర్లకు ఆహ్వానించారు. 22.24 చదరపు కిలోమీటర్ల పరిధిలో రేచర్ల కేంద్రీకృతంగా యర్రగుంటపల్లి, సీతానగరం, మేడిశెట్టివారిపాలెం, లింగగూడెం, రాఘవాపురం తదితర గ్రామాల్లో బొగ్గు నిల్వలను నిర్ధారించారు.

2.225 మిలియన్ టన్నులే

ఆంధ్రా–తెలంగాణ సరిహద్దు సమీపంలో ఉన్న రేచర్ల బొగ్గు బ్లాక్ పరిధి 22.24 చదరపు కిలోమీటర్లు. ఇక్కడ జీ–13 గ్రేడ్ బొగ్గు లభిస్తుందని, 623 మీటర్ల లోతు నుంచి గరిష్ఠంగా 1,123 మీటర్ల లోతులో నిల్వలు ఉన్నాయని, 2,225.63 మిలియన్ టన్నుల నిల్వలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని అంచనా వేసి టెండర్లను ఆహ్వానించారు. సోమవారం ప్రీబిడ్ సమావేశం నిర్వహించి వచ్చే నెల 27 వరకు టెండర్ దాఖలుకు తుది గడువుగా ప్రకటించారు. 28న టెక్నికల్ బిడ్‌లు తెరిచి నవంబర్ చివరి వారంలో ఈ–వేలం ద్వారా బొగ్గు గనిని కేటాయించనున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో పీపీపీ పద్ధతిలో మెడాల్ ప్రాజెక్టు అనంతపురంలోనే పురుడు పోసుకుంది. 2014–19 మధ్య కాలంలో రక్తపరీక్షల పేరుతో భారీగా దోపిడీ సాగించింది. రక్త పరీక్షలు చేయకుండానే చేసినట్టు చూపి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టింది. ఇప్పుడు మళ్లీ అనంతపురం సభలో మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తామంటూ సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వడంతో 'మెడాల్' దోపిడీని అందరూ గుర్తు చేసుకుంటున్నారు. మళ్లీ అనంతపురం నుంచే దోపిడీకి ఆజ్యం పోస్తూ చేసిన ప్రకటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పీపీపీకి ఫుల్‌స్టాప్ పెట్టి ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ల్యాబులను ఉన్నతీకరించి పేదలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటే.. చంద్రబాబు మళ్లీ ఇప్పుడు ఆరోగ్య రంగాన్ని అగాథంలోకి నెట్టేలా నిర్ణయాలు తీసుకుంటుండడంపై ప్రజలు మండిపడుతున్నారు.



అనంత నుంచే.. దోపిడీకి రాచబాట

- గత టీడీపీ ప్రభుత్వంలో 'పీపీపీ' మాటున రూ. కోట్లు కొల్లగొట్టిన మెడాల్
- అప్పట్లో అనంతపురంలోనే పురుడు పోసుకున్న ప్రాజెక్టు
- రక్తపరీక్షలు చేయకుండానే చేసినట్టు చూపి ఖజానాకు కన్నం
- ఇప్పుడు మెడికల్ కాలేజీలు పీపీపీలోకి అంటూ 'అనంత'లోనే బాబు స్పష్టత
- దోపిడీకి మళ్లీ జిల్లా నుంచే రాచబాట వేశారంటూ సర్వత్రా విమర్శలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పీపీపీ.. క్లుప్తంగా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్. ఈ పేరు టీడీపీకి బాగా అలవాటైన పదం. గతంలో పీపీపీ పేరున 'నీకింత నాకింత' అన్న చందాన దోచుకున్న తీరు రాష్ట్ర ప్రజలందరికీ గుర్తుండే ఉంటుంది. అసలు ఈ పీపీపీ పద్ధతి పురుడు పోసుకున్నదే అనంతపురం జిల్లాలో కావడం గమనార్హం. అనంతపురం కరువు జిల్లా అని, తనకు ప్రాణమని చెప్పే చంద్రబాబు ఇక్కడి నుంచే దోపిడీ మొదలుపెట్టారనే విమర్శలు ఉన్నాయి.

మూడు నెలల్లోనే రాష్ట్రమంతటా..

2014లో రాష్ట్రం విడిపోయింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు అధికారం చేపట్టారు. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా రక్తపరీక్షల నిర్వహణ ప్రైవేటుకు అప్పజెబుతూ నిర్ణయించారు. దీనికి బీజం అనంతలోనే వేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఇక్కడ 6 మాసాలు నిర్వహించి ఆ తర్వాత అన్ని జిల్లాలకు విస్తరించాలనేది యోచన. అయితే, మూడు నెలలు కూడా అమలు కాకనే రాష్ట్రవ్యాప్తంగా అమలుకు ఆదేశాలిచ్చారు.

ఇప్పుడు మళ్లీ..

'సూపర్‌సిక్స్–సూపర్‌హిట్' అంటూ అమలు కాని పథకాలనూ అమలు చేసినట్లు డప్పు కొట్టుకున్న 'అనంత' వేదిక నుంచే మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్వహించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడం గమనార్హం. ఇప్పటికే పెనుకొండలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల పనులు కూటమి సర్కారు వచ్చాక నిలిచిపోయాయి. 50 ఎకరాల్లో రూ.375 కోట్లతో కళాశాలను నిర్మించాలని గత వైఎస్సార్ సీపీ సర్కారు యోచించింది. అప్పట్లోనే రూ.30 కోట్లు ఖర్చు చేసింది. కానీ చంద్రబాబు తాజాగా 'పీపీపీ' అనడంతో పెనుకొండ మెడికల్ కాలేజీకి గ్రహణం పట్టినట్టయింది. స్వయానా ఈ నియోజకవర్గం నుంచి మంత్రిగా ఉన్న సవిత కళాశాలను కాపాడుకోవాల్సి పోయింది మౌనంగా ఉండటం మరిన్ని విమర్శలకు తావిస్తోంది.

రూ.300 కోట్ల దోపిడీ..

2019 నాటికి అంటే ఆరేళ్ల క్రితమే పీపీపీ పద్ధతి ద్వారా అనంతపురం జిల్లాలో బీజం పడిన ఈ ప్రాజెక్టు ద్వారా సదరు ప్రైవేటు సంస్థ రూ.300 కోట్ల అవినీతికి పాల్పడినట్టు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లాలోని పలు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో రక్తపరీక్షలు చేయకపోయినా చేసినట్టు డాష్‌బోర్డులో చూపి కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారు. 2019 తర్వాత కొత్త సర్కారు వచ్చాక పీపీపీ పద్ధతిని రద్దు చేసి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సొంతంగా రక్త పరీక్షల నిర్వహణకు లేబొరేటరీలు పునరుద్ధరించింది.

ప్రైవేటు వ్యక్తులైతే జవాబుదారీగా ఉంటారట..!

మెడికల్ కాలేజీలన్నీ ప్రైవేటుకు అప్పజెబుతున్నాం. పీపీపీ పద్ధతిలో ఇవ్వాలని నిర్ణయించాం. ప్రైవేటు వ్యక్తులైతే నిర్వహణ పరంగా జవాబుదారీగా ఉంటారు. ప్రభుత్వానికి 50 శాతం సీట్లు వస్తాయి. మీకు ఏం తెలుసని మాట్లాడుతున్నారు.

– ఈనెల 10న అనంతపురంలో జరిగిన సభలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలివీ

ప్రగఢ కోటయ్య పేరుతో చేనేత పార్క్ ఏర్పాటు చేయాలి

పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు



సమావేశంలో పాల్గొన్న కందగట్ల స్వామి, నాగేశ్వరరావు తదితరులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): చేనేత బంధు ప్రగడ కోటయ్య పేరుతో మంగళగిరిలో చేనేత పార్క్, మ్యూజియం ఏర్పాటు చేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.వి.నాగేశ్వరరావు కోరారు. ఆదివారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ పద్మశాలీయులకు నామినేటెడ్ పదవులిచ్చి సముచిత స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ.. చేనేత ప్రగడ కోటయ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.



నకిలీ వలలో గెలగిల!

ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో నిండా మునిగిన అరటి రైతులు / తోటలు ఏపుగా పెరిగినా దిగుబడి రాకపోవడంతో ఆందోళన

త్రిపురాంతకం: అరటి సాగు చేసిన రైతుల ఆశలు ఆవిరైపోయాయి. నకిలీ కాటుకు రైతులు ఆర్థికంగా బలయ్యారు. అరటి చెట్లు ఏపుగా పెరిగినా దిగుబడి రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలో రైతులు గత ఏడాది కాలంగా అరటి తోటలు విస్తారంగా సాగు చేస్తున్నారు. గతంలో మిరప, వరి, ఇతర పంటలను సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అరటి సాగుపై దృష్టి సారించారు. మండలంలో సుమారు 150 ఎకరాల వరకు అరటి తోటలు సాగవుతుండగా ముందస్తుగా నాటిన తోటలు కాపుదశకు చేరుకున్నాయి. ఏపుగా పెరిగిన అరటి చెట్లను చూసి ఆనందించిన రైతులు.. రోజులు గడుస్తున్నా అరటి గెలలు కాయకపోతుండటంతో ఆందోళనకు గురయ్యారు. సోమేపల్లి, శ్రీనివాసనగర్, మిరియంపల్లి, వెల్లంపల్లి గ్రామాల్లో సాగు చేసిన 15 ఎకరాల తోటల్లో ఒకటీ అరా గెలలు తప్ప పూర్తి స్థాయిలో కాపు రాలేదు. పంట చేతికొస్తే పెట్టుబడి సొమ్ము రూ.2 లక్షలకు పైగా పోను ఎకరాకు కనీసం రూ.2 లక్షల లాభం వస్తుందని ఆశించిన రైతులు.. ప్రస్తుత పరిస్థితి చూసి తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అరటికి ఈ క్రాప్ చేయించామని, పంట నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎకరాకు రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి

ఒక్కో అరటి మొక్కను రూ.12 నుంచి రూ.15 వరకు వెచ్చించి కొనుగోలు చేసిన రైతులు ఎకరాకు 1200 నుంచి 1400 మొక్కలు నాటారు. మొక్కలకు అవసరమైన గెడలు, సేద్యం ఖర్చులు, ఎరువులు, కూలీల ఖర్చు ఇలా మొత్తం రూ.2.50 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టారు. దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి మొత్తం బూడిదలో పోసిన పన్నీరైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



త్రిపురాంతకం మండలంలో పంట పండక మోడువారిన అరటి తోట

పంట రాకపోతే నేనేం చేస్తా?

పది నెలల క్రితం సాగు చేసిన అరటి మొక్కలు ప్రస్తుతం 12 అడుగుల వరకు పెరిగాయి. గెలలు వస్తాయని ఎదురుచూస్తున్న రైతులు ఇటీవల అనుమానం రావడంతో ఉద్యానశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తోటలను పరిశీలించిన అధికారులు అరటి మొక్కలకు కాపురాదని చెప్పడంతో రైతులు విస్తుపోయారు. 'నర్సరీ యజమాని మంచి కాపు వస్తుందని చెప్పడంతో వాటిని ఎంపిక చేసుకుని అందించా. ఫలసాయం రాకపోతే నేనేం చేస్తా' అని దళారి మాట దాటవేస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు.



త్రిపురాంతకం మండలంలో సాగు చేస్తున్న అరటి తోటలు

ఇలా నష్టపోతామనుకోలేదు



ఎకరా పొలంలో అరటి సాగు చేశా. సుమారు 1200 మొక్కలు నాటా. పెట్టుబడి రూ.3 లక్షలు ఖర్చయింది. తోటలో అక్కడక్కడా ఓ గెల కనిపిస్తోంది. ఇదేం అన్యాయమో గతంలో ఎన్నడూ లేని విధంగా పంట నష్టపోయా. ఏడాదిపాటు కష్టం చేసినా పంట రాకుండా పోయింది. ఇప్పుడు మమ్మల్ని ఆదుకునేదెవరు. అరటి రైతుకు నష్ట పరిహారం అందించేలా చూడాలి.

– టి.బొర్రయ్య, శ్రీనివాసనగర్

ప్రభుత్వం ఆదుకోవాలి




ఎకరా పొలంలో 14 వందల మొక్కలు నాటా. ఏడాది కాలంగా మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. తోట మొత్తం మీద 300 మొక్కలకు అక్కడక్కడా గెలలు కనిపిస్తున్నాయి. రైతులం ఘోరంగా దెబ్బతిన్నాం. ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టాం. ఇక పంట రాదని చెబుతున్నారు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ఆర్.బాలరాజు, శ్రీనివాసనగర్

ప్రకృతికి పక్షపాతం కొంచెం ఎక్కువే.
దక్షిణాదిన కేరళను అక్కున చేర్చుకుంది.
ఉత్తరాన ఉత్తరాఖండ్‌ను ఒడిలో దాచుకుంది.
'గాడ్స్ ఓన్ కంట్రీ' అనే భుజకీర్తి ఒకరిది.
'దేవభూమి' అనే అతిశయం మరొకరిది.
ఆ రెండు రాష్ట్రాల్లో పుట్టని వాళ్లేం చేయాలి?
వీలయినప్పుడు అక్కడికి వెళ్లి చూసి రావాలి?
హైదరాబాద్‌లో రైలెక్కి ఢిల్లీలో రైలు దిగుదాం.
ఢిల్లీలో బస్సెక్కి ఉత్తరాఖండ్ టూర్‌కి చెక్కేద్దాం.
ఇది... మూడు వేల అడుగుల ఎత్తు మొదలు...
ఏడు వేల అడుగుల ఎత్తుకు సాగే ప్రయాణం.


కోసి రివర్ వ్యాలీ, అల్మోరా, ఉత్తరాఖండ్


కాసర్ దేవి టెంపుల్

• గ్రీన్ ట్రయాంగిల్

ప్రకృతి చెక్కిన అద్భుతం

1వ రోజు ఉదయం ఆరు గంటలకు ట్రైన్ నంబర్ 12723 తెలంగాణ ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ నుంచి బయలుదేరుతుంది.

2వ రోజు ఉదయం 7.40 గంటలకు ఢిల్లీ స్టేషన్‌కు చేరుతుంది. హోటల్‌లో రిఫ్రెష్‌మెంట్, బ్రేక్‌ఫాస్ట్ తరవాత కార్బెట్‌కు ప్రయాణం. కార్బెట్‌కు చేసేటప్పటికి సాయంత్రం అవుతుంది. అక్కడ హోటల్ గదిలో చెక్, రాత్రి భోజనం, బస.


3వ రోజు తెల్లవారు జామున లేచి కార్బెట్ సఫారీకి వెళ్లడం, జలపాతాల వీక్షణం తర్వాత హోటల్‌కి వచ్చి బ్రేక్‌ఫాస్ట్, రిఫ్రెష్‌మెంట్ తర్వాత గది చెక్ అవుట్ చేయాలి. నైనితాల్‌కు ప్రయాణం. నైనితాల్‌లో హోటల్‌లో చెక్ ఇన్, రాత్రి భోజనం, బస అక్కడే.


వేటగాడి జ్ఞాపకం!

చందమామ కథల్లో చెప్పుకున్నట్లు కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవి కాదు కానీ ఇది దట్టమైన అటవీప్రదేశం అని చెప్పడంలో సందేహం లేదు. బ్రిటిష్ పాలన కాలంలో ఏర్పాటయిన నేషనల్ పార్క్ ఇది. తొలి తొలి నేషనల్ పార్క్ కూడా. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జిమ్ కార్బెట్ పార్కుగా పేరు మార్చుకుంది. ఇది పులుల సంరక్షణ కేంద్రం. నిజానికి పులులను సంరక్షించడంలో జిమ్ కార్బెట్ పాత్ర ఏమీ లేదు. ఇతడు గొప్ప వేటగాడు. కుమావ్ రీజియన్‌లో మనుషులకు హాని కలిగిస్తున్న పులులను, చిరుత పులులను హతమార్చిన ఘనత ఇతడిది. తన పులుల వేట కథనాలను రాశాడు కూడా. జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ సఫారీలో మనకు పులులు, ఏనుగుల గుంపులు, జింకలు, రకరకాల పక్షులు కనువిందు చేస్తాయి. నగరవాసుల ఈ టూర్ ఒక లైఫ్ టైమ్ ఎక్స్‌పీరియన్స్‌గా మిగులుతుంది. ఈ ప్రదేశం హిమాలయ పర్వత శ్రేణుల్లో భాగమైన శివాలిక్ రీజియన్ ఉంది. అటవీప్రదేశంలో పర్వతసానువులు, జలపాతాలు కూడా ఉన్నాయి. అడవి మధ్యలో ప్రవహిస్తున్న రామ్ గంగ నది, దాహం తీర్చుకోవడానికి నది తీరానికి వచ్చిన జంతువులను చూస్తూ పిల్లలు కేరింతలు కొడతారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం ఎకో టూరిజమ్ పాలసీ అమలులో ఉంది. కాబట్టి ప్రకృతికి, వన్యప్రాణులకు హాని కలిగించే వస్తువులను అనుమతించరు.



జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లోని వన్యప్రాణులు




జామా మసీద్, నైనిటాల్


4వ రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత నైనితాల్ లోని పర్యాటక ప్రదేశాల సందర్శనం. రాత్రి బస నైనితాల్‌లో.

ప్రకృతి అద్భుతం ఈ నయనం!

నైనితాల్ పట్టణానికి పౌరాణిక ప్రాశస్త్యంతోపాటు రాజకీయ ప్రాధాన్యం కూడా ఉంది. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్ (వింటర్ క్యాపిటల్, వింటర్ సెషన్స్), నైనితాల్ సమ్మర్ క్యాపిటల్, అలాగే జ్యుడిషియల్ క్యాపిటల్ కూడా, గవర్నర్ బంగ్లా కూడా నైనితాల్‌లోనే. తాల్ అంటే సరస్సు, నయనం (కన్ను) ఆకారంలో ఉంటుంది కాబట్టి ఈ తటాకానికి నైనితాల్ అని పేరు. ప్రకృతి దేవత రూపంలో కొలిచే సంస్కృతిలో భాగంగా నెలకొన్న నయనాదేవి (నైనాదేవి) ఆలయం కూడా ఉంది. ఇక్కడ ఒక పర్వత శిఖరానికి నైనా పీక్ అని పేరు. అది ఎనిమిది వేల అడుగులకు పైగా ఉంటుంది. చర్చ్, ప్రాచీన కాల నిర్మాణశైలి మసీదు నిర్మాణశైలి సునిశితంగా ఉంటుంది. హనుమాన్ ఘరి ఆలయం నైనితాల్‌లోని మాల్ రోడ్‌లో ఉంది. ఈ ఆలయం ఉన్న ప్రదేశం మంచి వ్యూ పాయింట్. ఇక్కడి నుంచి సూర్యోదయం, సూర్యాస్తమయాలు అద్భుతంగా ఉంటాయి. మంచు దుప్పటి కప్పుకున్న హిమాలయ శిఖరాలను కూడా చూడవచ్చు.



- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి


అల్మోరా, ఉత్తరాఖండ్

గ్రీన్ ట్రయాంగిల్ ఆఫ్ ఉత్తరాఖండ్ (ఎస్‌హెచ్‌ఆర్047). ఇది ఎనిమిది రోజుల యాత్ర. ఇందులో నైనితాల్, అల్మోరా, ముక్తేశ్వర్, ఢిల్లీ ప్రదేశాలు కవర్ అవుతాయి.

ప్యాకేజ్ ఇలా:

- కంఫర్ట్ కేటగిరీ (థర్డ్ ఏసీలో ప్రయాణం) ట్విన్ షేరింగ్లో ఒక్కొక్కరికి 40,360 రూపాయలు, ట్రిపుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 37,590 రూపాయలవుతుంది.
- స్టాండర్డ్ కేటగిరీ (స్లీపర్‌లో ప్రయాణం) ట్విన్ షేరింగ్‌లో 37,100 రూపాయలు, ట్రిపుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 34,330 రూపాయలవుతుంది.
- ప్యాకేజ్‌లో పర్యాటక ప్రదేశాల ఎంట్రీ టికెట్‌లు, టూర్ గైడ్, లాండ్రీ సర్వీస్, రైల్లో ఆహారం, నైనితాల్‌లో లోకల్ రవాణా వర్తించవు.

గమనిక: నైనితాల్ పట్టణంలోని ట్యాక్సీ యూనియన్ నిర్ణయం ప్రకారం పర్యాటకులు సైట్‌సీయింగ్‌కి ఆ పట్టణంలోని ట్యాక్సీల్లోనే ప్రయాణించాల్సి ఉంటుంది. బయటి టూరిస్టు వాహనాలను అనుమతించరు. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

ప్యాకేజ్ కోడ్ : https://www.irctctourism.com/pacakage_description?packageCode=SHR047

5వ రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత అల్మోరా, ముక్తేశ్వర్ దిశగా ప్రయాణం. దర్శనం తర్వాత తిరిగి నైనితాల్‌కు చేరాలి. రాత్రి బస నైనితాల్‌లో.

ఇక్కడ ఆది మానవుడు నివసించాడు!

అల్మోరాలో చూడాల్సిన ప్రదేశాలు ఏమున్నాయి అనే ప్రశ్న ఉదయిస్తుంది. దీనికి జవాబు ఇది ఒక అందమైన ప్రదేశం. ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడానికి వచ్చిన ప్రముఖుల పాదముద్రలే పర్యాటక ప్రదేశాలు. స్వామి వివేకానందుడు ప్రకృతి సౌందర్యం, ప్రశాంతతల మధ్య ధ్యానం చేసుకోవడానికి సరైన ప్రదేశంగా ఎంచుకున్నాడు. మహాభారత కాలంలో కూడా ఈ ప్రదేశం ప్రస్తావన ఉంది. అది కేవలం పుక్కిటి పురాణం కాదనడానికి నిదర్శనంగా చంద్ రాజవంశం నివసించిన భవనాలున్నాయి. రాజ భవనాలంటే మనకు రాజస్థాన్ కోటలు, ప్యాలెస్‌లే గుర్తొస్తాయి. కానీ ఇక్కడి రాజభవనాన్ని చూస్తే రాజు అత్యంత నిరాడంబరంగా జీవించాడనిపిస్తుంది. పెద్ద రాతి గోడలు, ఆకు పచ్చ రంగు రేకులతో ఏటవాటు పైకప్పు భవనమే చంద్ రాజవంశపు కోట. కుమావ్ పర్వతశ్రేణుల్లో రాజ్యాన్ని స్థాపించి అల్మోరా రాజధానిగా పాలించారు. ప్రాచీనకాలంలో ఇక్కడ మనుషులు నివసించారని నిరూపించే లఖుదియార్ గుహలున్నాయి. క్రికెట్ క్రీడాకారుడు మహేంద్ర సింగ్ ధోనీ పూర్వికులు అల్మోరా వాసులే.

అదిగో మంచుకొండ

ముక్తేశ్వర్ శైవ క్షేత్రం. ఇక్కడి శివుడిని దర్శించుకుంటే ముక్తి లభిస్తుందని చెబుతారు. ఉత్తరాఖండ్ పర్యటనలో హిమాలయాలు పర్యాటకులతో దోబూచులాడుతూ ఉంటాయి. పర్వత సానువుల మధ్య ప్రయాణం సాగుతున్నప్పుడు కొంత మేర ఆకాశాన్నంటే శిఖరాలతో ప్రపంచంతో సంబంధాలు తెగిపోయినట్లయినిపిస్తాయి. ఒక మలుపు తిరగ్గానే సూర్యకిరణాలతో ధగధగలాడుతూ మంచుకొండలు దర్శనమిస్తాయి. కొండవాలులో ప్రయాణిస్తున్నప్పుడు లోయలు వెన్నులో భయాన్ని పుట్టిస్తాయి. గూగుల్ సెర్చ్ చేస్తే ఏడు వేల అడుగుల ఎత్తులో ఉన్నామని చూపిస్తుంది. ఇక భయాన్ని అదిమిపెట్టి లోయవైపు చూడకుండా కొండంత అండగా కనిపిస్తున్న కొండనే చూస్తూ ముందుకు సాగిపోవాలి.



స్వామి నారాయణ్ అక్షర్‌ధామ్, ఢిల్లీ

6వ రోజు బ్రేక్ ఫాస్ట్ తర్వాత ఉదయం గది చెక్ అవుట్ చేసి ఢిల్లీకి ప్రయాణం. ఢిల్లీ చేరేటప్పటికి సాయంత్రం అవుతుంది. అక్షరధామ్ టెంపుల్ సందర్శనం తర్వాత హోటల్‌లో చెక్ ఇన్. రాత్రి బస.

లోహరహిత నిర్మాణం



అక్షరధామ్ ఆలయం విశాలమైన నిర్మాణం. ఇది స్వామి నారాయణ ఆలయం. ఈ ఆలయాన్ని ప్రాచీన భారత శిల్పశాస్త్రాన్ని అనుసరించి నిర్మించారు. ఇంత భారీ నిర్మాణంలో ఎక్కడా లోహాలను ఉపయోగించలేదు. అందుకే పిల్లర్‌లు ఎక్కువగా కనిపిస్తాయి. 234 స్తంభాలున్నాయి. ఒక్కొక్క స్తంభం మీద సునిశితమైన శిల్పచాతుర్యమయం. ఉత్తరాది నిర్మాణాలకు పాలరాయి ఒక వరం అనే చెప్పాలి. పాలరాతితో పూలరెక్కలను కూడా అంతే సున్నితంగా చెక్కగలిగిన నిపుణులు ఉండడం మనదేశ గొప్పదనం. అందుకే పాలరాతి ఆలయాలకు వెళ్లినప్పుడు చుట్టూ చూసి సరిపెట్టుకోకుండా తలెత్తి పైకప్పును కూడా చూడాలి. అక్షరధామ్ ఆలయ సందర్శనంలో వాటర్ ఫౌంటెయిన్‌లు, లేజర్ షోలను మిస్ కాకూడదు.


లోటస్ టెంపుల్, ఢిల్లీ


7వ రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత కుతుబ్‌మినార్, లోటస్ టెంపుల్ సందర్శనం, మధ్యాహ్నం మూడు గంటలకు ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో డ్రాప్ చేస్తారు. నాలుగు గంటలకు 12724 నంబర్ తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరుతుంది. ఎనిమిదవ రోజు సాయంత్రం ఐదు గంటలకు హైదరాబాద్ స్టేషన్‌కు చేరుతుంది.

ఏనాటిదో ఈ మినార్!

కుతుబ్ మినార్ నిర్మాణం గురించి చరిత్ర తవ్వకాల్లో కొత్త సంగతులు బయటకు వస్తున్నాయి. అప్పటికప్పుడు ఓ చిన్న వివాదం, ఆ తర్వాత సమసిపోవడం, కొత్త వాస్తవాలను స్వీకరించడం జరుగుతోంది. ఈ నిర్మాణాన్ని క్రీ.శ పన్నెండవ శతాబ్దంలో కుతుబుద్దీన్ ఐబక్ నిర్మించాడనే ఆధారాలను కొట్టిపారేస్తూ ఐదవ శతాబ్దంలో రాజా విక్రమాదిత్యుడు నిర్మించాడనే ఆధారాలు వ్యక్తమయ్యాయి. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధనలను కొనసాగిస్తోంది. ఈ వాస్తవాలెలా ఉన్నప్పటికీ కుతుబ్ మినార్ కాంప్లెక్స్ ఓ గొప్ప నిర్మాణ విశేషం. అందుకే యునెస్కో దీనిని వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది.

ధ్యాన కలువ


ప్రతి ఆర్కిటెక్చర్ స్టూడెంట్ చూడాల్సిన నిర్మాణం. ఎక్కడా పిల్లర్ లేదు. కలువ రెక్కల లోపల లోహపు కడ్డీల ఆధారంగా నిర్మించారు. గొప్ప ఆధ్యాత్మికత అన్వేషణలో భాగంగా ధ్యానం కోసం నిర్మించిన బహాయీ ధ్యానమందిరం ఇది. లోటస్ టెంపుల్ గిన్నిస్ రికార్డు సాధించిన ఆలయం. ఈ ఆలయం, నిర్మాణ వైశిష్ట్యాలను వివరిస్తూ ఐదు వందల వ్యాసాలు, వార్తాకథనాలు ప్రచురితమయ్యాయి. ఈ ప్రాంగణం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. కానీ శబ్దం వినిపించదు. నిర్వాహకులు పిన్‌డ్రాప్ సైలెన్స్ మెయింటెయిన్ చేస్తారు. చక్కటి గార్డెన్‌ల మధ్య మెల్లగా నడుస్తూ లోపలికి వెళ్లి కొద్ది సేపు ధ్యానం చేసి బయటకు రావడం గొప్ప అనుభూతినిస్తుంది.


కుతుబ్‌మినార్



మీరు చెల్లించేది ధర, మీరు పొందేది విలువ
- వారెన్ బఫెట్,
ప్రముఖ అమెరికన్ ఇన్వెస్టర్

దక్షిణాదిన తొలి 'హంటర్‌హుడ్' ఫెస్టివల్!



శివరామకృష్ణ మిర్తిపాటి
(చెన్నై నుంచి సాక్షి బిజినెస్ ప్రతినిధి)

దుగ్గు దుగ్గు బండిపై 'బుల్లెట్'లా దూసుకెళ్తున్న కుర్రకారు స్ట్రీట్ కల్చర్‌లోనూ దుమ్మురేపుతున్నారు. అందుకే, బుల్లెట్ బండి అంటే ఠక్కున గుర్తొచ్చే రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇప్పుడు ఈ లోకల్ ఆర్టిస్టులకు దన్నుగా నిలుస్తోంది. అర్బన్ రైడర్ల కోసం ప్రత్యేకంగా మలిచిన 'హంటర్ 350' బైక్ స్ఫూర్తితో 'హంటర్‌హుడ్' వేడుకలకు తెర తీసింది. దక్షిణాదిన ఈ తొలి ఫెస్టివల్‌ను తాజాగా చెన్నైలో నిర్వహించింది. బెంగళూరుకు చెందిన ప్రముఖ డీజే బెంకీ బేకు... క్రేజీ రీమిక్స్‌లతో ఈవెంట్‌ను ఆరంభించారు. స్ట్రీట్ ఆర్టిస్టులు వేసిన బైకింగ్ పెయింటింగ్‌లు అబ్బురపరిచాయి. మరోపక్క, స్కేట్‌బోర్డింగ్ మ్యూజిక్ కలగలిపి సాగిన ఈవెంట్ మరో హైలైట్. స్థానిక తీన్మార్ దప్పుల దరువుకు సింగర్లు పాడిన లోకల్ పాటలు వేరే లెవెల్. లోకల్ హిప్‌హాప్ సింగర్స్ ఇక్కీ బెర్రీ, అసల్ కోలార్, ఆరీవు తదితరుల తమిళం, ఇంగ్లీష్ ర్యాప్ సాంగ్స్‌తో ఇక్కడి ఐలాండ్ గ్రౌండ్ మొత్తం దద్దరిల్లింది. ఇక డ్యాన్సర్లు కూడా బీట్‌కు అనుగుణంగా క్రేజీ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. విభిన్న ఆర్టిస్టులు ఈవెంట్ ఆసాంతం స్ట్రీట్ కల్చర్ వైబ్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.

ఏప్రిల్‌లో తొలిసారి...

ఈ ఏడాది ఏప్రిల్‌లో తొలిసారిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ 'హంటర్‌హుడ్' ఫెస్టివల్‌ను ఒకేసారి ఢిల్లీ, ముంబై నగరాల్లో నిర్వహించింది. ఈ సందర్భంగా 'హంటర్ 350' 2025 ఎడిషన్‌ను రియో వైట్, టోక్యో బ్లాక్, లండన్ రెడ్ తదితర రంగుల వేరియంట్లలో ఆవిష్కరించింది. ఆధునిక రెట్రో లైఫ్‌స్టయిల్ కోరుకునే నవతరం యువతను ఆకట్టుకునేలా స్టయిల్, వినోదం, దూకుడును కలగలిపి హంటర్ 350 బైక్‌ను మలిచామని రాయల్ ఎన్‌ఫీల్డ్ చెబుతోంది. మరోపక్క, హిప్‌హాప్, ర్యాప్, స్ట్రీట్ డ్యాన్స్, స్కేట్‌బోర్డింగ్‌లలో లోకల్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ... స్ట్రీట్ కల్చర్‌కు దన్నుగా నిలవడమే 'హంటర్‌హుడ్' ఫెస్టివల్ ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. క్రమంగా మరిన్ని నగరాల్లోనూ ఈ వేడుకలను నిర్వహించే ప్రణాళికల్లో కంపెనీ ఉంది.

చెన్నైలో నిర్వహించిన రాయల్ ఎన్‌ఫీల్డ్
- ఆకట్టుకున్న హంటర్ 350 గ్రాఫైట్ గ్రే వేరియంట్
- కుర్రకారు కేరింతలతో డీజే, లోకల్ ర్యాప్ స్టార్స్ సందడి
- స్కేట్‌బోర్డింగ్, స్ట్రీట్ ఆర్టిస్ట్‌ల హల్‌చల్



గ్రాఫైట్ గ్రే.. సూపర్బ్

హంటర్ 350లో కొత్తగా ప్రవేశపెట్టిన గ్రాఫైట్ గ్రే వేరియంట్‌ను చెన్నై హంటర్‌హుడ్ ఫెస్టివల్‌లో ఎన్‌ఫీల్డ్ ప్రత్యేకంగా ప్రదర్శించింది. ఇప్పటికే యూత్‌కు బాగా కనెక్ట్ అవుతున్న హంటర్ బైక్.. ఈ సరికొత్త షేడ్‌తో మరింత ఆకట్టుకుంటోంది. బైకింగ్ యాక్సెసరీలు, లైఫ్‌స్టయిల్ గేర్‌తో పాటు ట్రెండింగ్‌లో ఉన్న స్ట్రీట్ వేర్ ఉత్పత్తులను కూడా ఈ సందర్భంగా వివిధ బ్రాండ్‌లు తమ స్టాల్స్‌లో ప్రదర్శించాయి. కాగా, 350సీసీ లోపు బైక్‌లపై జీఎస్టీ రేటును ఇప్పుడున్న 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించిన నేపథ్యంలో (ఈ నెల 22 నుంచి అమలు) ఎన్‌ఫీల్డ్ హంటర్‌పై గరిష్ఠంగా రూ.22,000 తగ్గింపును ప్రకటించిన సంగతి తెలిసిందే.

శీతాకాల సమావేశాల్లో బీమా సవరణ బిల్లు

కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్



న్యూఢిల్లీ: బీమా సవరణ బిల్లును వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. బీమా రంగంలో 74 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) ప్రస్తుత నిబంధనల కింద అనుమతి ఉంది. దీన్ని నూరు శాతానికి పెంచనున్నట్టు 2025–26 బడ్జెట్ సందర్భంగా మంత్రి సీతారామన్ ప్రకటించారు. 100 శాతం ఎఫ్‌డీఐ అనుమతి అన్నది భారత్‌లో ఆర్జించిన ప్రీమియంను ఇక్కడే ఇన్వెస్ట్ చేసే కంపెనీలకు అమలు చేయనున్నట్టు చెప్పారు. అలాగే, నిబంధనలు, షరతుల్లోనూ మార్పులు చేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. బీమా రంగం ఇప్పటి వరకు రూ.82,000 కోట్ల ఎఫ్‌డీఐని ఆకర్షించడం గమనార్హం. కాంపోజిట్ లైసెన్స్ (జీవిత, సాధారణ బీమా సేవలకు)తోపాటు చెల్లించిన మూలధనం తగ్గింపు కూడా ప్రభుత్వ ప్రతిపాదనల్లో భాగంగా ఉన్నాయి. మొదటిసారి 2015లో బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 26 శాతం నుంచి 49 శాతానికి కేంద్ర ప్రభుత్వం పెంచింది. తిరిగి 2021లో ఈ పరిమితిని 74 శాతం చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-9-2025	
విశాఖ	555-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

ఫెడ్‌వైపు ఇన్వెస్టర్ల చూపు

- 16–17 తేదీలలో పరపతి సమీక్ష
- 0.25 శాతం వడ్డీ రేటు కోతపై ఆశలు
- దేశీయంగా ధరల గణాంకాలు కీలకం
- ఈ వారం స్టాక్ మార్కెట్‌పై అంచనాలు



ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లపై ప్రభావం చూపించగల యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్.. పరపతి విధాన సమీక్షను చేపట్టనుంది. దీంతో ఫైనాన్షియల్ మార్కెట్లతోపాటు.. ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు సైతం ఫెడ్ నిర్ణయాలపై దృష్టిపెట్టనున్నాయి. మరోవైపు దేశీయంగా ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ వారం సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక టెక్నికల్ అంశాల ప్రకారం మార్కెట్లు ఈ వారం బ్రేకవుట్ సాధించే వీలున్నట్లు సాంకేతిక నిపుణులు భావిస్తున్నారు.
- సాక్షి, బిజినెస్ డెస్క్

దేశీయంగా నేడు(15న) ఆగస్ట్ నెలకు టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణ(డబ్ల్యూపీఐ) గణాంకాలు వెలువడనున్నాయి. 2025 జూలైలో డబ్ల్యూపీఐ మైనస్ 0.45 శాతంగా నమోదైంది. అయితే గత నెలలో 0.45 శాతం పెరిగే వీలున్నట్లు ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. ఇందుకు ప్రధానంగా ఆహారం, ఇంధనం, ఇతర కీలక విభాగాలలో ధరల పెరుగుదల కారణంకానున్నట్లు అంచనా వేశారు. కాగా.. గత వారాంతాన విడుదలైన వివరాల ప్రకారం ఆగస్ట్ నెలలో రిటైల్ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ) 2.07 శాతానికి చేరింది. జూలైలో 1.61 శాతం కాగా, గత నెలలో కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్లు, నూనెలు, కొవ్వు ఉత్పత్తుల ధరలు పెరగడం ప్రభావం చూపింది. ఇవికాకుండా యూఎస్‌తో వాణిజ్య వివాదాలకు చెక్ పడటంపై సానుకూల సంకేతాలు వెలువడితే దేశీ స్టాక్ మార్కెట్లకు ప్రోత్సాహం లభించనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా పేర్కొన్నారు.

కనీసం పావు శాతం

ఫెడరల్ రిజర్వ్ చైర్‌పర్శన్ జెరోమీ పావెల్ అధ్యక్షతన ఈ నెల 16 నుంచి ఫెడ్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) రెండు రోజులపాటు పాలసీ సమావేశాలు నిర్వహించనుంది. యూఎస్ ఉపాధి మార్కెట్ నీరసించిన నేపథ్యంలో 17న ఫెడరల్ ఫండ్స్(కీలక వడ్డీ) రేటులో కోత పెట్టనున్నట్లు అత్యధిక శాతంమంది ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. సీపీఐ జూలైలో 0.2 శాతంకాగా.. ఆగస్ట్‌లో 0.4 శాతానికి ఎగసింది. దీంతో వార్షిక ద్రవ్యోల్బణం 2.9 శాతంగా నమోదైంది. దీంతో ఈసారి పాలసీ సమావేశంలో ఉద్యోగ కల్పనకు దన్ను, ధరల తగ్గింపును ఫెడ్ కీలక లక్ష్యాలుగా ఎంచుకునే అవకాశమున్నట్లు పేర్కొంటున్నారు. కనీసం పావు శాతం కోతకు వీలున్నట్లు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం ఫెడ్ ఫండ్స్ రేటు 4.25–4.5%గా ఉంది. ఈ నేపథ్యంలో అటు యూఎస్, ఆసియా మార్కెట్లతోపాటు దేశీయంగానూ ఫెడ్ వడ్డీ రేట్ల కోత బలమివ్వనున్నట్లు ఆన్‌లైన్ ట్రేడింగ్ సంస్థ ఎన్‌రిచ్ మనీ సీఈవో పొన్ముడి ఆర్ అభిప్రాయపడ్డారు.

ఇతర అంశాలకూ ప్రాధాన్యం

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) కొద్ది రోజులుగా దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే ప్రాధాన్యమిస్తూ వస్తున్నారు. అయితే ఫెడ్ వడ్డీ కోత పెడితే దేశీ మార్కెట్లో పెట్టుబడులు పుంజుకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గత నెల(ఆగస్ట్)లో దేశీ స్టాక్స్ నుంచి ఎఫ్‌పీఐలు రూ. 34,900 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకోగా.. జూలైలోనూ రూ. 17,700 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. ఈ నెలలో సైతం తొలి వారంలో రూ. 12,257 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించడం గమనార్హం! కాగా.. డాలరుతో మారకంలో రూపాయి సరికొత్త కనిష్టాలకు చేరుతోంది. దీంతో అటు పసిడి, ఇటు ముడిచమురు ధరలు బలపడుతున్నాయి. రూపాయి బలహీనతతో దిగుమతుల బిల్లు పెరిగి మరింత వాణిజ్య లోటుకు దారితీస్తున్నట్లు ఆర్థికవేత్తలు తెలియజేశారు. అయితే ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించిన జీఎస్టీ సంస్కరణలతో వినియోగం ఊపందుకోనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా పేర్కొన్నారు.

గత వారమిలా..

జీఎస్టీ సంస్కరణలు, భారత్, యూఎస్ మధ్య టరిఫ్ వివాద పరిష్కారంపై ఆశలతో గత వారం బీఎస్ఈ సెన్సెక్స్ 1,117 పాయింట్లు(1.4%) జంప్‌చేసి 81,905 వద్ద ముగిసింది. ఈ బాటలో ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 314 పాయింట్లుపైగా(1.4%) ఎగసి 25,114 వద్ద స్థిరపడింది.

బ్రేకవుట్‌కు చాన్స్

యూఎస్, భారత్ మధ్య వాణిజ్య చర్చలపై ఆశలు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటులో కోతపై అంచనాలు, జీఎస్టీ సంస్కరణలతో పలు రంగాలలో ఊపందుకోనున్న వినియోగం వంటి సానుకూల అంశాలు గత వారం దేశీ స్టాక్ మార్కెట్లకు జోష్‌నిచ్చాయి. తాజా సానుకూలతల నేపథ్యంలో ఈ వారం మార్కెట్లలో బ్రేకవుట్‌కు వీలున్నట్లు సాంకేతిక నిపుణులు భావిస్తున్నారు. కొద్దిరోజులుగా బీఎస్ఈ సెన్సెక్స్ 79,750–82,250 పాయింట్ల శ్రేణిలో కదులుతోంది. 82,250ను అధిగమిస్తే.. 83,500–83,650 పాయింట్లకు బలపడే వీలుంది. ఒకవేళ దిగువకు చేరితే.. 81,450–81,200 స్థాయిలో మద్దతు లభించవచ్చు. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ పుంజుకుంటే 25,250ను అధిగమించవలసి ఉంటుంది. ఆపై 25,500 పాయింట్ల వద్ద రెసిస్టెన్స్ ఎదురుకావచ్చు. బలహీనపడితే 24,900 వద్ద తొలుత, ఆపై 24,700 వద్ద తదుపరి మద్దతు అందుకునే వీలుంది.

ఏసీలు, ఎల్‌ఈడీ లైట్లకు పీఎల్ఐ పథకం

- తిరిగి ప్రారంభించిన ప్రభుత్వం
- అక్టోబర్ 30 వరకు అందుబాటులో



న్యూఢిల్లీ: వైట్ గూడ్స్ (ఏసీలు, ఎల్‌ఈడీ లైట్లు) తయారీకి సంబంధించి ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ)ను కేంద్ర ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 14 వరకు అందుబాటులో ఉంటుందని వాణిజ్య శాఖ ప్రకటించింది. ఈ పథకం కింద మరిన్ని పెట్టుబడులకు పరిశ్రమ ఆసక్తి చూపిస్తుండడంతో తిరిగి ప్రారంభించినట్టు తెలిపింది. వైట్ గూడ్స్ పీఎల్ఐ పథకం కింద ఎంపికైన దరఖాస్తుదారులు రెండేళ్ల పాటు ప్రోత్సాహకాలకు అర్హులని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు రూ.10,406 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలతో 83 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపింది. ఈ పెట్టుబడులతో ఏసీలు, ఎల్‌ఈడీ లైట్లకు సంబంధించి విడిభాగాలు దేశీయంగా తయారవుతాయని వెల్లడించింది. ఇందులో కొన్ని విడిభాగాలు దేశీయంగా తయారవుతున్నప్పటికీ తగినంత పరిమాణంలో లేనట్టు పేర్కొంది. మొదటి సారి వైట్ గూడ్స్ రంగానికి పీఎల్ఐ పథకాన్ని కేంద్రం 2021 ఏప్రిల్ 7న ప్రకటించడం గమనార్హం. 2021–22 నుంచి 2028–29 వరకు అమలు చేయాలని ప్రతిపాదించింది.

వ్యాపారస్తులకు ఊహాజనిత పన్నులు

లెక్కలు, స్టేట్‌మెంట్లు రాయకుండా, వోచర్లు లేకుండా, పుస్తకాలు నిర్వహించకుండా కేవలం టర్నోవర్, వసూళ్ల మీద కొంత శాతం అంటే నిర్దేశిత శాతం లేదా అంత కన్నా ఎక్కువ శాతాన్ని నికర లాభంగా డిక్లేర్ చేసే వెసులుబాటు/విధానాన్ని 'ఊహాజనిత పన్ను విధానం' అని అంటారు. ఆంగ్లంలో 'Presumptive Taxation'గా పిలుస్తారు. ఒక సంవత్సర టర్నోవర్ మీద 8% అనుకొండి. కేవలం 8% మొత్తాన్ని నికర ఆదాయంగా పరిగణిస్తారు. మీరు లెక్కలు నిర్వహించి, శ్రమపడి, ఏ లెక్కలూ తేల్చాల్సిన అవసరం లేదు. టర్నోవర్ మీద 8% లేదా అంతకంటే ఎక్కువగా .. 9%, 10%, 11 శాతం ఇలా ఎంతైనా స్వచ్ఛందంగా మీకు నచ్చిన రేటు ప్రకారం నికర ఆదాయం లెక్కించుకోవచ్చు.



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఇది ఎవరికి వర్తిస్తుంది.

- రెసిడెంట్ వ్యక్తికి
- రెసిడెంట్ హిందూ ఉమ్మడి కుటుంబానికి
- రెసిడెంట్ భాగస్వామ్య సంస్థలకి

క్లుప్తంగా చెప్పాలంటే ఈ పద్ధతి నాన్ రెసిడెంట్లకు వర్తించదు. నిర్దేశిత ఇండస్ట్రియల్ జోన్లు, ప్రాంతాల్లోని వ్యాపారానికి వర్తించదు. ఇది కాకుండా వాహనాలు అద్దెకు నడిపేవారు, ఏజెన్సీ వ్యాపారం చేసేవారు, కమీషన్, బ్రోకరేజీలకు ఇది వర్తించదు. అంతేకాకుండా సంవత్సరపు టర్నోవర్/వసూళ్లు రూ.2 కోట్లు దాటిన వాటికి వర్తించదు. చిరు వ్యాపారస్తులకు ఊరటగా ఈ వెసులుబాటు కల్పించారు. జీఎస్టీ చట్టంలో చిన్న చిన్న వ్యాపారస్తులకు రికార్డుల నిర్వహణలోగానీ, రిటర్నులు దాఖలు చేసే ప్రక్రియకి గానీ, వర్తించే రేటు విషయంలో ఎటువంటి వెసులుబాటు లేదు. ఆదాయపు పన్ను శాఖ వారిని అభినందించాలి. ఇది నిజంగా చాలా పెద్ద ఉపశమనం అని చెప్పాలి.

నగదు వ్యవహారాలు చేయకపోతే మంచిది

నగదు రహిత వ్యవహారాల విషయంలో మరింత రిలీఫ్ కల్పించారు. మొత్తం టర్నోవర్‌లో వ్యవహారాలు బ్యాంకు ద్వారా జరిగి, కేవలం 5% నగదు వస్తే పైన చెప్పిన పరిమితిని రూ.2 కోట్లుగా గాకుండా రూ.3 కోట్లుగా తీసుకుంటారు. నగదులో వసూళ్ళు లేదా రావడం అంటే ... నగదు, అకౌంటు పే కాని చెక్కు, అకౌంటు పే కాని బ్యాంకు డీ.డీ. దీనర్థం ఏమిటంటే బ్యాంకు అకౌంటు ద్వారా వ్యవహారాలు జరగాలి.


ఊహాజనిత పన్ను రేటు 8%, 6 శాతం

మొత్తం అన్ని అమ్మకాలు/వసూళ్లు బ్యాంకు ద్వారా జరిగితే/జరిపితే... ఆరుశాతం చొప్పున లెక్కిస్తారు. అలా కాకపోతే ... అంటే నగదు/బ్యాంకుల ద్వారా వసూళ్లు/అమ్మకాలు ఉంటే 8% చొప్పున లెక్కించాలి. ఉదాహరణగా మీ టర్నోవర్ రూ.2 కోట్లు అనుకొండి. ఈ మొత్తం అంతా బ్యాంకు ద్వారా వచ్చినట్లయితే రూ.2 కోట్ల మీద 6% అంటే రూ.12 లక్షలు.

వసూళ్ల మిశ్రమం అయితే, 8% చొప్పున.. అంటే రూ.16 లక్షలు లేదా అంత కన్నా ఎక్కువ చూపించవచ్చు. 9%, 10%, 11 శాతం ఇలా మీ ఇష్టం. ఇలా లెక్కించిన మొత్తాన్ని ఆదాయం అని అంటారు. ఈ ఆదాయంలోంచి ఎటువంటి వ్యాపార ఖర్చులు, వ్యాపార సంబంధమైన, తరుగుదల మొదలైనవి తగ్గించరు. జీతాలు, భత్యాలు , కొనుగోళ్ల ఏ ఖర్చులు మినహాయించరు. కానీ ఈ ఆదాయంలోంచి మీరు పాత పద్ధతిని ఎంచుకున్నట్లు అయితే సెక్షన్ 80 ఇ, 80 ఈ, 80 ఉ మొదలైనవన్నీ తగ్గిస్తారు. మీరు 8% కన్నా ఎక్కువ శాతం కూడా డిక్లేర్ చేయొచ్చు.

8% చొప్పున తీసుకుంటే... 92% మీరు ఖర్చు చేసినట్లు పరిగణిస్తారు. ఓ వోచర్ చూపించక్కర్లేదు. ఓ బుక్ రాయాల్సిన అవసరం లేదు. మీ వ్యాపారం 8% లో (కొన్ని సందర్భాల్లో 6 శాతం) కూడా లాభం ఉండదనుకుంటే...మీరు కచ్చితంగా బుక్స్ నిర్వహించాలి. ఆ బుక్స్‌ను ఆడిట్ చేయించాలి. ఇలాంటి ఆడిట్‌ను, టాక్స్ ఆడిట్ అని అంటారు. ఒక్కసారి టాక్స్ ఆడిట్‌కి గురి అయితే అలా ఐదేళ్ల పాటు కొనసాగించాలి. ఒక సంవత్సరం 8% చొప్పున మరొక సంవత్సరం టాక్స్ ఆడిట్ కొనసాగించకూడదు. భాగస్వామ్య సంస్థలకు కొన్ని షరతులు వర్తిస్తాయి.


టాక్స్ ప్లానింగ్ విషయానికొస్తే... 8% కన్నా ఎక్కువ వచ్చే సందర్భంలో ఈ సెక్షన్ ప్రకారం 8 శాతానికి ఎంచుకోవడం ఉత్తమం.



పన్నులు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

అన్ని కాలాలకూ అనువైనది

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ డివిడెండ్ ఈల్డ్ ఈక్విటీ ఫండ్





ఈక్విటీ మార్కెట్లు గడిచిన ఏడాది కాలంగా ఎలాంటి వృద్ధి లేకుండా ఫ్లాట్‌గా కొనసాగుతున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు తోడు యూఎస్ టారిఫ్ విధానాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్ల వరుస అమ్మకాలు మార్కెట్ల ర్యాలీకి అడ్డుపడుతోంది. ఈ తరుణంలో ఎలాంటి మార్కెట్ విభాగంలో అయినా పెట్టుబడులు పెట్టగలిగే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఆదరణ పొందుతున్నాయి. అదే తరుణంలో స్థిరమైన పనితీరుకు తోడు, స్థిరమైన రాబడులు కోరుకునే వారు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ డివిడెండ్ ఈల్డ్ ఈక్విటీ ఫండ్‌ను పరిశీలించొచ్చు.

పనితీరు

ఈ పథకం సంబంధిత విభాగం టాపర్‌గా ఉంది. బెంచ్‌మార్క్ నిఫ్టీ 500 టీఆర్ఐ, పోటీ పథకాల కంటే మెరుగైన పనితీరు చూపిస్తోంది. ఏడాది కాలంలో 2 శాతం రాబడిని ఇవ్వగా, మూడేళ్లలో వార్షిక రాబడి 24.56 శాతంగా ఉంది. ఐదేళ్లలో 30.46 శాతం, ఏడేళ్లలో 18.05 శాతం, పదేళ్లలో 17.56 శాతం చొప్పున పెట్టుబడులపై ఇన్వెస్టర్లకు ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది. అన్ని కాలాల్లోనూ బెంచ్ మార్క్ కంటే 3–9 శాతం వరకు, విభాగం సగటు రాబడి కంటే 2–6 శాతం మేర అదనపు అదనపు రాబడిని ఈ పథకం తెచ్చిపెట్టింది. 2014 మే నుంచి ఈ పథకం కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆరంభం నుంచి ప్రతి నెలా రూ.10,000 చొప్పున ఇన్వెస్ట్ చేసినట్టయితే, 2025 ఆగస్ట్ 31 నాటికి రూ.41.3 లక్షలు సమకూరి ఉండేది. ఏటా 18.7 శాతం కాంపౌండెడ్ రాబడిని అందించింది. ఇంతే మొత్తాన్ని నిఫ్టీ 500 టీఆర్ఐపై ఇన్వెస్ట్ చేసి ఉంటే రూ.32.6 లక్షలే సమకూరి ఉండేది.

పెట్టుబడుల విధానం

పేరులో ఉన్నట్టుగా నిలకడగా డివిడెండ్ ఇచ్చే కంపెనీలకు ఈ పథకం ప్రాధాన్యం ఇస్తుంటుంది. డివిడెండ్ మరీ అధికంగా ఇచ్చే కంపెనీల్లో పెట్టుబడి ఏమంత గొప్పగా వృద్ధి చెందదన్న ట్రాక్ రికార్డు ఉంది. ఈ విషయంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ డివిడెండ్ ఈల్డ్ ఈక్విటీ ఫండ్ భిన్నమైన పనితీరు చూపిస్తోంది. స్థిరమైన డివిడెండ్‌ను వాటాదారులకు పంపిణీ చేస్తూనే, దీర్ఘకాలంలో మెరుగైన వృద్ధికి అవకాశం ఉన్న కంపెనీలను ఈ ఫండ్ పరిశోధక బృందం గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంటుంది. దీంతో పనితీరు పరంగా బెంచ్‌మార్క్ (సూచీ), పోటీ పథకాల కంటే ముందుంటోంది. ఆర్థికంగా బలమైన మూలాలతో, మెరుగైన వ్యాపార వృద్ధి అవకాశాలు, సహేతుక డివిడెండ్ పంపిణీ కలిగిన కంపెనీలను వివిధ రంగాల నుంచి ఎంపిక చేసి ఇన్వెస్ట్ చేసింది.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.5,779 కోట్ల నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) ఉన్నాయి. ఇందులో 91.6 శాతాన్ని స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ సాధనాల్లో 0.54 శాతం పెట్టుబడులు ఉన్నాయి. రియల్ ఎస్టేట్ సాధనాల్లోనూ (రీట్‌లు) 1.58 శాతం పెట్టుబడులు పెట్టింది. 6.29 శాతం మేర నగదు నిల్వలు ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోలో 64 స్టాక్స్ ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడుల్లో 88 శాతం వరకు లార్జ్‌క్యాప్‌లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 8.80 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 2.74 శాతం చొప్పున పెట్టుబడులు కలిగి ఉంది. 2020–2024 మధ్యకాలంలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 30–35 శాతం వరకు పెట్టుబడులు కొనసాగించింది. ఆ కాలంలో వాటిల్లో అప్‌ట్రెండ్ కొనసాగింది. స్టాక్స్ వ్యాల్యూయేషన్లు ఖరీదుగా మారడంతో 2024 జూన్ నుంచి మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులు తగ్గించుకుంటూ వచ్చింది. ఫలితంగా ప్రస్తుతం ఆయా విభాగాల్లో తక్కువ పెట్టుబడులను గమనించొచ్చు. ప్రస్తుతం బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ స్టాక్స్‌లో 26.15 శాతం, ఎనర్జీ, యుటిలిటీ కంపెనీల్లో 16.94 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 10.16 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	6.89
ఎన్‌టీపీసీ	6.15
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.96
సన్‌ఫార్మా	5.56
యాక్సిస్ బ్యాంక్	5.50
మారుతి సుజుకీ	5.21
ఎల్‌అండ్‌టీ	4.09
ఓఎన్‌జీసీ	3.75
భారతీ ఎయిర్‌టెల్	3.70
రిలయన్స్ ఇండస్ట్రీస్	2.88


ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా టి20 సిరీస్ సమం

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాల మధ్య మూడు టి20ల సిరీస్ 1-1తో సమంగా ముగిసింది. ఆదివారం జరగాల్సిన నిర్ణాయక ఆఖరి పోరు వర్షంతో రద్దయ్యింది. తెరిపినివ్వని వాన వల్ల మ్యాచ్‌కు అవకాశమే లేకపోయింది. కనీసం టాస్ కూడా వేయలేదు. మైదానమంతా చిత్తడిగా మారడంతో చేసేదేమీ లేక ఫీల్డ్ అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సిరీస్‌లో భాగంగా కార్డిఫ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో పర్యాటక దక్షిణాఫ్రికా గెలిచింది. ఈ మ్యాచ్‌కూ వరుణుడు అంతరాయం కలిగించగా సఫారీ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 14 పరుగులతో గెలిచింది. మాంచెస్టర్‌లో జరిగిన రెండో టి20లో ఇంగ్లండ్ ఏకంగా 146 పరుగుల భారీ తేడాతో జయభేరి మోగించింది.



మేఘనకు కాంస్యం

నింగ్బో (చైనా): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) చివరి వరల్డ్ కప్ టోర్నమెంట్‌ను భారత్ కాంస్య పతకంతో ముగించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో ఆఖరి రోజు మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ మేఘన సజ్జనార్ కాంస్య పతకాన్ని సాధించింది. 76 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో కర్ణాటకకు చెందిన మేఘన 632.6 పాయింట్లు స్కోరు చేసి ఏడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో మేఘన 230 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. చైనాకు చెందిన 16 ఏళ్ల పెంగ్ జిన్‌లు 255.3 పాయింట్లు సాధించి కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పడంతోపాటు పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. వాంగ్ జిఫె (చైనా; 254.8 పాయింట్లు) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టిన పెంగ్ జిన్‌లు ఈ క్రమంలో ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో స్వర్ణ పతకం గెలిచి అతి పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందింది. పతకాల పట్టికలో చైనా 8 పతకాలతో (3 స్వర్ణాలు, 4 రజతాలు, 1 కాంస్యం) టాప్ ర్యాంక్‌లో నిలిచింది. భారత్ ఒక స్వర్ణం, ఒక కాంస్యంతో ఐదో స్థానంతో ముగించింది.



సెవిల్లె


మెలిస్సా


అటు సెవిల్లె... ఇటు మెలిస్సా

మహిళల విభాగంలో అమెరికా అథ్లెట్ 'టాప్'

పురుషుల విభాగంలో జమైకా చిరుతకు పసిడి పతకం

100 మీటర్ల పరుగులో ప్రపంచ చాంపియన్‌లు

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జమైకా కొత్త చిరుత ఒబ్లిక్ సెవిల్లె పురుషుల 100 మీటర్ల స్వర్ణం కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్ రేసును ఒబ్లిక్ 9.77 సెకన్లలో ముగించి అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఉసేన్ బోల్ట్ (2016) తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం నెగ్గిన తొలి జమైకా రన్నర్‌గా ఒబ్లిక్ సెవిల్లె నిలిచాడు. సెవిల్లెకు ఇదే వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కాగా... జమైకాకే చెందిన ఒలింపిక్ రజత పతక విజేత కిషానె థామ్సన్ (9.82 సెకన్లు) రజతం దక్కించుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్, అమెరికా అథ్లెట్ నోవా లైల్స్ (9.89 సెకన్లు) కాంస్యం గెలుచుకున్నాడు. 'ప్రపంచ చాంపియన్‌షిప్ పురుషుల 100 మీటర్ల పరుగులో ఉసేన్ బోల్ట్ తర్వాత జమైకా అథ్లెట్‌కు స్వర్ణం దక్కడం ఇదే తొలిసారి. ఈ టోర్నీ కోసం పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యా. సెమీస్‌లో నా ప్రదర్శనతో సంతృప్తిపడలేకపోయా. ఫైనల్లో శక్తినంతా కూడగట్టుకొని ప్రయత్నించా. నా పూర్తి సామర్థ్యంతో పరుగు తీస్తే... అందరికంటే ముందు నిలవగలనని విశ్వసించా' అని 24 ఏళ్ల సెవిల్లె వెల్లడించాడు. పోటీలో ఉన్న అందరిలో అత్యుత్తమ వ్యక్తిగత టైమింగ్ ఉన్న థామ్సన్ ఆరంభంలోనే వెనుకబడిపోయాడు. ఇక అక్కడి నుంచి ఏ దశలోనూ సెవిల్లెను వెనక్కి నెట్టలేకపోయిన ఈ జమైకా అథ్లెట్ రెండో స్థానంతో సంతృప్తి పడాల్సి వచ్చింది. మహిళల 100 మీటర్లలో అమెరికా అథ్లెట్ మెలిస్సా జెఫర్సన్ వుడెన్ విజేతగా నిలిచింది. ఫైనల్లో మెలిస్సా 10.61 సెకన్లలో లక్ష్యాన్ని చేరి విజేతగా అవతరించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇది సంయుక్తంగా అత్యుత్తమ టైమింగ్ కాగా... రెండో స్థానంలో నిలిచిన టీనా క్లాటన్ కంటే 0.15 సెకన్ల ముందే మెలిస్సా రేసు పూర్తి చేసింది. వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇదే అత్యధిక గెలుపు వ్యత్యాసం. జమైకాకు చెందిన టీనా క్లాటన్ (10.76 సెకన్లు), జూలియన్ అల్‌ఫ్రెడ్ (10.84 సెకన్లు; సెయింట్ లూసియా) వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. జమైకా స్టార్ అథ్లెట్ షెల్లీ ఆన్ ఫ్రెజర్ ప్రైస్ 11.3 సెకన్లతో ఆరో స్థానానికి పరిమితమైంది. రెండో రోజు పోటీలు ముగిసే సరికి అమెరికా 5 స్వర్ణాలు, ఒక కాంస్యంతో మొత్తం 6 పతకాలు సాధించి పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతుండగా... కెన్యా (2 స్వర్ణాలు), జమైకా (1 స్వర్ణం, 2 రజతాలు) వరుసగా రెండో, మూడో స్థానాల్లో ఉన్నాయి. కెనడా, ఫ్రాన్స్, స్పెయిన్ కూడా ఒక్కో పసిడి పతకం ఖాతాలో వేసుకున్నాయి.



అయ్యో... అమన్

అధిక బరువుతో అనర్హతకు గురైన భారత స్టార్ రెజ్లర్

జాగ్రెబ్ (క్రొయేషియా): బంగారు పతకం ఆశలతో ప్రపంచ చాంపియన్‌షిప్‌కు సిద్ధమైన భారత స్టార్ రెజ్లర్ అమన్ సెహ్రావత్‌కు ఊహించని షాక్ ఎదురైంది. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన ఈ రెజ్లర్ అనర్హతకు గురయ్యాడు. తన వెయిట్ కేటగిరీలో అధిక బరువు వల్లే అతను ప్రతిష్టాత్మక చాంపియన్‌షిప్ **నుంచి నిష్క్రమించాడు. పోటీలకు ముందు** రెజ్లర్‌కు బరువును (వెయింగ్) చూస్తారు. పురుషుల 57 కేజీల ఫ్రీస్టయిల్ కేటగిరీలో తలపడేందుకు సిద్ధమైన అతను ఉండాల్సిన బరువుకంటే ఏకంగా 1.7 కేజీలు (1700 గ్రాములు) అధిక బరువు ఉండటంతో నిర్వాహకులు డిస్‌క్వాలిఫై చేశారు. 'ఇది చాలా దురదృష్టకరం. అమన్‌లాంటి రెజ్లర్ తన బరువును **అదుపులో ఉంచుకోకపోవడం ఆశ్చర్యపరుస్తోంది.** బరువును తూచే వెయింగ్ మిషిన్‌పై అతను నిలబడితే 1.7 కేజీలు అధికంగా ఉన్నట్లు కనిపించింది. ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. అతను అంత బరువు ఎలా పెరిగాడో అర్థమవడం లేదు' అని జాగ్రెబ్‌లో ఉన్న భారత జట్టు అధికారి ఒకరు వెల్లడించారు. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) నిబంధనల ప్రకారం ప్రపంచకప్, ర్యాంకింగ్ సిరీస్ టోర్నీల్లో ఉండాల్సిన బరువు కంటే రెండు కేజీల అదనపు బరువును కూడా అనుమతిస్తారు. అయితే ప్రపంచ చాంపియన్‌షిప్, ఒలింపిక్స్‌లాంటి మెగా టోర్నీల్లో మాత్రం 100 గ్రాము లున్నా వెంటనే అనర్హత **వేటు వేస్తారు.**

భారత్ 'ఎ' జట్టు సారథిగా తిలక్ వర్మ

- చివరి రెండు వన్డేలకు ఎంపిక
- తొలి వన్డేకు రజత్ పాటీదార్ కెప్టెన్
- ఆస్ట్రేలియా 'ఎ'తో సిరీస్‌కు జట్టు ప్రకటన



ముంబై: ప్రస్తుతం ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో పాల్గొంటున్న పలువురు భారత యువ ఆటగాళ్లు... ఆ తర్వాత ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 'ఎ' జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ నెల 28న ఆసియాకప్ ఫైనల్ జరగనుండగా... 30 నుంచి భారత్ 'ఎ', ఆస్ట్రేలియా 'ఎ' జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. దీంతో తొలి మ్యాచ్ అనంతరం హైదరాబాద్ ఆటగాడు తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా భారత 'ఎ' జట్టుతో చేరనున్నారు. ఈ సిరీస్ కోసం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని భారత సీనియర్ సెలెక్షన్ కమిటీ ఆదివారం వేర్వేరుగా జట్లను ప్రకటించింది. తొలి వన్డే కోసం 13 మంది ప్లేయర్ల పేర్లను ప్రకటించగా... మిగిలిన రెండు మ్యాచ్‌ల కోసం 15 మందిని ఎంపిక చేశారు. ఆస్ట్రేలియా 'ఎ'తో తొలి వన్డేకు రజత్ పాటీదార్ సారథ్యం వహించనుండగా... రెండో, మూడో వన్డేలకు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇరుజట్ల మధ్య కాన్పూర్ వేదికగా ఈ సిరీస్ జరగనుంది. అంతకుముందు ఆస్ట్రేలియా 'ఎ' జట్టు... భారత 'ఎ' జట్టుతో లక్నో వేదికగా రెండు అనధికారిక టెస్టులు కూడా ఆడనుంది. ఢిల్లీ బ్యాటర్ ప్రియాంశ్ ఆర్య, సిమర్‌జీత్ సింగ్ కేవలం తొలి వన్డే మాత్రమే ఆడనున్నారు. తక్కినవాళ్లు మూడు మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారు.

భారత 'ఎ' జట్టు

తొలి వన్డే కోసం: రజత్ పాటీదార్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రన్ సింగ్, రియాన్ పరాగ్, ఆయుశ్ బదోనీ, సూర్యాంశ్, విప్రాజ్ నిగమ్, నిశాంత్, గుర్‌జపనీత్ సింగ్, యుధ్‌వీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పొరెల్, ప్రియాంశ్ ఆర్య, సిమర్‌జీత్.

రెండో, మూడో వన్డే కోసం: తిలక్ వర్మ (కెప్టెన్), పాటీదార్, అభిషేక్, ప్రభ్‌సిమ్రన్, పరాగ్, బదోనీ, సూర్యాంశ్, విప్రాజ్, నిశాంత్, గుర్‌జపనీత్, యుధ్‌వీర్, రవి బిష్ణోయ్, పొరెల్, హర్షిత్, అర్ష్‌దీప్.

విజయం వాకిట్లో...

సెంట్రల్ జోన్ విజయ లక్ష్యం 65 పరుగులు

సౌత్ జోన్ రెండో ఇన్నింగ్స్ 426 ఆలౌట్ ● అంకిత్, సిద్ధార్థ్ పోరాటం వృథా

కార్తికేయకు 4 వికెట్లు, సారాంశ్‌కు 3 వికెట్లు ● దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీలో సెంట్రల్ జోన్ జట్టు విజయానికి చేరువైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసిన సెంట్రల్ జోన్ ముందు రెండో ఇన్నింగ్స్‌లో 65 పరుగుల లక్ష్యం నిలిచింది. నేడు ఆటకు చివరి రోజు కాగా... సెంట్రల్ జోన్ విజయం లాంఛనమే. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 129/2తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్ జోన్ జట్టు చివరకు 121 ఓవర్లలో 426 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఏమాత్రం ప్రభావం చూపలేకపోయిన సౌత్ జోన్ బ్యాటర్లు... రెండో ఇన్నింగ్స్‌లో బాధ్యతాయుతంగా ఆడారు. ముఖ్యంగా అంకిత్ శర్మ (168 బంతుల్లో 99; 13 ఫోర్లు, 1 సిక్స్), ఆంద్రె సిద్ధార్థ్ (190 బంతుల్లో 84 నాటౌట్; 7 ఫోర్లు) చక్కటి ఇన్నింగ్స్‌లతో అలరించారు. ఈ ఇద్దరూ ఏడో వికెట్‌కు 192 పరుగులు జోడించి జట్టును ఒడ్డున పడేసే ప్రయత్నం చేశారు. రవిచంద్రన్ స్మరణ్ (118 బంతుల్లో 67; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకం సాధించగా... ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్ (85 బంతుల్లో 45; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. సెంట్రల్ జోన్ బౌలర్లలో కుమార్ కార్తికేయ 4, సారాంశ్ జైన్ 3 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ 149 పరుగులకు ఆలౌట్ కాగా... సెంట్రల్ జోన్ 511 పరుగులు చేసింది.


కార్తికేయ

192 పరుగుల భాగస్వామ్యం...

సెంట్రల్ జోన్ స్పిన్నర్లను ఎదుర్కోలేక తొలి ఇన్నింగ్స్‌లో పేలవ ప్రదర్శన కనబర్చిన సౌత్ జోన్ బ్యాటర్లు... రెండో ఇన్నింగ్స్‌లో ఫర్వాలేదనిపించారు. రవిచంద్రన్ స్మరణ్, రికీ భుయ్ బాధ్యతాయుతంగా ఆడటంతో... ఇక సౌత్ జోన్ జట్టు కుదురుకున్నట్లే అనిపించింది. ఈ జంట మూడో వికెట్‌కు 85 పరుగులు జోడించగా... ఆ తర్వాత కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్ (27; 2 ఫోర్లు, 1 సిక్స్), సల్మాన్ నిజార్ (12) ఎక్కువసేపు నిలవలేకపోయారు. దీంతో 161/2తో పటిష్టంగా కనిపించిన సౌత్ జోన్... 222/6తో ఓటమి అంచున నిలిచింది. ఈ దశలో అంకిత్, సిద్ధార్థ్ చక్కటి పోరాట పటిమ కనబర్చారు. ఒక్కో పరుగు జోడిస్తూ... ముందుకు సాగిన ఈ జంట... సెంట్రల్ జోన్ స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. ఒక్కసారి క్రీజులో కుదురుకున్నాక స్వేచ్ఛగా షాట్‌లు ఆడుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించింది. ఈ క్రమంలో అంకిత్ శర్మ 84 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా... సిద్ధార్థ్ 110 బంతుల్లో **ఫిఫ్టీ మార్క్ అందుకున్నాడు. సెంచరీకి ఒక్క పరుగు దూరంలో అంకిత్ అవుట్ అయ్యాడు. దీంతో ఏడో వికెట్‌కు 192 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత మిగిలిన మూడు వికెట్లు** పడేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. మొత్తంగా సౌత్ జోన్ 64 పరుగుల ఆధిక్యం సాధించింది. సెంట్రల్ జోన్ జట్టు 11 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ చేజిక్కించుకోవాలంటే చివరి రోజు రెండో ఇన్నింగ్స్‌లో 65 పరుగులు చేయాల్సి ఉంది.

స్కోరు వివరాలు

సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్: 149; సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ 511; సౌత్ జోన్ రెండో ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (బి) కుల్దీప్ సేన్ 26; మోహిత్ కాలే (ఎల్బీ) (బి) సారాంశ్ జైన్ 38; స్మరణ్ (సి) యశ్ రాథోడ్ (బి) కార్తికేయ 67; రికీ భుయ్ (సి) శుభమ్ శర్మ (బి) దీపక్ చాహర్ 45; అజహరుద్దీన్ (సి) కుల్దీప్ సేన్ (బి) కార్తికేయ 27; సల్మాన్ నిజార్ (సి) రజత్ పాటీదార్ (బి) కార్తికేయ 12; ఆంద్రె సిద్ధార్థ్ (నాటౌట్) 84; అంకిత్ శర్మ (సి) రజత్ పాటీదార్ (బి) కార్తికేయ 99; గుర్‌జపనీత్ సింగ్ (సి) మాలేవర్ (బి) సారాంశ్ 3; నిధీశ్ (రనౌట్) 0; వాసుకి కౌశిక్ (స్టంప్డ్) ఉపేంద్ర యాదవ్ (బి) సారాంశ్ జైన్ 0; ఎక్స్‌ట్రాలు 25; మొత్తం (121 ఓవర్లలో ఆలౌట్) 426. వికెట్ల పతనం: 1-62, 2-76, 3-161, 4-200, 5-221, 6-222, 7-414, 8-419, 99-420, 10-426. బౌలింగ్: దీపక్ చాహర్ 16-2-74-1; ఆదిత్య ఠాకరే 8-2-22-0; కుమార్ కార్తికేయ 39-3-110-4; సారాంశ్ జైన్ 42-8-130-3; కుల్దీప్ సేన్ 12-1-60-1, శుభమ్ శర్మ 4-1-21-0.


అంకిత్
సిద్ధార్థ్

అతీఖ అదరహో

- పదేళ్ల ప్రాయంలోనే రేసింగ్‌లో నయా చరిత్ర
- కార్టింగ్ మినీ మ్యాక్స్ రేసు నెగ్గిన తొలి మహిళగా రికార్డు



దుబాయ్: భారత్‌కు చెందిన పదేళ్ల చిన్నారి అతీఖ మీర్ రేసింగ్‌లో చరిత్ర సృష్టించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా జరిగిన డీఏఎమ్‌సీ కార్టింగ్ చాంపియన్‌షిప్‌లో అతీఖ... మినీ మ్యాక్స్ కేటగిరీలో విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన పోటీలో వాయువేగంతో దూసుకెళ్లిన అతీఖ... యూరోపియన్ రేస్ విన్నర్లను సైతం వెనక్కి నెడుతూ అగ్రస్థానం దక్కించుకుంది. 14 మంది డ్రైవర్లు పాల్గొన్న ఈ రేసులో అతీఖ ఒక్కతే అమ్మాయి కాగా... పోల్ పొజిషన్ నుంచి రేసును ప్రారంభించిన ఈ చిన్నారి సహచరులను వెనక్కి నెడుతూ బుల్లెట్‌లా దూసుకెళ్లింది. తద్వారా మినీ మ్యాక్స్ కేటగిరీలో టైటిల్ గెలిచిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది. 'విజయం సాధించడం చాలా ఆనందంగా ఉంది. దుబాయ్ కార్ట్‌డ్రోమ్‌లో కార్టింగ్ ప్రారంభించా... ఇక్కడ పోటీపడటం చాలా ప్రత్యేకంగా అనిపించింది. ప్రాక్టీస్‌కు తగినంత సమయం దక్కకపోయినా... తుది రేసుపై దాని ప్రభావం పడలేదు. వెన్నుతట్టి ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని జమ్మూ కశ్మీర్‌కు చెందిన అతీఖ చెప్పింది. పదేళ్ల ప్రాయంలోనే ట్రాక్‌పై దూసుకెళ్తున్న అతీఖ ప్రతిభను గుర్తించిన ఫార్ములావన్ అకాడమీ డీవైడీ ప్రోగ్రామ్‌లో అవకాశం కల్పించింది. తదుపరి యూరోపియన్ పోటీల్లో పాల్గొననున్నట్లు అతీఖ వెల్లడించింది.

సాక్షి ప్లస్
సోమవారం ၊ 15-9-2025

నేడు బిహార్‌లో ప్రధాని పర్యటన

రూ.36 వేల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభం

పట్నా: ప్రధాని మోదీ సోమవారం బిహార్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పుర్నియాలో జరిగే భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా రూ.36 వేల కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. పుర్నియాలో కొత్తగా అభివృద్ధి చేసిన విమానాశ్రయం టెర్మినల్‌ను ఆయన ప్రారంభిస్తారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన నేషనల్ మఖానా బోర్డును ప్రధాని ప్రారంభిస్తారు. మఖానాను సూపర్‌ఫుడ్‌గా పలుమార్లు ప్రధాని మోదీ పేర్కొనడం తెల్సిందే. దేశంలో ఉత్పత్తయ్యే మఖానాలో అత్యధికంగా 90 శాతం మేర బిహార్‌లో సాగవుతోంది. మరికొద్ది నెలల్లో జరిగే ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే మరోసారి అధికారం చేపట్టాలని భావిస్తోంది. అందుకే ప్రధాని మోదీ బిహార్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గత 11 ఏళ్లలో బిహార్ అభివృద్ధికి ప్రధాని మోదీ రూ.1.50 లక్షల కోట్ల ప్రాజెక్టులను మంజూరు చేశారని బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర డెప్యూటీ సీఎం సమ్రాట్ చౌధరి తెలిపారు. తమ రాష్ట్రం డబుల్ ఇంజిన్ సర్కార్ ఫలాలను అందుకుంటోందన్నారు. ప్రధాని పర్యటనను పురస్కరించుకుని భద్రతా ఏర్పాట్లను భారీగా చేపట్టారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహనాలను అధికారులు నిషేధించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రతిపక్ష ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ పుర్నియాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ రోగులతో మాట్లాడి, వారు పడుతున్న ఇబ్బందులపై ఒక వీడియోను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆస్పత్రిలో కనీస సౌకర్యాల కల్పనలో సీఎం నితీశ్ కుమార్ సారథ్యంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు.



ఇజ్రాయెల్ ఆర్మీ హెచ్చరికలతో గాజా నగరాన్ని వీడి దక్షిణ గాజా వైపు పెట్టేబేడా సర్దుకుని వాహనాల్లో శనివారం రాత్రి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లిపోతున్న పాలస్తీనావాసులు

ఈశాన్యంలో భూకంపం

గౌహతి: ఈశాన్య రాష్ట్రాలతోపాటు పశ్చిమబెంగాల్‌లో ఆదివారం భూకంపం సంభవించింది. సాయంత్రం 4.41 గంటల ప్రాంతంలో సంభవించిన ఈ భూకంప కేంద్రం అస్సాంలోని ఉడల్‌గురిలో భూమి ఉపరితలం నుంచి 5 కిలోమీటర్ల లోతున ఉందని అధికారులు తెలిపారు. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.8గా నమోదైందన్నారు. ప్రధాని మోదీ ఆదివారం ఉదయం అస్సాంలో పర్యటించడం తెల్సిందే. భూకంపంతో ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని సీఎం హిమంత బిశ్వ శర్మ చెప్పారు. ఉడల్‌గురి, సోనిట్‌పూర్, తముల్‌పూర్, నల్బరీ సహా పలు జిల్లాల్లో భూప్రకంపనలు సంభవించాయని అధికారులు వెల్లడించారు. మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమబెంగాల్‌లోని సిలిగురి, జల్పాయ్‌గురి, అలిపూర్‌దువార్, కూచ్‌బెహార్ జిల్లాల్లోనూ ప్రకంపనలు సంభవించాయి. దీంతో, భయభ్రాంతులకు గురైన జనం ఇళ్లు, దుకాణాలు వదిలి వీధుల్లోకి చేరుకున్నారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. భూకంపంతో నష్టం కలగకూడదని కోరుకుంటూ కొందరు శంఖాలు ఊదారు. ఈశాన్య రాష్ట్రాల్లో భూప్రకంపనలు సర్వసాధారణం.

రన్‌వే పైనే నిలిచిన ఇండిగో విమానం

విమానంలో ఎంపీ డింపుల్ యాదవ్ సహా 150 మంది

న్యూఢిల్లీ: ఇండిగో సంస్థకు చెందిన విమానం సాంకేతికలోపంతో రన్ వేపైనే నిలిచిపోయింది. ఆదివారం లక్నో విమానాశ్రయంలో ఘటన చోటుచేసుకుంది. ఉదయం 8.10 గంటల సమయంలో ఢిల్లీకి టేకాఫ్ తీసుకోవాల్సిన విమానం ఆలస్యంగా 9.30 గంటలకు బయలుదేరింది. సాంకేతిక లోపం తలెత్తడంతో రన్ వే పైనే మరో గంటపాటు ఆగిపోయింది. దీనికితోడు విమానంలో ఏసీ పనిచేయలేదు. విమానంలో సమాజ్‌వాదీ పార్టీ నేత, ఎంపీ డింపుల్ యాదవ్ సహా 150 మంది ప్రయాణికులున్నారు. అసౌకర్యంతో అంతా గగ్గోలు పెట్టారు. అధికారుల సూచనలతో ముందు జాగ్రత్త చర్యగా సిబ్బంది ఆ విమానాన్ని బే ప్రాంతానికి తరలించారు. ప్రయాణికులందరినీ దించేసి, మరో విమానంలో వారిని గమ్యస్థానాలకు పంపించారు. ఘటనపై ఇండిగో స్పందించలేదు.

సరిహద్దుల్లో రూ. 7.11 కోట్ల డ్రగ్స్ సీజ్

ఐజ్వాల్: మిజోరంలోని మయన్మార్ సరిహద్దులో భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. సరిహద్దులకు సమీపంలోని చంఫాయ్‌లో రూ.7.11 కోట్ల విలువ చేసే మెథాంఫెటమైన్ టాబ్లెట్లను అస్సాం రైఫిల్స్ బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. శనివారం ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో బలగాలు అతడిని వెంబడించాయి. దీంతో, అతడు తన వద్ద ఉన్న బ్యాగును కిందపడేసి పరుగుతీశాడు. బ్యాగును పరిశీలించి చూడగా 2.37కిలోల మెథాంఫెటమైన్ మాత్రలు కనిపించాయి. మరో ఘటనలో శనివారం సాయిటువాల్ వద్ద అస్సాం రైఫిల్స్ బలగాలు వాహనాల సోదాల సమయంలో దొంగతనంగా తరలిస్తున్న 8,160 కిలోల వక్కలను పట్టుకున్నాయి. వక్కల విలువ రూ.52.17 లక్షలుంటుందని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

పోప్ లియో-14కు 70 ఏళ్లు

రోమ్: కేథలిక్‌ల మతపెద్ద పోప్ లియో-14కు ఆదివారం 70వ పడిలోకి అడుగుపెట్టారు. పుట్టిన రోజు సందర్భంగా దేవుడికి, తల్లిదండ్రులకు, తన కోసం ప్రార్థించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రోమ్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో ఆదివారం ఇంగ్లిష్, ఇటాలియన్, స్పానిష్ భాషల్లో భారీ హ్యాపీ బర్త్‌డే బ్యానర్లు దర్శనమిచ్చాయి. పెరూకు చెందిన డ్యాన్సర్లు సహా పెద్ద సంఖ్యలో మతస్తులు సంప్రదాయ దుస్తులు ధరించి పోప్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చారు. లియో గతంలో రాబర్ట్ ప్రివోస్ట్ అనే పేరుతో మత బోధకుడిగా పెరూలో దాదాపు రెండు దశాబ్దాలపాటు సేవలందించారు. సెయింట్ పీటర్స్ స్క్వేర్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వారిని ఉద్దేశించి పోప్ లియో ప్రసంగించారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం లియో ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

ఉపరాష్ట్రపతి సెక్రటరీగా అమిత్ ఖరే

న్యూఢిల్లీ: నూతన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ వ్యక్తిగత కార్యదర్శిగా సీనియర్ రిటైర్డు అధికారి అమిత్ ఖరే నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మూడేళ్లపాటు కాంట్రాక్టు విధానంలో ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. కార్యదర్శి స్థాయి వేతనం పొందుతారు. ఈ నియమాకంపై కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని ఆదివారం కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. 1985 బ్యాచ్ జార్ఖండ్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అమిత్ ఖరే. అమిత్ ఖరే ప్రధాని మోదీకి 2021 అక్టోబర్ నుంచి సలహాదారుగా పనిచేస్తూ ప్రధాని కార్యాలయంలో సామాజిక రంగ అంశాలను ఆయన పర్యవేక్షిస్తున్నారు. జాతీయ విద్యా విధానం-2020 రూపకల్పన, అమలుపై ఏర్పాటైన కీలక కమిటీ సభ్యుల్లో అమిత్ ఒకరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పలు కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ నుంచి పట్టభద్రుడైన ఖరే, ఐఐఎం అహ్మదాబాద్‌లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ చేశారు. బిహార్ దాణా కుంభకోణాన్ని వెలికితీయడంలో కీలకంగా వ్యవహరించారు.

చిరుత దాడిలో మహిళ మృత్యువాత

బిజ్నోర్: ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ జిల్లాలో చిరుత దాడిలో ఒక మహిళ చనిపోయింది. ఇస్సాపూర్ గ్రామానికి చెందిన మీర, భర్త మహేందర్‌తో కలిసి ఆదివారం తమ సమీపంలోని అడవిలోకి గడ్డి కోసేందుకు వెళ్లింది. ఆ సమయంలో ఒంటరిగా ఉన్న మీరపై చిరుతపులి దాడి చేసింది. ఆమె కేకలు వేయడంతో భర్త మహేందర్‌తోపాటు గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే చిరుత అక్కడి నుంచి పారిపోయింది. మీరను వెంటనే సమీపూర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న చిరుత దాడి ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారని, అధికారులు స్పందించడం లేదంటూ భారతీయ కిసాన్ యూనియన్ నేత దిగంబర్ సింగ్ డివిజన్ అటవీ అధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

తన భూమిలో చెట్లు నరకొద్దంటే చంపేశారు

జంషెడ్‌పూర్: తన భూమిలోని చెట్లను నరకవద్దంటూ అడ్డుచెప్పిన పాపానికి ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. జార్ఖండ్‌లోని తూర్పు సింగ్‌భుమ్ జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. జంషెడ్‌పూర్ పట్టణ శివారులోని సిర్కాటోలా బరిదిహ్ గ్రామానికి చెందిన జగ్‌దీశ్ హెంబ్రమ్‌కు చెందిన స్థలంలోని చెట్లను ఆదివారం కొందరు వ్యక్తులు నరికేందుకు పూనుకున్నారు. వారిని జగ్‌దీశ్ అడ్డుకోవడంతో మాటామాటా పెరిగింది. చెట్లు నరుకుతున్న వారు కర్రలతో జగ్‌దీశ్‌ను కొట్టడంతోపాటు గొడ్డలితో నరికారు. దీంతో, అతడు చనిపోయాడు. దాడికి కారకులుగా భావిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరికొందరి కోసం గాలింపు చేపట్టారు. కాగా, నిందితులు జగదీశ్‌కు దూరపు బంధువులు అని పోలీసులు తెలిపారు.

'సిక్' అని మెసేజ్ చేసిన 10 నిమిషాలకే మృతి


విషాదాన్ని 'ఎక్స్'లో పంచుకున్న ఉన్నతాధికారి

న్యూఢిల్లీ: హఠాత్తుగా ఒంట్లో బాగోలేదంటూ ఉన్నతాధికారికి స్మార్ట్‌ఫోన్‌లో సందేశం పంపిన పది నిమిషాలకే ఆ ఉద్యోగి గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. 40 ఏళ్లకే ఓ ఉద్యోగి నూరేళ్లు నిండిన విషాద ఘటన తాలూకు వివరాలను పైఅధికారి కేవీ అయ్యర్ 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. '' నా కింది ఉద్యోగి శంకర్ నుంచి ఉదయం 8.37 గంటలకు ఒక మెసేజ్ వచ్చింది. భయంకరమైన వెన్నునొప్పి కారణంగా ఈరోజు ఆఫీస్‌కు రాలేకపోతున్నా, ఒక రోజు సెలవు ఇవ్వండి అని అందులో ఉంది. సరే విశ్రాంతి తీసుకో అని సమాధానం ఇచ్చా. ఆ తర్వాత కేవలం 10 నిమిషాలకే కుప్పకూలి శంకర్ గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. కొద్దిసేపటి తర్వాత నాకొక ఫోన్‌కాల్ వచ్చింది. శంకర్ చనిపోయాడని అవతలి వ్యక్తి చెబితే నమ్మలేకపోయా. వెంటనే మరో ఉద్యోగికి ఫోన్‌చేసి ఆరాతీశా. 10 నిమిషాలకే చనిపోయాడని వాళ్లు కూడా చెప్పడంతో నిశ్చేష్టుడినయ్యా. వెంటనే శంకర్ ఇంటి అడ్రస్ కనుక్కుని పరుగున వెళ్లా. కానీ అతనిక లేడని తెల్సి దుఃఖంలో మునిగిపోయా. శంకర్ ఆరేళ్లుగా మా ఆఫీస్‌లోనే పనిచేస్తున్నాడు. వయసు కేవలం 40 ఏళ్లు. పెళ్లయింది. వాళ్లకొక పసి పిల్లాడు ఉన్నాడు. అతనికి ధూమపానం, మద్యపానం వంటి చెడు అలవాట్లు లేవు. మరునిమిషం ఏం జరుగుతుందో అస్సలు ఊహించలేం. చుట్టూ ఉన్న వాళ్లతో హాయిగా ఉండండి. చివరిదాకా జీవితాన్ని ఆస్వాదించండి'' అని అన్నారు.

విమర్శల బదులు విస్తృత దర్యాప్తు చేయించాల్సింది

రాహుల్‌పై ఎన్నికల సంఘం తీరును తూర్పారబట్టిన మాజీ సీఈసీ ఖురేషి

న్యూఢిల్లీ: బిహార్‌లో ఆగమేఘాల మీద చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)పై లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలను తీవ్రమైనవిగా భావించి దర్యాప్తు చేపట్టాల్సింది పోయి ఆయనపై ప్రత్యారోపణల బురద చల్లడం ఏమాత్రం సబబుకాదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) ఎస్‌వై ఖురేషి వ్యాఖ్యానించారు. ఖురేషి రాసిన 'ప్రజాస్వామ్యానికి గుండెకాయ(డెమొక్రసీస్ హార్ట్‌ల్యాండ్)' పుస్తకం త్వరలో ఆవిష్కరించనున్న నేపథ్యంలో ఆదివారం పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్నిల సంఘం తీరును ఆయన తూర్పారబట్టారు. ఓట్ల చోరీ జరిగిందంటూ రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన తర్వాత ఉద్యమస్థాయికి చేరిన విషయం తెల్సిందే. ''ఓట్ల చోరీ అంశంలో త్వరలో రాహుల్‌గాంధీ 'హైడ్రోజన్ బాంబ్'పేలుస్తానని చేస్తున్న వ్యాఖ్యలు కేవలం రాజకీయ ఎత్తుగడ అయి ఉండొచ్చు. కానీ ఆయన చేసిన ఆరోపణలు చాలా తీవ్రమైనవి. ఎన్నికల సంఘం కొత్త ఓట్ల జోడింపు, నకిలీ ఓట్ల తొలగింపు ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు, లోపాటు ఉన్నట్లు ఆయన ఆరోపణలు చేశారు. రాహుల్ చేసిన ఆరోపణలను ఈసీ చాలా తీవ్రంగా భావించాలి. వాటిలోని సహేతుకత, ప్రభావాలను పరిగణనలోకి తీసుకుని లోతైన దర్యాప్తు చేపట్టాలి. సమగ్ర స్థాయిలో దర్యాప్తుతో ఆయన ఆరోపణల్లోని నిజానిజాలను నిగ్గుతేల్చాలి. అలాంటిదేమీ చేయకుండా కేవలం ఆయనపై ప్రత్యారోపణలు చేయడం ఈసీకి తగదు. బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) చేపట్టిన విధానం లోపభూయిష్టంగా ఉందని విపక్షపార్టీలుసహా పలు వర్గాల నుంచి తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని నివృత్తిచేయాల్సిన బాధ్యత ఈసీపైనే ఉంది. ఆ దిశగా అడుగులేయాల్సింది పోయి ఇతరత్రా అంశాల్లో జోక్యం చేసుకుని వివాదాల తేనెతుట్టెను ఈసీ కదిపింది'' అని ఖురేషి అన్నారు.



అఫిడవిట్ అడగడం సబబుకాదు

''ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో లోపాలు ఉన్నాయని రాహుల్ ఆరోపించినప్పుడు దర్యాప్తు మొదలెడితే సరిపోయేది. అలా చేయకుండా రాహుల్ నుంచి ఆ ఆరోపణలు నిజమేనని పేర్కొంటూ అఫిడవిట్‌ను కోరడం సబబుకాదు. ఆయనేం వీధిలో వెళ్లే వ్యక్తికాదు. లోక్‌సభలో విపక్ష నేత. కోట్లాది ఓటర్లకు ప్రతినిధి. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల తరఫున ప్రశ్నించే ప్రజాప్రతినిధి. కోట్లాది ప్రజల గొంతుక. అలాంటి కీలకమైన హోదాలో ఉన్న వ్యక్తితో ఈసీ ఇలా నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం గతంలో నేనెప్పుడూ చూడలేదు. అఫిడవిట్ ఇవ్వండి లేదంటే ఇలా చేస్తాం అలా చేస్తాం అంటూ ఆయనతో అమర్యాద బాషలో సంబోధించడం అభ్యంతరకరం మాత్రమేకాదు నేరం కూడా'' అని ఖురేషి ఆగ్రహం వ్యక్తంచేశారు.

కొత్త జాబితాలో తప్పుల్లేవని అఫిడవిట్ ఇవ్వగలరా?

ఈ సందర్భంగా ఈసీపై ఖురేషి పలు ప్రశ్నలు సంధించారు. ''ముసాయిదా జాబితా తర్వాత సవరణల తర్వాత తెచ్చే తుది జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లవని మీరు గ్యారెంటీ ఇవ్వగలరా? రాహుల్‌ను అడిగినట్లుగా మీరు కూడా ఇందులో ఏ తప్పులు ఉండబోవని అఫిడవిట్ సమర్పించగలరా? తప్పులు ఉంటే అది నిజంగా నేరమే. అలాంటి పరిస్థితిని మీరు ఎదుర్కోగలరా?. ఈసీ అనేది పారదర్శకంగా ఉంటే సరిపోదు. పారదర్శకంగా ఉన్నట్లు స్పష్టంగా కనిపించాలి. నిజానిజాలను దర్యాప్తు మాత్రమే బయటపెట్టగలదు. తీవ్ర ఆరోపణలు అరుదుగా చేస్తారు. అలాంటప్పుడే దర్యాప్తు చేపట్టాలి. అలాంటి అవకాశాన్ని ఈసీ సద్వినియోగం చేసుకోలేకపోయింది'' అని అన్నారు. ఖురేషీ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ స్పందించింది. 'రాజకీయ పార్టీలతో మేము క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఇంత నిర్మాణాత్మక పద్ధతిలో మరెక్కడా సమావేశాలు జరగవు' అని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆ సందర్భాల్లో నేనెంతో బాధపడ్డా..

''నేరుగా ఈసీని తప్పుబడుతూ ఏవైనా ఆరోపణలు వస్తే నేను తొలుత ఆందోళనచెందుతా. ఈసీని అత్యంత పారదర్శకంగా పనిచేసేలా చూడటంలో నాడు ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నా వంతు కృషిచేశా. అందుకే ఇప్పుడు కేంద్ర ఎన్నికలసంఘంపై ఎవరైనా ఆరోపణలు చేస్తే మాజీ సీఈసీగానేకాకుండా ఒక సగటు భారతీయ పౌరునిగా ఎంతో బాధపడతా. ఏదైనా ప్రభుత్వసంస్థను ఎవరైనా బలహీనపర్చడానికి ప్రయత్నిస్తే కుంగిపోతా. అలాంటి ఈసీ స్వయంగా ఆరోపణల దాడులను ఎదుర్కొన్నప్పుడు వాటిని సమగ్ర దర్యాప్తు ద్వారా సమగ్రంగా ఎదుర్కోవాలి. రాజకీయ శక్తులు, బయటి వ్యక్తుల ఒత్తిళ్ల ఏ స్థాయిలో ఉన్నా సరే స్వీయ నిర్ణయాలల్లో వెనుకడుగు వేయకూడదు. ప్రజల విశ్వాసాన్ని ఈసీ చూరగొనాలి. అధికార పార్టీతో పోలిస్తే విపక్ష పార్టీల పలుకుబడి తక్కువ అయినాసరే విపక్ష పార్టీల విశ్వాసాన్నీ సాధించాలి. అధికార పార్టీ నేతలతో పోలిస్తే విపక్ష పార్టీల నేతలు చెప్పేవి ఎక్కువగా వినాలి. అందుకోసం వారికి ఈసీ తలుపులు బార్లా తెరవాలి. వాళ్లకు అపాయింట్‌మెంట్ ఇచ్చి వాళ్ల వాదనలు, ఆరోపణలు, అభ్యంతరాలు, విన్నపాలను సావధానంగా ఆలకించాలి. మా మాట ఈసీ వినట్లేదని ముఖ్యమైన 23 పార్టీలు సుప్రీంకోర్టు గుమ్మం తొక్కే పరిస్థితి తెచ్చుకోవద్దు'' అని ఈసీకి ఖురేషి హితవు పలికారు.

ప్రగతి పథంలో ముందుకు

- ప్రాచీన విజ్ఞానంపై విశ్వాసంతో దూసుకెళ్తున్న భారత్
- ఆర్ఎస్ఎస్ చీఫ్ భాగవత్ వ్యాఖ్య

ఇండోర్: భారతీయ సంప్రదాయక విజ్ఞానాన్ని నమ్ముకున్న భారత్ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ విజయపథంలో దూసుకుపోతోందని రాష్ట్రీయ స్వయంసేవక్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. గత ఐదు త్రైమాసికాలతో పోలిస్తే ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ప్రతి ఒక్కరి అంచనాలు పటాపంచలు చేస్తూ భారత్ ఏకంగా 7.80 శాతం వృద్ధిరేటును సాధించిన నేపథ్యంలో భారత పురోభివృద్ధిని భాగవత్ ప్రస్తావించడం గమనార్హం. ఆదివారం మధ్యప్రదేశ్ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్‌కు చెందిన 'పరిక్రమ కృపాసారం' పుస్తకాన్ని ఇండోర్‌లో ఆవిష్కరించిన సందర్భంగా మీడియాతో భాగవత్ మాట్లాడారు. ''3,000 ఏళ్లపాటు భారత్ విశ్వశక్తిగా కొనసాగినన్నిరోజులు ప్రపంచంలో ఎలాంటి ఆధిపత్యపోరు, సంఘర్షణలు జరగలేదు. ఇప్పుడు ప్రపంచదేశాల్లో నెలకొన్న ఘర్షణలన్నీ స్వప్రయోజనాలకు సంబంధించినవే. ఇవే అన్ని సమస్యలకు మూలం. భారతీయుల పూర్వీకులు జ్ఞాన, కర్మ, భక్తి భావనలను ఎలా సమన్వయం చేసుకుని జీవించాలో మనకు బోధించారు. ఈ సంప్రదాయక తత్వాన్ని భారత్ మనసావాచా కర్మణా పాటిస్తోంది. అందుకే ప్రతి ఒక్కరి అంచనాలను తప్పు అని ప్రకటిస్తూ ప్రగతిపథంలో భారత్ వడివడిగా అడుగులు వేస్తోంది'' అని అన్నారు. మాజీ బ్రిటన్ ప్రధానమంత్రి విన్‌స్టన్ చర్చిల్ చేసిన వ్యాఖ్యలను భాగవత్ ఉదహరిస్తూ.. ''మేం(బ్రిటన్) మీకు (భారత్‌కు) స్వాతంత్ర్యం ఇస్తే అంతర్గత వైషమ్యాలు, విబేధాలతో విడిపోతారు. కలిసి ఉండటం కల' అని వెక్కిరించారు. ఆయన అంచనాలు సైతం తప్పు అని భారత్ నిరూపించింది. ఐకమత్యాన్ని చాటింది. ఆర్థికాభివృద్ధితో పురోగమిస్తోంది. విడిపోదామని బ్రిటన్‌లోనే కొన్ని ప్రాంతాల నుంచి డిమాండ్లు ఊపందుకున్నాయి. ఇప్పుడు ఇంగ్లాండ్ విభజన దిశలో అడుగులేస్తోంది. కానీ భారత్ విడిపోదు. మనం ముందుకే వెళతాం. గతంలో మనం విభజనకు గురయ్యాం ఇప్పుడు మళ్లీ ఆ ఐక్యతను సుసాధ్యంచేద్దాం'' అని అన్నారు. విశ్వాసాలు, నమ్మకాల మీదనే ప్రపంచం ముందుకుపోతోంది. అలాంటి నమ్మికలకు భారత్ పుట్టినిల్లు. ఇక్కడి వాళ్లంతా కర్మసిద్ధాంతాన్ని విశ్వసిస్తారు. గోవులు, నదీమతల్లులు, వృక్షాలను పూజిస్తూ తద్వారా ప్రకృతి ఉపాసనను భారతీయులు ఆచరిస్తారు. అలా ప్రకృతిలో జీవిస్తారు. అలాంటి ప్రకృతి సంబంధం కోసం నేటి సమాజం అర్రులుచాస్తోంది. కానీ గత 300-350 సంవత్సరాలుగా ప్రపంచంలో చాలా దేశాలు ఎవరి దారి వారిదే, బలవంతులే బతకాలి అనే తప్పుడు వాదనకు జైకొట్టాయి. దాంతో సమస్యలొస్తున్నాయని వాళ్లకు ఇప్పుడు అర్థమైంది. జీవితనాటకంలో మనందరం పాత్రధారులం. నాటకం ముగిసినప్పుడే మనం ఎవరనేది మనకు బోధపడుతుంది'' అని ఆయన అన్నారు.

ధర్నాకు దిగిన వైష్ణోదేవి భక్తులు

యాత్రను పునరుద్ధరించాలని డిమాండ్

కత్రా/జమ్మూ: త్రికూల పర్వతాల్లో కొలువైన మాతా వైష్ణోదేవిని దర్శించుకునే భాగ్యం తమకు కల్పించాలని భక్తులు ధర్నాకు దిగారు. భారీ వర్షాలు, కొండచరియలు విరిగి పడుతున్న ఘటనలతో ముందుజాగ్రత్తగా జమ్మూకశ్మీర్ పాలనాయంత్రాంగం వైష్ణోదేవి యాత్రను గత 20 రోజులుగా నిలివేసిన నేపథ్యంలో విసుగుచెందిన యాత్రికులు, భక్తులు ధర్మాగ్రహం వెలిబుచ్చారు. దేవీదర్శనం కోసం సుదూరాల నుంచి వచ్చాక తీరా త్రికూల పర్వతాల వద్ద హఠాత్తుగా ఆపేసి, యాత్రకు అర్థంతరంగా రద్దుచేయడంపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ఆదివారం రేసీ జిల్లాలోని కత్రా బేస్‌క్యాంప్ వద్ద పెద్దసంఖ్యలో యాత్రికులు నిరసన చేపట్టారు. ఆలయం దిశగా ర్యాలీగా వెళ్తేందుకు భక్తులు ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. ఆలయబోర్డ్ ఆదేశాలను ఉల్లంఘించడానికి వీల్లేదని పోలీసులు తెగేసి చెప్పారు. ఆలయానికి దారితీసే ప్రధాన ఘాట్‌రోడ్డు, దానికి అనుసంధానమైన రహదారుల వెంట భారీ వర్షాలు, పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిన పడటంతో మొత్తం ఘటనల్లో 34 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. 20 మంది గాయపడ్డారు. దీంతో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వైష్ణోదేవి ఆలయ బోర్డ్ ఆగస్ట్ 26వ తేదీన యాత్రను నిలిపేసింది. అప్పటి నుంచి యాత్ర ఆగిపోయి ఆదివారానికి వరసగా 20 రోజులు పూర్తయింది. సెప్టెంబర్ 14వ తేదీన యాత్రను పునరుద్ధరిస్తామని గతంలో ప్రకటించినా ఆదివారం(సెప్టెంబర్ 14న) అది మొదలుకాలేదు. దీంతో రోజులతరబడి వేచి ఉండే ఓపికలేక భక్తుల్లో అసహనం, ఆగ్రహం పెల్లుబికింది. ''రెండు నెలలపాటు పాదరక్షల్లేకుండా కాలినడకన కత్రా బేస్‌క్యాంప్‌దాకా వచ్చా. వీలైనంత త్వరగా దర్శనభాగ్యం దక్కుతుందని ఆశపడుతున్నా. పెద్దగుంపులుగా జనానఇన పంపిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని భావిస్తే చిన్న గుంపులుగా అయినా యాత్రను మొదలెడితే బాగుంటుంది'' అని మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన రాజీవ్ లోధీ అనే భక్తుడు అన్నారు. ''19 రోజలతర్వాత 14వ తేదీన యాత్ర మొదలుకానుందని తెల్సి తమిళనాడు నుంచి కుటుంబంతో వచ్చా. తీరాచూస్తే యాత్ర పునరుద్ధరణ వాయిదాపడింది. మా క్షేమం కోరి యాత్రను ఆపేశారని తెలుసు. కానీ ఇంకెన్ని రోజులు వేచి ఉండాలో తెలీట్లేదు'' అని చెన్నైవాసి వినోద్‌కుమార్ అన్నారు. ''ఏదేమైనా యాత్ర పూర్తిచేస్తాం. సస్పెండ్‌చేసే ఉద్దేశమే ఉంటే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఎందుకు మొదలెట్టారు?' అని ముంబై నుంచి వచ్చిన రేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్శనం చేసుకున్నాక వెనుతిరుగుతామని బిహార్ వాసి రాజ్‌కుమార్ స్పష్టంచేశారు.

టెక్సాస్‌లో షరియా చట్టంపై నిషేధం

- ఎవరైనా అమలు చేస్తే సమాచారమివ్వండి
- గవర్నర్ గ్రెగ్ అబాట్ పిలుపు

హూస్టన్: ఇస్లామిక్ షరియా చట్టం అమలుపై అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం నిషేధం విధించింది. ఎవరైనా ఈ చట్టాన్ని వ్యాపార సంస్థల్లోగానీ, వ్యక్తిగత విషయాల్లో గానీ అమలు చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే సమాచారమివ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మద్యం, పందిమాంసం, లాటరీ టిక్కెట్లను విక్రయించరాదంటూ ఓ ముస్లిం బోధకుడు లౌడ్ స్పీకర్ ద్వారా దుకాణదారులను కోరుతున్నట్లుగా ఉన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన నేపథ్యంలో అబాట్ నిషేధం విషయం ప్రకటించారు. ఇలా కోరడం వేధింపుల కిందికే వస్తుందని, మత నియమాలను ప్రజలపై బలవంతంగా రుద్దాలని చూస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. 'టెక్సాస్ పరిధిలో షరియా చట్టాన్ని, షరియా ప్రాంగణాలను నిషేధించే చట్టంపై సంతకం చేశా. ఏ వాణిజ్య సంస్థ లేదా వ్యక్తి అటువంటి మూర్ఖులను చూసి భయపడరాదు' అని అబాట్ 'ఎక్స్'లో అన్నారు. ఎవరైనా షరియా చట్టాన్ని బలవంతంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తే టెక్సాస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ సేఫ్టీకి తెలపండి అని ప్రజలను కోరారు. టెక్సాస్‌లో అధికారికంగా షరియాపై నిషేధం లేదు. అయితే 2017 నాటి అమెరికన్ లాస్ ఫర్ అమెరికన్ కోర్ట్స్ ప్రకారం టెక్సాస్‌లో అమెరికా చట్టంతో విభేదించే షరియా సహా ఏదైనా విదేశీ, మతపరమైన నిబంధనల అమలును నిరోధిస్తుంది. అమెరికన్ ఇస్లామిక్ రిలేషన్స్ సహా పలు ముస్లిం సంస్థలు అబాట్ ప్రకటనలను తప్పుబట్టాయి. షరియా వ్యక్తిగతమైనదే తప్ప, ప్రజా చట్టం కాదని పేర్కొన్నాయి. కొన్ని నెలల క్రితం ఈస్ట్ ప్లానో ఇస్లామిక్ సెంటర్ పేరుతో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయతలపెట్టిన ప్రాజెక్టును సైతం అబాట్ తీవ్రంగా వ్యతిరేకించారు. నివాసాలు, స్కూళ్లు, మసీదు, వాణిజ్య సదుపాయాలతో ఏర్పాటయ్యే ఈ సముదాయం మరో షరియా జోన్‌గా మారుతుందని ఆయన ఆరోపించారు.

ఉక్రెయిన్ డ్రోన్ దాడులు... మంటల్లో రష్యా ఆయిల్ రిఫైనరీ

మాస్కో: రష్యాలోని అతిపెద్ద చమురుశుద్ధి కేంద్రంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు పాల్పడింది. దీంతో లెనిన్‌గ్రాడ్ ప్రాంతంలోని కిరిషి రిఫైనరీలో మంటలు చెలరేగాయని రష్యా అధికారులతోపాటు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. ఇక్కడ రోజుకు 3.55 లక్షల బ్యారెళ్ల చమురు శుద్ధి అవుతుంది. రష్యాలోని మూడు అతిపెద్ద రిఫైనరీల్లో ఇదొకటి. చమురు, గ్యాస్ విక్రయాలతో వచ్చే ఆదాయంతోనే తమపై రష్యా దురాక్రమణను కొనసాగిస్తోందని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. అందుకే, తరచూ రష్యా ఆయిల్ వనరులపై దాడులకు దిగుతోంది. తాజా దాడిలో కిరిషి రిఫైనరీలో పేలుళ్లు, మంటలు చెలరేగినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. ఇందుకు సంబంధించిన ఫొటోను ఆన్‌లైన్‌లో షేర్ చేసింది. కిరిషి ప్రాంతంపై శనివారం రాత్రి మూడు డ్రోన్లు దాడి చేశాయని ఆ ప్రాంత గవర్నర్ అలెగ్జాండర్ చెప్పారు. వీటిని గగనతల నిఘా వ్యవస్థలు ధ్వంసం చేయడంతో శిథిలాలు పడి మంటలు లేచాయని, వెంటనే అదుపు చేశామని ఆయన తెలిపారు. నష్టం వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. అయితే శనివారం రాత్రి నుంచి క్రిమియా, అజోవ్ సముద్రంపై ఉక్రెయిన్ ప్రయోగించిన కనీసం 80 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. చమురు ఎగుమతుల్లో రష్యా ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశం. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యాలో గ్యాసోలిన్ కొరత ఏర్పడింది. చాలా ప్రాంతాల్లోని గ్యాసోలిన్ స్టేషన్లు మూతబడటంతో వాహనదారులు క్యూలు కడుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు రష్యా గ్యాసోలిన్ ఎగుమతులను నిలిపివేసింది. ఇలా ఉండగా, లెనిన్‌గ్రాడ్ ప్రాంతంలో శనివారం రాత్రి ఒక గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఘటనలతో తీవ్రగాయాలైన గూడ్స్ డ్రైవర్ చనిపోయారు. ఒరియోల్ ప్రాంతంలో రైలు పట్టాలపై అమర్చిన బాంబు పేలి ముగ్గురు చనిపోయారు. రైలు పట్టాలను తనిఖీ చేస్తుండగా ఘటన చోటుచేసుకుందని అధికారులు వివరించారు.

హింసకు పాల్పడిన వారిని వదలం

నేపాల్ ప్రధానమంత్రి సుశీలా కర్కి వెల్లడి

కాఠ్మండు: ఇటీవల పెద్ద ఎత్తున చోటుచేసుకున్న ప్రభుత్వ వ్యతిరేక నిరసనల సందర్భంగా విధ్వంసానికి, హింసాత్మక చర్యలకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతామని నేపాల్ ప్రధాని సుశీలా కర్కి స్పష్టం చేశారు. జెన్ జెడ్ విద్యార్థుల ఆందోళనల సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన వారిని అమరులుగా ప్రకటిస్తామన్నారు. మృతుల కుటుంబాలకు పది లక్షల నేపాలీ రూపాయలు అందజేస్తామన్నారు. శనివారం బాధ్యతలు చేపట్టిన సుశీలా కర్కి అనంతరం ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితులను సమీక్షించారు. నిరసనల వేళ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల విధ్వంసానికి దిగడం నేరం, ఇందుకు బాధ్యులైన వారిని వదిలేది లేదన్నారు. ఈ నెల 9వ తేదీన చోటుచేసుకున్న విధ్వంసం ప్రణాళిక ప్రకారమే జరిగిందని, జెన్ జెడ్ నిరసనకారులు ఈ ఘటనల్లో పాల్గొనలేదని ఆమె స్పష్టం చేశారు. దేశవ్యాప్త ఆందోళనల్లో దెబ్బతిన్న పోలీస్‌స్టేషన్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆమె ఆదేశించారు. ఆందోళనకారులు సింఘదర్బార్ సెక్రటేరియట్‌లో ఉన్న ప్రధాని కార్యాలయానికి నిప్పుపెట్టారు. దీంతో కర్కి కొత్తగా నిర్మించిన హోం శాఖ కార్యాలయాన్ని ప్రధాని కార్యాలయంగా ఉపయోగించుకుంటున్నారు. ఇలా ఉండగా, ఆందోళనలకు సంబంధించిన ఘటనల్లో చనిపోయిన వారి సంఖ్య 72కు చేరుకుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆర్యల్ ఆదివారం తెలిపారు. ఇందులో ముగ్గురు పోలీసులతోపాటు 59 మంది నిరసనకారులు, 10 మంది ఖైదీలు ఉన్నారని వివరించారు.

వీరనారి.. పరిపాలనాదక్షురాలు.. రాణి రుద్రమదేవి

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

క్రీ.శ.1262లో పూర్తి రాజ్యభారాన్ని స్వీకరించిన రుద్రమదేవి కాకతీయ సామ్రాజ్యాన్ని సుమారు మూడు దశాబ్దాలపాటు పరిపాలించింది. స్త్రీలు రాజ్యాధికారం చేపట్టడం అరుదైన ఆ కాలంలో.. తండ్రి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా రుద్రమదేవి వీరనారిగా, పరిపాలనాదక్షురాలిగా చరిత్రలో నిలిచింది.



కాకతీయులు

గణపతిదేవుడు(క్రీ.శ.1199-1262)

దక్షిణ భారతదేశాన్ని ఏలిన గొప్ప చక్రవర్తుల్లో గణపతిదేవుడు ఒకరు. యాదవ రాజుల చెర నుంచి విడుదలైన గణపతిదేవుడు క్రీ.శ.1199 నుంచి రాజ్యపాలన చేశాడని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఆయన రాజ్యానికి వచ్చినప్పుడు ఆంధ్రదేశ పరిస్థితులు రాజ్య విస్తరణకు అనుకూలంగా ఉన్నాయి. తీరాంధ్రలో గోదావరికి దక్షిణంగా ఉన్న ప్రాంతం చిన్న చిన్న రాజ్యాలుగా చీలిపోయింది. దీంతో గణపతిదేవుడు తీరాంధ్రపై దండెత్తాడు. రెండో రాజేంద్ర చోళుడి కుమారుడైన పృథ్వీశ్వరుడితో యుద్ధం చేశాడు.

క్రీ.శ.1201లో బెజవాడను ఆక్రమించిన కాకతీయ సైన్యం దివి ద్వీపాన్ని ముట్టడించింది. కానీ గణపతిదేవుడు ఆ ద్వీపాన్ని అయ్యవంశ రాజైన అయ్య పినచోడుకు తిరిగి ఇచ్చివేశాడు. అతడి కుమార్తెలైన నారాంబ, పేరాంబలను వివాహమాడాడు. బావమరిదైన జాయపుడికి తన కొలువులో గజసాహిణి అనే పదవిని ఇచ్చాడు. ఈ యుద్ధంతో గోదావరి నుంచి పెన్నా నది వరకు ఉన్న వెలనాటి చోళుల రాజ్యం కాకతీయుల హస్తగతమైంది. నెల్లూరు తెలుగు చోళులతో కాకతీయులకు స్నేహం ఉండేది. ఇది కాకతీయ రాజ్య విస్తరణకు తోడ్పడింది. పృథ్వీశ్వరుడిపై యుద్ధంలో గణపతిదేవుడికి చోడ తిక్కన సహాయం చేశాడు. దీనికి ప్రతిఫలంగా గణపతిదేవుడు నెల్లూరుపై దండెత్తాడు. తమ్ముసిద్ధిని ఓడించి చోడ తిక్కనకు సింహాసనం కట్టబెట్టాడు. ఈ యుద్ధాల వల్ల నెల్లూరు తెలుగు చోళుల రాజ్యంపై కాకతీయుల ఆధిపత్యం ఏర్పడింది.

కళింగ దండయాత్ర

పృథ్వీశ్వరుడిపై విజయం సాధించిన గణపతి దేవుడు కళింగ దండయాత్రను ప్రారంభించాడు. ఈ దండయాత్ర చేసిన వారిలో రేచర్ల రాజనాయకుడు, ఏరువ తెలుగు చోడ భీముడు ముఖ్యులు. ఉదయగిరి ఆక్రమణ తర్వాత కాకతీయ సైన్యం బస్తర్‌లో ప్రవేశించి చక్రకోటను జయించింది. తర్వాత గోదావరిని దాటి ద్రాక్షారామం చేరింది. కళింగ దండయాత్రతో కాకతీయ సైన్యం ప్రతిష్ఠ పెరిగింది. కానీ శాశ్వత ప్రయోజనం చేకూరలేదు. కాకతీయుల చేతిలో ఓడిన గాంగ సైన్యం కోల్పోయిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుంది.

కమ్మనాడును పరిపాలిస్తున్న కొణిదెన చోళులు గణపతిదేవుణ్ని ఎదిరించి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. తెలుగు చోళరాజు కుమారుడైన ఓబిలిసిద్ధి 'పొత్తపి'ని పరిపాలించేవాడు. కమ్మనాడును జయించాలని గణపతిదేవుడు ఇతణ్ని ఆజ్ఞాపించాడు. ఓబిలిసిద్ధి కొణిదెన చోళులతోపాటు అద్దంకి చక్రనారాయణ వంశ రాజులనూ ఓడించాడు. దీంతో గణపతిదేవుడు ఓబిలిసిద్ధిని కమ్మనాడుకు పాలకుడిగా నియమించాడు. గోదావరి మండలం కాకతీయుల వశమైంది. గణపతిదేవుడు జీవించి ఉన్నంత కాలం కళింగులు మళ్లీ యుద్ధం మాట ఎత్తలేదు.

క్రీ.శ.1248లో నెల్లూరుని పాలించే చోడ తిక్కన మరణించాడు. ఇతడి కుమారుడైన రెండో మనుమసిద్ధి(వీరగండ గోపాలుడు), అతడి దాయాది విజయగండ గోపాలుడి మధ్య రాజ్యం కోసం తగాదా వచ్చింది. ఈ పరిస్థితుల్లో రెండో మనుమసిద్ధి గణపతిదేవుడి సహాయం కోరాడు. మహాకవి తిక్కన సోమయాజితో రాయబారం పంపాడు.

దీంతో గణపతిదేవుడు సామంతభోజుని నాయకత్వంలో తన సైన్యాన్ని పంపాడు. గణపతి దేవుడు స్వయంగా నెల్లూరు వెళ్లి మనుమసిద్ధిని సింహాసనంపై అధిష్ఠింపజేశాడు. ఆ తర్వాత కాకతీయ సైన్యం ద్రావిడ మండలంలో ప్రవేశించింది. పళైయూరు(తంజావూరు జిల్లా) యుద్ధంలో విజయగండ గోపాలుడిని, కర్ణాటక సైన్యాన్ని ఓడించింది. ఈ విజయాలతో కాకతీయ సామ్రాజ్యం దక్షిణదేశంలో కాంచీపురం వరకు విస్తరించింది.

క్రీ.శ.1263లో జరిగిన ముత్తుకూరు యుద్ధం మినహా తన జీవిత కాలంలో గణపతిదేవుడు అపజయం పొందలేదు. క్రీ.శ.1199 నుంచి క్రీ.శ.1262 వరకు అఖిలాంధ్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధిపత్యం కిందికి తెచ్చిన గొప్ప రాజనీతిజ్ఞుడు. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని పూర్తి చేసి రాజధానిని ఓరుగల్లుకు మార్చాడు. గణపతిదేవుడికి ఇద్దరు కూతుళ్లు రుద్రమదేవి, గణపాంబ. రుద్రమదేవి గణపతి దేవుడి కూతురని కొలనుపాక, పానగల్లు శాసనాలు తెలుపుతున్నాయి. గణపతి దేవుడు రాజకీయ చతురతతో రుద్రమదేవిని తూర్పు చాళుక్య వంశ రాజు వీరభద్రుడికిచ్చి వివాహం చేశాడు. గణపాంబను కోట వంశ రాజైన బేతనకిచ్చి వివాహం చేశాడు.

రుద్రమదేవి(క్రీ.శ.1262-1289)

గణపతిదేవుడు రుద్రమదేవిని క్రీ.శ.1259లోనే రాజప్రతినిధిగా నియమించినప్పటికీ.. క్రీ.శ.1262లో పూర్తి రాజ్య భారాన్ని అప్పగించాడు. అయితే క్రీ.శ.1269లో గణపతిదేవుడు మరణించిన తర్వాత రుద్రమదేవి కాకతీయ రాజ్య కిరీటాన్ని ధరించింది. గణపతి దేవుడు రుద్రమాంబను రాణిని చేయడం నచ్చని కొంత మంది సామంత రాజులు, రాజబంధువులు ఆమెపై తిరుగుబాటు చేశారు. రుద్రమాంబ సవతి సోదరులైన హరిహర దేవుడు, మురారి దేవుడు ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. రుద్రమాంబ వారిని ఓడించి, మరణ శిక్ష విధించినట్లు 'ప్రతాపరుద్ర చరిత్ర' ద్వారా తెలుస్తోంది. కాయస్థరాజులైన జన్నిగదేవుడు, త్రిపురారి, వెలమనాయకుడైన ప్రసాదిత్యుడు, మల్యాల గుండియ నాయకుడు తదితరుల మద్దతుతో రుద్రమదేవి సింహాసనం దక్కించుకుంది. కాకతీయ రాజ్యంలో తిరుగుబాటు జరిగిన సమయంలో కళింగరాజు మొదటి నరసింహుడు గోదావరి మండలంపై దండెత్తి చాలా ప్రాంతాన్ని ఆక్రమించాడు. అనంతరం అతడి కుమారుడు గజపతి మొదటి వీర భానుదేవుడు ఒడ్డాది మత్స్యదేవుడితో కలిసి వేంగిపై దండెత్తాడు. పోతినాయకుడు, పోలినాయకుడు అనే సేనానుల నాయకత్వంలో రుద్రమదేవి ఈ దండయాత్రను ఎదుర్కొంది. గోదావరి తీరంలో జరిగిన భీకర యుద్ధంలో కళింగులను ఓడించిన కాకతీయ సేనానులు గజపతి మత్తమాతంగ సింహ, ఒడ్డియ రాయమర్దన బిరుదులు పొందారు.

తర్వాతి కాలంలో యాదవ మహాదేవుడు కాకతీయ రాజ్యంపై దండెత్తాడు. ఓరుగల్లు కోటను 15 రోజులు ముట్టడించాడు. రుద్రమదేవి అతడితో భీకరంగా పోరాడింది. మహాదేవుడికి చెందిన మూడు లక్షల సేవణ కాల్బలాన్ని, ఒక లక్ష అశ్విక దళాన్ని నాశనం చేసింది. మహాదేవుడు ఓడిపోయి పారిపోగా రుద్రమాంబ అతణ్ని దేవగిరి వరకు వెంటాడింది. యాదవ మహాదేవుడు కోటి సువర్ణాలను నష్టపరిహారంగా ఇచ్చి సంధి చేసుకున్నాడు. ఈ సొమ్మును రుద్రమాంబ తన సేనానులకు పంచి పెట్టింది. రుద్రమదేవి దేవగిరి వద్ద విజయస్తంభం నాటిందని 'ప్రతాపరుద్ర చరిత్ర' గ్రంథం ద్వారా తెలుస్తోంది. అయితే 'హేమాద్రి వ్రతఖండం' మాత్రం రుద్రమదేవిని మహాదేవుడు ఓడించాడని తెలుపుతోంది. కానీ 'ప్రతాపరుద్రచరిత్ర' కథనంలో యుద్ధంలో చనిపోయిన సేవణుల సైనిక సంఖ్య మినహా మిగతావన్నీ నిజాలేనని శాసనాలు, నాణేలు బలపరుస్తున్నాయి. నల్గొండ జిల్లా పానుగల్లులోని ఛాయా సోమనాథుడికి భూమిని దానం చేసిన సారంగపాణి దేవుడు రుద్రమదేవి సామంతుడు. ఇతడు యాదవ మహాదేవుని పినతండ్రి. ఇతడు సామంతుడు కావడం మహాదేవుని ఓటమిని సూచిస్తోంది. బీదర్ ప్రాంతాన్ని రుద్రమ కాకతీయ రాజ్యంలో చేర్చుకోవడం కూడా ఆమె విజయాన్నీ, మహాదేవుడి ఓటమినీ సూచిస్తోంది.

కడప మార్జవాడి రాజ్యంలో కాయస్థ జన్నిగదేవుడి తర్వాత అతని పెద్ద కుమారుడు త్రిపురారిదేవుడు, తర్వాత అతడి తమ్ముడు అంబదేవుడు కాకతీయుల సామంతులుగా పాలించారు. క్రీ.శ.1272లో రాజ్యానికొచ్చిన కాయస్థ అంబదేవుడు రుద్రమదేవిని ఎదిరించి స్వతంత్ర కాయస్థ రాజ్య నిర్మాణానికి పూనుకున్నాడు. రుద్రమదేవి మల్లికార్జున సేనాని నాయకత్వంలో సైన్యాన్ని నడిపింది. ఈ యుద్ధంలో రుద్రమ జయించిందనీ, మరణించిందనీ భిన్న కథనాలున్నాయి. రుద్రమదేవి క్రీ.శ.1289లో మరణించినట్లు నకిరేకల్ సమీపంలోని చందుపట్ల శాసనం ద్వారా తెలుస్తోంది. దీన్ని బట్టి ఆ యుద్ధంలో రుద్రమదేవి మరణించిందని చెప్పొచ్చు.

ప్రతాపరుద్రుడు (క్రీ.శ.1289-1323)

రుద్రమదేవికి ముగ్గురు కుమార్తెలు. వారు.. ముమ్మడమ్మ, రుద్రమ్మ, రుయ్యమ్మ. పెద్ద కుమార్తె ముమ్మడమ్మ మహాదేవుడి భార్య. వీరి కుమారుడే ప్రతాపరుద్రుడు. ఇతడి కాలంలో కాకతీయుల అధికారం ఉచ్ఛస్థితికి చేరి, ఓ వెలుగు వెలిగి అస్తమించింది.

రుద్రమదేవి కాలం నుంచే స్వతంత్రించిన అంబదేవుడు, అతడి కొడుకు రెండో త్రిపురారి లు ప్రతాపరుద్రుడి సార్వభౌమాధికారాన్ని అంగీకరించలేదు. దీన్ని సహించని ప్రతాపరుద్రుడు నాయంకర వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి సైన్యాన్ని పటిష్ఠం చేసి అంబదేవుడిపై దండెత్తడానికి సమాయత్తమయ్యాడు. ఇది ఊహించిన అంబదేవుడు దక్షిణాన పాండ్యరాజులతో, ఉత్తరాన సేవుణుల(దేవగిరి యాదవులు)తో పొత్తు పెట్టుకున్నాడు. ప్రతాపరుద్రుడు క్రీ.శ.1291లో అంబదేవుని రాజధాని త్రిపురాంతకంపై ప్రచండ సైన్యాన్ని పంపాడు. కొలని సోమనమంత్రి కుమారుడు మనుమగన్నయ, ఇందులూరి పెదగన్నయమంత్రి కుమారుడు అన్నయదేవులు ఈ సైన్యానికి నాయకత్వం వహించారు. వీరు అంబదేవుణ్ని ఓడించి ములికినాడు వరకు తరిమికొట్టి కాయస్థ రాజ్యాన్ని కాకతీయ రాజ్యంలో కలిపారు. అంబదేవుణ్ని ఓడించిన తర్వాత ప్రతాపరుద్రుడు నెల్లూరుపై రెండుసార్లు దండెత్తాడు. నెల్లూరురాజు రాజగండగోపాలుడికి మద్దతునిచ్చిన పాండ్యులను ఓడించాడు. రుద్రమదేవి చివరి కాలంలో కాకతీయులు కృష్ణానది దక్షిణాన ప్రాభవాన్ని కోల్పోగా, ప్రతాపరుద్రుడు దాన్ని తిరిగి నిలబెట్టాడు. ప్రతాపరుద్రుడి మూడో దండయాత్ర అంబదేవుడికి మద్దతు నిలిచిన దేవగిరి యాదవరాజులపై జరిగింది. మనమగండగోపాలుడు, వర్ధమానపుర(మహబూబ్‌నగర్ జిల్లా) పాలకుడైన గోన విఠలుల నాయకత్వంలో ఈ యుద్ధం జరిగింది. గోనవిఠలుడు కృష్ణా, తుంగభద్ర ప్రాంతాన్ని దేవగిరి రాజుల నుంచి వశం చేసుకున్నాడు. .

మాదిరి ప్రశ్నలు

1. గణపతిదేవుడు మొదటగా ఎవరిపై దండెత్తాడు?
   1) రాజేంద్రచోళుడిపై
   2) అయ్య పినచోళుడిపై
   3) పృథ్వీశ్వరుడిపై
   4) చోడతిక్కనపై
2. ఎవరి కాలంలో వెలనాటి చోళ రాజ్యం కాకతీయ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది?
   1) ప్రతాపరుద్రుడు 2) రుద్రమదేవి
   3) గణపతిదేవుడు 4) రుద్రదేవుడు
3. గణపతిదేవుడి దగ్గరకి తిక్కన సోమయాజిని రాయబారిగా పంపిన రాజు?
   1) రక్కసగంగ
   2) విజయ గండగోపాలుడు
   3) చోడతిక్కన
   4) రెండో మనుమసిద్ధి
4. నెల్లూరు మనుమసిద్ధికి సహాయంగా గణపతిదేవుడు ఎవరి నాయకత్వంలో తన సైన్యాన్ని పంపాడు?
   1) సామంతభోజుడు 2) జాయప్ప
   3) రేచర్ల బేతిరెడ్డి 4) ఓబిలిసి
5. గణపతిదేవుడు అపజయం పొందిన ఏకైన యుద్ధం?
   1) కడప 2) కాంచీపురం
   3) ముత్తుకూరు 4) పళైయూరు
6. ముత్తుకూరు యుద్ధం ఏ సంవత్సరంలో జరిగింది?
   1) క్రీ.శ.1262 2) క్రీ.శ.1263
   3) క్రీ.శ.1261 4) క్రీ.శ.1264
7. రుద్రమదేవి గణపతిదేవుడి కుమార్తె అని మొదట పేర్కొన్నవారు?
   1) నరహరి కవి 2) మార్కోపోలో
   3) గంగాధర కవి
   4) శేషాద్రి రమణ కవులు
8. రుద్రమదేవిని వివాహం చేసుకున్న వీరభద్రుడు ఏ వంశ రాజు?
   1) కోటవంశ 2) తూర్పు చాళుక్య
   3) యాదవ 4) వెలనాటి చోళ
9. రుద్రమదేవి క్రీ.శ.1259లో రాజ్యపాలనకు వచ్చి, ఏ సంవత్సరంలో రాజ్య కిరీటాన్ని ధరించింది?
   1) క్రీ.శ.1265 2) క్రీ.శ.1266
   3) క్రీ.శ.1269 4) క్రీ.శ.1267
10. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని పూర్తిచేసినవారు?
    1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
    3) రుద్రమదేవి 4) రుద్రదేవుడు
11. కాకతీయుల రాజధానిని హన్మకొండ నుంచి ఓరుగల్లుకు మార్చింది?
    1) ప్రతాపరుద్రుడు
    2) రుద్రమదేవి 3) గణపతిదేవుడు 4) రుద్రదేవుడు
12. ఏ యుద్ధ విజయం తర్వాత కాకతీయ సేనానులు గజపతిమత్త మాతంగ సింహ, ఒడ్డియ రాయమర్దన అనే బిరుదులను పొందారు?
    1) వేంగి 2) కళింగ
    3) నెల్లూరు 4) కడప

సమాధానాలు

1) 3 2) 3 3) 4 4) 1
5) 3 6) 2 7) 4 8) 2
9) 3 10) 1 11) 3 12) 2

శిశు గీతాలకు ఉండాల్సిన ప్రత్యేకతలు?

టెట్/డీఎస్సీ

తెలుగు మెథడాలజీ



1. కనీస అభ్యసనస్థాయి ప్రాతిపదికాంశాల్లో ఒకటి?
   ఎ) అభ్యసనకాలం బి) ఇంటిపని
   సి) జవాబుదారీతనం
   డి) బోధన సమయం
2. క్షుణ్ణ, విస్తార పఠనాలకు చిత్తాన్ని అయత్త పరిచే పఠనం?
   ఎ) ఆదర్శ పఠనం బి) మౌన పఠనం
   సి) ప్రకాశ పఠనం
   డి) మండూకప్లుతిపఠనం
3. నిలువు గీతలు, అడ్డ గీతలు, ఏటవాలు గీత లు, అర్ధచంద్రాకార గీతలు, వృత్తాలు మొద లైన వాటిని మొదట నేర్పి, తర్వాత రాత నేర్పే విధానం?
   ఎ) ప్రాచీనం బి) అతి పురాతనం
   సి) ఆధునికం డి) అతి నవీనం
4. బోధనాభ్యసన ప్రక్రియలను విశ్లేషించి ఉత్తమమైన వాటిని ఉపాధ్యాయులు స్వీకరించేందుకు తోడ్పడే శాస్త్రం?
   ఎ) భాషా శాస్త్రం బి) విద్యాతత్వ శాస్త్రం
   సి) విద్యా సాంఖ్యక శాస్త్రం
   డి) విద్యా సాంకేతిక శాస్త్రం
5. విద్యలో స్థాయి అంటే?
   ఎ) దీర్ఘకాలంలో సాధించాల్సిన లక్ష్యాలు
   బి) అనతి కాలంలో సాధించాల్సిన గమ్యాలు
   సి) నిర్ణీత సమయంలో సాధించాల్సిన సామర్థ్యాల అనుక్రమం
   డి) నిర్ణీత సమయంలో సాధించాల్సిన ప్రగతి
6. విరామకాల సద్వినియోగానికి ఉపకరించేది?
   ఎ) క్షుణ్ణ పఠనం బి) విస్తార పఠనం
   సి) దూర శ్రవణం డి) దృష్ట లేఖనం
7. ఉక్త లేఖనం కలిగించే ప్రయోజనం?
   ఎ) లేఖనంలో సమత బి) రాతలో స్పష్టత
   సి) లేఖనంలో వేగం డి) రాతలో భంగిమ
8. విద్యాసాంకేతిక శాస్త్రం విద్యాబోధనకు అందించిన వరం?
   ఎ) రేడియో బి) టెలివిజన్
   సి) టేప్ రికార్డర్
   డి) భాషా ప్రయోగశాల
9. భాషా ప్రయోగశాలలో ప్రధాన టేపులు, అభ్యాసకులను పర్యవేక్షించడానికి అవసరమైన సామగ్రి ఉండే అర?
   ఎ) పఠన అర బి) నియంత్రణ అర
   సి) సలహాదారు అర డి) వినికిడి అర
10. భాషా ప్రయోగశాలలో ఉండే సామగ్రి?
    ఎ) వినే బూత్ బి) సలహాదారు బూత్
    సి) కంట్రోల్ రూం డి) పైవన్నీ
11. ఓ చిత్రం లేదా దృశ్యాన్ని ప్రదర్శించి దానిపై విద్యార్థులను వ్యాసం రాయాలని కోరే పద్ధతి?
    ఎ) సన్నివేశ పద్ధతి బి) అభివర్ణన పద్ధతి
    సి) అనుకరణ పద్ధతి డి) క్రీడా పద్ధతి
12. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, స్వయంకృషి, నాయకత్వ లక్షణాలను పెంపొందించేవి?
    ఎ) పద క్రీడలు బి) వైయక్తిక క్రీడలు
    సి) వక్తృత్వపు పోటీలు
    డి) సాహిత్య ప్రహేళికలు
13. విద్యార్థుల్లో భాషాభినివేశం, సాహిత్యాభిలాషను పెంపొందించేందుకు తోడ్పడే యాత్రలు?
    ఎ) విజ్ఞాన యాత్రలు
    బి) భాషా విహార యాత్రలు
    సి) వినోద యాత్రలు
    డి) విహార యాత్రలు
14. పాఠశాల బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా విద్యార్థులు సంవత్సరమంతా నిర్వహించే తోట పని, పాఠశాల బ్యాంకు... అనేవి?
    ఎ) సాంస్కృతిక ఉద్యమాలు
    బి) పర్యావరణ ఉద్యమాలు
    సి) సంకీర్ణ ఉద్యమాలు
    డి) భాషోద్యమాలు
15. సారస్వత సంఘాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనం?
    ఎ) సమయ పాలన నిర్వహణ తెలుస్తుంది
    బి) సభా నిర్వహణ సామర్థ్యం అలవడుతుంది
    సి) కాలం విలువ తెలుస్తుంది
    డి) ఆత్మవిశ్వాసం పెరుగుతుంది
16. స్వల్పకాల వ్యవధిలో నిర్వహించడానికి, బోధించిన అంశాన్ని వెంటనే పరీక్షిం చడానికి అనువైన పద్ధతి?
    ఎ) పరీక్ష బి) పరిపృచ్ఛ
    సి) నికష డి) అభిప్రాయావళి
17. కింది వాటిలో ఉత్తమ నికష లక్షణం?
    ఎ) క్లుప్తత బి) సమగ్రత
    సి) స్వాభావికత డి) లాక్షణికత
18. విద్యార్థికి సంబంధించిన శారీరక, మానసి క, నైతిక, సామాజిక మూర్తిమత్వాన్ని నమో దు చేసి ప్రగతిని సూచించే రికార్డు?
    ఎ) విద్యార్థి స్వీయ వివరాల రికార్డు
    బి) క్యుములేటివ్ రికార్డు
    సి) పాఠశాల ప్రవేశ రికార్డు
    డి) పాఠశాల విడుదల రికార్డు
19. యూనిట్, నికషలతోపాటు తయారు చేయాల్సిన పట్టిక?
    ఎ) సూచనల పట్టిక
    బి) లక్ష్యాల భారత్వ పట్టిక
    సి) వివరణ పట్టిక
    డి) అంశాల పట్టిక
20. విద్యార్థుల సమాధాన పత్రాలను ఎవరు దిద్దినా, ఒకేవిధమైన మార్కులు రావాలనే మూల్యాంక లక్షణాన్ని ఏమంటారు?
    ఎ) విశ్వసనీయత బి) నిబద్ధత
    సి) ప్రామాణికత డి) విషయ నిష్ఠత
21. అంతర్గత మూల్యాంకనం చేసేది?
    ఎ) ప్రధానోపాధ్యాయులు
    బి) ఇతర పాఠశాల ఉపాధ్యాయులు
    సి) సహ విద్యార్థులు
    డి) బోధించిన ఉపాధ్యాయులు
22. విద్యార్థుల ప్రవర్తనలను తెలుసుకోవడానికి ఉపకరించే పరీక్షా సాధనం?
    ఎ) ప్రాయోగిక పరీక్ష బి) పరిశీలన
    సి) పరిపృచ్ఛ డి) రాత పరీక్ష
23. లక్ష్యాధార బోధనలో సమప్రాధాన్యం ఉన్న అంశాలు?
    ఎ) ఉద్దేశాలు - బోధన అభ్యసనం
    బి) లక్ష్యాలు-మూల్యాంకనం-పర్యవేక్షణ
    సి) లక్ష్యాలు-బోధనాభ్యసన కృత్యాలు - మూల్యాంకనం
    డి) గమ్యాలు-మూల్యాంకనం - స్వీయ అధ్యయనం
24. ప-ఫ-బ-భలను ఏమంటారు?
    ఎ) దంత్యాలు బి) ఓష్ఠ్యాలు
    సి) నాదాలు డి) తాలవ్యాలు
25. వర్గ ద్వితీయ, చతుర్థాక్షరాలను ఏమంటారు?
    ఎ) పరుషాలు బి) సరళాలు
    సి) వర్గయుక్కులు డి) శ్వాసాలు
26. వర్గ పంచమాక్షరాలను ఏమంటారు?
    ఎ) పరుషాలు బి) స్థిరాలు
    సి) నాదాలు డి) అనునాసికాలు
27. పరుష, సరళేతర హల్లులను ఏమంటారు?
    ఎ) శ్వాసాలు బి) నాదాలు
    సి) స్థిరాలు డి) అంతస్థాలు
28. చాప - చలి- జాజి - జొన్న - జాదం పదాల్లో చ,జలను ఏమంటారు?
    ఎ) దంత్యాలు బి) తాలవ్యాలు
    సి) పరుషాలు డి) సరళాలు
29. చిలుక - చీమ - చేను - జిల - జీడి - జేజే పదాల్లో చ,జలను ఏమంటారు?
    ఎ) దంత్యాలు బి) సరళాలు
    సి) తాలవ్యాలు డి) నాదాలు
30. బోధనాంశాలకు సంబంధించిన అదనపు సమాచారాన్ని విద్యార్థులకు అందించేం దుకు ఉపాధ్యాయులకు తోడ్పడేవి?
    ఎ) పారిభాషిక పదకోశాలు
    బి) నిఘంటువులు
    సి) మాండలిక పదకోశాలు
    డి) పరామర్శ గ్రంథాలు
31. అర్థ కాఠిన్యతను తొలగించడానికి ఉపాధ్యాయుడు తరగతి గదిలో అనుసరించే బోధన పద్ధతి?
    ఎ) విశ్లేషణ పద్ధతి బి) ప్రశ్నోత్తర పద్ధతి
    సి) ఉదాహరణ వాక్య పద్ధతి
    డి) వివరణ పద్ధతి
32. ఉపాధ్యాయుల మార్గదర్శనంలో... శోధనా దృక్పథంతో, స్వయంకృషితో విద్యార్థులు పూర్తిచేసేవి?
    ఎ) తోటపనులు బి) నిర్దేశ్యాలు
    సి) అనువాదాలు
    డి) తరగతి అలంకరణలు
33. వ్యాకరణ బోధనలో ఉదాహరణలు చెప్పి సూత్రాన్ని నిర్మింపజేసేందుకు అనుసరించే పద్ధతి?
    ఎ) అర్థ వివేచన పద్ధతి బి) శాస్త్ర పద్ధతి
    సి) అనుమానోపపత్తి పద్ధతి
    డి) నిగమోపపత్తి పద్ధతి
34. విద్యార్థుల వయసు, మానసిక స్థాయిని బట్టి సంవత్సరం వారీగా, తరగతి వారీగా విభజించేవి?
    ఎ) క్రీడానుభవాలు
    బి) అభ్యసనానుభవాలు
    సి) బోధనానుభవాలు
    డి) సామాజిక అనుభవాలు
35. ప్రాంతీయ భాషలను అధికార భాషలుగా స్వీకరించడానికి రాష్ట్రాలను అనుమతించిన భారత రాజ్యాంగ అధికరణం?
    ఎ) 342 బి) 343
    సి) 345 డి) 346
36. శిశు గీతాలకు ఉండాల్సిన ప్రత్యేకతలు?
    ఎ) గుణాత్మకత, యతి
    బి) ప్రామాణికత, యతి
    సి) లక్ష్యాత్మకత, ప్రాస
    డి) లయాత్మకత, అనుప్రాసలు
37. పద్యబోధన ప్రధాన లక్ష్యాల్లో... రసానుభూతి, ఆనందానుభూతులతోపాటు పేర్కొనదగింది?
    ఎ) ధ్వని విజ్ఞానం బి) సముచిత వైఖరి
    సి) హృదయ ద్రవీకరణం
    డి) భాషాంతరీకరణం
38. గద్యబోధనలో రచయిత పరిచయం, పూ ర్వాంశ పరిచయం చేయడానికి ఉపాధ్యా యుడు అనుసరించాల్సిన బోధన పద్ధతి?
    ఎ) చర్చా పద్ధతి బి) వివరణ పద్ధతి
    సి) ప్రశ్నోత్తర పద్ధతి డి) ఉపన్యాస పద్ధతి
39. సమగ్ర పాఠ్య ప్రణాళిక అంటే?
    ఎ) పాఠశాలలో జరిగే కార్యక్రమాలన్నింటికి సంబంధించింది
    బి) ఒక రోజు పాఠ్యాంశానికి సంబంధించింది
    సి) ఒక రోజు జరిగే బోధన కార్యక్రమానికి సంబంధించింది
    డి) ఒక పాఠానికి లేదా ఒక యూనిట్‌కు సంబంధించింది
40. వ్యాఖ్యాన పద్ధతి ఏ ప్రక్రియ బోధనకు ఉపకరిస్తుంది?
    ఎ) కథా బోధన బి) నాటక బోధన
    సి) వ్యాకరణ బోధన
    డి) ఉపవాచక బోధన
41. నిగూఢార్థాన్ని తెలుసుకోవడం, సూచనలను అనుసరించడం అనే స్పష్టీకరణలున్న బోధన లక్ష్యం?
    ఎ) భాషాభిరుచి బి) రసానుభూతి
    సి) అవగాహన
    డి) సంస్కృతి-సంప్రదాయాలు
42. తెలుగును ద్వితీయ భాషగా బోధిస్తున్న ప్పుడు మొదట సాధించాల్సిన విలువలు?
    ఎ) పరోక్ష విలువలు
    బి) పరిమిత విలువలు
    సి) హృదయగత విలువలు
    డి) అగణిత విలువలు
43. ట - ఠ - డ - ఢ - ణలను ఏమంటారు?
    ఎ) కంఠ్యాలు బి) తాలవ్యాలు
    సి) మూర్ధన్యాలు డి) ఓష్ఠ్యాలు
44. శ - ష - స - హలను ఏమంటారు?
    ఎ) ఊష్మాలు బి) శ్వాసాలు
    సి) నాదాలు డి) తాలవ్యాలు
45. య - ర - ల - వలను ఏమంటారు?
    ఎ) శ్వాసాలు బి) సరళాలు
    సి) అంతస్థాలు డి) పరుషాలు
46. హల్లులకు మరోపేరు?
    ఎ) స్వరాలు బి) స్థిరాలు
    సి) వ్యంజనాలు డి) శ్వాసాలు
47. దంత్యోచ్చారణ ఉన్న హల్లులు?
    ఎ) క - ఖ -గ - ఘ- ఙ
    బి) త - థ - ద - ధ - న
    సి) ప - ఫ - బ - భ - మ
    డి) చ - ఛ - జ - ఝ - ఞ
48. 'నయితాలీమ్' విద్యావిధానంలో మాతృభాష మాధ్యమం మంచిదని ప్రశంసించిన విద్యావేత్త?
    ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్
    బి) కొమర్రాజు లక్ష్మణరావు
    సి) రామచంద్ర శుక్లా
    డి) మహాత్మా గాంధీ
49. విజయనగర కాలంలో అధికార భాషగా తెలుగు అమల్లో ఉందని తెలిపే గ్రంథం?
    ఎ) ఆముక్త మాల్యద
    బి) క్రీడాభిరామం
    సి) రాయవాచకం డి) మను చరిత్ర
50. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేసిన సంవత్సరం?
    ఎ) 1966 బి) 1974
    సి) 1975 డి) 1978
51. లఘూత్తర ప్రశ్నలను తయారుచేసే క్రమంలో ఉపాధ్యాయుడు దృష్టిలో ఉంచుకోవాల్సిన అంశం?
    ఎ) ప్రతి ప్రశ్నను ఫలితాల ఆధారంగా రూపొందించాలి
    బి) మాదిరి సమాధానాలు ముందే రాసి ఉంచుకోవాలి
    సి) ప్రతి ప్రశ్నకు స్పష్టమైన ఒకే సమాధానం రావాలి
    డి) కాదు, రాదు వంటి ప్రశ్నలను అడగాలి
52. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఉపయోగపడే బోధనా పద్ధతి?
    ఎ) చర్చా పద్ధతి
    బి) ప్రశ్నోత్తర పద్ధతి
    సి) వివరణ పద్ధతి
    డి) ఉపన్యాస పద్ధతి

సమాధానాలు

1) సి; 2) బి; 3) సి; 4) డి; 5) సి; 6) బి; 7) సి; 8) డి; 9) సి; 10) డి; 11) బి; 12) సి; 13) బి; 14) సి; 15) బి; 16) సి; 17) ఎ; 18) బి; 19) బి; 20) సి; 21) డి; 22) బి; 23) సి; 24) బి; 25) సి; 26) డి; 27) సి; 28) ఎ; 29) సి; 30) డి; 31) సి; 32) బి; 33) సి; 34) బి; 35) సి; 36) డి; 37) సి; 38) బి; 39) డి; 40)బి; 41) సి; 42) బి; 43) సి; 44) ఎ; 45)సి; 46) సి; 47) బి; 48) డి; 49) సి; 50)బి; 51) సి; 52)బి;.

బైకు, కారు, బస్సులలో... దేని జడత్వం ఎక్కువ?

యాంత్రిక శాస్త్రం

- వస్తువుల స్థితిగతులను అధ్యయనం చేసే శాస్త్రాన్ని యాంత్రిక శాస్త్రం అంటారు.
- ఈ శాస్త్రానికి అరిస్టాటిల్ పితామహుడిగా పేరుగాంచారు.
- **రేఖీయ చలనం:** ఒక వస్తువు సరళరేఖ మార్గంలో ప్రయాణిస్తే దానిని రేఖీయ చలనం అంటారు.

ఉదా॥ రుజుమార్గంలో కదులుతున్న బస్సు లేదా రైలు రేఖీయ చలనాన్ని కలిగి ఉంటుంది.

ప్రాథమిక అంశాలు

- **దూరం:** గమనంలో ఒక వస్తువు ప్రయాణించే మార్గాన్ని దూరం అంటారు.

ప్రమాణాలు: సెంటీమీటర్, మీటర్స్ (ఇది అంతర్జాతీయ ప్రమాణం)

- **స్థానభ్రంశం:** ఒక వస్తువు తొలిస్థానం, తుదిస్థానాలను కలిపే సరళరేఖను స్థాన భ్రంశం అంటారు.

ప్రమాణాలు: సెంటీమీటర్, మీటర్స్

- దూరం అనేది అదిశరాశి. ఎందుకంటే దూరం అనే భౌతిక రాశికి కేవలం పరిమాణం మాత్రమే ఉంటుంది. దిశ ఉండదు.
- స్థానభ్రంశం అనేది సదిశరాశి. ఎందు కంటే స్థానభ్రంశం అనే భౌతికరాశికి పరిమాణం, దిశ ఉంటాయి.

దూరం, స్థానభ్రంశంల మధ్య సంబంధాలు

- ఒక వస్తువు వృత్తాకార మార్గంలో ఒక భ్రమణం పూర్తిచేసిన తర్వాత అది ప్రయాణించే దూరం అనేది వృత్త పరిధికి సమానం.

$S = 2\pi r$

కాని స్థానభ్రంశం శూన్యంగా ఉంటుంది.

$\therefore \vec{S} = 0$

- ఎందుకంటే ఈ సందర్భంలో వస్తువు తొలిస్థానం, తుదిస్థానాలు ఒకదానితో మరొకటి ఏకీభవిస్తున్నాయి.
- ఒకవేళ వస్తువు అర్ధభ్రమణాన్ని పూర్తి చేసిన తరువాత అది ప్రయాణించే దూరం S=πr, స్థానభ్రంశం S=2r వృత్త వ్యాసా నికి సమానంగా ఉంటాయి.
- నిట్టనిలువుగా పైకి విసిరిన వస్తువు కొంత ఎత్తును పొందిన పిమ్మట తిరిగి తన యథాస్థానాన్ని చేరుతుంది. ఈ సంద ర్భంలో వస్తువు ప్రయాణించే దూరం S= 2h ; కానీ $\vec{S} = 0$
- ఒక వస్తువు సరళరేఖ మార్గంలో ప్రయా ణిస్తే.. అది ప్రయాణించే దూరం, పొందిన స్థానభ్రం శం పరస్పరం సమానంగా ఉంటాయి.

$s = \bar{s}$ (or) $\frac{s}{\bar{s}} = 1$

- ఒక వస్తువు క్రమరహిత మార్గంలో చలిస్తే అది ప్రయాణించిన దూరం పొందిన స్థానభ్రంశం కంటే ఎక్కువగా ఉంటుంది.



$s > \bar{s}$

∴ ఒక వస్తువు ప్రయాణించిన దూరం పొందిన స్థానభ్రంశానికి సమానంగా లేదా ఎక్కువగా ఉంటుంది. అంతేకాని వస్తువు ప్రయాణించిన దూరం అనేది స్థానభ్రంశం కంటే ఎట్టిపరిస్థితుల్లో తక్కువగా ఉంటుంది.

వడి: గమనంలో ఉన్న వస్తువు నిర్దేశిత కాలంలో ప్రయాణించిన దూరాన్ని వడి అంటారు.

వడి(V) = $\frac{\text{ప్రయాణించిన దూరం}}{\text{కాలం}} = \frac{s}{t}$

ప్రమాణాలు: సెం.మీ/ సెకన్ లేదా మీ./సెకన్

వడి అనేది అదిశరాశి

వేగం: గమనంలో ఉన్న ఒక వస్తువు నిర్దేశిత కాలంలో పొందిన స్థానభ్రంశాన్ని వేగం అంటారు.

వేగం$(\vec{V}) = \frac{\vec{S}}{t}$

ప్రమాణాలు: సెం.మీ./ సెకన్ (లేదా) మీ./సెకన్

వేగం అనేది సదిశరాశి

త్వరణం: గమనంలో ఉన్న వస్తువు వేగంలోని మార్పురేటుని త్వరణం అంటారు.

$\vec{a} = \frac{\text{వేగంలోని మార్పు}}{\text{కాలంలోని మార్పు}}$

$= \frac{V_2 - V_1}{t_2 - t_1} = \frac{V}{t}$

ప్రమాణాలు: సెం.మీ/ సెకన్^{2} (లేదా) మీ/సెకన్^{2}

త్వరణాన్ని 2 రకాలుగా వర్గీకరించవచ్చు

1. **ధన త్వరణం:** గమనంలో ఉన్న వస్తువు వేగంలో మార్పు రేటు పెరిగితే దానికి ధన త్వరణం ఉంటుంది.
2. **రుణ త్వరణం:** గమనంలో ఉన్న వస్తువు వేగంలో మార్పు రేటు తగ్గితే దానికి రుణ త్వరణం ఉంటుంది.

- ఒక వస్తువు విరామస్థితిలో ఉన్నపుడు $(\vec{V} = 0)$ లేదా సమాన వేగంతో కదులుతున్నపుడు $(\vec{V_1} = \vec{V_2} = \vec{V_3} = ...)$ ఆ వస్తువు త్వరణం శూన్యం.

రేఖీయ ద్రవ్యవేగం: గమనంలో ఉన్న వస్తువు ద్రవ్యరాశి, వేగాల లబ్ధాన్ని రేఖీయ ద్రవ్యవేగం అంటారు.

$\vec{P} = m\vec{v}$

m → ద్రవ్యరాశి

v → వేగం

ప్రమాణాలు : గ్రామ్,సెం.మీ/సెకను లేదా కిలోగ్రామ్, మీటర్/సెకన్

- రేఖీయ ద్రవ్యవేగం సదిశరాశి.

బలం: ఒక వస్తువు స్థితిని మార్చేది లేదా మార్చడానికి ప్రయత్నించే దాన్ని బలం అంటారు.

బలం $(\vec{F}) = m\vec{a}$

m → ద్రవ్యరాశి

$\vec{a}$ → త్వరణం

ప్రమాణాలు : డైన్, న్యూటన్ (ఇది అంతర్జాతీయ ప్రమాణం)

1 న్యూటన్ = 10^5 డైన్స్

- బలం గురించి న్యూటన్ అనే శాస్త్రవేత్త అధ్యయనం చేసి వాటిని 2 రకాలుగా వర్గీకరించారు.

అంతర బలం: ప్రతి వస్తువు లేదా వ్యవస్థ లోపల ఉన్న బలాలను అంతర బలాలు అంటా రు. ఈ బలం వల్ల వస్తువు స్థితిలో ఎలాంటి మార్పు ఉండదని న్యూటన్ ప్రతిపాదించారు.

ఉదా॥ ఒక బస్సు లోపల ఉన్న ప్రయాణికులు తమ ఎదుటి సీట్లపై బలాలను ప్రయో గించినప్పుడు ఆ బస్సు స్థితిలో ఎలాంటి మార్పు ఉండదు.

బాహ్యబలం: ఒక వస్తువు మరో వస్తువుపై ప్రయోగించే బలాన్ని బాహ్యబలం అంటారు.

- ఈ బలం వల్ల వస్తువు స్థితిలో మార్పు రావచ్చు. లేదా మార్పు రావడానికి ప్రయత్నించవచ్చు.
- Liftని కనుగొన్న శాస్త్రవేత్త otis

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

న్యూటన్ గమన నియమాలు: వస్తువుల చలనాన్ని అధ్యయనం చేసి వాటిని వివరించడానికి 16వ శతాబ్దంలో న్యూటన్ మూడు నియమాలను ప్రతిపాదించారు. వీటిని న్యూటన్ గమన నియమాలు అంటారు.

మొదటి నియమం లేదా జడత్వ నియమం

- బాహ్యబలాన్ని ప్రయోగించినంతవరకు విరామ స్థితిలో ఉన్న వస్తువు విరామ స్థితిలోను, గమనంలో ఉన్న వస్తువు సమవేగంతో రుజు మార్గంలో కదులు తుంది.
- ప్రతి వస్తువుకు సహజసిద్ధంగా ఏర్పడే జడత్వం అనే ధర్మం ఉంటుందని మొదటి నియమం వల్ల తెలుస్తోంది. అందువల్ల ఈ నియమాన్ని జడత్వ నియమం అంటారు.

జడత్వం: ఒక వస్తువు తనంతట తానుగా తన స్థితిని మార్చుకోలేని అశక్తతను లేదా ధర్మాన్ని జడత్వం అంటారు. ఈ ధర్మం వస్తువుల ద్రవ్యరాశిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ద్రవ్యరాశి పెరిగితే జడత్వం కూడా పెరుగుతుంది.

ప్రమాణాలు : గ్రామ్ లేదా కి.గ్రా.

జడత్వాన్ని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **విరామ జడత్వం:** విరామస్థితిలో ఉన్న ఒక వస్తువు తనంతట తానుగా తన విరామ స్థితిని మార్చుకోలేని అశక్తతను విరామ జడత్వం అని అంటారు.
2. **గమన జడత్వం:** గమనంలో ఉన్న వస్తువు తనంతట తానుగా తన గమనస్థితిని మార్చుకోలేని అశక్తతను గమన జడత్వం అని అంటారు.

ఉదా॥ గమనంలో ఉన్న బస్సుకు అకస్మాత్తుగా బ్రేకులువేసి ఆపినపుడు దానిలోపల ఉన్న ప్రయాణీకులు గమనజడత్వం వల్ల ముందువైపు తూలుతారు.

3. **దిశ జడత్వం:** ఒక వస్తువు తనంతట తానుగా తన దిశను మార్చుకోలేని అశక్తతను దిశ జడత్వం అని అంటారు.

ఉదా॥ రుజుమార్గంలో ప్రయాణిస్తున్న బస్సు మలుపు తిరుగుతున్నప్పుడు అందులోని ప్రయాణికులు జడత్వం వల్ల అవతలివైపు తూలుతారు.

- న్యూటన్ రెండో గమన నియమం ప్రకారం బలానికి సమీకరణం F=ma

న్యూటన్ మూడవ గమన నియమం

చర్యకు సమానమైన వ్యతిరేక ప్రతిచర్య ఉంటుంది. చర్య= – ప్రతిచర్య

చర్య+ ప్రతిచర్య = 0

- ఈ నియమం ప్రకారం చర్య, ప్రతిచర్య అనేవి పరస్పరం సమానంగా ఉండి, వ్యతిరేక దిశలో ఎల్లప్పుడూ జంటగా ఉంటాయి.

ఉదా॥ 1. రబ్బర్ బంతిని గోడవైపునకు విసిరినపుడు, అది గోడపై కలుగజేసే బలాన్ని చర్య అంటారు. ప్రతిచర్యగా గోడ కూడా అంతే బలాన్ని బంతివైపు వ్యతిరేక దిశలో ప్రయోగిస్తుంది.

2. నడవడం, పరుగెత్తడం, నీటిలో ఈదడం, పడవ ప్రయాణం, పక్షి ఎగరడం మొదలైన అంశాల్లో న్యూటన్ మూడో గమన నియమం ఇమిడి ఉంది.
3. తుపాకి, రాకెట్, జెట్ విమానం.. పని చేయడంలోనూ ఈ నియమం ఇమిడి ఉంది.

- రాకెట్, క్షిపణులు పనిచేయడంలో రేఖీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం ఇమిడి ఉంది.

మాదిరి ప్రశ్నలు

1. న్యూటన్ మూడు గమన నియమాల్లో.. ఏ నియమాన్ని జడత్వ నియమం అంటారు?
   ఎ) మొదటి బి) రెండో
   సి) మూడో డి) పైవన్నీ
2. బైకు, కారు, బస్సులలో... దేని జడత్వం ఎక్కువ?
   ఎ) బైకు బి) కారు
   సి) బస్సు డి) పైవన్నీ
3. గమనంలో ఉన్న వస్తువుకు ఏ భౌతిక రాశి ఉంటుంది?
   ఎ) వేగం బి) రేఖీయ ద్రవ్యవేగం
   సి) గతిజ శక్తి డి) పైవన్నీ
4. బాంబు విస్ఫోటనం, తుపాకి పని చేయడంలో ఏ నిత్యత్వ నియమం ఇమిడి ఉంది?
   ఎ) న్యూటన్ మూడో గమన నియమం
   బి) రేఖీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం
   సి) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
   డి) కోణీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం
5. జడత్వం ప్రమాణం?
   ఎ) గ్రామ్ బి) కిలోగ్రామ్
   సి) పౌండ్ డి) పైవన్నీ
6. అంతర్గత బలం వల్ల గమనంలో ఉన్న వస్తువు వేగం?
   ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
   సి) మారదు
   డి) రెండింతలు అవుతుంది
7. ఏ ప్రక్షిప్త కోణం వద్ద ప్రక్షేపకం గరిష్ఠ వ్యాప్తిని పొందుతుంది?
   ఎ) 30° బి) 45°
   సి) 90° డి) 120°
8. బలం.. అంతర్జాతీయ ప్రమాణం?
   ఎ) న్యూటన్ బి) డైన్
   సి) కి.గ్రా., మీ/సె^{2}
   డి) గ్రా., సెం.మీ/సె^{2}
9. కింది వాటిలో అత్యంత గరిష్ఠమైన బలం?
   ఎ) అయస్కాంత బలం
   బి) ఘర్షణ బలం
   సి) గురుత్వాకర్షణ బలం
   డి) కేంద్రక బలం
10. ఎక్కువ ప్రాధాన్యతను కలిగిన న్యూటన్ గమన నియమం?
    ఎ) మొదటి బి) రెండో
    సి) మూడో డి) పైవన్నీ
11. ప్రక్షేపకం ఏ మార్గంలో ప్రయాణిస్తుంది?
    ఎ) రుజు బి) వృత్తాకార
    సి) పరావలయ డి) దీర్ఘవృత్తాకార
12. న్యూటన్ మూడో గమన నియమం ఆధారంగా పనిచేసేది?
    ఎ) రాకెట్
    బి) క్షిపణి
    సి) యుద్ధ విమానం డి) పైవన్నీ
13. ఒక వస్తువుపై ఎక్కువ బలాన్ని అధిక కాలవ్యవధిలో ప్రయోగిస్తే దానిపై ప్రచోదన ప్రభావం?
    ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
    సి) శూన్యం డి) అనంతం
14. లిఫ్ట్‌ని కనుగొన్న శాస్త్రవేత్త?
    ఎ) న్యూటన్
    బి) రూథర్‌ఫర్డ్
    సి) పాస్కల్
    డి) ఓటిస్
15. పైకి కదులుతున్న లిఫ్ట్‌లోని వ్యక్తి చర్య, ప్రతి చర్యలు అనేవి?
    ఎ) సమానం
    బి) చర్య ఎక్కువ
    సి) ప్రతిచర్య ఎక్కువ
    డి) ప్రతిచర్య శూన్యం

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి; 4) బి;
5) డి; 6) సి; 7) బి; 8) ఎ;
9) డి; 10) బి; 11) సి; 12) డి;
13) బి; 14) డి; 15) సి

Neither of the five students was responsible for...

MODEL QUESTIONS

Directions (Q.No.1-05): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The process of updation of state's part of NRC (1)/ in the state of Assam is started in the year 2013, (2)/ when the Supreme Court of India (3)/ passed an order for its updation. (4)/ No error (5)
2. The Supreme Court on Wednesday hinted at taking back a controversial March 20, 2018, ruling (1)/ that had instituted a check on the institution of false, motivated cases (2)/ against the stringent SC/ST Prevention of Atrocities Act (3)/ while reserving orders on a government plea to review the ruling. (4)/ No error (5)
3. Aadhaar enrolments in Jammu & Kashmir (J&K) have dropped drastic (1)/ since August 5, (2)/ after restrictions came into place (3)/ following the abrogation of Article 370. (4)/ No error (5)
4. The Indian Army conducts a massive rare exercise (1)/ involving all its arms and services including tanks, artillery and helicopters, (2)/ in Eastern Ladakh bordering China, (3)/ for testing and improving its war-fighting capabilities. (4)/ No error (5)
5. European parliamentarians Ryszard Czarnecki and Fulvio Martusciello (1)/ have slammed Pakistan for harbouring militants, (2)/ with one of them saying terrorists who carried out attacks in India (3)/ did not came from the Moon. (4)/ No error (5).

Directions (Q.No. 06-10): Each question below has blanks, each blank indicating that something has been omitted. Choose the word / set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Some of the banned ___ for which Indian sports persons have been ___ positive are so highly priced that no ____ sportsperson would be able to buy them on his own.
   1) Substances, tested, ordinary
   2) products, examination, simple
   3) drugs, proved, common
   4) medicines, declared, general
   5) materials, experienced, regular
7. The present education system is ___ and needs ___, if we don't address this immediately we shall be ____ behind.
   1) complete, improvement, progressing
   2) full, betterment, covering
   3) defective, reforming, lagging
   4) total, redressal, moving
   5) inadequate, recharging, stirring
8. The amended Motor Vehicle law was expected to have a ___ effect on errant drivers, ___ traffic in metros and a ___ effect on highways.
   1) solemn, terrifying, upsetting
   2) grave, nightmarish, shocking
   3) glum, vivid, distressing
   4) optimistic, lurid, calming
   5) sobering, nightmarish, calming
9. Former Prime Minister Manmohan Singh ___ to take military action against Pakistan if another Mumbai-type terror attack occurred, David Cameron, who ___ with him as prime minister, reveals in his book ___ Singh as a 'saintly man'.
   1) planning, interacts, describing
   2) planned, interacting, describes
   3) planned, interactive, described
   4) planned, interacted, describing
   5) plans, interacted, describing
10. The government last month ___ the merger of 10 public sector banks (PSBs) ___ four strong lenders with countrywide networks and global reach to boost credit and revive economic ___ in the nation's bid to become a five trillion dollar economy in the next five years.
    1) announces, to, growth
    2) has announced, into, growing
    3) have announced, in, growths
    4) announced, into, growth
    5) is announcing, into, growth

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. Unlike Satyajit Ray whose films transcend ideology, Sanjay Leela Bansali is frequently dismissed <u>with being merely a photographer</u> for a visually impressive production with little meaning.
    1) as being a photographer merely
    2) for being merely a photographer
    3) as a mere photographer
    4) merely for being a photographer
    5) No correction required
12. In many rural provinces, the so-called party leaders are more powerful, wealthy and wield <u>more influence as any other</u> illicit group.
    1) wielding more influence to any other
    2) wielded much influence as any other
    3) wield more influence than any other
    4) wields more influence as many other
    5) No correction required
13. <u>Ambanis are keeping</u> the nose to the grind stone and expanding their business.
    1) Ambanis were keeping
    2) Ambanis have kept
    3) The Ambanis are keeping
    4) The Ambanis have been kept
    5) No correction required
14. <u>N.D.Prasad grammar book</u> based on Wren and Martin's grammar book is loved by many students.
    1) N.D.Prasads grammar book
    2) N.D.Prasad's grammar book
    3) N.D.Prasad grammar books
    4) N.D.Prasad grammars book
    5) No correction required
15. She doesn't <u>like to lend me some money.</u>
    1) like to lend me any money
    2) like to lend me no money
    3) like to lend me few money
    4) like to lend me many money
    5) No correction required

BANK EXAMS

General English

Directions (Q.No. 16-20): In the following set of questions, there are four sentences given in each question, find out which sentence is correct and mark the number of that sentence as your answer. If no sentence is correct mark 5 'None' as your answer.

16. 1) My cousin sister is a brewer.
    2) Neither of the five students was responsible for the damage in the Chemistry laboratory.
    3) You, Sarma and we have murdered the democracy by taking the law in our hands.
    4) Between you and me, there is nothing. So, let us part our ways.
    5) None
17. 1) Both the wife and husband love one another. It helped them to overcome all misunderstandings.
    2) For every wrong answers negative marking is there.
    3) You should approach the concerned clerk.
    4) Each one of the novels you suggested is worth reading.
    5) None
18. 1) Raju is the only boy that comes early.
    2) It is none of your business.
    3) I found a two thousand rupees note on my way.
    4) Indira Gandhi was the bravest and the influential leader of the congress party.
    5) None
19. 1) There are many architectural marvels at India.
    2) Ramesh cut the tree by an axe.
    3) Both the siblings divided the property among themselves after their father's demise.
    4) I have been standing here from the past four hours.
    5) None
20. 1) The platinum is an expensive metal.
    2) The Skakespeare is the Kalidas of the west.
    3) I eat the breakfast at 8 a.m.
    4) The Grand Trunk express is not running on time today
    5) None

Answers with Explanation

1. **2;** In place of 'is started', simple past tense must be used, i.e. 'started'.
2. **2;** In order to make the sentence correct the correct preposition to be used is 'under', not 'against'.
3. **1;** It is not the adjective 'drastic' which must be used, but the adverb 'drastically' which must be used here.
4. **1;** The verb 'conduct' must be used in past tense 'conducted', as it is not a regular activity.
5. **4;** Did is always followed by the present tense of the verb, not the past tense. ('He did not told' is wrong, 'he did not tell' is right)
6. **1;** Only in the first option all the words are present in the correct form, to complete the sentence.
7. **3;**
   If it is complete it doesn't require any improvement, so option 1 is wrong. Second option, full and betterment will not fit. Option 4, total and redressal doesn't go hand in hand to convey the meaning in this sentence and the last option, if it is inadequate it cannot be recharging.
8. **5;**
9. **4;**
   Only in option 4 all the words are used in the correct form.
10. **4;**
    Based on the first blank in the sentence, this bit can be easily answered. The word 'last month' is the indicator which tells us that we should go for the past tense of the verb. In all other options the verb is in different forms of present tense.
11. **4;**
    The modifier 'mere' and the preposition for are used in the correct order and sense only in option 4. All the other options are incorrect.
12. **3;** When we use comparative degree in a sentence, usage of 'than' is must.
13. **3;** Before the names of the families the definite article 'the' must be used.
14. **2;** After the noun an apostrophe is supposed to be used to show the possessive, it is used correctly in 2 option.
15. **1;**. Any money is the correct expression, all other expressions are wrong.
16. **4;** Option 1 is wrong, as cousin sister is incorrect usage. Option 2 is incorrect as neither is used for two and none is used for more than two. Option 3, the order of subjects should be We, you and Sarma.
17. **4;**
    Option 1, love each other, not one another. Option 2, it should be 'for every wrong answer' not 'for every wrong answers'. Option 3, the correct usage is clerk concerned.
18. **1;** If 'the only/ the same' appears after the subject 'that' should be used. Option 2, though this expression is frequently used, it is wrong; the correct expression is 'it is no business of yours'. Option 3, it should be 'two thousand rupee note'. Option 4, it should be 'most influential'.
19. **5;**
    Option 1, the correct preposition to be used is 'in', not 'at'. Option 2, the correct preposition to be used is 'between', not 'among'. Option 3, the correct preposition to be used is 'with', not 'by'. Option 4, the correct preposition to be used is 'for', not 'from'.
20. **4;**
    Option 1, before material nouns article is not used. Option 2, before proper noun (Shakespeare) we shouldn't use article. (Usage of 'the' before Kalidas is justified, because it is used as a common noun) Option 3, before the names of meals article shouldn't be used.